- బాల్య జ్ఞాపకాల కథలు
- దీపావళి - విశేషాలు
- మధురకవి మల్లవరపు జాన్
- సి.పి.బ్రౌన్ తాతాచార్య కథలు
- ఓటు చైతన్య కవిత్వం
- రాతపత్రుల సేకరణకు, పరిష్కరణకు కృషి చేసిన ప్రముఖులు
- వర్తమాన కవిత్వం - పర్యావరణ చైతన్యం
- తండా వామనుడి త్రివిక్రమ 'బతుకు' చిత్రం

# మూసీ
# MUSI

• Samputi : 27 • Sanchika : 01 • Pages : 64 • Rs. 20
• November 2023

UGC Care List
Approved Journal




Scanned with OKEN Scanner



వ్యవస్థాపకులు
శ్రీ బి.ఎన్.శాస్త్రి
సంపుటి : 27 సంచిక : 1
నవంబర్ - 2023
'శోభకృత్' ఆశ్వీజ, కార్తీక మాసాలు
సంపాదకులు (EDITOR)
సాగి కమలాకర శర్మ
SAGI KAMALAKARA SHARMA
సహ సంపాదకులు (ASSOCIATE EDITOR)
డా. దత్తయ్య అట్టెం
Dr. DATTAIAH ATTEM

Printed and Published by
B. Anantha Laxmi

*Type Setting at :*
Kavyasree Graphics
Ph: 934 797 1177

Printed at : Sri Sai Process
Ph. 27563075

విడిప్రతి : 20/-
సంవత్సర చందా : 200/-
శాశ్వత సభ్యత్వం : 2500/-
(పది సంవత్సరాలు మాత్రమే)

చెక్కులు, డి.డి.లు 'మూసీ తెలుగు మాసపత్రిక' (MUSI Telugu Monthly Magazine) పేరుపై మాత్రమే పంపాలి.

వివరాలకు : మేనేజర్, మూసీ మాసపత్రిక,
2-2-1109/బికె - ఎల్ఐజి-10,
బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట,
హైదరాబాద్ - 500 013
ఫోన్ : 934 797 1177
email : editormusi@gmail.com

ISSN 2457-0796



# మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక
చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక

## ఈ సంచికలో ...

### వ్యాసాలు

బాల్య జ్ఞాపకాల కథలు - ప్రత్యేకతలు ... డా. రామరాజు మాధవీలత 7
దీపావళి - విశేషాలు ... డా. కాకునూరి సూర్యనారాయణ మూర్తి 11
పసరు రెక్కలు (బందారం కథలు -22) ... డా. నందిని సిధారెడ్డి 15
మధురకవి మల్లవరపు జాన్ ... డా. కోయి కోటేశ్వర రావు 19
భారతీయీకరణ16 : ఆంగ్లమూలం : బలరాజ్ మధోక్, తెలుగు : కోవెల సంపత్కుమార 23
సి.పి.బ్రౌన్ తాతాచార్య కథలు (గ్రంథాంతరంగం-28) ... ఘట్టమరాజు 27
పద్యమనోహరం- 46 ... గన్నవరం గిరిజామనోహర్ బాబు 32
ఓటు చైతన్య కవిత్వం ... పి. రాజీవ్ కుమార్ 33
పునరుత్పత్తి రాజకీయాలను చిత్రించిన మొట్టమొదటి కథకురాలు ఓల్గా ... ఆచార్య కిన్నెర శ్రీదేవి 37
రాతప్రతుల సేకరణకు, పరిష్కరణకు కృషి చేసిన ప్రముఖులు ... కె. సంతోష్ కుమార్ 45
వర్తమాన కవిత్వం - పర్యావరణ చైతన్యం ... వర్ధ వేణు 49
తండా వామనుడి త్రివిక్రమ 'బతుకు' చిత్రం ... మదన మోహన రెడ్డి బుగదూరు 54

### కవితలు

కవితా వ్యసనము ... డా. అయాచితం నటేశ్వర శర్మ - 5;
అతడు ఒట్టి కోట ... అంజనా శ్రీ ఖమ్మం - 6;
తుకారాం అభంగం ... డా. మంత్రి శ్రీనివాస్ - 6;
దీపోత్సవ సంరంభం ... వి.ఎస్.ఆర్.ఎస్. సోమయాజులు - 18;
దేశం ఉండేదట ... మహేశ్ వేల్పుల - 36;
దుఃఖం ... .... విను - 62

### సమీక్షలు

'వర్గమూలాల' శోధన ... డా. వెల్దండి శ్రీధర్ 56
ఈ 'కాల'పు నిఘంటువు - నిఘంటు కర్తా ... డా. చంద్రయ్య ఎన్. 58
తెలంగాణ పరిశోధనల 'సారాంశం' ఆవిష్కరణ సభ ... డా. మంత్రి శ్రీనివాస్ 59
స్వీకృతి ... 61

**ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.**

*Printed, Published and Owned by :* **B. Anantha Laxmi,** 3-4-245/1, Lingampally, Kachiguda, Hyderbad - 500 027. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma. RNI No. 37723/80**

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 1  UGC Care List Approved Journal
హైదరాబాద్ నవంబర్ : 2023

## సంపాదకీయం



 

వ్యక్తి శక్తి కావాలి

మనిషి మనీషి కావాలి

మానవుడు
మహనీయుడు కావాలి

ఉన్న స్థానం నుండి
ఉన్నత స్థానానికి చేరాలి

పరిమితుడు
అపరిమితుడు కావాలి

స్థాయి విస్తరించాలి

దైవత్వం మేల్కొనాలి

తనను తాను నిరంతరం
ఉద్ధరించుకోవాలి

అందరికీ ఆదర్శంగా
ఆమృతమూర్తిగా
మారాలి

**నీలో దీపం వెలిగించు**
**నీవే వెలుగై వ్యాపించు**

 

# వెలుగు - వ్యాపనం

దీపావళి దగ్గరలో ఉంది. దీపోత్సవం ఆనందంగా దేశమంతటా నిర్వహిస్తుంటారు. దీపం వెలుగుకు సంకేతం. వెలుగు ఉన్నప్పుడే మనకు వస్తు జ్ఞానం, విషయ జ్ఞానం కలుగుతుంది. జ్ఞానం ఉన్నవాని విశ్లేషణ వల్ల సృష్టిలోని శక్తితో సమన్వయం పెరుగుతుంది. శక్తి ఉన్నవాడే లోకాన్ని పూర్ణంగా ప్రేమించగలడు. అందరికీ వినియోగ పడగలడు. అన్నీ ఇవ్వగలడు. ఆనందంగా జీవించగలడు. మనలో వెలుగులు నింపుకోవడం మొదలు పెడితే ఇన్ని ప్రయోజనాలుంటాయి.

దివ్య శబ్దం దివ్వెగా మారుతుంది. దివ్వెను వెలిగించడం అంటే వ్యక్తి దివ్యత్వాన్ని సాధించాలని అర్థం. వెలుగు వల్ల వచ్చే చైతన్యంతో అంతటా వ్యాపించాలి. మనం వెలిగించే దీపం వల్లనో, వేసే బల్బు వల్లనో ఆ గదిలో వెలుగు వస్తుంది. వీధిలో వెలిగించే బల్బు వల్ల ఆ వీధి మొత్తానికి ఒక వెలుగు వస్తుంది. సూర్యుని వల్ల కాంతి ప్రసరించబడే భూభాగానికి అంతటా వెలుగు వస్తుంది. అదేవిధంగా ఇతర సౌరకుటుంబ గ్రహాలు కూడా ప్రభావితం అవుతుంటాయి. వెలుగు స్థాయిని బట్టి వ్యాపనం ఉంటుంది. వ్యక్తి వెలుగు లోకంపై ప్రసరింపబడాలి అంటే తన చుట్టూ ఉన్న వారికన్నా తన వెలుగు అధికంగా ఉండాలి. ఆ వెలుగు వ్యక్తిలో ఉంటేనే ఇతరుల వెలుగులు తగ్గి వ్యక్తి వెలుగులు వ్యాపిస్తుంటాయి. వ్యక్తి సమక్షంలో అతనిని ప్రత్యక్షమైన జ్ఞాన సంబంధమైన వెలుగుగా ఎదుటివారు ఆనందిస్తే, వ్యక్తి పరోక్షంలో 'తలచుకుని' కూడా అంతటి ఆనందాన్ని అనుభవిస్తారు. అది స్థాయి కలిగిన వెలుగుతో కూడుకున్న వాళ్ళ వల్ల మాత్రమే జరుగగలిగే గొప్ప విషయం. దీపావళి కేవలం దీపాలు ఇంట్లో వెలిగించుకోవడం కోసమే కాదు, మనలో ఉన్న జ్యేష్ఠాదేవిని (మలినాలను) తీసివేసి, శుభ్రం చేసుకుని, లక్ష్మీదేవిని (సంపద, ఐశ్వర్యం, జ్ఞానం, శక్తి, చైతన్యం) ఆహ్వానించడం కోసమే. ఎంత పెద్ద వెలుగును మనం ఉపాసిస్తే అంతగా మనం వెలిగిపోతామనడానికే ఇది ప్రతీకయైన పండుగ.

ఒక్క వెలుగు ఎంతో జ్ఞానాన్ని, సమాచారాన్ని అందిస్తుంది. వెలుగు నింపుకోవాలంటే మనం వెలుగుతో చేరి ఉండాలి. సెల్‌ఫోన్‌కు శక్తిని నింపాలంటే, తగిన ఛార్జర్ ద్వారా పవర్‌తో సంబంధాన్ని కలుపుతాము. అప్పుడే సెల్‌ఫోన్ పవర్‌ఫుల్ అవుతుంది. మన శరీరం, మనస్సులలో కూడా శక్తిని నింపి వెలగాలంటే మనం కూడా వెలుగుతో సంబంధాన్ని బాగా పెట్టుకోవాల్సి ఉంటుంది. సాధకుడు కళ్ళు తెరిచినా, మూసినా ఏదో ఒక శక్తితో, వెలుగుతో, చైతన్యంతో మానసికమైన అనుబంధాన్ని పెంచుకుంటూ ఉండటమే ప్రయత్నం. ఎంత ఎక్కువ సేపు శక్తి లేదా వెలుగుతో మనస్సు కలిసి ఉంటుందో అంత ఎక్కువగా మాలిన్యాలు తొలగి, శక్తి స్వరూపులుగా మారుతారు.

దీపాన్ని బయట వెలిగించి దీపావళి నిర్వహించడమే కాకుండా, మనలోని దీప స్థాయిని పెంచి వ్యాపించాలని సూచన చేసేదే దీపావళి. దివ్యమైన దీపాలతో, వెలుగులతో మనస్సును నిరంతరం కలిపే ప్రయత్నం చేయడమే సాధన. బయటి శరీరాన్ని, లోపలి శరీరాన్ని వేరు వేరు పద్ధతుల ద్వారా శుద్ధి చేసిన తర్వాత మనస్సును శుద్ధి చేయడానికి, వెలుగులు నింపడానికి పూనుకోవాలి. అనేక ఆలోచనలతో మలినమైన మన మనస్సు, దీపం పైన పెడుతున్న గ్లాసు వంటిది. ఎంత కాలం ఎక్కువగా అలా ఉంటుందో అంతటి మసిని పూసుకుంటుంది. మన మనస్సు అసలైన వెలుగు, శక్తి, ప్రాణ చైతన్యం లేదా సూర్య తేజస్సుతో చాలా ఎక్కువసేపు కలిగి ఉండటానికి ప్రయత్నం చేస్తూనే ఉండాలి. మధ్యలో వచ్చే ఆలోచనల వల్ల ఇబ్బంది కలుగకుండా మరీ మరీ మంత్ర జపం ద్వారా శక్తితో మనస్సును కలిపి మాత్రమే ఉంచే ప్రయత్నం జరిగితే వ్యక్తి వెలుగుతాడు, లోకాన్ని వెలిగిస్తాడు. వ్యాపిస్తాడు. **నీలో దీపం వెలిగించు – నీవై వెలుగై వ్యాపించు.**

# కవితా వ్యసనము



వ్యసనము లెన్నియోగలవు బాగుగ శోధన జేయ భూమిపై
రసభరితైక భావపదరాజిత పద్యములన్ రచింపగా
వ్యసనము మెండుగా కవిని పర్వులు దీయగద్రోయు నిత్యమున్
రసికజనాత్మమోదమున రాజిలు పద్యము నిత్యసేవ్యమై!

ఏల వ్రాయుచుంటివీ రీతి పద్యాల
ననగ నాకు వ్యసనమనును సుకవి
వ్రాయువారలెపుడు వ్రాయుచునుందురు
వెల్లువెత్త పద్యమెల్ల గతుల!



సృజనమున్నచోట విజయమ్ము నిలుచును
నిత్య సృజన జేయ నిలువవలయు
స్తబ్ధమైన మేధ సాగదు ముందుకు
పదనుదేర వలయు పద్య సృజన!

ఏమాశించిరి పూర్వులు?
నీమమ్ముగ కావ్యరచన నిష్ఠగజేయన్
భూమిని నిల్చును కవియే
భామయ రవిచంద్రదీప్తి వరలెడు వరకున్!







డా. అయాచితం నటేశ్వర శర్మ
ఫోన్ : 94404 68557

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 1  UGC Care List Approved Journal
హైదరాబాద్ నవంబర్ : 2023

# అతడు వట్టి కోట








అతడు తెలంగాణ గట్టి కోట
నల్లగొండ జిల్లాలో నిజాము రాచరిక వ్యవస్థను ధిక్కరించి

వంట మనిషిగా జీవితాన్ని ప్రారంభిస్తూనే..
సీతారామారావు అనే పంతులు దగ్గర చదువుకొని
విజయవాడలో హెూటల్ సర్వర్ గా తన కర్తవ్యాన్ని ప్రారంభించి
కమ్యూనిస్టుగా దేశోద్ధారక గ్రంథమాల నిర్వాహకులుగా
తొలి నవల ప్రజల మనిషిని

ఆనాటి తెలంగాణ ప్రజల స్థితిగతులను ప్రజల జీవితాన్ని
తన నవలల ద్వారా గొప్పగా చిత్రీకరించిన మహనీయుడు
తొలి తెలంగాణ యాస భాషను ప్రవేశపెట్టి
అందులో తెలంగాణ జీవితాన్ని
నిలిపిన మహనీయుడు వట్టి కోట ఆళ్వార్ స్వామి



కలకాలం సాహితీ గంగు నవలలు
జైలు జీవితాన్ని గొప్పగా చిత్రీకరించి
గ్రంథాలను ప్రచురించి ఊరురా అందజేసిన
కార్మిక నాయకునిగా ప్రజానాయకునిగా
పౌర హక్కుల నాయకునిగా చేయటంలో
ఊరురా గ్రంథాలను పంచిపెట్టి
గ్రంథాలయ ఉద్యమాన్ని రాత్రి పాఠశాలలను స్థాపించి
కులమత బేధాలను లెక్కించి నిలిచిన నవల
వికాసమైన అళ్వార్ స్వామి

అతని జయంతి కలకాలం నిలిచిపోయే
ప్రజా జయంతిగా ప్రజా ప్రస్థానం
అతడు ఎప్పటికీ తొలి తెలంగాణ నవలా రచయిత
**(వట్టి కోట ఆల్వార్ స్వామి జయంతి సందర్భంగా)**

**అంజనశ్రీ ఖమ్మం**
భువనగిరి కోట, ఫోన్ : 770 253 7453

# తుకారాం అభంగం

తలపుల మాటున చేరవే ధ్యానమా
తలుపులు తెరిచే దిశకు చేర్చు నిధానమా
నమ్మితి నీ నామం చేసితి నీ గానం
పట్టితి పరమాత్మ పండరీపుర ధామం

చిత్తవృత్తుల ప్రళయం మారుతమును దాటగ
ఆరు అజగరములు నన్నులుముకు అణచగ
అంతర్యామి ధ్యాన రూపమా
అందుకో నా చేయి ఆదుకో వేగిరము

మిషలు కాకులై పొడుచుచుండగ
అనిమిషనాథుని కొలిచి చేరితిని
యోగవిద్య జగ విద్యల నెరుగ
నామ మంత్రమే నా ప్రాణతంత్రమిక

తుకా రావే విఠలు నీకిక తల్లి
జ్ఞాన జనులు జగమెరిగిన జనని
ఆది బ్రహ్మ ఆది శక్తి స్వరూపిణి
కనుల తెరలు తెరిచే ఆది ముక్తాయిని.




**అనువాదం : డా॥ మంత్రి శ్రీనివాస్**
ఫోన్ : 83283 33720

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 1 7 హైదరాబాద్ నవంబర్ : 2023

# బాల్య జ్ఞాపకాల కథలు – ప్రత్యేకతలు

**డా. రామరాజు మాధవీ లత,** అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్, ఎ.పి. సచివాలయం. ఫోన్ : 83748 10111

బాల్యస్మృతి ఒక మధురానుభూతి. బాల్యాన్ని తిరిగి ఈ వయస్సులో పునఃదర్శించుకోవాలంటే, తిరిగి మనం నడిచిన బాటవైపు ఓసారి తొంగి చూడాలంటే, మనసు పొరల్లో దాచుకున్న అనుభూతులను తిరిగి నెమరు వేసుకోవటం ద్వారా, ఆనాటి జ్ఞాపకాలను ఒకసారి గుర్తుతెచ్చుకోవటం ద్వారానే సాధ్యం. కథాసాహిత్యంలో బాల్య జ్ఞాపకాలను స్మృతి పథంలోకి తెచ్చుకుంటూ, అనుభవాలను అక్షర రూపంలో మలచిన ఈ క్రింది కథలను పరిశీలించడం జరిగింది.

ఇందులో మొదటిగా స.వెం.రమేష్ రాసిన **'ఉత్తరపొద్దు'** కథను పరిశీలించవచ్చు. పులికాట్ సరస్సును ఆప్యాయంగా 'ప్రళయ కావేరి' అని పిలుచుకుంటారు ఆ చుట్టుపక్కలవాళ్ళు. అక్కడి నలబై దీవులను, అక్కడి ప్రజల మనస్తత్వాలను స.వెం.రమేష్ తన కథల్లో చిత్రించారు. 'ఉత్తరపొద్దు' కథలో ఆకతాయిలైన ఇద్దరు పిల్లలు, పెద్దల మాట వినకుండా ప్రళయ కావేరిలో దిగి మేనమామ ఇంటికి వెళ్ళడానికి ప్రయాణమవుతారు. ఉత్తరపొద్దు ప్రయాణంలో ఏమారి మానవ సంచారం లేని ఒక దీవిలో చిక్కుకు పోవటం, అక్కడ ఒక ముసలి తాత దగ్గర ఆశ్రయం పొంది ప్రళయ కావేరి కథంతా తెలుసుకుంటారు. తిరిగి మేనమామ ఇంటికి చేరిన పిల్లలను చూసి అందరు ఆశ్చర్యపోతారు. అద్వితీయమైన నెల్లూరు మాండలికంలో కథను నడుపుతారు రచయిత. మనల్ని కూడా ఆ పిల్లలతో పాటు ప్రళయ కవర్లో దింపి రంగన్న పట్టడా, జల్లల దొరువు వంటి దీవుల్ని చూపించి పాఠకులలో బాల్యానుభూతుల్ని నింపిన ఈ కథ అనుభూతివాదానికి ఒక నిదర్శనంగా అనిపిస్తుంది.[1] ఇందులో,
**"అబయా! మనం మన పేరునన్నా మరిచిపోవచ్చుగాని అమ్మ పేరుని మటుకు మరువగూడదురా"**

**"మాయమ్మ పేరు నాకు గుర్తుండ్లా తాతా!"**

**"అమ్మంటే కన్నతల్లి మటుకే కాదురా. అమ్మంటే అమ్మబాస కూడా. అమ్మంటే అమ్మ నేల కూడా"**

ఇవి ఓ తాతా! మనవడి మధ్య జరిగిన మాటలు. అమ్మ బాసని, అమ్మ నేలనీ మరువకూడదన్న తాత మాటలు ఓ మనవడిని విడువక పట్టి నడుపుతుంటే ఆ తాత మాటల స్ఫూర్తితో ఆ మనవడు వ్రాసిన కథలే ఈ **"ప్రళయకావేరి కథలు"** అని రచయిత పేర్కొన్నారు.

'ప్రళయకావేరి' ఇది పులికాట్ సరస్సు అసలు పేరు. **'ప్రళయకావేరి...పులికాట్...ఒకే సరస్సుకి ఎంత వైవిధ్యమైన పేర్లు. పులికాట్...పేరులోనూ, ఊరులోనూ తనదనం లేని ఉప్పుకయ్య'** అంటాడు రచయిత ఒకచోట. ఇప్పుడసలు ప్రళయకావేరి అన్న పేరే లేదు. ఆ సరస్సులో వున్న దీవుల గురించి, అ దీవులలోని పల్లెలు,




ఆ పల్లెలోని జనాల గురించి వారి యాసలోనే చెప్పిన కథలు ఈ ప్రళయకావేరి కథలు. నిజానికి ఇవి కథలు కాదు. ఓ వ్యక్తి జ్ఞాపకాలు, అందుకే ఆర్ద్రంగా వుంటాయి, మనస్సుని కదిలిస్తాయి. అభివృద్ధి పేరుతో ఎన్ని పల్లె బ్రతుకులు సమాధి అవుతున్నాయో అనే స్పృహను రచయిత కలిగిస్తారు. ఈ కథలను నేనెందుకు రాసానంటే... అంటూ ముందుమాటగా రచయిత ఇలా చెప్తారు.

**"ఇదివరకు ఏదాదికొకసారి ఎండే ప్రళయకావేరి ఇప్పుడు ఏదాదికొకసారి ఎప్పుడన్నా అరుదుగా నిండుతోంది. ఇప్పుడు ప్రళయకావేట్లో అప్పటి జానపదాలు లేవు. తమద సంగటి, రొయ్య పులుసు లేవు. ప్రళయకావేరి పుట్టుకను గురించి కథలు చెప్పేవారు లేరు. ఇదంతా, ఇవన్నీ కళ్లముందే ఒక్క బతుకులోనే, తటాలున, చటుక్కున మాయమై పోవడం, అంతరించిపోతున్న ఆ సరస్సు జీవనాన్ని చూస్తూ ఏమీచేయలేక, వూరుకోలేక నరకయాతన పడడం... ఆ భావాల్ని అక్షరాల్లో రాయడం కష్టం. అయినా నా భావాలను నలుగురితో పంచుకోవాలనుకున్నాను, ఆ భావాలకు అక్షర రూపమే నా ప్రళయకావేరి కథలు".**

మొత్తం 21 కథలు. ప్రళయకావేరి, అందులో తాతగారి దీవయిన జల్లల దొరువు, దాని చుట్టూ ఉండే ఇతర దీవులు, అడవులు, అక్కడి ప్రజలు, పిట్టలు... వీటి చుట్టూనే అన్ని కథలు నడుస్తాయి. పల్లెల్లో వేసుకునే పొడుపు కథలు, భాగోతాలు, నాటకాలు, సావాసగాళ్లు, అల్లరి ఆటలు, చిలిపి పనులు, భయాలు, అలకలు, ఉప్పు కయ్యలు, వలస పిట్టలు... ఇవే కథా వస్తువులు. శైలి, శిల్పం, కథనం, పాత్ర చిత్రణ స. వెం. రమేష్ యొక్క రచనా శైలికి నిదర్శనాలు.[2]

ప్రళయకావేరి గురించిన వర్ణనలు కూడా అతి సహజంగా ఉంటాయి. ఎక్కడా తెచ్చిపెట్టుకున్న పదగాంభీర్యం వుండదు. మచ్చుకి కొన్ని :

"అబయా, నలగాములు దాటినాక, పెళయకావేరమ్మకు సక్కలగిలెక్కువ, మునేళ్లు అదిమిపెట్టి నడవండి. లేకపోతే గెబ్బిడు ఎంట్రకాయల్ని జవరాల్సి పడతాది"

"సరస్సుకి సక్కలగిలి... ప్రకృతితో మమేకం అవటం అంటే ఇదేనేమో"

"ఉల్లంకి పిట్టలు వేలకు వేలు బార్లు కట్టి నిలబడి ఉన్నాయి. వాటి రెక్కల పసిమి చాయ, నీటి నీలి వన్నె, ఎండ బంగరు రంగు కలిసి ప్రళయ కావేరి కొత్త హొయలు పోతుంది",

"సందకాడ సన్నజాజి పూసినట్టు సన్నంగా నవ్వినాడు ఆ పిలగాడు",

"అవ్వ నీలికోక మింద పచ్చపూల మాదిరిగా నాలుగు తట్టులా నీలాపు నీల్లతో నిండిన ప్రళయకావేట్లో పచ్చపచ్చని దీవులు ఉంటాయి"

**"కాశెవ్వ బోగాతం"** కథలో బోగాతం ఆడేటప్పుడు కాశెవ్వ చేసే రచ్చ హాస్య ప్రధానంగా సాగుతుంది. అలాగే **"పాంచాలి పరాభవం"** కథలో మునసామి పాంచాలి వేషంలో చేసే హంగామా ఆ కోవకి చెందినదే. ఇక ఓ **"ఎచ్చులకారి సుబ్బతాత"** కథలో తాతలాంటి వారు మనకి ప్రతి పల్లెలో కనిపిస్తుంటారు. తుమ్మ మొద్దుల్ని పట్టుకుని దొంగ అనుకుని బాదటం, **"కత్తిరిగాలి"** కథలో సుబ్బ తాత నారతాతని దొంగనుకుని పట్టుకుని కొట్టటం, దొంగను పట్టుకున్న హుషారులో పంచె ఊడిపోయింది కూడా పట్టించుకోని వైనం కథల్లో హాస్య వ్యంగ్యాలకు పెద్ద పీట వేసినట్లు అర్థం అవుతుంది.

"ఆడే వొయిసులో ఆడాల" అంటూ బక్కోడు వాళ్ల ఆటల గురించి, సావాసగాళ్ల గురించి, వాళ్లు తెచ్చుకున్న అప్పుచ్చుల గురించి చెపుతుంటే మనకి కూడా ఒక్కసారి మన చిన్ననాటి స్నేహితాలు గుర్తుకొస్తాయి. ఆడుకోవటానికి వెళుతూ అమ్మకి తెలియకుండా ఒళ్లో వేసుకెళ్లిన వేరుశనగ కాయలు, బెల్లం, అటుకులు, జామ కాయల్లోకి ఉప్పు కారాల పొట్లాలు గుర్తుకొస్తాయి. పల్లెల్లో పిల్లల్ని అసలు పేర్లతో ఎవరూ పిలవరు. అసలు వాళ్ల అమ్మనాన్నలకే వాళ్ళ పేర్లు గుర్తుండవు. అన్నీ మారు పేర్లే, అవే అసలు పేర్లయి స్థిరపడిపోతాయి. ఉదాహరణకు కత్తోడు, పొండోడు, దిబ్బోడు, పొప్పోడు, కర్రోడు, బర్రోడు, ముద్దలోడు, పెగ్గోడు మొదలైనవి. బండి కట్టటం కూడా ఒక కళే అంటూ తన తాత బండి కట్టే విధానం గురించి **"కొత్త సావాసగోడు"** కథలో మనకి వినిపిస్తాడు. ఈ కథలోనే పల్లెల్లో మనుష్యులకి పశువులకి మధ్య వుండే అనుబంధాన్ని స్పృశిస్తాడు.

**'మిట్టూరోడి కతలు'** నామిని సుబ్రహ్మణ్యం నాయుడు రాశారు. పూర్తిగా చిత్తూరు మాండలికంలో తన చిన్ననాటి అనుభవాలను నామిని 'మిట్టూరోడి కథలు'గా మలిచారు.[3]

చిత్తూరు జిల్లాలోని గ్రామీణ పేద వ్యవసాయ కుటుంబానికి చెందిన రచయిత బాల్యం ఈ కథల్లో చిత్రీకరించారు. చిన్నతనం నుండి ఆడిన ఆటలు, తిన్న తిళ్లు, చూసిన మనుష్యుల గురించి చెబుతూనే, లోతైన సార్వజనీనమైన అంశాలను ఈ కథలు స్పృశిస్తాయి. రచయిత తన ఊళ్లోని వ్యక్తులను గురించి కథల్లో చిత్రీకరించారు. ఈ కథల్లో భాష, మాండలికం పూర్తిగా చిత్తూరు జిల్లాలోని మారు మూల పల్లెలోనిది.

ఉదాహరణకు : **'మద్యానాలకు మకరాజవదామని'** అనే కథలో "నేను ఆరో తరగతిని తపుసు జేసినా పాసయి వుండేవాడ్ని గాదు. ఆరో తరగతిలో చేరినా ఏ,భీ,శీ,డీలు నేర్చుకున్నాననుకో, సంవత్సరం పరీచ్చలను ఏ రీతిగా రాసుందును. ఏ రీతిగా పాసయ్యిందును? కాసు బ్రమ్మానంద రెడ్డి మా ఇస్కూలు పిలకాయల పాలిట దేముడు మాదిరిగా దిగొచ్చి, ఆరో తరగతికి, ఎనిమిదికి, తొమ్మిదికి ఫయిలు అనేది లేకుండా చేసాడు. అటెండెంసు వుంటే చాలు, పరీచ్చలు రాసినా, సరిగ్గా రాయని పిలకాయలందరు మొగలాయిలుగా పాసయి పోవాల్చిందేనని బ్రమ్మానంద రెడ్డి ఒక రూలు పాసు జేసి నడు. ఆ 'బి.పాసు.' దర్మాన నేను ఆరోతరగతిని గట్టెక్కేసినాను....... మునెమ్మ ఆరో తరగతిలోనే పెద్దమనిసై పోయిందట. ఆ పిల్లగూడ బ్రమ్మానందారెడ్డి దర్మాన పాసయి పూడ్సింది." అంటూ అంటూ చిత్తూరు మాండలికం కొనసాగుతుంది.

నామిని రాసిన దాదాపు 90 కథలను మిట్టూరోడి పుస్తకంగా ఒక సంకలనాన్ని తీసుకువచ్చారు. ఇందులో కథకుని బాల్య దశలోని కథలను, తల్లితో అనుబంధాన్ని, పుట్టిన ఊరితో ఉన్న సంబంధాన్ని నలభై కథల్లో వివరించారు. తన యవ్వన కాలాన్ని, వివాహం, ఉద్యోగం, వ్యవసాయాన్ని సిన్నబ్బ కతలు, నా కుశాల, నా మానేదా అనే కథల సంపుటాలుగా తీసుకువచ్చారు. ఇవన్నీ అయన జ్ఞాపకాల దొంతరలే. అచ్చమైన చిత్తూరు మాండలికం, అమాయకమైన గ్రామీణ ప్రజల జీవన చిత్రణ ఈ కథలకు ప్రత్యేక అలంకరమైందని చెప్పవచ్చు.

**'దర్గామిట్ట కతలు'** రాసిన మొహమ్మద్ కదీరు బాబు తన జీవితంలోని చిన్నతనపు తీపి, చేదు అనుభవాలను తీపిగానే మనకి అందించారు. మన కళ్ళకు చప్పగా అనిపించే దైనందిన జీవితాన్ని చిట్టి కదీరు తన జిజ్ఞాసతో పరిశీలించి వడపోసి, హాస్యాన్ని రంగరించి తేనెగా మన నోట్లో పోస్తాడు.

ఈ కథలలో ప్రేమ తప్ప ఇంకేమి తెలియని అమ్మ, బోళా నాన్న, ఎల్లలెరగని స్నేహం, మనింటి మనుషుల్లాంటి పక్కింటోల్లు ఒకటేమిటి అన్ని రకాల అద్భుత, ఆదర్శమైన తెలుగు జీవిత మధురిమలు మనల్ని ముంచెత్తుతాయి. ఈ కతలకు ముందు మాట రాసిన ముళ్ళపూడి రమణగారి పదాలలో... "వేదంలా ప్రవహించే తెలుగు జీవనదిలో ముస్లిం జీవన స్రవంతి ఇంతకాలం అంతర్వాహినిగా – కనపడకుండా ప్రవహిస్తూ వుండాలి. ఖదీర్ బాబ – దర్గా మిట్ట కతలలో భగీరథుడిలా ఆ నదిని మన ముందుకు మళ్ళించాడు . ఈ నది నీటిలో ప్రతి బిందువు ఒక ఆణిముత్యం. మంచుని ఎగజిమ్మే అగ్ని పర్వతం. ఇందులో నాన్నలూ, అమ్మలూ అవ్వలూ తాతలూ అందరూ భూలోక దేవతలు. సుఖసంతోషాలలాగే

కష్టాలనూ కన్నీళ్ళను కూడా నగలుగా వేసుకుని హుషారుగా తిరుగుతారు. పాలు పూలు పాపాలు, తాపాలు అన్నీ ఒక్కటే... మచ్చుకి నాలుక్కతలను మెచ్చుకుంటే మిగతా ఇరవయ్యి ... కోప్పడవు; నవ్వుతాయి... అంచేత...[4]

ఈ కథలు నెల్లూరు యాసలో కొనసాగుతాయి. ఈ కథలు ఆనంద జీవితాల మాత్రమే కాకుండా చాపకింద నీరులా చిన్నస్థాయి మధ్యతరగతి జీవితాల హాస్యభరిత బాధలను రచయిత ఆవిష్కరించారు. యదార్థత, నిష్పక్షపాతం, బాల్యాన్వేషణలో జీవిత సత్యాన్వేషణ చేయటం ఈ కథల్లో గమనించదగిన అంశం.

**'అలీఫ్, బే, తే మా నాయనమ్మకి గోరి కడితే'** కథను గమనిస్తే "ఈ ఐవోరు బెత్తం పట్టుకుంటే వొదలడంట సామీ. ఈ సంగతెలిసే మా అన్న ఆరులో ఉర్దూకు బదులు తెలుగు తీసుకున్నాడంట' అని యింకాస్త దడిపించినాడు యూసఫ్ గాడు. ఆ దెబ్బకి ఇంకిప్పటికిప్పుడు ఫ్లానెయ్యక తప్పదని అర్థమైపోయింది అందరికీ. 'రరర్తాయ్ ... ఐడియా' అన్నాడు గౌస్ జాన్ కొడుకు సందాని. ఏందిరా ... ఏందిరా అని అడిగినాము అందరం. 'జాఫర్ ఐవోరు, విజ్డమ్ టుటోరియల్స్' అన్నాడు చిటికేస్తా. అందరం సప్పంగా సల్లబడిపోయినాం. ఏడ్చినావులే.. ఆ పర్వేట్ లో బాగా చెప్పరని కదా సామీ మనం చేరనిది. అదీ కాక ఆడ పది రూపాయలు నాయినా ఫీజు" అన్నాడు యూసఫ్ . 'ఫీజు ఎక్కువైతే ఏమిరా? కొట్టకుండా చెప్తారంట. మధ్యలో ఎగనూకినా ఏమీ అనరంట' అన్నాడు సందాని అంటూ పిల్లల ప్రపంచంలోకి తీసుకుకెళ్తారు రచయిత.

**'వంజరాలు మాగలు కందసుదుములు'** కథలో "కూర సంగతికొస్తే మా నాయనదంతా 'హైతో ఖానా –నైతో సోనా' స్టయిలు (ఉంటే తినటం, లాకుంటే పొణుకోవటం). ఏ రోజయినా మా నాయిన యాభై రూపాయలు సంపాదించుకుని వచ్చినాడా... యింకయ్యి నీసు డబ్బులకిందే లెక్క. పొద్దునొక నీసు కూరకి, సాయింత్రమొక నీసు కూరకీ ఆ డబ్బుల్లోని అణా పైసాని కూడా జమెయ్యాల్సిందే."

"ఆమెని కదిలిస్తే కుర్ర పిల్లప్పటి కతలన్ని యిట్టాగే చెప్పద్దని మా అమ్మ కదిలించదు. ఎప్పటిలానే గమ్మున దుప్పటి చుట్టుకుని రెడీ అయిపోయింది సినిమాకి. జైబూన్ అపా వచ్చినాక 'రే...రిష్కా తేబో గబాల్న' అనింది నా తట్టు చూస్తా. 'తేనుగా' అన్నాను తల అడ్డంగా వూపుతూ... 'ఏందిరో చెప్తా వుంటే..పో రిష్కా పిలచక రాబో' అనింది జైబూన్ అపా కూడా... 'తెస్తే – నన్ను –కూడా – పిలచక పోవాలి – సినిమాకి' అన్నాను దీర్ఘాలు పెట్టి సాగ తీస్తా...' 'సినిమాకా? ఖాజాపీరు కోడలికి కాన్పయ్యింది నాయినా, చూసి రావడానికి పోతన్నాం ... ఆడకి పిలకాయలు రాకూడదు' అనింది మా అమ్మ. నువు యాడికి పోతున్నావో – నాకు తెలుసులేమ్మా' అని చిటికేసి 'మరేదగా నన్ను సినిమాకి పిలచకపోతే రిష్కా తేను అని బెదిరించేసాను. దెబ్బకి మా అమ్మ దారికొచ్చేసింది. 'సరే పా నా




కొడకా. ఇంటర్‌బెల్లులో పులి బంగరాలు అడిగినావో అప్పుడు చెప్తా నీ పని' అని పళ్ళు పటపటమని కొరికింది మా అమ్మ." 'నేను నేలలో... అమ్మ బెంచీలో' కథలో తల్లితో ఉన్న అనుబంధాన్ని తెలియచేస్తూ రచయిత వివరించడం జరిగింది.

ఎలికట్టె శంకర్రావు తన బాల్యాన్ని, నాటి గ్రామీణ జీవనాన్ని, తాను చదువుకున్న పాఠశాల జీవితాన్ని, తన సార్లను, టీచరమ్మలను, స్నేహితులను మనముందు సజీవంగా 'పరిగెచెను కథల' ద్వారా పాఠకుల ముందు నిలుపుతారు. శంకర్రావుది వ్యవసాయ కుటుంబ నేపథ్యం అవటం వలన, ఈ జ్ఞాపకాలలో వ్యవసాయ విషయాలు, ఒక రైతుగా తండ్రి పడే తాపత్రయం, కష్టజీవి ఆయన తల్లి అంతరంగం ఈ కథల్లో తరచూ గమనించవచ్చు. తెలంగాణా గ్రామీణ రైతుల భాష యాస ఈ కథల్లో గుర్తించదగిన మరో అంశం. నల్గొండ జిల్లా యాస ఈ కథల్లో ఉపయోగించడం జరిగింది. తొలి చినుకుల కోసం ఆశగా చూసే తండ్రిని, అతని ద్వారా కార్తె లెక్కలు వేయటం నేర్చుకునే పిల్లల్ని **'అయిటి వాన – మా ఆశ'** కథలో చిత్రిస్తే, **'పంట సేను అమ్మ వోడి అనుకోవాలిరా'** కథ చేనుకి రైతుకు ఉన్న అనుబంధాన్ని చూపుతుంది. హాస్యం, వ్యంగ్యం, అమాయకత్వం కలిసిన కథకుని సంభాషణలకు, శైలికి పాఠకులు ఆకర్షితులవుతారు. తమ పసితనాన్ని జ్ఞప్తికి తెచ్చుకుంటారు.

**'జ్ఞాపకాల జావళి'** పేరుతో వచ్చిన కథాసంకలనం మనకు మధ్యాంధ్ర పల్లెల్లో బాల్యాన్ని పరిచయం చేస్తుంది. ఇవి పొత్తూరి విజయలక్ష్మి గారి జ్ఞాపకాలు. ఈ కథల్లో తాతయ్యలు, అమ్మమ్మ, నానమ్మలు, అమ్మానాన్నలు, ఇంకా దగ్గరి బంధువులు, సొంతూరి జ్ఞాపకాలు, చిన్ననాటి ఆటలు, పాటలు, అప్పటి అలవాట్లు, పద్ధతులు అలనాటి అభిమానాలు, ఆప్యాయతలు, అనుబంధాలు, బాంధవ్యాలకే తప్ప సంపదకి ప్రాధాన్యతనీయని వ్యక్తులు విశిష్ట వ్యక్తిత్వాలు, బాధ్యతలను పంచుకోవాలనుకునే మనుషులు, ప్రేమను పంచే మమతలు, పెద్దలని గౌరవించే పిన్నలు, పిల్లల అభిప్రాయాలను మన్నించే పెద్దలు అడుగడుగునా ఎదురవుతారు.

ఇంకా నిశితంగా పరిశీలిస్తే, "పెళ్ళిళ్ళు, పండగలు పబ్బాలు... ఉత్సవాలు వేడుకలు... అమ్మకాలు, కొనుగోళ్ళు... నిజాయితీ... నిబద్ధత... విలువలు. ఒక పెన్సీలు ఇంజక్షన్, ఒక కరెంట్ వింజామర, ఇంకా అరకు అల్లం, సంతకం పెడితే ఇంటికొచ్చే చీరె, చిరకాలం మన్నే ట్రంకు పెట్టె, ఇంగిలీషు... తెలుగు... హిందీ

పాఠాలు.... అద్భుతమైన బాలభోగం... అందమైన దీపావళి... అసలైన పండగ...బాపట్ల స్టేషన్ ప్లాట్ఫారం 3 మీదుగా దూరాభారాలు... అందమైన జ్ఞాపకం అమ్మమ్మ పుట్టిల్లు... అభిమానాల నెలవు..." మొదలైన అనుభూతులను పంచేందుకు రచయిత్రి కృషి చేసారు.

ఒక్కో సంఘటనలో, ఒక్కో కథనంలో ఒక విశిష్టవ్యక్తిని పరిచయం చేస్తారు. ఆ వ్యక్తితో ముడిపడ్డ జ్ఞాపకాలను పొత్తూరి విజయలక్ష్మి పాఠకులతో అందంగా పంచుకుంటారు. ఈ 'నోస్టాల్జియా'లో కల్మషం లేని మనుషులను, కల్తీ కాని అభిమానాలను కళ్ళకి కట్టారు రచయిత్రి. ఈ స్మృతులలో కొన్ని నవ్విస్తాయి, కొన్ని ఆలోచింపజేస్తాయి. మరికొన్ని కంటికి చెమ్మనిస్తాయి. జీవితం పట్ల సానుకూల భావాన్ని కలిగించే ఈ మధుర స్మృతులు చదువరులను అలరిస్తాయి.

**'అప్పడాల పిండి'** కథలో ఊరంతా ఏకమై ఒక్కొక్కళ్ళ ఇంట్లో ఒక్కోరోజు చేరి అప్పడాలు తయారుచేసే కార్యక్రమం సాధారణమైనదిగా కనిపించినా చాలాకాలంగా సమాధానంలేని సమస్యలు అందరు కలిసి పరిష్కరించుకోవడం గమనించవచ్చు. **'జాగ్రత్త అది వింటుంది'** కథలో సంవత్సరాల నాటి స్త్రీల అమాయకత్వాన్ని హాస్యభరితంగా వివరించారు. 'రేడియో' పాడుతుంటే దానిముందు కూర్చునే వినాలని, అవతలకి వెళ్తే, అందులోని విద్వాంసులకు కోపం వస్తుందని భావించడం, పని కూడా మానేసి కూర్చోవడం, రేడియో ముందు ఏమైనా మాట్లాడితే అది వింటుందని భావించడం వంటివి రచయిత్రి యొక్క చమత్కారానికి తార్కాణాలు. జీవితం చరమాంకంలో ఉన్న అన్నాచెల్లెళ్ళు కుటుంబ సభ్యుల పంతాలకు బలయ్యి దూరం అవుతారు. గాజుల బత్తుడి సహాయంతో కుశలం తెలుసుకోవటం, గడుగ్గాయి లాంటి కథకురాలు వారిద్దరిని కలపడం 'అసలు రహస్యం' కథలో ఇతివృత్తం. ఇలాంటి కథలన్ని కలగలిసి జ్ఞాపకాల జావళి కథలను మరింత ఆర్ద్రంగా మలచాయి.

సీనియర్ రచయిత ముళ్ళపూడి వెంకటరమణ తన జీవిత ఘట్టాలను, అంతర్లీనంగా ప్రాణ మిత్రుడైన దర్శకుడు, చిత్రకారుడు బాపు జీవిత ప్రయాణాన్ని మేళవించి రాసిన జ్ఞాపకాల పరంపర 'కోతి కొమ్మచ్చి'[5] పేరుతో మూడు భాగాలుగా విడుదలయ్యాయి. ఇవి కథలనే, వ్యాసాలనో తేల్చి చెప్పలేం. ఇవి తారీకులవారీ దస్తావేజు కాదు, రచయతగా, సినీనిర్మాతగా, మహానుభావులతో, మరో-భావులతో తనకెదురైన వింతవింత అనుభవాలను నిజాయితీగా, నిర్భీతిగా పాఠకులతో పంచుకుంటూ ఒక రసవద్ఘట్టం నుండి మరో రమ్యమైన ఘట్టానికి శాఖాచంక్రమణం చేస్తూ, కొత్తకొత్త పదబంధాలను అల్లుతూ, చమత్కారశైలితో మానని మురిపిస్తూ, ఆ కాలంలోకి తీసుకుపోయి ఆయా మనుషుల మధ్య విహరింపజేశారు రమణ. ఒక చెట్టుచెట్టునుండి మరో చెట్టుకు దూకుతూ ఆదే కోతి కొమ్మచ్చిగా తన కథలను పోల్చుకున్నప్పటికీ, జీవితంలో అన్నీ చూసిన వేదాంతి నిర్వేదంతో తన జీవితాన్ని పొరపాట్లతో సహా సమీక్షిన్చుకుంటున్నట్లుగా రాసుకుపోయారు. అనుభవాల పరంపరలో ఆత్మావలోకనం చేసుకున్నారు. రచించింది రమణ కానీ, శరీరాలు వేరేగాని ఆత్మలు ఒకటే అనేలా బ్రతికిన బాపు రమణలిద్దరి జీవితం ఈ కథల్లో కనిపిస్తుంది.

సుంకోజు దేవేంద్రాచారి తెలంగాణ మాండలికంలో రాసిన **'కొమ్మిపూలు'** కథను పరిశీలిస్తే, ఊరికి దూరంగా ఉన్న కొండమీదకి బావమరుదులతో కలిసి ఎక్కే ప్రయత్నంలో, వాళ్ళు గుట్ట ఎక్కుతూ చేసే సందడి, దారిలో ప్రతీ కాయని, పువ్వుని పలకరించుకుంటూ చేసే ఆ ప్రయాణంలో కందిసొళ్ళు, వరినాట్లు, పెరికె చెట్లు మాట్లాడుతాయి. గుట్ట మీద బండల్లో తమ బాల్యాన్ని వెతుక్కుంటారు. ఆ కొండ చుట్టూ చిన్ననాడు పీల్చిన సుగంధాలను పీల్చుకుని ఆశ్చర్యపోతాడు కథకుడు. అవి దేవతల వలన వచ్చిన సుగంధాలని పెద్దవాళ్ళు చెప్పినా, చివరికి అవి కొండరాళ్ళ మధ్య ఉన్న కొమ్మిపూల సుగంధాలని తెలుసుకుంటాడు. బాల్యాన్ని స్మరించుకునే ఈ కథలో కొమ్మిపూలను బాల్యానికి ప్రతీకాత్మకంగా రాయటం జరిగింది.

బాల్యం ఎంతో మధురమైనది. చిన్నప్పుడు చేసే పనులు, చిలిపి చేష్టలు మరపురాని జ్ఞాపకాలుగా నిలిచిపోతాయి. ఎంత వయసు వచ్చినా గతం తాలుకూ గుర్తులు వెంటాడుతూనే ఉంటాయి. చిన్ననాటి జ్ఞాపకాలు అనేక ప్రత్యేక లక్షణాలను కలిగి ఉంటాయి. ప్రయోగాత్మక మనస్తత్వవేత్త మరియు కాగ్నిటివ్ న్యూరో సైంటిస్ట్ ఎండెల్ టుల్వింగ్ జ్ఞాపకశక్తిని "మానసిక సమయ ప్రయాణం"గా సూచిస్తారు. ఇది మానవులకు మాత్రమే ప్రత్యేకమైన ప్రక్రియ. ఆనందాన్ని, ఆహ్లాదాన్ని మాత్రమే కాకుండా జీవితమంతా కొనసాగే స్నేహ బంధాలకు సైతం బాల్యమే సుస్థిర వేదిక. అటువంటి బాల్య జ్ఞాపకాలను కథా వస్తువులుగా స్వీకరిస్తూ కథా సాహిత్యం సైతం సుసంపన్నం అవుతోంది.

**ఉపయుక్త గ్రంథ సూచి :**


1. రమేష్. స. వెం, ఉత్తర పొద్దు, ఆదివారం ఆంధ్ర జ్యోతి, 7 డిశంబర్ 2003.
2. ప్రళయకావేరి కథలు, రమేష్. స. వెం, మీడియా హవుస్ పబ్లికేషన్సు, విద్యానగరు, హైదరాబాదు, 2015.
3. సుబ్రహ్మణ్యం నాయుడు నామిని , మిట్టూరోడి కథలు, టామ్ సాయర్ పబ్లికేషన్స్, తిరుపతి, 2015.
4. ఖదీర్ బాబు, మహమ్మద్, దర్గామిట్ట కథలు, కావలి ప్రచురణలు, నెల్లూరు.
5. వెంకట రమణ, ముళ్ళపూడి, కోతి కొమ్మచ్చి (బాపు రమణీయం) ఎమెస్కో బుక్స్, 2011.

ISSN 2457-0796                                                UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక   సంపుటి -27 : సంచిక - 1   11   హైదరాబాద్   నవంబర్ : 2023

# దీపావళి – విశేషాలు

**డా. కాకునూరి సూర్యనారాయణ మూర్తి,**
తెలుగు ఆచార్యులు, బి.జె.ఆర్. డిగ్రీ కళాశాల, హైదరాబాద్.
ఫోన్ : 98665 42365

**ప్రారంభం :** భాః అంటే కాంతి. కాంతిని ఆరాధించేవారు భారతీయులు. దీపం అంటే వెలుగులను ప్రసాదించేది. దీపాన్ని వెలిగించి ఆరాధన చేసే సంప్రదాయం భారతీయులది. ఆ దీపారాధనలే దీపావళికి ప్రేరణలు. మనలో జ్ఞానం అనే దీపాన్ని వెలిగించటం ఆ దీపావళికి సంకేతం. ఈ వ్యాసంలో తెలుగు సాహిత్యంలో కావ్యాలు, పురాణాలు ప్రధానంగా హరివంశం ఈ పండుగకు సంబంధించిన జ్ఞానాన్ని వివరిస్తాయి. ముఖ్యంగా నాచన సోమన ఉత్తర హరివంశంలో మరింత విశేషంగా ఈ పండుగకు సంబంధించిన వైజ్ఞానిక కోణాలను గ్రహించవచ్చు. ఎర్రన హరివంశంలో కూడా ఈ పండుగకు సంబంధించిన అనేక శాస్త్రీయ కోణాలను ఆ కవి తన కావ్యంలో నిక్షేపించి ఉన్నాడు. అయితే పండుగల నేపథ్యంలో ఉండే శాస్త్రీయ వైజ్ఞానికకోణాన్ని గ్రహించక మూఢమార్గంలో అనుసరించడంగా మన పండుగలు మారిపోతున్నాయి. ఈ నేపథ్యంలో దీపావళి పండుగ వెనుక ఉన్న ఆధ్యాత్మిక, శాస్త్రీయ కోణాలను వివరించే ప్రయోజనం సాధించటమే ఈ వ్యాసం ఉద్దేశం.

**కీలక పదాలు :** దీపావళి అయిదురోజుల పండుగ 1. ధన త్రయోదశి (బంగారాన్ని పూజించటం అంటే కొనమని అర్థం కాదు; బంగారంపై వ్యామోహాన్ని తొలగించుకోవటం) 2. నరక చతుర్దశి (తైలాభ్యంగనం ద్వారా శారీరక ఆరోగ్యం అనే సంపదను పెంచుకోవటం) 3. దీపావళి (ధనలక్ష్మిని పూజించటం అంటే పర్యావరణాన్ని పరిరక్షించుకోవటం, బాణసంచాను వెలిగించటం అంటే నష్టం కలిగించే సూక్ష్మక్రిములపై యుద్ధం ప్రకటించటం. 4. బలి పాడ్యమి (వాతావరణ సమతౌల్యతను కాపాడడంలో ధేనువు ఉనికిని గుర్తించి సంరక్షణ చేయటం) 5. యమ ద్వితీయ (కౌటుంబిక అనుబంధాలలో సోదరీ, సోదర అనుబంధం వెలకట్ట లేనిదని నిరూపించటం.

### అయిదురోజుల పండుగ దీపావళి

దీపం అంటే ప్రాణశక్తికి ప్రతీక. ఆనందానికి మరొక రూపం, కనిపించే దైవం, చీకటిని పారద్రోలి వెలుగు ఇచ్చే సాధనం, ఒక్కమాటలో పరబ్రహ్మ స్వరూపం. వెలిగించిన దీపం నిశ్చలంగా ప్రకాశిస్తుంటే అది మనకు మన మనస్సుకు ప్రశాంతతను ఇస్తుంది, ఏకాగ్రతను కుదురుస్తుంది. దానితో మన పుణ్యబలం పెరుగుతుంది. ఫెస్టివల్ ఆఫ్ లైట్స్ అని మనం పిలుచుకునే ఈ పండుగ అంటే అసత్యంపై సత్యం విజయం. మనం పెంచుకున్న పుణ్యం కాంతి అనుకుంటే చేసిన పాపాలను చీకటి అనాలి. అప్పుడు దీపకాంతి ఆ చీకట్లనే పాపాలను తొలగిస్తుంది. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక ఈ పండుగ. చెడు రాశిపోసిన చీకటి అయితే మనం చేసే మంచి అనంతకోటి ప్రభలతో వెలిగే అఖండ దీపాల వరుస దీపావళి.



### పురాణాలలో –

+ దుర్మార్గుడైన నరకుడిని కృష్ణుడు సత్యభామ సహాయంతో సంహరించినందుకు దీపావళి జరుపుకుంటారు.

+ బలి చక్రవర్తి విష్ణువు ఆజ్ఞకు బద్ధుడై పాతాళానికి పోయినందుకు దీపావళి.

+ రావణ వధ అనంతరం రాముడు అయోధ్యకు వచ్చినందుకు దీపావళి.

### చరిత్రలో

ఆచార్య జినసేన శకం 705 ప్రకారం జైనులకు సంవత్సరపు చివరిరోజు దీపావళి. జైన గురువు వర్ధమాన మహావీరుడి నిర్వాణం రోజు ఆశ్వయుజ శుద్ధ చతుర్దశి మరునాడు దీపావళి. ఆ మరునాడు వారికి కొత్త సంవత్సరం. మరో కథనంలో విక్రమశక స్థాపకుడైన విక్రమార్క చక్రవర్తి పట్టాభిషేకం చేసుకొన్న రోజు కూడా ఈరోజే!

సిక్కులకు 'బందీచోర్ దివస్'. వారి గురువు గురుగోవింద్ (ఆరవ గురువు) తో పాటు 52 ఇతర రాజులను ఆనాటి ఢిల్లీ మొఘల్ బాద్‌షా జహంగీర్ గ్వాలియర్ కోటలో బంధించాడు. అది 1610 సంవత్సరం. అయితే వారందరినీ తప్పనిసరి పరిస్థితులలో విడుదల చేయవలసి వచ్చింది. వారు విడుదల అయిన రోజు బందీచోర్ దివస్ వారికి దీపావళి. "సర్బత్ ఖాల్సా" మొదటి సమావేశం కూడా సిక్కులు



దీపావళినాడే జరిపారు.

కొసమెరుపుగా శ్రీరాముడు రావణవధ అనంతరం పట్టాభిషిక్తుడైన రోజు కూడా ఈరోజే అని కూడా కథనాలున్నాయి.

### ఇతర దేశాలలో

నేపాల్‌లో తీహార్ అన్న పేరుతో, మలేషియాలో హరిదీవళి అన్న పేరుతో ఈ పండుగను జరుపుకుంటారు. ఇంగ్లండ్, నెదర్ల్యాండ్, న్యూజిలాండ్, కెనడా, ఫిజి, మారిషస్, మయన్మార్, సింగపూర్, సౌత్ ఆఫ్రికా, ఆస్ట్రేలియా, ఆఫ్రికా, అమెరికా… ఇలా ప్రపంచంలోని దాదాపు అన్ని దేశాలలో ఈ పండుగ జరుపుకుంటారు. చైనాలో దీనిని 'నయమేహోచా' అంటారు. నేపాల్‌లో కాళ్‌తోహార్ అన్న పేరుతో కాకులకు విందు పెడతారు. అవి తినడం కోసం వచ్చినప్పుడు పూలదండలతో ఆహ్వానిస్తారు. ఆ పూలదండ కాకికి తగిలితే లాభదాయకం అని నేపాలీయుల విశ్వాసం.

దీపావళి ఐదురోజుల పండుగ. 1. ధనత్రయోదశి 2. నరక చతుర్దశి 3. దీపావళి అమావాస్య 4. బలి పాడ్యమి 5. యమద్వితీయ అని దీపావళిని అయిదురోజులలో జరుపుకుంటాం. ఘనమైన పండుగ ఇది.

**1. ధన త్రయోదశి :** ఈ రోజున లక్ష్మీదేవి మన ఇంటికి వస్తుంది అని విశ్వాసం. ఇందుకు ఒక చక్కని కథ ప్రచారంలో ఉంది. పూర్వం హిముడు అని ఒక రాజు ఉండేవాడు. అతడి కుమారుడికి 16వ ఏట ప్రాణగండం అని, వివాహమైన నాల్గవరోజున అతని భార్యకు తెలిసింది. ఆ ప్రాణగండం ఉన్నరోజు ఈ త్రయోదశి. ఆ ఇల్లాలు వారి ఇంటి గుమ్మం ముందు ధనాన్ని రాశిగా పోసి దీపాన్ని వెలిగించింది. లోపల భక్తితో భగవంతుడి పాటలు పాడుతున్నది. యముడు వచ్చి దీపాలను చూచి, పాటలు విని లోనికి వెళ్లలేక వెనుదిరిగి పోయాడు.

అలాగే దేవదానవులు కలిసి చేసిన సముద్రమథనంలో ధన్వంతరి ఆవిర్భవించిన రోజు ఈరోజు. ఈరోజున ఇంట్లో, ఇంటి ముందర దీపాలు వెలిగించాలి. రెండవ ద్వాపరయుగంలో దీర్ఘతముడు అనేవాడికి ఈ ధన్వంతరి కొడుకుగా పుట్టాడనే మరో కథ కూడా ఉంది. ధన్వంతరి ఒక చేతిలో జలగ, మరోచేతిలో అమృతభాండం పట్టుకొని జన్మించాడు అని బ్రహ్మాండ పురాణం వర్ణిస్తుంది.

**"నమామి ధన్వంతరి మాది దైవమ్, సురాసురైర్వందిత పాదపద్మం।**
**లోకే జరారుగ్ భయ మృత్యునాశనం, దాతారమీషం వివిధౌషదానాం॥"**

**2. నరక చతుర్దశి :** ప్రేత చతుర్దశి, పిశాచ చతుర్దశి, నరక చతుర్దశి అనే పేర్లతో రెండవరోజు ప్రసిద్ధి పొందింది. నరకుడు ప్రాక్ జ్యోతిషపురానికి అధిపతి. అతడు శ్రీహరికి, భూదేవికి పుట్టినవాడు. విష్ణువు హిరణ్యాక్షుడిని సంహరించడం కోసం వరాహావతారం ఎత్తిన సందర్భంలోనే భూదేవిని కూడా ఉద్ధరించాడు. అప్పుడు పుట్టాడితడు. ఇతడికి భౌముడనే పేరు కూడా ఉంది. సత్యభామ సహాయంతో కృష్ణుడు ఇతడిని చక్రం ప్రయోగించి సంహరించాడు. ఇది పురాణ కథ.

జ్యోతిషం ప్రకారం ఈరోజు తులారాశిలో సూర్యోదయం అవుతుంది. అప్పుడు మేషరాశికి సూర్యాస్తమయం. ఆ రాశికి అధిపతి కుజుడు. కు అంటే భూమి. జ అంటే పుట్టడం. కుజుడు అటే భూమి కుమారుడు. ఈ రోజులలో సూర్యచంద్రులు స్వాతీ నక్షత్రంలో ఉంటారు. ఇది తులారాశిలో ఉండే నక్షత్రం. కృష్ణుడు (సూర్యుడు), సత్యభామ (చంద్రుడు) కలిసి కుజుడిని ఓడించి కన్యారాశికి (16వేల మంది కన్యలు) విడుదల కలిగించడమే నరక చతుర్దశి కథ. ఇది నాచన సోమన చేసిన హరివంశం రచనలోని అలంకారం.

ఈరోజు పాటించవలసిన విధులు

**1. తైలాభ్యంగనం**

**"తథా కృష్ణ చతుర్దశ్యా మాశ్వినేర్కో దయాత్పురా ।**
**యామిన్యా: పశ్చిమేయామే తైలాభ్యంగో విశిష్యత ॥**
**(నిర్ణయ సింధు)**

స్నానం చేసే సమయంలో శరీరానికి నువ్వుల నూనెతో మర్దన చేయాలి. మన దేహంలో ఉన్న ముక్కు, కళ్ళు, చెవి, నాలుక, చర్మం అనే అయిదు ఇంద్రియాలలో స్పర్శ చర్మ సంబంధితం. శరీరానికి ఉన్న మరో లక్షణం వీలు వెంబడి వంగే స్వభావం కలిగి ఉండడం. చర్మాన్ని చేత పట్టుకొని లాగితే, సాగి ఉండే గుణం, తిరిగి వదలగానే తిరిగి యథాప్రకారం కావడం అనే స్వభావానికి మూలం దేహంలో ఉన్న వాయు తత్త్వం.

**"స్పర్శ వేభ్యధికో వాయు: స్పర్శనంతత్వగాశ్రితమ్ ।**
**త్వచం చ పరమోభ్యంగ: తస్మాత్తం తిలయేన్నర: ॥**

అని చరక సంహిత స్పర్శ అనే ఇంద్రియగుణం చర్మాన్ని ఆశ్రయించి ఉంటుంది. ఈ చర్మపు కదలికలకు వాయువు ఆధారం.

దీనికి బలం కలిగించేది తైలాభ్యంగనం. నూనెతో శిరస్సుకు మర్దన చేస్తే శరీరం మొత్తానికి సుఖం, బలం, తృప్తి లభిస్తాయి. అరికాళ్ళకు మర్దన చేస్తే చల్లబడతాయి. ఇవి మనకు అనుభవంలో ఉన్న విషయాలు. చెవులలో కొన్ని చుక్కలు నూనె వేసుకుంటే కర్ణరోగాలు, కర్ణమలం, మెడి బిగిసిపోవడం, చెవిలో హెూరు, తదితర వ్యాధులు రావు. ముక్కు రంధ్రాలలో వేయడం ద్వారా జలుబు, తిమ్మిరులు, తుమ్ములు వంటివి అరికట్టవచ్చు. కంటి చివరలో వేసి నేత్రవ్యాధులకు దూరంగా ఉండవచ్చు. దంతాలకూ కళ్ళకూ సంబంధం ఉండడం కూడా తెలిసిన విషయమే. ఆవిధంగా దంతవ్యాధులూ దరి చేరవు. కనుక తైలాభ్యంగనం తప్పనిసరి.

**2. యమ తర్పణం :** స్నానం అనంతరం దోసిళ్లలో నీళ్ళు తీసుకొని 11సార్లు యమధర్మరాజుకు ప్రీతి కలిగే నిమిత్తమై తర్పణం వదలాలి. స్నానం చేసే నీరు, కాచే సమయంలో అందులో మామిడి, మేడి, జువ్వి, అత్తి, నేరేడు చెట్ల బెరడు వేయాలి. ఉత్తరేణి పుల్లతో కలపాలి.

**3. ఉల్కాదానం :** పితరులకు త్రోవ చూపించే విధంగా ఈ క్రియ ఆచరించాలి. ఉల్కలు అంటే కొరవులు. కట్టె చివర పేడ, బొగ్గుపొడి కలిపి, అద్ది, ఎండబెట్టి, దానిపై తైలం వేసి వెలిగించితే అది కొరవి. సూర్యాస్తమయం కాగానే వాటిని వెలిగించి ఆకాశంవైపు చూపుతూ ఇలా చెప్పాలి.

**"అగ్నిదగ్ధాశ్చయే జీవా యేప్యదగ్ధా: కులేమమ ।**
**ఉజ్జ్వల జ్యోతిషా దగ్ధాస్తేయాంతు పరమాంగతిం ॥**
**యమలోకం పరిత్యజ్య ఆగతాయే మహాలయే**
**ఉజ్జ్వల జ్యోతిషా వర్త ప్రవశ్యంతు వ్రజంతుతే ॥**

ఈ చతుర్దశి నాటి సాయంత్రం, చేతిలో ఇలా కొరవిని పట్టుకొని ఆకాశం వైపు చూపుతూ అగ్నిచేత దేహం మాత్రమే దహింప బడుతుంది. ఆ అగ్నిచేత ధర్మం నిర్వహింపబడుతుంది. అగ్ని మార్గం చూపిస్తుంది, ఉత్తమ లోకాలకు మార్గనిర్దేశనం చేస్తుంది. కనక యమలోకం విడిచి మహాలయ పక్షంలో మమల్ని ఆశీర్వదించడం కోసం ఈ లోకాలకు వచ్చిన పితృదేవతలకు ప్రీతికరంగా ఉత్తమ లోకాలకు పథం నిర్దేశించే నిమిత్తమే ఈ ఉల్క అని ఆ తరువాత కొరవిని ఇంటి మేడపైన దక్షిణ దిగ్భాగంలో పెట్టాలి. దీనికి ప్రతీకగా, ఆకాశదీపాన్ని నేడు మనం వెలిగిస్తున్నాం.

ఆ తరువాత దీపాలను దేవాలయం, మఠం, ప్రాకారం, వీధికూడలి, ఇంటి ముందుభాగం, గోశాల, గజశాల, అశ్వశాల అనే ఎనిమిదిచోట్ల దీపాలను వెలిగించాలి. నరక చతుర్దశి అంటే నరకం (దుర్గతి) నుండి తరింపచేసే చతుర్దశి.

**దీపావళి అమావాస్య :** నరక లోక వాసులకు స్వర్గపు త్రోవ చూపడం కోసం ఏర్పాటు చేసే దీపాల వరుస దీపావళి. బలి చక్రవర్తి పాతాళానికి చేరిన అనంతరం అతడి చెరలో ఉన్న లక్ష్మికి విడుదల కలిగిన రోజు కనుక దీపావళి రోజున మనం లక్ష్మీ పంచాయతనాన్ని పూజించాలి. అంటే విష్ణువు (సంతోషం) ఇంద్రుడు (తృప్తి) కుబేరుడు (సంపద) గణేశుడు (సంపద ఇచ్చేవాడు) లక్ష్మి (శక్తి). దీపావళికి దీపమంత చలి ఉంటుంది. దీపావళి వర్షాలు ద్వీపాంతరాలు దాటుతాయని సామెతలున్నాయి.



**"కర్దమేన ప్రజాభూతా మయి సంభవ కర్దమ ।**
**శ్రియం వాసయమే కులే మాతరం పద్మమాలినీం ॥**

కర్దమ పుత్రికైన శ్రీ మహాలక్ష్మి నాకు సాక్షాత్కరించాలి. తామరపువ్వుల మాల ధరించిన సంపదలకు నిలయమైన లక్ష్మి మా అందరి హృదయాల్లో ఎల్లప్పుడు నిలిచి ఉండాలని దీపావళినాడు లక్ష్మీదేవిని ప్రార్థించాలి కొందరు ఈరోజు కేదారేశ్వర వ్రతాన్ని నిర్వహిస్తారు.

**బలి పాడ్యమి :** గోవర్ధన గిరిని చిటికెనవేలిపై శ్రీకృష్ణుడు ఎత్తినరోజు బలి పాడ్యమి.

**"బలిరాజ నమస్తుభ్యం విలోచన సుత ప్రభో**
**భవిష్యేంద్ర సురారాతే పూజితాం ప్రతిగృహత్యాం"**

అంటూ భవిష్యకాలంలో ఇంద్రుడిగా కాబోయే బలిని ప్రార్థిస్తారు.

**"వైరాగ్య తైల సంపూర్ణే భక్తి వర్తి సమన్వితే**
**ప్రబోధ పూర్ణ పాత్రేతో జ్ఞానదీపం విలోకయేత్"**

గురుప్రబోధంతో నిండిన వ్యక్తిత్వం అనే పాత్రలో వైరాగ్యం అనే నూనెను పోసి భక్తి అనే వత్తిని వెలిగించి, జ్ఞానకాంతులను ప్రకాశింప జేయాలి. గోవర్ధనోద్ధరణం చేసిన కృష్ణుడు ఇంద్రుని గర్వాన్ని తొలగించి, మనకు అభయం ప్రసాదించిన ఘటనకు ప్రతీకగా ఈరోజు వాకిలిలో గోమయంతో గోవర్ధనపర్వతం చేసి పూజించటం ఒక ఆచారం. అలాగే గోక్రీడను కూడా నిర్వహిస్తారు.

**5. యమ ద్వితీయ :** ఉత్తర భారతంలో ఈ పండుగకు **'భాయి దూజ్'** అని పేరు మనం **భగినీ హస్త భోజనం** అంటాం. సోదరీ సోదరుల మధ్య అనుబంధం దృఢతరం చేసేవి రెండు సందర్భాలు ఒకటి రాఖీ పున్నమ కాగా రెండవది ఈరోజు. ఈనాడు సోదరునికి భోజనం పెట్టిన మహిళకు ఏ కష్టమూ కలగదని జనుల విశ్వాసం.



సూర్యుని కుమార్తె అయిన యమున తన సోదరుడైన యమునికి ఈరోజు విందుభోజనం ఏర్పాటు చేసింది కనుక ఈ పండుగకు యమ ద్వితీయ అనే పేరు ఉందని మరో కథనం.

**"తులా రాశిం గతే సూర్యే గంగా త్రైలోక్య పావనీ**
**సర్వత్రా ద్రవరూపేణ సా సంపూర్ణ భవేత్తదా"**

సూర్యుడు తులా రాశిలో సంచరించే ఈ కాలంలో మనం పాటించే ఈ పండుగ ప్రకృతి నియమాలకు అనుగుణంగా రూపుదిద్దుకున్నదే. దీపాలతో కొత్త వెలుగులను ప్రసాదించేది. దీపం చీకట్లను పటాపంచలు చేస్తుంది. మనం మనలోని అజ్ఞానమనే చీకట్లను విజ్ఞానమనే వెలుగులతో పారద్రోలాలి.

చీకటి = వెలుతురు; దు:ఖం = సుఖం; దుర్గతి = సద్గతి. మొదటి స్థితి నుంచి రెండవ స్థితికి చేరేందుకు మనం చేసే ప్రయత్నమే దీప ప్రజ్వలనం. అహంకార అజ్ఞానాలకు చీకటి సంకేతం. పాపాలకు ప్రతీక ఈ చీకటి. దీప ప్రకాశంతో పాపాలు తొలగిపోతాయి. ఈ లోకం నియమానుసారం నడవాలి. లేకపోతే జీవితం నరకమౌతుంది. ఇది చీకటి వెలుగుల సంగ్రామం. అంతరంగంలో జరిగే మంచి, చెడుల ఘర్షణలో అప్రమత్తతో మెలగాలి. వివేకంతో అంతర్మథనంలో చోటుచేసుకున్న చీకటిని కూకటి వేళ్ళతో పెకిలించాలి.

ఈ విధమైన వివరణ దీపావళి పండుగను గురించి మనం చేసేటటువంటి ఆధ్యాత్మిక వివేచన. సాహిత్యపరమైన వివేచనలో ఈ కథా నేపథ్యం ఆకాశంలో ఉన్న నక్షత్రాల కదలిక సంకేతం. ఎర్రన, నాచనసోమన కవులు ఎవరికి వారు వారి ధోరణులలో మనకందించిన వైజ్ఞానికాంశాల సమాహారమైన కావ్యాలు హరివంశాలు. యశోదారెడ్డిగారి తెలుగులో హరివంశాలు అనే సిద్ధాంత గ్రంథాన్ని పరిశీలించినా, లేక **"జ్యోతిర్మయం వాఙ్మయం"** (ప్రాచీనాంధ్ర సాహిత్యంలో జ్యోతిష విజ్ఞానం) అనే ఆచార్య కమలాకర శర్మగారి సిద్ధాంత గ్రంథాన్ని పరిశీలించినా ఈ కథలో ఉన్న ఖగోళ విజ్ఞానం అవగతమవుతుంది.

కన్యారాశిలో సూర్యసంచారం చీకట్లకు ప్రతీక. మేషరాశిలో సూర్యాస్తమయం ఇదే విషయాన్ని వివరిస్తుంది. మేషరాశికి అధిపతి కుజుడు. ఇతడే నరకుడు. కన్యారాశిలో సూర్య కిరణాల ప్రతీకాత్మకంగా 16 వేలమంది కన్యకలను కన్యకామణి అయిన సత్యభామా సమేతుడై సూర్యుడు (కృష్ణుడు) వెలుగులను అందించడమే దీపావళి. యుగ ఆరంభ సూచన. సంస్కృత మహాభారతంలోని 99,100 పర్వాల సమాహారమైన హరివంశ కావ్యం మనకు వైజ్ఞానికాంశాలను పరిచయం చేస్తుంది. కాశీఖండం, పోతన భాగవతం, పద్మపురాణం... ఇతర అనేక పురాణాలలో శాస్త్ర సంబంధిత కథనాల అంతరార్థాలను గుర్తించవచ్చు. ప్రాగ్జ్యోతిషపుర పాలకుడైన నరకుడు భూదేవి కుమారుడు. ఇతడిని భూదేవికి ప్రతీకగా ఉన్న సత్యభామ అంతం చేసి కొత్త వెలుగులను అందిస్తుంది. సింహరాశి నుండి కన్యారాశిలోని సూర్యసంచారం దసరా పండుగ అయితే, కన్యారాశి నుండి తులారాశికి కదిలే సూర్య సంచార ప్రతీకాత్మక పండుగ దీపావళి.

"హరి జూచున్ హరిజూచు చూచుకములందందు మందార సలిల స్యందంబులందంబులుగా" చేసిన నాచన సోమన వర్ణన మనకు కావ్యానందాన్ని అందిస్తూ, అలాగే బ్రహ్మానందాన్ని కూడా కలిగిస్తుంది. అయనాంశ మార్పులకు చెందిన ఈ పండుగ భూమికి ఉండే రెండు చలనాలతో పాటుగా మూడవది అయిన అక్ష చలన సంబంధితం. 26,700 సంవత్సరాలకు ఒకసారి భూమి ఒక డిగ్రీ పక్కకు జరిగి కొత్త దిశను తూర్పుగా నిర్ణయం చేసుకుంటుంది. పూర్వం అటువంటి మార్పు జరిగినప్పుడు దిశా నిర్దేశం చేసే నరక నక్షత్రం తొలగిపోయి, ప్రస్తుతం తూర్పు దిశను సూచించే ధ్రువ నక్షత్రం వచ్చి చేరింది. చిత్త రెండు పాదాలు, స్వాతి నాలుగు పాదాలు, విశాఖ మూడు పాదాల కాలం వెరసి తులామాసం. చిత్త కుజ నక్షత్రం, కుజుడు అగ్నిగ్రహం. ఇక స్వాతి రాహు నక్షత్రం. ఇది వాయువు ఆధిపత్యం కలది. మూడవది అయిన విశాఖ గురు నక్షత్రం. ఇంద్రాణి ఆధిపత్యం కలది.

"కుజ నక్షత్ర సంబంధిత కథనం = నరకాసుర కథ; స్వాతి నక్షత్ర సంబంధిత జ్ఞానం = తైలాభ్యంగన నియమం; విశాఖ నక్షత్రం సంబంధిత విజ్ఞానం = గురు ప్రోద్బలమైన సంప్రదాయానుసరణం. ఇది తెలుసుకొని ఆచరిస్తేనే ఈ పండుగ పూర్ణ ప్రయోజనాన్ని పొందగలుతాం.

**ఉపయుక్త గ్రంథాలు**

1. నిర్ణయ సింధు 2. ధర్మ ప్రవృత్తి 3. ఉత్తర హరివంశం
4. హరివంశం

బందారం కథలు 22

# పసరు రెక్కలు

డా. నందిని సిధారెడ్డి, ఫోన్ : 9440 381148



డా. నందిని సిధారెడ్డి

యేనె రాళ్ల మీద కూర్చుని గుబురు పొదల వైపు తదేకంగా చూస్తున్నారిద్దరు. ఐదారేళ్ల వయసు బేధమున్నా ఆ ఇద్దరిది గాఢమైన స్నేహం. కిష్టయ్య పెద్దవాడయినా లోపలి ఆలోచనల్ని తనకంటే చిన్నవాడైన బాలరాజుతో పంచుకోకుంటే ఏమీ తోచదు. బాలరాజు ఐదారేళ్లు పెంచుకొన్న కొంచెం పెద్దరికంతో వ్యవహరించబోతుంటాడు. రాళ్లమీదికి వీస్తున్న సన్నటి గాలి మొగలి వాసన మోసుకొస్తున్నది. యేనెగుండ్ల పక్కన సీతాఫల చెట్లు, దాటి చిన్న వేప చెట్టు తర్వాత మొగలిపొదలు, రాళ్ళు రప్పలు... పక్కన రెండు మూడు పుట్టలు... అటు దాటి తీగ అల్లుకున్న గుబురు పొద, చూడటానికి మైదానంలా ఉంటుంది. చిక్కు పొదలాగా ఉంటుంది. రాతిగుండ్లమీద కూచుని చూస్తుంటే చల్లటి గాలితో పాటు సన్నటి ఎండ పొడ తగిలి హాయిగా అనిపిస్తున్నది. నిన్నా అట్లాగే అదే రాళ్ల మీద మూడుగంటలు కూచున్నారు. ఇవాళ మళ్లా అట్లాగే...

గాలికి ఆకులు కదిలినట్లు చప్పుడయ్యేసరికి ఒకరిని పట్టక ఒకరు అటువైపు మరింత తీక్షణంగా చూశారు. వొచ్చిన గాలి వొచ్చినట్టే ఉత్తరం దిక్కుకు వెళ్ళిపోయింది. ఎదురుచూపులు ఫలించకపోయేసరికి బాలరాజు ఆలోచనలో పడ్డాడు. అయ్య గుర్తొచ్చాడు. మందతోట కెళ్ళేటప్పుడు చెప్పిన బాట గుర్తొచ్చింది. అయ్యో పాపం, మబ్బులకే లేచి వంట చేశాడు. జొన్న గట్క ఉడుకేసి అర్రల పెట్టాడు. **"అంచెటాల్ల కాంగనే సంటిదానికి తినవెట్టు. నీ అంతట నువ్వు సెలకల పట్టుకోని తిర్గితె సంటిపోరి, అది ఆకలికి జస్తది. ఏడ్సుకుంట కూసుంటది. మా అవ్వ నాకు బరువుపట్టి అది ఎల్లిపాయె. నాకిటు జీవాలు తప్పయాయె. అటు సంటొల్లు తప్పరాయె... బిడ్డా, బాలా... ఇనపడ్డ దారే. చెవిన పెట్నవా... మర్సిపోకు".** అయ్య మాటలు చెవుల తిరిగేసరికి భయం పట్టుకున్నది బాలరాజుకు. పదే పదే చెప్పిన సంగతి పదే పదే గుర్తొచ్చింది. పదే పదే చెల్లె గుర్తొచ్చింది. ఏడుస్తున్నట్టే అనిపించింది. తనకూ ఏడుపొచ్చింది.

"కిష్టన్నా. నేను పోత. శెల్లె ఏడుస్తుండొచ్చు. తినవెట్టుమని చెప్పిండు అయ్య".

"ఏం గాదు తియ్యి. ఎవలో ఒకలు తినవెట్టరు. ఏడుస్తుంటె చూసుకుంటు ఉంటరా..." సముదాయించబోయాడు. "మా అయ్య ఒక్క తీర్గ చెప్పిండు. శెల్లె ఒక్కతుంటది. ఇడిసిపెట్టి తిర్గకు. అయిన నీ సోపతితోని ఇటొచ్చిన. అయ్యొచ్చినంక శెల్లె శెప్తది. నా తోలు పల్గుగొడతడు మా అయ్య. నేను పోత..." చిన్నగ ఏడుపు మొదలుపెట్టాడు బాలరాజు.

"బాలా... దోస్తంటే గిందేం దోస్తురా... నడుముల ఇడిసిపెట్టి పోతనంటవు. ఇంటికి పోయినంక నీకు బెల్లం ముద్ద గొనిస్త. యింకొక గంట...."

బాలరాజుకు కిష్టయ్యను చూస్తుంటే ఉండాలనిపించింది. అయ్య గుర్తొస్తే పోవాలనిపించింది. ఊగిసలాటలో నిర్ణయం తీసుకోలేక ఉండిపోయాడు. కిష్టయ్యకు మాత్రం పనికానిదే అక్కడనుంచి కదలాలని లేదు. బాలరాజును వదలాలని లేదు. మరోసారి గుబురు పొదలవైపు చూశాడు. గుబురుపొదల నుంచి మొగలి వాసన గుప్పుమన్నది. మొగలి వాసన సోకగానే దాసన్నపూల వాసన గుప్పుమన్నది. వెంటనే పటేండ్ల స్వరూప గుర్తొచ్చింది. సాయంత్రం కాగానే అలంకరించుకొని తమవాడ మీదుగా ఒయ్యారంగా అడుగులు వేసుకుంటూ పోతుంది. గొలపల్లి పటేండ్లింట్లో దాసన్న పూలుంటాయి. దాసన్నపూలవంటి దోస్తులుంటారు. పూల కోసం పూలరాశి మాదిరిగా పోతుంది. ముచ్చట్ల కోసం మురిపాల రాశి మాదిరిగా పోతుంది. చూస్తూ కిష్టయ్య తట్టుకోలేక పోతాడు. కోరికలను కులం నియంత్రించలేక పోతున్నది. యౌవనానికి ఏ గోడలు కనిపించవు. పటేండ్ల స్వరూప ఎనిమిది చదివి ఆపేసింది. కిష్టయ్య బడి మొఖమే చూడలేదు. అందుకనే బాలరాజును విడిచిపెట్టలేడు. స్వరూపని మరిచిపోలేడు. కిష్టయ్యదొక విచిత్రమైన అవస్థ. మొగలివాసన విచ్చిందంటే తప్పక పాము ఉండి తీరాలంటారు అనుభవజ్ఞులు.

"కిష్టన్న..." గుసగుసగా పిలిచాడు బాలరాజు. మళ్ళా అన్నాడు. అయినా పలకలేదు కిష్టయ్య. చిన్నరాయి తీసుకొని అటు విసిరాడు. తగిలేసరికి స్పృహలోకి వచ్చి కిష్టయ్య బాలరాజు వైపు చూశాడు. బాలరాజు సైగ చేశాడు. పుట్ట పక్కనుంచి పాము నెమ్మదిగా కదులుతున్నది. స్వరూప కదులున్నట్టే అనిపించింది కిష్టయ్యకు. చూస్తూ ఉండిపోయాడు. బాలరాజు చూపులు చురుగ్గా కదులుతున్నాయి.

జేబులోంచి కందికాయ వొలుచుకొని లేత గింజలు నోట్లో వేసుకున్నాడు బాలరాజు.

కందికాయ రుచికరంగా ఉన్నది. పామును తలచుకుంటే భయభయంగా ఉన్నది. అయినా ఆసక్తిగా ఉన్నది. ఇద్దరూ పామునే చూస్తున్నారు. ఆగింది. కదిలింది. ఆకుల మధ్య విశ్రాంతిగా సేద దీరుతున్నది. సన్నటి ఎండకు హాయిగా మత్తుగా ఉన్నది.

గుబురు పొదనుంచి మళ్లా చప్పుడైంది. మరో పాము. పొదచుట్టూ గుండ్రంగా తిరుగుతున్నది. ఒక్కసారిమొగలి వాసన ఆ ప్రాంతమంతా అల్లుకున్నది. కొంచెం మత్తు. కొంచెం భయం. మరికొంచెం ఆసక్తి. మూడు భావనల నడుమ ఏదో సమన్వయం. భయం పెరిగేకొద్దీ ఆసక్తి కూడా పెరుగుతుంది. భయపడుతూ ఆసక్తి ప్రదర్శించటంలో తెలియని మత్తు ఏదో ఉంటుందేమో తెలియదు.

పాములు చేరువయ్యాయి. ఊసులాడుకున్నాయో ఏమో కొన్ని క్షణాలు. ఉద్రేకపడ్డాయేమో మరి కొన్ని క్షణాలు. క్రమక్రమంగా మెల్లమెల్లగా పెనవేసుకున్నాయి. ఆ సన్నివేశం కోసమే వాళ్లిద్దరూ ఎదురు చూస్తున్నారు. కిష్టయ్య కోరికకు ఒక రూపం వస్తున్నది. చాటునుంచి దగ్గరగా వెళ్లాడు. బాలరాజును తోడు తీసుకెళ్లాడు. తెచ్చుకున్న తెల్లవస్త్రం పేలికలు పొదల వెనుక నుండి పాముల మీదికి జారవిడిచారు. పాములు దొర్లుతున్నాయి. విడివడుతున్నాయి. పెనవేసుకుంటున్నాయి. తెల్ల పేలికలు జారిపోతూ చుట్టుకుంటూ పాములను తలపిస్తున్నాయి.

కిష్టయ్యకు లోన పరవశం కలుగుతున్నది. ఏదో అనుకూల శకునం ఉంటే తప్ప ఈ పాముల సన్నివేశం దొరకదు. దొరికిందంటే జర ఆశ... చిగురిస్తున్న ఆశ... పటేండ్ల స్వరూప వంటి అందమైన ఆశ... దాసన్నపూల వాసన వంటి ఆశ...

యేనెగుండల మీద కూచుని ఎంతోసేపు గడిపారు. పొద్దు నడినెత్తి మీదికి చేరేసరికి చురుక్కుమన్నది ఒళ్లు. పాములు చల్లబడి జారుకుంటున్నాయి. కిష్టయ్య బాలరాజు మెల్లగా పొదవైపు కదిలారు. పాములు చల్లబడి జారుకున్నాయి. కిష్టయ్య బాలరాజు మెల్లగా పొదవైపు కదిలారు. ప్రశాంతంగా ఉంది వాతావరణం. బట్ట పేలికలు పట్టి చూశారు. వేడిగా ఉన్నాయి. అక్కడే పెట్టారు. పుల్లలు, చిదుగులు ఒకచోట చేర్చారు. జెకమక కొట్టి నిప్పు పుట్టించారు. మంట అటుపెట్టారు. జాగ్రత్తగా ఎడంగా పేలికలు కాల్చారు. పేలికలు మండి బూడిదయ్యాయి. బూడిద ప్రతిరేణువు చిన్న సీసాలోకి జాగ్రత్తగా ఎత్తుకున్నారు. ఇద్దరూ ఊరివైపు కదిలారు.

ఎదురు చూస్తుండగానే సాయంత్రం అయింది. బజారు మలుపు దగ్గర కిష్టయ్య చూస్తున్నాడు. కొంచెం దూరంగా బాలరాజు నక్కి ఉన్నాడు. కిష్టయ్య కళ్లల్లో కొత్త వెలుగు. కిష్టయ్య నుదుటన గుండ్రంగా, దానికింద అడ్డంగా తెల్లబొట్టు. అది విభూతి అవునా.. అది బూడిద అవునా... ఎంత కష్టపడితే ఆ బొట్టు... నొస్ట బొట్టో. ఒక గర్వం కిష్టయ్యలో. ఒక ధైర్యం కిష్టయ్యలో. చూస్తుండగానే స్వరూప... వాసన... రూపం.. అందం.. అన్నీ ఒకసారే ఒకసారే గుబాళించాయి. మలుపు తిరగగానే ఎదురుగా కిష్టయ్య.

“బాగున్నవా, కిష్టయ్య...” సుతారంగా తియ్యగా వినిపించింది గొంతు. ఇంతకుముందు ఎప్పుడూ పలకరించలేదు. తను ఇంతగా ఎప్పుడూ పరవశించలేదు. లోన అంతా తడిమినట్టు హుషారు.

“బాగున్న...”

ఆమె కదులుతున్నది. తానూ రెండడుగులు వేశాడు. ఆమె ఆగింది. చిన్నగా నవ్వింది. కదిలిపోయింది. కిష్టయ్య ఉక్కిరిబిక్కి రయ్యాడు.

ఒకసారయినా తనను మాట్లాడించటం... ఒకసారయినా తను చూసి నవ్వటం – చిన్న విషయాలా... ఆమె చేరువవుతున్న దానికి సంకేతాలు కావా... బొట్టు గొప్పతనం. బొట్టు మహిమ. లేకపోతే స్వరూపమ్మ తనను మందలించటం సాధ్యమేనా... ఏదో ఉంది...ఏదో జరిగింది? ఇంకేదో జరుగుతుంది.

కిష్టయ్య తలచుకొని తలచుకొని మురిసిపోతున్నాడు. మహిమగల బొట్టు సంపాదించటానికి ఎంత కష్టపడ్డారు. బాలరాజు తనకెంత మంచి తోడు. తనతోపాటు తమ్ముడెన్ని తంటాలు పడ్డాడు. బొట్టు కోసం పడ్డట్టే స్వరూపమ్మ కోసం ఇంకెన్ని తంటాలయినా పడటానికి తయారే.

వారం రోజులు గడిచిపోయింది. స్వరూప ప్రతి సాయంత్రం బజారు వెంబడి పోతూనే ఉన్నది. మళ్లా పలకరించకపోయే సరికి కిష్టయ్య మనసు మనసులో లేదు. బాలరాజుతో చర్చించాడు. తానే పలకరించాడు. అయినా పట్టించుకోలేదు. పూలు తెచ్చి ఇస్తానన్నాడు. అయినా పట్టించుకోలేదు పవిత్రమైన బొట్టు పెట్టుకొని బొట్టు పొట్లం ఇచ్చాడు. అయినా మన్నించుటలేదు. ముచ్చట పెట్టడానికి సరిపోయినన్ని విషయాలు కిష్టయ్యకు తెలియవు. ఎట్లా స్వరూపమ్మను చేరుకోవాలో కిష్టయ్యకు తెలియదు.

ఆరోజు సాయంత్రం అందంగా అలంకరించుకొని స్వరూప సాగిపోతున్నది. స్వరూప బజారు మలుపు తిరిగి వెళ్లిన తర్వాత ఆమె పాదముద్ర దగ్గర కూర్చున్నాడు బాలరాజు. పరుగున వచ్చాడు కిష్టయ్య. అడుగుల గుర్తులు చెదరకుండా, ఎవరూ తొక్కకుండా కాపలా ఉడమన్నాడు కిష్టయ్య. ఆ గుర్తులు చూస్తుంటే కిష్టయ్యలో కొత్త ఉత్సాహం, కొత్త హుషారు నిండుతున్నది. జాగ్రత్తలు చెప్పి కిష్టయ్య తోట పెరట్లోకి పరిగెత్తాడు.

బాలరాజు స్వరూప అడుగులకు కాపలా కాయలేక అవస్థ పడుతున్నాడు. అడుగుల మీద చేతులు అడ్డంగా ఉంచి ఏదో ఆడుతున్నట్టు నటిస్తున్నాడు. కొందరు పక్కనుంచి వెళ్ళిపోతున్నారు. కాని లచ్చవ్వ పెద్దమ్మ నోరు విడిచి అడగనే అడిగింది. “బాలయ్య,

గీడ బజార్ల గూసోని ఏం రాజిర్కం జేస్తున్నవయ్యా...” “ఏంలే... పెద్దమ్మ. దొస్తొస్తదని జూస్తున్న....”

అటునుంచి కుక్కలు ఒకదాన్ని ఒకటి తరముకుంటూ వచ్చాయి. బాలరాజు రాయి తీసుకొని వాటిమీదికి విసిరాడు. చూసేవాళ్లకు అనుమానమొస్తుంది. అనుమానమొస్తే మరింత కష్టం. బాలరాజుకు క్షణంక్షణం కష్టంగా వుంది.

‘కిష్టన్న తొందరగా వస్తే బాగుండే. ఎటుపోతే అటే. ఎక్కువసేపు బజార్ల కూసోలేను. నడిబజారాయె. వొచ్చెటోల్లు, పొయ్యేటోల్లు. ఎవలాగుతరు. రా కిష్టన్న... రా... మనసులో రకరకాలుగా ఆలోచిస్తున్నాడు బాలరాజు.

బాలరాజు చదువులో హుషారే. మంచి బొమ్మలు వేస్తడు. మంచి పద్యాలు పాడుతాడు కాని కిష్టయ్య స్నేహం ఇష్టం. కిష్టయ్య చెప్పే ముచ్చట్లు ఇష్టం. అప్పుడప్పుడు చెప్పే కథలు ఇష్టం. కథల్లో వచ్చే రాజకుమారి ఇష్టం. రాజకుమారి అంటే కిష్టయ్య తనను తాను మరిచిపోయి పరవశించి వర్ణించి చెప్పుతుంటే బాలరాజుకు ఇష్టం. ఊహల్లో తేలిపోవటం చెప్పరాని ఇష్టం.

“ఎంతసేపు కూసోవాల్నో ఏందో.. ఎవని కల ఏందోగని కూసాలు కదులుతున్నయి. ఇయ్యం ఇయ్యం మంచిదే. దయ్యమొచ్చి నడుమ కయ్యం పెట్టినట్టు నడుమ తనకేం వొస్తది!....”

కోడిపెట్ట పిల్లతో రాబోతే చేత్తో తరిమాడు బాలరాజు. చెమటలు పట్టి ముఖం నిండా కారుతుంటే పరుగెత్తుకొచ్చాడు కిష్టయ్య. వెడల్పాటి చెక్కినట్టు ఉన్న ఆకులు అరచేతిలో వేసి నలిచాడు. బలంగా నలిచి స్వరూప అడుగు గుర్తుల మీద పసరు పిండాడు. మళ్ళీ నలిచి మళ్ళీ పిండాడు. అడుగులు తడిచేటట్టు అరకాలు గుర్తు దగ్గర మరింత ఎక్కువ ఆకు పసరు పిండాడు . పది నిమిషాలు ఇద్దరూ అడుగులకు కాపలా కాశారు.

“బజార్ల అట్ల గూసున్నవేంది కిష్టయ్య. ఆటా...”

మళ్లా తియ్యటి గొంతు. మళ్లా స్వరూపమ్మ పలుకరింత. మళ్లా తియ్యటి మత్తు స్వరూప సాగిపోయింది. తన ఒంటిమీద నుంచి పాము జారిపోతున్నట్టు భయం. దాసన్నపూలు పాముతున్నట్టు మత్తు. అడుగుటు.... పసరు గుర్తులు. కళ్లల్లో అట్లే ముద్రపడి ఉన్నాయి. బాలరాజుకు బెల్లంముద్ద కొనిచ్చాడు కిష్టయ్య.

పటేండ్ల స్వరూప పలకరించినందుకు ఒకపక్క సంతోషం కలుగుతున్నా, క్షణాల్లో సంతోషం కరిగిపోతున్నందుకు బాధగా వుంటున్నది. కరిగిపొయ్యేదే సంతోషమా? కదిలిపొయ్యేదా సంతోషమా? సంతోషం నిలకడగా ఉండదా? స్వరూపమ్మతో తనకు ఒక్క రోజన్న కలుస్తదా? ఒక్క రోజన్న కలువాలె.

పలుకరించిందంటే పసరు పనిచేస్తున్నట్టేనా. .. ఏమో... పని చెయ్యొచ్చు. లేకపోతే ఎందుకు పలుకరిస్తది? ఏదో ఉన్నది... ఏదో ఉంటది. కిష్టయ్య పరి పరి విధాల ఆలోచించాడు. బాలరాజుతో చర్చించాడు. కిష్టయ్య జ్ఞానం చిన్నది. బాలరాజు వయసు చిన్నది. ఈ విషయాలు అందరితో చెప్పుకునేవి కావు. సర్ది చెప్పినా సహకరించినా బాలరాజే.

ఎప్పటిలాగే ఆరోజు సాయంత్రం స్వరూప అలంకరించుకొని బయలుదేరింది. పాము మీదికి దూసుకొస్తున్నట్టు కిష్టయ్యకు చిత్రంగా అనిపించింది. కిష్టయ్య ధైర్యం తెచ్చుకుంటున్నాడు. బాలరాజుకోసం వెదికితే కనిపించలేదు. బండకు నార చీరటం తనతో కాదు. ఏదో ఒకటి తేలితే అన్నిటికి మంచిది. లోపల ఆపుకోలేకపోతున్నాడు. అట్లని పటేండ్లు తమసొంటివాళ్లకు కలువడు. పని చెడి ఎంతకాల మిసొంటి తిప్పలు.

స్వరూప చేరువవుతుంది. మత్తేదో ఒక్కసారిగా గుప్పుమన్నది. జ్వరమున్నట్టున్నది. బజారు మలుపు తిరిగి స్వరూప వస్తుంటే కిష్టయ్యకు ఏమీ తోచలేదు. ఆపుకోవటం సాధ్యం కాలేదు. అంతురాలు తెలిసి కోరికలు పుట్టవు కదా. కోరికే సమస్తం ఆవహించింది.

స్వరూప తనను దాటి పోతున్నది. కిష్టయ్యలో లోకం కనబడ నంతగా మత్తు కమ్ముకుంటున్నది. దాటుతున్నది. సంతోషం దాటుతున్నది. స్వరూప వెనుక అడుగులు వేశాడు. వెంట వెంట నడిచాడు.

“కిష్టయ్యా. ఏమైంది. అట్ల నడుస్తున్నవు”

తియ్యగా అడిగేసరికి మనసు ఆగలేదు. గొంతులోంచి అనాలోచితంగా శబ్దం వచ్చింది. “స్వరూప”.

ఆగింది స్వరూప. పిలుపు కొత్తగా ఉంది. ఏమీ అర్థం కాలేదామెకు. తొందరగా నడిచి చెయ్యందుకున్నాడు. ఎంత ధైర్యం. ఊహించనిదేదో జరుగుతున్నది. స్వరూపకు కోపం వచ్చింది. ‘పోనీ.. అని పలకరిస్తే ఇంతదాంక వచ్చిందా? ఇదేంది? ఎంత సెడ్డ పేరు? ఇంట్ల తెలిస్తు ఈ యింత బయటకు రానియ్యరు, బజారుకు రానియ్యరు. గొల్లపల్లోల్ల పేరు చెప్పుకోని వొస్తున్నది. దాసపూల వంక పెట్టుకొని వస్తున్నది. ఈ లోకం కూడా ఉండదిగ. చెయ్యి పట్టుకుంటడా... ఎన్ని గుండెలు? “కిష్టయ్య ఏందింది. ఇడువు. ఇడిసిపెట్టు” జాడించింది. కిష్టయ్య చెయ్యి ఊడిపోయింది. ఏ భావం లేకుండా నిలబడిపొయ్యాడు కిష్టయ్య.

స్వరూప ముందుకు పోలేకపోయింది. దాసన్నపూలమీద నుంచి మనసు చెదిరిపోయింది. దోస్తులను కలువాలన్న ఉత్సాహం ఆరిపోయింది. వెనుదిరిగింది. గబగబా ఇంటివైపు మరలింది.

ఇంట్లో చెప్పాలనుకోలేదు స్వరూప. అమ్మను చూసేసరికి దు:ఖం ఆగలేదు. ఏడ్చింది. ఏమీ చెప్పలేకపోయింది. కిష్టయ్య తన చెయ్యి పట్టుకున్నప్పుడు ఎవరూ చూసినట్లు అనిపించలేదు. ఊరు కదా. ఏ దర్వాజలోంచి ఎవరి చూపు అందుకున్నదో తెలియదు. క్షణాల్లో ఊరంతా గుప్పుమన్నది. ఎవరిని ఎవరాపుతారు?

పామును పట్టుకున్నాడు కిష్టయ్య. పాము చుట్టుకున్నది కిష్టయ్యను. పాములు తలపడుతుంటే ధైర్యం చేశాడు. పెనవేసుకున్నప్పుడు సాహసం చేశాడు. కిందా మీదా పడ్డాడు. తనను తను అదుపు చేసుకోలేకపోయాడు.

మరుసటిరోజు ఉదయం అనుమానించినంతా జరిగింది. పటేండ్ల పాటకిల బిక్కుబిక్కుమంటూ నిలబడ్డాడు కిష్టయ్య. స్వరూప చెయ్యి పట్టుకున్నట్టు ఒప్పుకున్నాడు. తల వంచుకున్నాడు. కిష్టయ్య తండ్రి తల వంచుకున్నాడు. జీవాలు సంబాళించటం తెలుసు కాని కొడుకును సంబాళించలేకపొయ్యాడు...

కిష్టయ్య ... కిష్టయ్య తండ్రి... తల్లి ఇద్దరు కులపెద్దలు.

పటేలు ముగ్గురు కొడుకులు జీతగాళ్లు

కిష్టయ్యను ముక్కు నేలకు రాయమన్నారు. తప్పలేదు. కిష్టయ్య పటేండ్ల వాకిట్లో ముక్కు నేలకు ఆనించాడు. అటుపక్క ఇటుపక్కకును చూపు సాగదీసి చూశాడు. మరీ సాగదీసి చూశాడు. స్వరూప కనబడలేదు. ముక్కు ఆన్చి కళ్లు మూసుకున్నాడు. స్వరూపే కనిపించింది.

పాము ఒళ్లంతా పాకుతున్నట్లు అనిపించింది. మత్తు తేలిపోతున్నట్టు మనసు తేలికపడింది. తెలిసి చేసింది కాదు. తెలియక ఊకున్నదీ లేదు.


## మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక
మూసీ మాస పత్రిక సభ్యులుగా చేరండి
వెంటనే శాశ్వత చందాదారులు కండి.
సాహిత్య రంగంలో వెలువడుతున్న ఒకే ఒక
పరిశోధనాత్మక వ్యాసాల మాస పత్రిక
యూజీసీ కేర్ లిస్ట్‌లో చేరిన తెలుగు పరిశోధనా పత్రిక
శాశ్వత సభ్యత్వం (10 సం॥లు)... 2500/-
సంప్రదించండి. మూసీ మాసపత్రిక... ఫోన్ : 934 7971177


## దీపోత్సవ సంరంభం

ఒక దివ్య(వ్వె)త
నింగి నేలా నడుమ
సార్వత్రికంగా అనుభవాన్నిస్తున్న సందర్భం –
ప్రాకృతికోత్సవం – జీవన "వారిదం" గా
నిలవాలన్నది – అక్షరాదేశికత్వం ॥
ఎన్నో అమవస 'నిశి'లు మరెన్నో
మావనాళి మనుగడకు దీపావళి –
తారావళియై వెల్గు పుల్కన్నిస్తుంది.
అజ్ఞాన తిమిరాపహారం కొనసాగడానికి –
ఆత్మ మండిత ప్రచోదన శక్తుల్ని –
ఆవాహనం చేసుకోవడం – వెలుగుల్ని –
కలల్లోనే కాదు వాస్తవాలను పంచుకొనే
దిగ్దర్శనం – దివ్వెల్లోనే సాకార సాధ్యం –
వేడి గుండెల కొలిమి నుంచి రగిల్చే
సంఘర్షణలు నిభాయిస్తే విలువల
అనైతికతల – నరకుల్ని దునిమేసే
"ధీ" శక్తులు మానవీయతలు – దీపాలై వెలగాలి!
ఆశయాల దీపం – కోటి ఆశల సంకేతంలా
దిగంతాల అంచుల్లో ధైర్యాన్ని మెలిగిస్తుంది.

వి.ఎస్.ఆర్.ఎస్. సోమయాజులు
ఫోన్ : 9441 148 158



ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 1  హైదరాబాద్ నవంబర్ : 2023

# మధురకవి మల్లవరపు జాన్

**డా. కోయి కోటేశ్వర రావు,** తెలుగు అధ్యాపకులు, సిటీ కళాశాల, హైదరాబాద్. ఫోన్ : 94404 80274



**"సృష్టి ఎప్పుడూ మట్టినుంచే పుడుతుంది. మట్టినారాధించే రైతు కూలీలే నిజమైన సృష్టి కర్తలు. ప్రతిభ మట్టి వంటిది. పాండిత్యం కార్ఖానా వంటిది. ఎప్పటికప్పుడు సహజమైన ప్రతిభను చంపేస్తూ, కార్ఖానాలను పోషించుకుంటూ వచ్చారు సంప్రదాయకులు, పండితులు."** (పాలేరు నుంచి పద్మశ్రీ వరకు పేజీ.607) అని డాక్టర్ బోయి భీమన్నచేసిన ఆరోపణను ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు కానీ, ఆయన మాటలు మాత్రం అక్షరాల నిజం. సాహిత్యమూలాలను గురించి భీమన్న శాస్త్రీయంగా సూత్రీకరించాడు. కూలీల నుండి, రైతుల నుండి, శ్రామికుల నుండి వచ్చిన కవులు, రచయితలు అనుభవ జనితమైన స్పృహతో సజీవ సాహిత్యాన్ని సృష్టించారు. అసాధారణమైన ప్రతిభతో గుఱ్ఱం జాషువ తెలుగు పద్య కవిత్వానికి ప్రాణ చైతన్యాన్ని అందించాడు. కుసుమ ధర్మన్న అందించిన సృజన స్ఫూర్తితో కాకులు దూరని కారడవి, చీమలు దూరని చిట్టడవిలా ఉన్న సాహిత్యాన్ని జాషువ సుందర నందనోద్యానవనంగా మార్చాడు. ఈ వనంలో డాక్టర్ బోయి భీమన్న కవన విహారం చేశాడు. నూతక్కి అబ్రహాం, నక్కా చిన వెంకయ్య, జ్ఞానానంద కవి, గద్దెల జోసెఫ్, బీర్జీడి మోషే, బీర్జీడి ప్రసన్న, నంబూరి దూర్వాస మహర్షి, బొడ్డు ప్రకాశం, అత్తోట రత్నకవి, ఎడ్లపల్లి సామ్యేల్ అంటరాని వర్గాలకు చెందిన కవులెంతోమంది తమ కావ్యాలతో పద్య కవిత్వానికి ఎంతో వైవిధ్యాన్ని సమకూర్చారు. అక్షర జ్ఞానం లేని నిరుపేద కుటుంబాలకు చెందిన ఈ కవులు అచంచలమైన పట్టుదలతో, కృషితో అపురూప సంకల్పంతో ఏకంగా పద్య కవిత్వం రాయడం గొప్ప విశేషం. **"హరిజనులలో నేడు మంచి కవులు పుట్టుచున్నారు. మనము ఏర్పాటు చేయబోవు సామ్యవాద రాజ్యాంగమునకు ఇది ఒక శుభ సూచికము"** (విశ్వనాథ పీఠికలు) అని విశ్వనాథ సత్యనారాయణ జ్ఞానానందకవి 'అక్షరాభిషేకం' కావ్యానికి పీఠికలో ప్రస్తుతించాడు. **"పై కులము వారిలో చాలామంది సంప్రదాయాంధ్ర కవితా దూషకు లగుచుండగా ఆంధ్ర కవితా శారద మిమ్ము పొందుచున్నది"** (గోల్కొండ కావ్య పీఠిక) అని కూడా విశనాథ ప్రస్తావించాడు. ప్రాబల్య వర్గాలకు చెందిన కవులు వచన కవిత్వం వైపు దృష్టి సారిస్తే, కింది కులాలకు చెందిన కవులు పద్యకవిత్వం వైపు నిలబడ్డారు. బహుశా సామాజిక గౌరవం పొందడానికి పద్య రచనను అక్షర నిశ్రేణిగా, ఈ కవులు భావించారేమో అనిపిస్తుంది. జాషువ అనంతరం, ఆయన ప్రభావంతో చాలామంది పద్యకవులు సాహిత్య రంగం లోకి ప్రవేశించారు. జాషువా మార్గంలో మడమ తిప్పకుండా పయనించిన సాహితీ మూర్తుల్లో విశిష్టకవి మల్లవరపు జాన్. ఈ కవి మల్లవరపు దావీదు, శ్రీమతి రత్నమ్మ దంపతులకు 1927 జనవరి రెండవ తేదీ ప్రకాశం జిల్లా చీమకుర్తిలో జన్మించాడు. అంటరానితనం, పేదరికం కారణంగా అనేక ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని, కఠోరమైన శ్రమతో సంస్కృతాంధ్ర భాషా సాహిత్యాలను అధ్యయనం చేసి, తెలుగు పండితునిగా ఎదిగి విశేషమైన సేవలందించారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా, పద్యకవిగా ప్రఖ్యాతి గాంచారు. **"మధుర కవి"** గా తెలుగునాట ప్రసిద్ధికెక్కిన మల్లవరపు జాన్ నాలుగు దశాబ్దాల పాటు అవిచ్ఛిన్నంగా కవితాగానం చేసి, ప్రజా చైతన్యానికి పట్టుగొమ్మగా నిలచే పద్య కవిత్వానికి మారుపేరుగా వెలుగొందాడు. మల్లవరపు జాన్ పేరు ఈ తరం వచన కవులకు పెద్దగా పరిచయం లేకపోవచ్చు. కానీ జాషువానంతర పద్యకవులకు మాత్రం నులివెచ్చని జొన్నరొట్టె లాంటి ఆయన పద్య కవిత్వం అనుభవైక వేద్యమే. దివాకర్ల వేంకటావధాని, విశ్వనాథ, జాషువా, దాశరథి, కరుణశ్రీ. సి.నా.రె వంటి ప్రముఖ కవిపండితుల మన్ననలందుకున్న మల్లవరపు జాన్ నగటు పాఠకుడి అవగాహనా స్థాయిని అర్థం చేసుకొని, ఆద్యంతమూ ఆ పరిధిలో ఒదిగి 'అతుకుల బ్రతుకుల' దిశగా తన కావ్య ప్రస్థానాన్ని సాగించాడు. **"తేనెలూరు తెల్గు తీరు కనుంగొన కోర్కె వొడమువారు"** మల్లవరపు జాన్ కావ్యాలను పరిశీలించమని 'అభినవ తిక్కన' తుమ్మల సీతారామమూర్తి రస హృదయులైన భాషాబిమానులకు హితవు పలకడమే కాకుండా, జాన్ పద్య విశిష్టతను కొనియాడారు. మల్లవరపు జాన్ పద్యం మాధుర్యగుణ భూయిష్ఠమైనదని ఉద్యమకవి దాశరథి కితాబిచ్చాడు. **"పదవుల ప్రాకులాట సముపార్జన కెప్పుడు దేవులాట, క్రొం / జదువుల పీకులాట, విరసంబగు మాట, ముఠా గలాట, ...కృశియించిన పేదల గూల్చువేట / నీ వదపున బెట్టకున్న నిఖిలాంధ్ర జగమ్ము పురోగమించునే"** (విశ్వప్రకాశము) అంటూ ఆయన భారతదేశ సామాజిక జీవన వాస్తవికతను సహజ సిద్ధంగా కవిత్వీకరించాడు. **"పనులు జేయకుండ పంచ భక్ష్యములను / తేరగా భుజించి తిరుగువారు/ కష్టజీవి సొమ్ము కాజేయు గజదొంగల'**ని ఒక్కోసారి అభ్యుదయ కవిలా గర్జించినా,

**"సామ్రాజ్యవాదుల సాహచర్యంబున, స్వార్థ జీవనుల హస్తముల జిక్కి"** మాతృదేశం విలవిల లాడుతుందని మరొకసారి విప్లవ రచయితలా తిర గబడినా, **"కుల పటాటోపలకుల ముందు కళల కెట్లు విలువ గల్గు"** నని ఇంకోసారి దళిత కవిలా ప్రశ్నించినా, **"పురుషుల్ జేసిన పుణ్య మెట్టిదియె యెపుడున్ మానభంగాలకున్ ఎగురియైపోయిన జాడలేదు"** అని స్త్రీ వాదిలా కన్నెర్ర జేసినా నిజానికి మల్లవరపు జాన్ అచ్చమైన మానవతా వాది. ఛందో బందోబస్తుల రహదారుల్లో ప్రయాణం చేస్తూనే, అనేక ప్రజా సమస్యలకు నిర్మాణాత్మకమైన పరిష్కార మార్గాలను సూచిస్తూ, నిరాడంబరమైన కవితా పద్ధతిని ఆశ్రయించి సాహితీ యాత్రలో ఆయన మునుముందుకు దూసుకు పోయాడు.

అభ్యుదయ కవితా ప్రభంజనం తీరం దాటుతున్న సాహిత్య సంక్షోభంలో రచయితగా రంగప్రవేశం చేసిన మల్లవరపు జాన్, అస్తిత్వ ఉద్యమాలు అంతర్గత వైరుధ్యాలతో పెనుగులాడుతున్న సామాజిక సందర్భంలో కవిగా కన్నుమూశాడు. ఈ నలభైయేళ్ళలో సాగిన సామాజిక ఉద్యమాలతో జాన్ కవికి ప్రత్యక్షంగా సంబంధం లేకపోయినప్పటికీ, ఆయా ఉద్యమాల మౌలికావేశాలు, అవి లేవనెత్తిన ప్రాథమిక ప్రశ్నలు జాన్ కవిత్వంలో సర్వత్రా కనబడతాయి. కవి జీవించిన సాంఘిక అస్తిత్వం అందుకు కారణభూతమైందని చెప్పవచ్చు. తెలుగుదేశ చారిత్రక, సాంస్కృతిక వైభవ ప్రాభవాలను రమణీయంగా తన కవిత్వంలో చిత్రించడమే కాకుండా, సాంఘిక రాజకీయ, ఆర్థిక అసమానతలను ధిక్కరించి సమానత్వాన్ని ప్రబోధించిన మల్లవరపు జాన్ పద్యకవుల్లో ప్రజాకవి. **"ప్రజల నేర సమస్యల పరిహరించి/ తీర్పు జెప్పు కోర్టులకిక తీరికేది/ కడకు నేతలపై మోపబడిన 'రిట్లు / కుప్పబడి యుండె, సుప్రీము కోర్టు ముందు"** (భావవిపంచి) అంటూ ఈనాటి నేర రాజకీయాల తీరుతెన్నుల్ని అద్భుతంగా బొమ్మ కట్టించాడు కవి. యుద్ధాల నెపంతో నిత్యావసర వస్తువుల ధరలను అమాంతం పెంచి అక్రమార్జన చేసే విఫణి విక్రమార్కుల విశ్వరూపాలను జాన్ కవి తన కవిత్వంలో బట్టబయలు చేశాడు. కేజీ బియ్యము రెండురూపాయలేనని ఆనంద పడాలో, కప్పుకాఫీ మూడు రూపాయలని బాధపడాలో తెలియక మథన పడుతున్న మధ్యతరగతి మానవుడి అంతరంగ సంక్షోభాన్ని ఆయన తన పద్యకవిత్వంలో ఎంతో చమత్కార సుందరంగా ఆవిష్కరించాడు. జెండా కఱ్ఱలపైన రెపరెపలాడే జాతీయపతాకం మాయమై, ఆ కఱ్ఱలు గూండాల చేతుల్లో ఆయుధాలవుతున్నాయని జాన్ కవి ఎంతో ఆవేదన వ్యక్తం చేశాడు.

సాధారణంగా పద్యకవుల్లో కనబడని అంతర్జాతీయ రాజకీయాలకు సంబంధించిన అవగాహన కూడా జాను కవిత్వంలోఅక్కడక్కడ దర్శనమిస్తుంది. 'కువైట్' ను కబళించిన అమెరికా ఆధిపత్యం, గల్ఫ్ యుద్ధాల దుష్ప్రభావము లాంటి ఎన్నో విషయాలను తన సూక్తి శతకంలో ఈ కవి అక్షరబద్ధం చేశాడు. మతరాజకీయ దుర్మార్గాలను కూడా మల్లవరపు జాన్ చీల్చి చెండాడాడు. 'రామ జన్మభూమి' బాబ్రీ మసీదు గొడవల నెత్తురు, మడుగుల్లో బ్రతుకు దుంప తెగుతుందని బాధపడుతూనే "ఓమన్న, రహీమన్న" ఈ పదాలన్నీ సమానార్థక బోధకాలేనని చెబుతూ, మత సమైక్య ప్రబోధించిన జాన్ కవిత్వంలో గొప్ప ప్రాపంచిక జ్ఞానం తొంగిచూస్తుంది. 'స్త్రీ జనావేదన' 'వరకట్నం' మొదలగు ఖండికల్లో 'ఆకాశంలో సగమైన' స్త్రీమూర్తుల జీవన స్థితిగతులను అత్యంత ఆర్ద్రంగా చిత్రించి, మహిళాభ్యుదయాన్ని మనసారా ఆకాంక్షించాడు. ప్రతి నిత్యం మానభంగాల పీడను ఆడవాళ్ళకు ఎందుకు కల్పించావని బ్రహ్మను ప్రశ్నిస్తూ, ఈ విధమైన 'నీచపు వికారాలను' సత్యలోకంలో సాగిస్తే సరస్వతిదేవి కూడా కోపంతో చీపురు చేతబడుతుందని హాస్య సంభాషణావిలసితంగా కవి హెచ్చరించాడు. భారతదేశంలో ఏళ్ళ తరబడి ఆరిపోని అగ్నిగుండంలా మండుతున్న వరకట్న సమస్యను బహుముఖీన దృష్టితో అర్థంచేసుకొని దాని పర్యవసానాలను తన పద్యాల్లో ఈ కవి విస్తృతంగా చర్చించాడు. **"పేచీలు బెట్టి కట్నము, దోచెడి నీచులను దేశద్రోహుల క్రిందన్, పూచీలీయక జైలు పాలు చేయాలని"** జాన్ ప్రతిపాదించాడు. అనేక రకాల పేచీలు బెట్టి లక్షల కట్నం దోచుకొనె నీచులను **'నాన్ బెయిలబుల్ వారెంట్'** తో దేశ ద్రోహనేరం క్రింద అరెస్టు చేయాలని ఎంతో ఆగ్రహంతో జాన్ కవి ప్రభోదించాడు. **"వామనుల వంటి కటాలుస్వామి"** లున్న ఆడపిల్లల తల్లిదండ్రుల కష్టాలువర్ణనాతీతమని చెప్పాడు. **"పురుషులతోసమానంగా సర్వకార్యములు నెరపిడిశక్తియుక్తులు నేర్చిన"** ఆధునిక స్త్రీలను అణిచివేయడం సభ్యసమాజానికి సిగ్గువేటు కలిగించే విషయమని ఎలుగెత్తి చాటిన మల్లవరపు జాన్ సాహిత్య వ్యక్తిత్వం ఎంతో ఉదాత్తమైనది. అంత కంటే విశాలమైనది. విశ్వమానవాళికి సమతా సందేశాన్నం దించిన గౌతమ బుద్ధుని సమున్నత మూర్తిమత్వాన్ని మల్లవరపు జాన్ కవి ఆరాధించాడు. **"లోకపరివర్తన దృక్పథమున్న గొప్ప సన్యాసి"** అని **"మానవాభ్యుదయ ద్రష్ట"** అని ఆయన బుద్ధుడిని కీర్తించాడు. బుద్ధుని బోధలు సజీవములై కరుణాస్రవంతులై విశ్వమంతా ప్రవహిస్తాయని మల్లవరపు జాన్ క్రాంతదర్శిలా పేర్కొన్నాడు .మల్లవరపు జాన్ తనకు నచ్చని సిద్ధాంతాల్ని, కవితా పద్ధతుల్ని నిర్మొహమాటంగా వ్యతిరేకించాడు. **"పుట్ట గొడుగులట్లు పుట్టిన యిజములు/ గొప్పతనము చాటుకొనుచు వచ్చి/కలహ మలినమంటి గబ్బు గబ్బైపోయె/ నీతిలేని యిజము నిలువగలదే"** (అతుకుల (బతుకులు) అంటూ వివిధ సిద్ధాంతాల పరిమితులను ఎత్తిచూపి, ఏ వాదమైనా నైతిక పునాది లేకుండా ఎంతోకాలం నిలువలేదని తాత్త్విక ఎరుకతో ఈ కవి ప్రబోధించాడు. మితిమీరిన దిగంబర కవుల భాషాగ్రహాన్ని కూడా జాన్ ఎంతో ధైర్యంగా విమర్శించాడు.

జాన్ కవిత్వ స్వరూప స్వభావలను నిశితంగా పరిశీలించినపుడు కవిగా ఆయన జాషువ అడుగుజాడల్లో నడిచినట్లుగా స్పష్టమవుతుంది. జాషువా మార్కు పద్య కవిత్వానికి అసలైన వారసునిగా మల్లవరపు జాన్ కనిపిస్తాడు. మల్లవరపు జాన్ కావ్యాలకు పీఠికలు రాసిన ప్రముఖ కవి పండితులు కూడా ఈ విషయాన్ని ముక్త కంఠంతో అంగీకరించారు. **“మీ ఝరీ కవితను గమనిస్తూ వుంటే ఎంత ఆనందం కలిగిందో చెప్పనా? ఆత్మీయుడు జాషువ వచ్చి నా గుండెను తడుతున్నాడా అనిపించిది.”** అంటూ పద్మశ్రీ సి. నారాయణ రెడ్డి ‘అతుకు బ్రతుకులు’ కావ్యానికి ముందు మాట రాస్తూ **“జాషువ, జానుల రచనాసామ్యాన్ని గురించి ప్రస్తావించాడు. పద్యాన్ని వస్తు పరంగా ఆధునికం చేసినవారిలో అగ్రగణ్యుడు జాషువ. వీరిదీ అదేబాట చూ అదేమాట”** అని డా. బేతవోలు రామబ్రహ్మం కూడా (భావ విపంచి ఉపశ్రుతి) ఇదే విషయాన్ని మరింత స్పష్టంగా నిర్ధారించాడు. వర్ణతత్వం అణువణువులో విషం కక్కుతున్న చాతుర్వర్ణ వ్యవస్థలో బతకలేక బతుకుతున్న దళిత జనుల దుర్భర జీవన స్థితిగతులను అద్భుతంగా కవిత్వీకరించిన జాషువా లాగే జాన్ కవి గూడా తన జాతిజనుల సామాజిక విముక్తిని ప్రబోధిస్తూ పద్య కవిత్వం రాశాడు. కులవ్యవస్థ కుటిలత్వాన్ని నిరసిస్తూ వాడియైన ప్రశ్నాస్త్రాలను సంధించాడు. **“హరిపదాల బుట్టి అరుగుదెంచిన గంగ, పాప జనుల శుద్ధి పరచుచుండ, అజుని పాదజనితులు స్పృశ్యులెట్టైరి?”** అని పౌరాణిక పద్ధతిలోనే ప్రశ్నించాడు జాన్. విష్ణు పాదాల నుండి పుట్టిన గంగ పవిత్రమైనదైతే, బ్రహ్మ పాదాల నుండి జనించినట్లు చెప్పబడుతున్న అతి శూద్రులైన దళితులు అంటరాని వారెందుకయ్యారని జాన్ వాదించాడు. కులీనుల ఇళ్ళలో కుక్కకు కూడా మనిషి హోదా లభిస్తుందని, కాని కుల సమాజంలో దళితులకు జీవించే హక్కు లేకుండా పోతుందని, ఈ దుర్మార్గమైన విషమ పరిస్థితిని రూపుమాపలేని భారత దేశాన్ని చూసి ప్రపంచం పరిహసిస్తుందని మల్లవరపు జాన్ ‘అస్పృశ్యత’, (విశ్వప్రకాశం) అనే ఖండికలో ఆవేదన వ్యక్తం చేశాదు ఈ విధమైన దార్శనికతని జాషువా కవిత్వం నుంచే ఆయన అందిపుచ్చు కున్నాడు. “కోటాను కోట్లనరులొక మేటి జగన్మాత సుతులు, మిత్రులని’ జాషువా భావిస్తే, ‘తలచుము! అన్నదమ్ములని ధారుణి పై గల వారినందరున్” అని జాన్ సూత్రీకరించాడు. జాషువా వలె జాన్ కూడా తను రాసిన ప్రతి కవితలో మరణం లేని మానవతకు పెద్ద పీట వేశాడు. సమాజ అభివృద్ధికి గొడ్డలి పెట్టైన అసమానతను దుయ్యబడుతూనే, జాన్ కవి దళితుల్లో రగులుతున్న అంతర్గత విభేదాలను కూడా నిజాయితీగా ఎత్తిచూపాడు. **“మాలయతడు, నేను మాదిగ కులజుడనను భేద ముండునంత దనక, కలిసి తిరగలేము కదా కులీనులతోడ, ఇంటగెలిచి రచ్చకేగుమయ్య”** (విశ్వప్రకాశము) అని సూటిగా ఇంటి గుట్టును బయట పెట్టిన జాన్ విలువైన మాటల్ని ఆచరణాత్మకంగా నిజం చేయాల్సిన అవసరమెంతైనా ఉంది. **“పరరాజన్యులు లేరు,**







**నేడు ప్రజలే పాలించు రాజ్యంబులో, తరుగే మున్నది? సర్వహక్కుల సమానత్వము నీ సొమ్మురా తిరిపెమ్మెత్తెదవేల? సంఘటిత శక్తిన్ జూపలే లెమ్ము, నీ యరచేతన్ పరిపాలనా చరణ భాగ్యంబెన్నడో దోచె”** (విశ్వప్రకాశము) అంటూ ఎంతో ముందు చూపుతో దళితులకు కర్తవ్యాన్ని నూరిపోశాడు. ప్రజాస్వామ్యదేశంలో సర్వ హక్కుల్ని ధైర్యంగా అనుభవిస్తూ చిన్న చిన్న రాయితీల కోసం బిచ్చమెత్తకుండా అంతిమంగా రాజ్యాధికారం కోసం పోరాటం చేయాలని దళితులకు జాన్ పిలుపునిచ్చాడు. వస్తురూపాల్లో, అభిప్రాయ ప్రకటనలో జాషువా ప్రభావం జాన్ కవిత్వంలో సర్వత్రా కనబడుతుంది. అయితే ఆ ప్రభావం కార్బన్ కాపీలా యథాతథంగా కాకుండా అన్నయ్య పోలికలు తమ్ముడి రూపంలో కొత్తగా, అందంగా ప్రతిఫలించినట్లుగా ఉంటుంది. “గాంధేయవాద పరిష్వంగంలో ఇమడలేక బయటపడలేక జాషువా సంఘర్షణకు గురైనట్లే, జాన్ కూడా ‘ఆకాశవాణి’ విధించిన భావపరమైన కర్ఫ్యూ నీలినీడల్లో నడవలేక ఉక్కిరిబిక్కిరయ్యాడు. అందువల్లనే ప్రజాస్వామ్య భావజాలంపై ఉక్కుపాదం మోపిన ‘ఎమర్జెన్సీ’నీ ఆయన సమర్థించకుండా ఉండలేకపోయాడు. అత్యవసర పరిస్థితిని నరసింహస్వామిగా భావించి ప్రహ్లాద చిత్తముతో దానికి స్వాగతం పలకమని ఉద్బోధించాడు. (అత్యవసర పరిస్థితి)

‘అత్యవసర పరిస్థితి’ వలన ఆర్థికపరమైన ప్రయోజనాలు చేకూరాయని తెలియజేయడానికి ఆయన శతవిధాల ప్రయత్నించినప్పటికీ జాన్ కవిత్వంలో ఇది ఒక వైరుధ్యంగానే మిగిలిపోతుంది. అయితే తరచుగా ఆకాశవాణి నిర్దేశించిన వస్తువులకు ఆయన పద్యాలు రాయటం వలన జాన్ కవిత్వంలో గొప్పవస్తువైవిధ్యం చోటు చేసుకుంది. అందుకే జాన్ కవిత్వంలో విశాలమైన సందేశాత్మక దృష్టి, సులభగ్రాహ్యమైన పద్యశైలితో నిండివుంటుంది. పేదరికం, మద్యపానం, అధికజనాభా, కుటుంబ నియంత్రణ, అవినీతి, లంచగొండితనం. సాంఘిక సంక్షేమం, వరకట్నం, స్త్రీల అణచివేత,

దళితాభ్యుదయం, కులాంతర వివాహం, అవిద్య లాంటి అనేక అంశాలను తడిమి, వాటి తీరు తెన్నుల్ని విస్తృతంగా చర్చించి, ఆయా అంశాలపట్ల ప్రజల్లో సదావగాహన కలిపించటానికి కవిత్వం ద్వారా ఆయన అసామ్యామైన కృషిచేశాడు.

కథాత్మకంగా సాగే పద్య కవితాఖండికలు జాన్ కవిత్వానికి విశిష్టతను చేకూర్చాయి మల్లవరపు జాన్ ప్రజా సమస్యల్ని ఎంతో ప్రతిభావంతంగా చిత్రించాడు. కథాత్మకంగా సాగే పద్య కవితా ఖండికలు జాన్ కవిత్వానికి ప్రధాన ఆకర్షణగా చెప్పవచ్చు. ఇందువలనే సమకాలీన పద్యకవులందరికంటే మిన్నగా జాన్ కవిత్వంలో 'రీడబులిటీ' కనిపిస్తుంది.

కేవలం పద్య కవిత్వమే కాకుండా పద్యనాటకాన్ని కూడా అద్భుతంగా రచించి మల్లవరపు జాన్ తన సృజనాత్మక ప్రస్థానాన్ని మరింత వైవిధ్య భరితం చేసుకున్నాడు. పౌరాణిక ఇతివృత్తంతో కూడిన పద్య నాటకాలు ఆంధ్రదేశంలో వీరవిహారం చేస్తున్నప్పుడు, బైబిల్ కథాంశంతో కూడిన "సాంసన్ దెలిలా" అనే పద్య నాటకాన్ని రచించి జాన్ కవి క్రైస్తవ సోదరులకు అపురూపమైన కానుకగా అందించాడు. ఆంధ్రదేశంలో కొన్ని వేల సార్లు ప్రదర్శింపబడి క్రైస్తవులకు కనువిందు చేసిన ఈ నాటకం మల్లవరపు జాన్ నాటక శిల్ప చాతుర్యానికి మచ్చుతునకగా నిలిచిందనిచెప్పవచ్చు.

మల్లవరపుకవిత్వంలోభావపరమైన సమతౌల్యం, భాషాపరమైన సంయమనం రెండూ పడుగు పేకల్లా దర్శనమిస్తాయి. సామాన్య మానవుడి సహజ సిద్ధమైన వ్యవహారానికి అతిసమీపంగా తెలుగు పద్యాన్ని ఒయ్యారంగా నడిపించిన ఘనత జాను గారికే దక్కుతుంది. సంస్కృత భాషా సముద్రాల్ని లంఘించిన పండితోత్తముల మెప్పుకోసం ఆయన పద్యం రాయలేదు. పేదరికం, అవిద్య, సాంఘిక దుర్నీతి వంటి లెక్కకు మిక్కిలి 'సమస్యలతో సతమతమవుతున్న సగటి మనిషిలో కనువిప్పు కలిగించాలనే ఉత్తమ సంకల్పంతో' ఆయన ప్రయోజనాత్మకమైన పద్య కవిత్వం రాశాడు. అందుకే జాన్ పద్యం తిరుపతి గుడిలో దొరికే పరమ పవిత్రమైన తీర్థం వంటిది కాదు. చౌరాస్తాలోని చలివేంద్రంలో దొరికే చల్లని మంచినీరు వంటిది. ఆ మంచినీటి తత్వం వల్లనే మల్లవరపు కవిత్వంలో 'మధురత్వం అంతకంటే మించిన సజీవత్వం నిలువెల్లా పరిమళిస్తుంది.' **"తెలుగు కధికారభాషయని తెల్చియు, బ్రహ్మరథమ్ము పట్టియున్ కులికిరిగాని, ఆచరణకున్ తలయొగ్గిరే"** అని జాను కవి వేసిన ప్రశ్న ఈనాటి అధికారభాషా సంఘంలోని డొల్లతనాన్ని తెలియజేస్తుంది. సుతిమెత్తని ఎత్తిపొడుపు, మర్యాద పూర్వకమైన మందలింపు, ఆర్ద్రమైన ఆవేదన, సంభాషణా సిద్ధమైన పద్యధార మొదలగు లక్షణాల వల్ల జానుకవిత్వం ఎంతోమంది పాఠకులకు చేరువయిందని చెప్పవచ్చు. అత్యాధునిక సాహిత్యంలో వచనకవితా రూపానికి సమాంతరంగా పద్యాన్ని కదం తొక్కించి, ఈనాటి వచన కవుల్లోని ఆధునికతని మనసారా ఆహ్వానించి జాతీయ, అంతర్జాతీయ పరిణామాలను అనుసరిస్తూ ఎప్పటికప్పుడు తాజా కవిత్వాన్ని సృజించిన జాన్ పద్యకవుల్లో ఆధునికుడు. భావంలో ఎంత ఆధునికత ఉన్నా, మరెంత సమకాలికత ఉట్టిపడినా, పొరపాటున అది పద్యకవిత్వమైతే ఏ మాత్రం ఆదిరించని రూపలౌల్యం సోకాల్డ్ విమర్శకుల్ని పట్టి పీడిస్తున్నందువల్ల మల్లవరపు జాన్ కవికి తెలుగు సాహిత్యంలో రావాల్సినంత గుర్తింపు రాలేదు.

**ఆధార గ్రంథాలు :**

1. విశ్వనాథ పీఠికలు - సంపాదకులు. ముదివేడు ప్రభాకరరావు.

2. హరిజనాభ్యుదయం ఆధునికాంధ్ర కవిత్వం - డా కల్లూరి ఆనందరావు.

3. మల్లవరపు జాన్ కృతులు.

**శిలాక్షరం**

**(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం - సమాలోచన)**




ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.

సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి

సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య

వెల : 300/-

**సంప్రదించండి.**
**మూసీ మాసపత్రిక**
**ఫోన్ : 934 7971177**

**మూసీ**

**సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక**
**మూసీ మాస పత్రిక సభ్యులుగా చేరండి**
**వెంటనే శాశ్వత చందాదారులు కండి.**
**సాహిత్య రంగంలో వెలువడుతున్న ఒకే ఒక**
**పరిశోధనాత్మక వ్యాసాల మాస పత్రిక**
**యూజీసీ కేర్ లిస్ట్‌లో చేరిన తెలుగు పరిశోధనా పత్రిక**
**శాశ్వత సభ్యత్వం (10 సం॥లు)... 2500/-**
**సంప్రదించండి. మూసీ మాసపత్రిక... ఫోన్ : 934 7971177**

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 1 హైదరాబాద్ నవంబర్ : 2023


# భారతీయీకరణ – 16

## ఆంగ్ల మూలం : బలరాజ్ మధోక్, అనువాదం : కోవెల సంపత్కుమార

బలరాజ్ మధోక్ దేశశాంతి సమైక్యతలను పరిరక్షించడానికి భారతీయ ప్రజల ఆలోచనలను భారతీయీకరించవలసిన అవసరాన్ని చెబుతూ ఇంగ్లీష్ లో వ్రాసిన Indianness కు అనువాదం ఈ భారతీయీకరణ. భారతీయీకరణ అంటే అన్ని రకాల దీపాసనా మార్గాలను స్థలాలను సమానంగా గౌరవించడం. ఒక వ్యక్తి తాను ఏ కుల, మత, భాషావర్గాలకు చెందినవాడైన వాటి ప్రయోజనాలన్నిటి కన్నా దేశ ప్రయోజనానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడం ప్రధానమన్న అభిప్రాయాలు బలరాజ్ మధోక్ ఆలోచనల్లో కనిపిస్తాయి.

రాజకీయ వ్యవస్థలో జాతీయ భావన స్వరూపాన్ని, భారతీయీకరణ విషయంలో జరుగుతున్న చర్చలు, వ్రాసిన వ్యాసాలు, లేఖలు వాదోపవాదాలు ఈ గ్రంథ రచనకు బలరాజ్ మధోక్‌ను ప్రేరేపించాయి. భారతీయీకరణను గురించి ఒక జాతీయ భావన గల మేధావి ఆలోచనల ప్రతిబింబం భారతీయీకరణ. 1970లో వచ్చిన ఈ రచనను సంపత్కుమార తర్వాత కాలంలో సుమారు 80లకు ముందే అనువదించిందంటారు.

భారతదేశం భౌగోళిక స్వరూపం, జాతీయత – భారతీయత మధ్య గల తేడా, భారతీయీకరణ అంటే ఏమిటి? ఎందుకు? దానివల్ల ప్రయోజనమేమిటి? అది జరగవలసిన తీరు ఏమిటి? అన్న విషయాలను యథామూలంగా సంపత్కుమార అందించారు. అనువాదకుడిగానూ జాతీయభావనా చైతన్యం, దేశీయ ఆలోచనా విధానం వ్యక్తమయ్యే రచనను ఎన్నుకోవడం ఆయన దేశీయ నిబద్ధతను చెబుతుంది.

భారతీయులందరూ – ప్రత్యేకంగా ముస్లింలు – ఈ విషయంలో ఇండోనేషియా నుంచి ఎంతో నేర్చుకోవలసి ఉన్నది. ?

హిమాద్రి నుండి సముద్రం దాకా ఏకీకృతమయిన భారత మాతృ స్వరూపాన్ని ప్రాథమిక విద్యాభ్యాస కాలం నుంచే పిల్లల మనసుల్లో హత్తుకునేట్లు చేయడానికి, జాతీయ పతాకను దేశచిహ్నంగా, దాని గౌరవమే తన గౌరవమనే గాఢ భావన పిల్లల మనస్సులలో కలిగించడానికీ సరయిన చర్యలు తీసుకున్నట్లయితే, దేశంలోని ప్రతి పౌరునిలోనూ, జాతీయ భావనకు పునాది పడుతుంది.

ఒక వ్యక్తికి తన చుట్టూ ఉన్న సమాజంతోనూ, పరిసరాలతోనూ, వాతావరణంతోనూ ఆత్మీయ భావనను పెంపొందించేది, అతడు పాఠశాలలో విద్యాభ్యాసం చేసే కాలమే. ఏ కులానికీ, మతానికీ, సామాజిక స్థాయికి చెందినవారైనా, పిల్లలందరూ తామంతా సమానులుగా వ్యవహరించడానికే ఇష్టపడుతూ ఉంటారు. ఇది వారిలో పరస్పర గౌరవానికి కారణమవుతుంది. అందుకనే, ప్రాచీన భారతీయ విద్యా పద్ధతిలో మహారాజు కుమారుడు గూడా గురుకులంలో అతి సామాన్య బాలురతో కలిసి మెలిసి భుజాలు భుజాలు రాసుకుంటూ తిరుగుతూ ఉండవలసి వచ్చేది. ఆనాడు కుల, వర్గరహిత సమాజ స్వరూపాన్ని గూర్చి మాట్లాడిన వాడొక్కడూ లేదు మరి.

పరిస్థితులన్నీ ఈనాడు తారుమారయినయి. స్వామ్యవాదం పేరిట అన్నిరకాల నూతన వర్గ ప్రత్యేకతలు సృష్టింపబడినయి. ధనవంతుల పిల్లలు ఆంగ్ల మాధ్యమం గల "పబ్లిక్" పాఠశాలలకే వెళ్తున్నారు. బీదవారి పిల్లలు తమంత బీదవే అయిన "మున్సిపల్" పాఠశాలలకే వెళ్తున్నారు. ఒక వాడలోని పిల్లలు ఆ పరిసరాల పాఠశాలలకే వెళ్లాలనే సూత్రం- The principle of





neightourhood school కూడా భారతదేశంలోని సామ్యవాద ప్రభువులకు అంగీకారయోగ్యం కావడం లేదు. జాతీయ సమైక్యత అనేది పాఠశాలల నుంచి రావాలసి ఉంటుంది. అక్కడే అది కరువైతే, బయటి ప్రపంచంలోనూ అది కలుగబోదు.

మత కారణాలను పురస్కరించుకొని కొన్ని మత వర్గాలవారు కొన్ని ప్రత్యేక భాషలకే అంటిపెట్టుకుని ఉండడం. భారతీయీకరణ, జాతీయ సమైక్యతా మార్గంలో ఆటంకాలు కలిగిస్తున్నది. ఉర్దూగానీ, ఆంగ్లంగానీ నేర్చుకొనడంలో తప్పు ఏమాత్రమూ లేదు. ఈ రచయిత ఉర్దూతో తన విద్యాభ్యాసం ప్రారంభించి ఆంగ్లంతో జీవయాత్ర సాగిస్తున్నాడు. కాని, ఎవరైనాసరే తానొక ప్రత్యేక కులానికో, వర్గానికో సంబంధించిన కారణంగా తన పిల్లలకు ఉర్దూ పాఠశాలలోనో, ఆంగ్ల మాధ్యమం గల పాఠశాలలోనో విద్యాభ్యాసం జరిగవలెనని కోరడం, ఈ కోరికను ప్రభుత్వం అంగీకరించడం కేవలం తప్పు మాత్రమే కాదు, ప్రమాదకరం గూడా. ముస్లింల భాష ఉర్దూ కాబట్టి, అందులోనే ముస్లిం లందరికీ విద్యాభ్యాసం

జరుగవలెనని ఈ మధ్యనే జమాయత్– ఇ– ఇస్లామీ ప్రకటించింది. ఈ కారణంగానే, మహారాష్ట్ర, తమిళనాడులలో ఉర్దూ పాఠశాలలను తెరవడానికి, ఉత్తరభారత రాష్ట్రాలలో ఉర్దూకు ద్వితీయ భాషాస్థానం కల్పించడానికి వత్తిడి ఎక్కువగా చేయడం జరిగింది. ఎవరయినా ఉర్దూ నేర్చుకోవాలె నంటే, అందుకెవరికీ అభ్యంతరం ఉండనక్కర లేదు. కానీ మరాఠీ మాట్లాడే ముస్లిం పిల్లలను, మరాఠీయే మాట్లాడే మిగిలిన పిల్లల నుంచి విడదీసి, ఉర్దూ పాఠశాలకు పంపడమంటే, జాతీయ సమైక్యతను తల్లివేరు నుండి కోసివేయడమన్నమాట. భారతీయీకరణను వ్యతిరేకించడమన్నమాట. కుల మత వర్గాల ప్రమేయం లేకుండా, మరాఠా పిల్లలందరికీ మొట్టమొదట మరాఠీ భాష రావలసి ఉంటుంది.

ఉర్దూ భాష మళ్ళీ ఒకసారి ముస్లిం వేర్పాటు ధోరణికి ప్రతీకగా రూపొందుతున్నది. ఇది ఉర్దూకు గానీ, ముస్లింలకు గానీ, క్షేమకరం గాదు. తన సాహిత్యాన్ని బట్టి భారతదేశంలో ఉర్దూ అభివృద్ధి పొందుతుంది. దాని అభివృద్ధికి ముస్లిమేతరులు గూడా ముస్లింలతో సమంగా కృషి చేసినారు. ఇది కేవలం ముస్లింల వల్ల మాత్రమే అభివృద్ధి పొందలేదు, పొందదు కూడా. అయితే ఆ భాష క్రమంగా దేవనాగరి లిపిని స్వీకరించవలసి ఉంటుంది.

ఏ భాషలోనయినాసరే, ఏదో ఒక ప్రత్యేక లిపితో బంధించడం సరికాదు. పరస్పరం పూర్తిగా విభేదించే యూరోపియ భాషలన్నీ ఒకే లిపిలో వ్రాయబడుతున్నయి. ఇది వివిధ యూరోపియ భాషలను నేర్చుకొనడంలో సహాయకం కావడమే కాకుండా, ఉమ్మడిగా యూరోపియ దృక్పథాన్ని కలిగించడానికి దోహదం చేస్తుంది. "దివాన్– ఇ– గాలిబ్" అన్న ప్రసిద్ధ ఉర్దూ కావ్యం ఉర్దూ (లిపి)లో అచ్చుయినప్పుడు చాలా కొద్ది ప్రతులే అమ్ముడుపోయినాయి కానీ, దేవనాగరిలో అచ్చుయినపుడు అమ్ముడుపోయింది లక్షల ప్రతులు. అందువల్ల, ఒక ఉమ్మడి లిపిని ప్రవేశపెట్టడం, ఏ భాషనైనా సరే, ఏదో ఒక మతానికో,వర్గానికో బంధించే తత్వాన్ని నిరుత్సాహపరచడం భారతీయ సమైక్యతకు అత్యవసరం. దీన్ని సరియైన విద్యావితరణం ద్వారా ఎంతో బాగా సాధించవచ్చు.

మనుష్యుల మనసులను మలచడంలో చరిత్రకెంతో ప్రాముఖ్యం ఉన్నది. ఇది జాతీయ భావ నిర్మాణంలో గూడా ఒక గొప్ప సాధనం. భారతదేశానికి వైవిధ్యం గల సుదీర్ఘ చరిత్ర ఉన్నది. దేశం యొక్క వృద్ధిక్షయాలలో, జయ పరాజయాలలో, వీరులలో, ద్రోహులలో కూడా దానికి భాగం ఉన్నది. వీటన్నింటితో ఆ చరిత్ర వేదకాలం నుండి ఈనాటి దాకా ఒకటే. అది భారతదేశం యొక్క సర్వవ్యాపక స్వరూప దర్శనం కలిగిస్తుంది.

చరిత్రాంశాలను పవిత్రంగా భావించి, వాటిని ప్రస్తుత సాంఘికావసరాలకు అనుగుణంగా వ్యాఖ్యానించడమే సరయిన చారిత్రక దృక్పథం. కానీ, భారతదేశంలో జరుగుతున్నది దీనికి సరిగా తలక్రిందులు.

లౌకికరాజ్య విధానం పేరిట చారిత్రకాంశాలను అధికారంలో ఉన్నవారు తమ సిద్ధాంతాలకూ, రాజకీయావసరాలకూ అనుకూల పడేట్లు వక్రీకరిస్తున్నారు లేదా తుడిచివేస్తున్నారు. ఉదాహరణకు ఔరంగజేబు ఉదార ప్రభువుగా ప్రస్తుతీకరింపబడుతున్నాడు. అందుకే, జిజియా పన్ను– అన్ని ప్రభుత్వాలు తమ సాగుదలకు విధించే పన్నుల వంటి ఒక పన్నుగా వివరించబడుతున్నది. పాఠ్యపుస్తకాలను చదువుకోకున్నా గూడా కొట్ట వచ్చినట్లుండే ఈ అంశాలు ఏదోవిధంగా తెలుసుకునే యువతరం మీద, పై విధంగా చారిత్రకాంశాలను వక్రీకరించడం వల్ల పూర్తిగా విరుద్ధ ప్రభావం పడుతుంది.

లౌకిక విధానం, మతతత్వ నిరోధం పేరిట ఈ విధంగా చారిత్రకాంశాలను చెరచడం, భారత జాతీయ మహావ్యక్తుల ప్రస్తావనలను పాఠ్యగ్రంథాల నుంచి తొలగించడం పూర్తిగా రాజకీయ దుర్నీతి. అంతేకాదు, దీనివల్ల ఎన్నో దుష్ఫలితాలు గూడా కలగవచ్చు. చరిత్రపై మసి పూసినంత మాత్రాన చారిత్రక స్మృతులు మాసిపోవు. అవి జాతీయ వారసత్వంలో భాగంగా జాతి మనస్సులో చెరుగకుండా నిలిచిపోయినయి. అందువల్ల, ఉదీయమాన యువతరం వీటన్నింటినీ తెలుసుకొనేట్లు చేయడమే ఉచితమయినపని. మంచి చెడ్డలకు కారణమయినవారి జాతి మతాల ప్రమేయం లేకుండానే మంచిని మెచ్చుకునేట్లు, చెడ్డను నిరసించేట్లుగా వారిని తయారు చేయడం ఉపాధ్యాయులూ నాయకుల కర్తవ్యం. తమ నిరంకుశ పాలనను నిలుపుకొనడం కోసం తాము వేసిన దారిలోనే ప్రజల బుద్ధిని నడిపించవలసిన అవసరం గల కమ్యూనిస్టుల అదుపులోని దేశాలలో తప్ప, ప్రపంచంలోని అన్ని దేశాలలోనూ చరిత్ర విషయంలో ఇదే వైఖరి అనుసరింప బడుతున్నది. ఉదాహరణకు బ్రిటన్‌ను తీసుకుంటే, అక్కడ సర్ థామస్ మోర్, ఇంకా అట్లాంటి వందలాది ఇతర ప్రొటెస్టెంటులను స్తంభాలకు కట్టించి సజీవదహనకాండ జరిపించిన క్వీన్ మేరీ విషయాన్ని చరిత్రలో దాచడానికి ఏవిధమైన ప్రయత్నమూ చేయబడలేదు. కానీ, ఔరంగజేబు చేసిన ఘోర కార్యాలను, అతని చేతుల్లో బలి అయిన గురు తెగ్ బహద్దూర్ వంటి అనేక మహాత్ములను, దేశభక్తులను గురించి భారత ప్రజలు తెలుసు కొనడానికి, భారతదేశంలోని లౌకికవాదులు ఇష్టపడడం లేదు. భారతీయీకరింపబడిన అక్బర్ ను గూర్చి గౌరవాన్ని పెంపొందించ తలచుకుంటే, ఔరంగజేబు యొక్క ఆ భారతీయ, అమానుష ఆటవిక ప్రవృత్తిని వారు ఖండించక తప్పదు.

ప్రార్థనా స్థలాలు, పుణ్యక్షేత్రాల విషయంలో గూడా ఇంతే. అన్ని వర్గాల ప్రార్థనా స్థలాలు గౌరవింపబడ వలెననేదే భారతీయీకరణ యొక్క వాంఛ. కానీ, ఎవడో వెర్రివాడు జెరూసలెంలోని అల్ అక్సా మసీదును తగులబెడితే, ఈ దేశంలోని లౌకికవాదులూ, భారతీయ వ్యతిరేకులూ బ్రహ్మాండమయిన ఆర్భాటం చేసినవారే తప్ప, ప్రాచీన

కాలం నుంచి అతి పవిత్రంగా భావింపబడుతున్న ఈ దేశంలోని దేవాలయాలనూ పుణ్యక్షేత్రాలనూ నాడు నేడు మతోన్మాదులు కాల్చినా, కూల్చినా, అపవిత్రం చేసిన పెదవి విప్పి ఒక్క మాటయినా మాట్లాడలేదు. కమాల్ పాషా అంతటి ముస్లిం కూడా కాన్ స్టాంటి నోపుల్ లోని సెయింట్ సోఫియా చర్చిని మసీదుగా ఉపయోగించ డానికి ఒప్పుకోలేక పోయినాడు. మధ్యేమార్గంగా దాన్ని ఒక వస్తు ప్రదర్శనశాలగా మార్చినాడు. కానీ, ఇక్కడ భారతదేశంలో రామ, కృష్ణుల జన్మస్థానాల వంటి అతి పవిత్ర దేశీయ ప్రదేశాలు ఇప్పటికీ ముస్లింల చేతులలోనే ఉండిపోయినయి. వారు ఆయా ప్రదేశాలలోని దేవాలయాలను కూల్చలేదు. వాటి స్థానంలో మసీదులు నిర్మించలేదు. అంతవరకు నిజమే. అట్లా చేయడం ఔరంగజేబు వంటి ఆటవికుల పని. కానీ మన ప్రజల భావైక్యతా మార్గంలో పెద్ద ఆటంకాలుగా ఉంటూ ఉన్న ఇట్లాంటి ఘోరాలు "జాతీయ ముస్లిం"లనీ, లౌకిక వాదులనీ చెప్పుకొనబడుతున్న వారి మనసులను ఎప్పుడయినా బాధించినాయా? నిజంగా భారతీయీకరింపబడిన ముస్లింలు ఈ యీ పవిత్ర స్థలాలను వాటికి సంబంధించిన వారికి స్వచ్ఛందంగా సమర్పిస్తారు. ఈ సత్కృతికి బదులుగా వాటి ప్రక్క ప్రక్కనే మసీదులను కట్టుకొనడానికి గూడా అవకాశం లభిస్తుందని నేను గట్టిగా విశ్వసిస్తున్నాను.

దేశంలో ఈ విధమయిన సద్వాతావరణం, భావన కలిగించడం విద్యా ప్రణాళిక, మరియు విద్యావేత్తల కర్తవ్యం. ఇట్లాంటి దృక్పథం గల ముస్లింలు భారతదేశంలో చాలామంది ఉన్నారని నాకు నిశ్చయంగా తెలుసు. కానీ, ఔరంగజేబును ఆదర్శం ముస్లిం ప్రభువుగా, అక్బర్ ను మత ద్రోహిగా భావించే వారి పగసాధింపు చర్యలకు భయపడి తమ ఆంతరిక భావాలను బహిరంగంగా చెప్పలేకపోతున్నారు.

భారతీయ పరిస్థితులకనుగుణంగా, తానొక భారతీయుడు కావడం గర్వించదగిన అంశంగా ప్రతి వ్యక్తి భావించడానికి సాధనంగా విద్యా ప్రణాళికను ఆమూలాగ్రం భారతీయీకరిగించడం భారతదేశంలోని అన్ని తరగతుల వారి భారతీయీకరణకు అత్యంత ఆవశ్యకం. వ్యక్తులను ఆ భారతీయీకరించే ఈ ప్రస్తుత విద్యా విధాన ప్రభావాలు ఇంకా ఇప్పటివరకు సామాన్య ప్రజానీకం దాకా పూర్తిగా వెళ్లలేదు. కానీ కొంచెం ముందు వెనుకలుగా వారి అందుబాటులోకి విద్య వెళ్లకతప్పదు. అందువల్ల విద్యాప్రణాళికను సంస్కరించడం ఆ ప్రణాళికలో నైతిక, జాతీయాంశాలను చేర్చడం, ఉన్నత తరగతుల దాకా హిందీని ఇతర జాతీయ భాషలను విద్యా మాధ్యమం చేయడం, ఒక క్రమ ప్రయత్నంలో భారతీయులందరూ "భాషాభారతి"ని, దేవనాగరి లిపిని తెలుసుకొనే విధంగా చేయడం తత్ క్షణావసరం. దేశానికి ఉమ్మడి అయిన భాషకు "హిందీ" అనే పేరుకు బదులు "భాషాభారతి" అన్న పేరును ప్రచారంలోకి తీసుకురావలసి ఉంటుంది. మన ఈ సువిశాల భారతదేశంలో ఎన్ని భాషా ప్రాంతాలున్నాయో అన్నింటి ఛాయలూ ఈ భాషా భారతిలో ఉంటాయి. భారతదేశంలోని ఆగ్నేయ ప్రాంతాలలో ఉపయోగించే "భాషాభారతి"లో పర్షియన్, తురుష్క భాషా ప్రకృతి గల పదాలు అధికంగా ఉండగా, తమిళనాడులోని భాషాభారతి అధికంగా తమిళ ప్రభావితమై ఉంటుంది. అన్ని భారతీయ భాషలలోని ప్రస్తుత వ్యవహారిక సాంకేతిక పదాలతో ఈ భాషాభారతి ఏర్పడుతుంది. వ్యావహారికంలో పదాలు లభించిన సందర్భంలో సంస్కృతం మీద ఆ పదాలకోసం ఆధారపడవచ్చు. వ్యవహారంలోని కొన్ని ఆంగ్ల భాషా పదాలను గూడా భారతీయీకరించి భాషాభారతిలో చేర్చుకోవలసి ఉంటుంది.

ఏ దేశంలోనయినా సరే, జాతీయ వినోదాలూ, పండుగలూ, పర్వాలు ప్రజల ఊహలను తీర్చిదిద్దడంలో చాలా ప్రాధాన్యం వహిస్తాయి. ఈ విషయంలో భారతదేశం ఎంతో సంతృప్తికర స్థాయిలో ఉన్నది. ఏదో ఒకరీతిలో దేశమంతటా జరుపుకొనే పండుగలు చాలా ఉన్నయి. వీటిలో అనేకమయిన పండుగలకు పౌరాణిక, చారిత్రకాంశాలతో సంబంధం ఉన్నాగూడా, ప్రధానంగా ఇవి ఋతువులకు సంబంధించినవి. ఓనం, వసంత్, హోలీ, వైశాఖీ, దసరా, దీపావళి– ఇవి పండుగలన్నింటిలో చాలా ప్రధానమయినవి. ఓనం అనేది మకర సంక్రాంతి. దేశంలోని కొన్ని ప్రాంతాలలో దీన్ని "మాఘి" అని కూడా అంటారు. సూర్యుడు దక్షిణాయనం నుంచి ఉత్తరాయణానికి మారడానికీ, చలికాలం యొక్క చివరిస్థితికీ నవ సంవత్సర అ ప్రారంభానికీ ఇది సూచకం. ఇది దేశం మొత్తం మీద జరిగే పండగ. ఈ పండుగలో, దేశంలోని అన్ని ప్రాంతాలలోనూ ప్రత్యేకంగా నువ్వులూ, బెల్లం ఉపయోగించబడుతాయి.

వసంత కాలంలో వచ్చే అచ్చమయిన ఋతుసంబంధమయిన పండుగ "వసంత్". ఈ రోజున విద్యాధి దైవతమయిన సరస్వతీ దేవిని విద్యార్థులు పూజిస్తారు. అందువల్ల ఇది విద్యార్థుల పండుగగా కూడా భావింపబడుతున్నది. విద్యార్థులతో, ''వసంత్''తో సరస్వతీదేవిని ముడివేయడం కేవలం మనదేశానికే పరిమితంకాదు. జపాన్ లోనూ, ఇంకా ఇతర దేశాలలో గూడా సరస్వతీదేవిని విద్యార్థులు ప్రత్యేకంగా పూజిస్తారు.

హోలీ పండగ భారతదేశంలో "మే– పోల్" పండగ వంటిది. ఇది ఆనందోల్లాస పండుగ. ఇందులో సాంఘిక మయిన తరతమ భేదాలన్నీ అదృశ్యమయిపోతాయి. ఈ విధంగా సమాజాన్ని ఏకీకృతం చేసే పండుగ ఇది. ఇది ప్రధానంగా సామాన్య ప్రజల పండుగ. దీనికి ప్రతీక. దృఢ శరీరి అయిన భారతీయ "కిసాన్"– కర్షకుడు.

అతి ప్రాచీనకాలం నుంచీ దసరా లేక విజయదశమి భారతదేశపు సైనికదినం. చెడు మీద మంచి విజయం పొందిన దినమిది. ఆయుధపూజ, యోధుల పూజ, ఈ దినాన జరుగుతుంది. దేశంలోని

రైతులూ, తదితరులూ, దేశపు మనుగడకు ఎంత ప్రమాదమో, యోధులు, వారి ఆయుధాలూ అంతగానే అవసరం. జవాన్– కిసాన్– సైనిక కర్షక– విజయం కలిసిమెలిసి సాగుతుంది. సైనికులకూ, కర్షకులకూ– జవాన్లకూ, కిసాన్లకూ – విజయం లేకపోతే, భారత దేశానికే విజయం అనేది లేదు.

సాంప్రదాయికంగా, శ్రీరామచంద్రుడు లంకా విజయం పొంది అయోధ్యకు తిరిగి వచ్చిన దినంగా దీపావళి చెప్పబడుతున్నా గూడా, వేసవికాలం గడిచి, శీతాకాలం ప్రారంభం కావడాన్ని ఈ పండుగ సూచిస్తుంది. పునాస పంటల కోతలనూ, చలికాలం పంటల నాట్ల ప్రారంభాన్నీ, ఈ పండుగ సూచిస్తుంది. అందువల్లనే, సాంప్రదాయికంగా ఇది భారతదేశపు నూతన ఆర్థిక సంవత్సరానికి ప్రారంభ సూచకం. ఈ కారణంగా ఈ దినం వ్యాపారస్థులకు ఎక్కువగా సంబంధించింది. ధనాది దేవతమయిన లక్ష్మీదేవి పూజలు ఈనాడు జరుగుతాయి. భారతదేశంలో అంతటా, మత, వర్గ ప్రమేయం లేకుండా అందరు వ్యాపారస్తులూ ఈనాడు తమ క్రొత్త ఖాతా పుస్తకాలను ప్రారంభిస్తారు.

ఇటీవలి కాలం దాకా ఈ పండగలన్నీ కుల,మత, వర్గాలతో నిమిత్తం లేకుండా భారతీయులందరూ చేసుకునేవారు. తాను ముస్లిం అయి ఉండి కూడా, అక్బర్ ఈ పండుగలన్నింటినీ ప్రభుత్వ పర్వాలుగా జరిపిస్తూ ఉండేవాడు. ఒకసారి మహారాజా రంజిత్ సింగ్ ఆస్థానంలోని ఆఫ్ఘనిస్తాన్ అమీర్ యొక్క రాయబారి, తాను ముస్లిం అయిన కారణంగా హెూలీ ఉత్సవాలలో పాల్గొనకుండా ఉండేందుకు అనుమతించ వలసిందని ప్రార్థించగా, పంజాబ్ సింహమయిన ఆ రాజు "ఇది ఒక మతానికి సంబంధించింది కాదు, భారతదేశపు పండుగ" అని అంటూ, స్వయంగా ఆ రాయబారి మీద రంగు చల్లినాడన్న చారిత్రక సత్యం సుప్రసిద్ధం.

జాతీయ పర్వాలుగా వ్యవహరించడానికి వీలులేని జన్మాష్టమి, శివరాత్రి, బుద్ధపూర్ణిమ, గురుపర్వం, రుషిబోదోత్సవం, ఈద్, మొహర్రం, క్రిస్టమస్ వంటి ప్రత్యేక వర్గసంబంధం గల పండుగల నుంచి, పైన పేర్కొన్న జాతీయ పర్వాలకు వేరుచేయవలసి ఉంటుంది. ఈ జన్మాష్టమి మొదలైన పండుగలు భారతదేశంలోని వివిధ మతాలకూ, ఉపాసనా మార్గాలకు, వాటి ప్రారంభకుల జీవితాలకూ సంబంధించిన పండుగలు. వీటిలో దేశంలోని అన్నివర్గాల ప్రజలు పాల్గొనడం దేశ సంప్రదాయానుగుణం, ఉచితమూ అయినా గూడా వీటికి సహజంగానే వర్గలక్షణం, వర్గాకర్షకత్వం ఏర్పడింది.

జాతీయ పర్వాలకు సంబంధించినంతవరకు, అవన్నీ మరొక తరహాకు చెందినవి. వాటిని వేరు వేరు మత, వర్గాల పండుగలతో కలుపగూడదు. ప్రభుత్వం ఈ పర్వాలను నిజమయిన జాతీయ ధోరణితో నిర్వహించడానికి చొరవ తీసుకోవలసి ఉన్నది. ఇట్లా గనుక జరిగితే, ఈ జాతీయ పర్వాలు ప్రజల జాతీయ సమైక్యత విషయం లోనూ, వారి జాతీయాకరణలోనూ ఒక ఒక ప్రధానాంశమవుతాయి.

(సశేషం)


## 'కదంబం'

**(తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు)**

**మూసీ మాసపత్రిక ప్రచురించిన ప్రత్యేక గ్రంథం**

**ప్రాచీన, అధునాతన, జానపద ప్రక్రియలన్నింటిపై ప్రత్యేక వ్యాసాలు**

(పురాణం, ఇతిహాసం, కావ్యం మొదలైన ప్రక్రియలు మొదలు నానీలు, హైకూల వరకు 82 సాహిత్య ప్రక్రియలపై ప్రముఖ సాహితీవేత్తల కలాల నుండి జాలువారిన ప్రత్యేకాంశాల సమాహారం. పోటీ పరీక్షలకు, కళాశాలలకు, వ్యక్తిగతంగా అందరికీ వినియోగపడే

ఉత్తమ గ్రంథం **'కదంబం'.**

**440 పేజీలతో వెలువడిన ఈ గ్రంథం వెల రూ. 350/-**

## ఆలోకనం

**(తెలంగాణ 31 జిల్లాల చరిత్ర సాహిత్య సాంస్కృతిక సమాచారం)**

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా మూసీ మాసపత్రిక ప్రత్యేకంగా సంకలనం చేసిన గ్రంథం ఆలోకనం.

తెలంగాణ 31 జిల్లాలకు సంబంధించిన విలువైన సమాచార సూచిక ఇది.

330 పేజీల ఈ గ్రంథం విలువైన రంగు చిత్రాలతో కూడుకుని ఉన్న విశేష గ్రంథం.

అన్ని రకాల కాంపిటీషన్ పరీక్షలకు కూడా వినియోగపడే సమగ్ర సమాచార దర్పణం.

**మూసీ కార్యాలయంలో దీనిని పొందదలచిన వారికి కేవలం 300/- (అసలు 500/-) కు మాత్రమే అందిస్తున్నాం. సంప్రదించండి.**

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 1 27 హైదరాబాద్ నవంబర్ : 2023

గ్రంథాంతరంగం
28

# సి.పి. బ్రౌన్ తాతాచార్ల కథలు

శ్రీ ఘట్టమరాజు, బెంగుళూరు, ఫోన్ : 9964082076

రాజసభలకు, పండిత పరిషత్తులకు భక్తకూటువలకు మాత్రమే పరిమితమైన తెలుగు కావ్య, పురాణ, శతకాల్ని ఆబాలగోపాలానికీ చేరువయ్యేలా భగీరథ ప్రయత్నం చేసిన ఉదాత్త పురుషుడు ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్ (1798-1884) ఈ కావ్యగంగను తెలుగు ప్రజాకోటికి తరలించిన ఈ పురుషోత్తముని డా. కొత్తపల్లి వీరభద్రరావు ఇలా ప్రశంసించారు- **"ఆనాడు జీర్ణస్థితిలో నున్న తెలుగు కావ్య సరస్వతిని పునరుజ్జీవితను చేసిన ధన్వంతరి బ్రౌనుదొర."** (సి. పి. బ్రౌన్. పేజి: 243. ద్వి. ము. 1988)


ఘట్టమరాజు అశ్వత్థ నారాయణ

విదేశీయుడైన సి.పి.బ్రౌన్ గ్రాంథిక భాషలో రచింపబడ్డ ఎన్నో తెలుగు కావ్యాల్ని చీకటి కొట్ల నుంచి వెలుగులోనికి తెచ్చారు. కాని అవి సామాన్య ప్రజలకు కొరుకుడు పడవని గ్రహించి, వాటికి ప్రకాండ పండితుల చేత వ్యావహారిక భాషలో సులభంగా అర్థమయ్యేలా వ్యాఖ్యానాలు రాయించారు. సమకాలీన విద్వాంసులైన ఏనుగుల వీరాస్వామయ్య 'కాశీయాత్ర చరిత్ర' (1838) బేతపూడి సుందరరాయుడి 'నీలగిరియాత్ర' (1864) మొదలైనవి వ్యావహారిక భాషలోనే వెలువడి పాతకాదరణ పొందాయి. కాగా బ్రౌను దొర తెలుగు రచనా వ్యాసంగం వాడుక భాషలోనే సాగింది. ఆయన రూపొందించిన తెలుగు- తెలుగు నిఘంటువు, ఇంగ్లీషు తెలుగు నిఘంటువు, మిశ్రభాషా నిఘంటువు, తెలుగు వాచకం (ది టెలుగు రీడరు) ప్రాచీన గ్రంథ సేకరణ నిమిత్తం పండిత ప్రవరులతో కొనసాగించిన ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ వ్యావహారిక భాషలోనే నడవడం గమనించాల్సిన సంగతి. ఆ మహానుభావుడు సుమారు ముప్పై సంవత్సరాల పాటు తెలుగు పద్య, గద్య సంరక్షణకు త్రికరణ శుద్ధిగా పాటుపడ్డారు. 1855 లో ప్రియమైన భారతదేశం నుంచి వీడ్కోలు తీసుకుంటూ, స్వస్థానమైన లండను నగరానికి వెళ్తూ తనకు ఆప్తుడైన తాతాచారి (సుమారు 1798-1848) చెప్పగా, వాటిని రాయసగాళ్ళ చేత రాయింపచేసి. ముచ్చటగా 'తాతాచారి కథలు' పేరుతో ముద్రింప చేసి తెలుగు జాతికి ప్రేమ కానుకగా ఇచ్చి వెళ్లారు.

ఇంతకీ గ్రాంథిక భాషా విద్వాంసులైన సి.పి. బ్రౌనుకు వాడుకభాషలోని తాతాచార్యుల కథలు ఎందుకు ఇంపితమైనట్లు? అలాగే వ్యావహారిక భాషా ప్రతిపాదకులైన గురజాడ అప్పారావు ఈ 'తాతాచారి కథలు' వావిళ్ళ ప్రెస్సు ద్వారా ప్రచురింప చేయాలని ఎందుకు సంకల్పించినట్లు? తనదైన విలక్షణ దృక్పథంతో పీఠిక రాయాలని తలచి. 1915లో ఆకస్మికంగా మరణించగా మరుసటి సంవత్సరమే -1916లో వావిళ్ళవారి మూలంగా వెలువడటం గమనార్హమైన సంగతే. 'తాతాచారి కథలు' అనే పేరుతో సి.పి.బ్రౌన్ సంపాదకత్వంలో 1855లో వెలువడ్డ కథా సంపుటిని, ప్రసిద్ధ పరిశోధకుడు బంగోరె (బండిగోపాలరెడ్డి 12-10-1938- 5-11-1982) 'తాతాచార్ల కథలు' అనే శీర్షికతో 1974 జూలైలో ఎమ్. శేషాచలం అండ్ కొ ద్వారా ప్రచురింప చేశారు. పరిశోధనను 'పవిత్రబాధ్యత'గా భావించే, శ్రమించే 'శాపగ్రస్తయోగి' బంగోరె' ఈ పుస్తకానికి రాసిన 'ముందు మాటలు' లో ఇలా అంటారు - **"గురజాడ ఆఖ్రరోజుల్లో బ్రౌన్ విషయం పట్టి చూడాలనుకొన్నాడు. వ్యావహారిక భాషావాదానికి బ్రౌన్ ఒక విధంగా వైతాళికుడు వంటి వాడని గురజాడ ఆఖరుదశలో గుర్తించాడా అన్పిస్తుంది."** (పేజి: 12) తెలుగు వ్యావహారిక భాషా ఉద్యమానికి అశ్వినీ దేవతలుగా భావించే గిడుగు రామమూర్తి, గురజాడ అప్పారావుల కంటే సుమారు అరవయ్యేళ్ల ముందుగానే వ్యావహారిక భాష ఆవశ్యకతను, ప్రాధాన్యాన్ని గుర్తించిన క్రాంతదర్శి బ్రౌను. ఆ మహానుభావుని దూరదృష్టిని గురజాడ వాస్తవంగా దర్శించాడు. ఒకవేళ ఆయనే 'తాతాచారి కథలు' కు పీఠిక రాసి వుంటే 'భాషాపరశేష యోగి' అయిన సి. పి. బ్రౌను దూరదృష్టి, సునిశిత పరిశీలనా దృక్పథాలు మనకు స్పష్టంగా బోధపడి వుండేవి. గురజాడ ఆ పుణ్యాత్ముణ్ణి వ్యావహారిక భాషా వైతాళికుడని కీర్తించి వుంటే కళాపూర్ణోదయ కర్త పింగళి సూరన మాటల్లో 'తప్పేమి యొప్పే యగున్.'



ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 1 (28) హైదరాబాద్ నవంబర్ : 2023

సి. పి. బ్రౌన్ ప్రాచీన తెలుగు కావ్యాల్ని వెలుగులోకి తెచ్చి,అవి పండితులకే కాకుండా సామాన్య ప్రజానీకానికి కూడా చేరువ కావాలని అభిలషించారు. అవి అంతో ఇంతో చదువుకున్న వాళ్లకు కూడా అర్థం కావాలంటే వాడుక భాషల్లో టీకా తాత్పర్యాలతో పాటు వెలువడాలని అభిప్రాయపడ్డారు. ఆ కావ్య యజ్ఞంలో ఋత్విజులై సఫలీకృతులయ్యారు కూడా. కావ్యాల్ని పునరుద్ధరించి, వాటిని అర్థం చేసుకునేందుకు నిఘంటువులు తయారు చేయించిన బ్రౌను మహాశయుడు ఆబాలవృద్ధులకు కూడా సులభంగా అర్థమయ్యే 'తాతాచారి కథలు' ను తెలుగు బిడ్డలకు వీడ్కోలు కానుకగా దీన్ని అందించి వెళ్లారు.

'సి.పి.బ్రౌన్ తాతాచారి కథలు' కు 'ముందు మాటలు' రాస్తూ పరిశోధకులైన ఇలా అంటారు– **"బ్రౌన్ ఈ కథలను ఎందుకు** సేకరించినట్లు? వీటిల్లోని భాషా సారళ్యం, సూటి దనమూ ఒక్కటే కారణమా? లేక ఇతివృత్తం కూడానా? చారిత్రాంశాలు ఉన్నాయనే స్పృహ కూడా ఒక కారణమా? 'స్పెక్యులేట్' చేయడం కష్టం. బ్రౌన్ వ్యక్తిత్వం ఒక మూసకు ఇమిడేది కాదు. ఒక కొలమానానికి అందేది కాదు. ఆయన పాండితి, ప్రజ్ఞ, సేవ బహుముఖమైనవి. విస్తారమైనవి." (పేజి: 25) సి. పి. బ్రౌన్ 'తాతాచారి కథలు' పుస్తకానికి రాసిన పీఠికలోని 'శీర్షిక' 'The Tatachari Tales or Popular Telugu Tales' బంగోరె 'తాతాచార్ల కథలు' 'రెండవ అనుబంధం'లో వావిళ్ళ వారి ప్రతి 'తాతాచార్యుల కథలు' (1916) లోని 'Authors Preface' లో బ్రౌన్ మాటల్ని ఇలా ఉటంకిస్తారు – "Tatacharulu uses a style free from Pedantry; his tales were written down from his dictation ; and furnish good models of the colloquial Telugu. Several turn upon points of Sanskrit Learning" (పేజి: 22) సామాన్య పాఠకులకు ఇనుప గుగ్గిళ్ళుగా వుండే గ్రాంథిక భాష ఆయనకు ఎప్పటికీ నచ్చేది కాదు.

ఆ రసపిపాసికి పసందైనది ప్రజల వాడుక భాషే. బ్రౌన్ దొరగారి చూపు ఎప్పుడూ 'బహుజన హితాయ, బహుజన సుఖాయ' యే – అందువల్లే ఆ మహానుభావుడు "తాతాచారి కథలు' 'Popular Telugu Tales' అనే అన్నారు. అంటే ఆయన ఉద్దేశ్యం సాహిత్యం మామూలు మనుషులకు కూడా అర్థం కావాలన్నదే. అందువల్లే ఆయన తాతాచారి చెప్పిన కథలు విని సంతోషించి వాటిని రాయసగాళ్లతో రాయించి, ముద్రించి మనకు అందించారు. 'తాతాచారి కథలు' బంగోరెను ఆకట్టుకున్నాయి. అంతేకాదు, ఆయన సూక్ష్మదృష్టికి వాటి సారళ్యం, సూటిదనమూ, ఇతివృత్తం కూడా కన్నుల పండుగ చేశాయి. పైగా వాటి చారిత్రక స్పృహ కూడా ఆ నిశితమతిని సూదంటురాయిలా తనవైపు లాక్కొంది. ఈ కథల్లోని ఎన్నో విషయాలు ఆయన్ని కలవరపెట్టాయి. విశిష్ట పరిశోధకులైన బంగోరె రచనా వ్యాసంగంలో ఎన్నో విశేష గుణాలున్నాయి. కాని స్థిరత్వం, నిలకడ తక్కువై శాఖాచంక్రమణం చేయడం ఆయనలోని ఒక లోటు ఆయన అంతర్మథనం ఇలా చెప్తుంది – **"నా తీర్పువేరు. నా దృక్పథం వేరు. ఈ కథలు ఒక్కొక్కదాని వెనుక ఉన్న చరిత్ర మూలాలను అన్వేషించు కొంటూ పోవాలనిపించింది. పోయాను. పోయిన కొద్దీ ఇంకా పోవలసిన దూరం చాలా ఉందని అనిపిస్తూ వచ్చింది. నా చేతనైన మేరకు వెళ్ళి ఏదో కొంత గడబిడ చేశాను. అప్పటి గ్రామీణ వ్యవస్థ, వ్యవసాయ వ్యవస్థ పనిచేసే తీరును గురించి కొంత వెలుగును ప్రసరిప జేసే గాథలివి."** (తాతాచార్ల కథలు. ముందుమాటలు– పేజి–14)

బంగోరె పరిశోధన ఆయన చెప్పినట్లు 'ఏదో కొంత గడబిడ' కానే కాదు ఓ అనాదృత విషయం గురించి సాగిన అంతర్మథనమే. ఆయన పరిశోధన 'కొంత వెలుగు' ను మాత్రమే ప్రసరింప చేసేది కానేకాదు; కొండంత వెలుగును వ్యాపింప చేసే పరిశోధన ఆయనది.

సి.పి.బ్రౌను 1855 లో ప్రచురించిన 'తాతాచారి కథలు' గురజాడ అప్పారావు సంపాదకత్వంలో (?) వావిళ్ళ ప్రెస్ ప్రచురించిన 'తాతాచార్యుల కథలు' (1916) బంగోరె సంపాదకత్వంలో ఎమ్. శేషాచలం అండ్ కో 1974లో ముద్రించిన 'తాతాచార్ల కథలు' వీటి స్వభావ స్వరూపాల గురించి తెలుసుకుందాం.

బ్రౌను ప్రచురించిన 'తాతాచారి కథలు' తొలి ముద్రణ (1855) మనకిప్పుడు అలభ్యం. కాని చల్లనిచూపులకు నోచుకున్న రాతప్రతి మాత్రం ఇప్పటికీ చెన్నైలోని మద్రాసు ప్రాచ్యవ్రాతప్రతుల గ్రంథాలయంలో పదిలంగా వుందంటారు బంగోరె. ఆ వ్రాతప్రతుల్లో వున్న లేవంటారాయన. సి.పి. బ్రౌన్ 'తాతాచార్ల కథలు'లోని 10వ కథ 'నిఘంటుపూజ' 19వ కథ 'మతాచార్యులకు కానుక – 'తీరిపోయిన కట్టుబాటు', 20 వ కథ 'కత్తివాడి కలంవాడి' 21 వకథ 'బహువ్రీహి' కథ – ఈ నాలుగూ బ్రౌను 'తాతాచారి కథలు' (1855) లో లేవు. ఆయన తనకు నచ్చని కథల్ని ఇదివొద్దు, సున్న, This is a Poor Story, Too difficult. Not worth printing అని తన అభిప్రాయాన్ని ప్రకటిస్తూ ముద్రించలేదు. ఆయన ప్రకటించిన కథల సూచికనే వావిళ్ళ సంస్థ ఈ విధంగా ప్రకటించింది. 1. ముసలిదాన్ని చంపినకథ 2. నిప్పుతగిలి పిల్లకాయలు చచ్చిన కథ 3. హిమాంజి కాళమనాయుడు ఓడిపోయిన కథ 4. మనిషి యొక్క సద్గతి దుర్గతి తెలిపే కథ 5. చీవర గ్రామణి వుండి చెరిపి, చచ్చి చెరిపిన కథ 6. బండివాడు ఆడమనిషిని చంపదలచిన కథ 7. "అధికాశ మొదలు చెఱుచును" అనడమును గుఱించిన కథ 8. దయ్యమునకు వెరచిన బ్రాహ్మణుని కథ 9. దుగ్గిశెట్టి కొడుకుల కథ 10. దున్నపోతు కథ 11. గ్రామశక్తికి పొంగలి పెట్టిన కథ 12. బ్రాహ్మడికి మాన్యము ఇచ్చిన వాడేనామాలవాడు అనే కథ 13. వాలాజాపేట రాయజీ మసీదు కథ 14. సత్యపురాచార్యుల యేనుగను నవాబు కొడుకు చంపించిన కథ 15.

దేవర మాకుల కథ 16. హలీంఖాన్ మోసపోయిన కథ 17. స్త్రీ చమత్కార కథ 18. "గిరిన్మయూరే" అనే శ్లోకమును గుఱించిన కథ 19. ఏకాదశి తాంబూలపు కథ 20. పొగచుట్టు కథ 21. సంభాషణ సరసము 22. నవాబు రూపాయిల కథ 23. సమయస్ఫూర్తిగా చెప్పిన వాక్యమును గురించిన కథ 24. వెర్రివాండ్ల పట్టీకథ 25. ధర్మానికి క్షౌరము చేసికొన్న కథ

చిల్లర కథలు – కృష్ణమాచార్యులు చెప్పినవి

1. ఉభయులకు జయములని తీర్పును గురించిన కథ

2. గాలివాన

వావిళ్ళవారి ప్రతిలో వున్న తాతాచారి 24 కథలు. కృష్ణమాచార్యులు అనే పండితుడు చెప్పిన రెండు కథలు వెరసి 26 కథలు మనకు 'తాతాచార్యుల కథలు' లో కనపడుతున్నాయి.

సి.పి.బ్రౌను తొలి ముద్రిత ప్రతి 'తాతాచారి కథలు' ను వావిళ్ళవారు యథాతథంగా వేశారా అంటే చెప్పలేం. ఈ ప్రతిలో తెలుగు కథలతో పాటు బ్రౌను ఇంగ్లీషు అనువాదాలు కూడా వున్నాయో లేదో చెప్పడం కష్టం. నాకు ఈ ప్రతిలోని 13వ కథ– 'దేవర మాకుల కథ' వరకే పి.డి.ఎఫ్ ప్రతి దొరికింది. (నాకు ఈ అరుదైన ప్రతిని పంపిన వజ్జల వెంకటరమణ, హైదరాబాదు, ఆయన పేరును సూచించిన డా. శ్రీపెరుంబుదూరు శ్రీరంగాచార్యుల వారికి కృతజ్ఞతలు)

మనకిప్పుడు అందుబాటులో వుండేది (ఇది కూడా దుర్లభమే అనుకోండి) బంగోరె సంపాదకత్వంలో వెలువడ్డ సి.పి. బ్రౌన్ 'తాతాచార్ల కథలు' మాత్రమే. బంగోరె ఈ పుస్తకం గురించి రాసిన భోగట్టా 'ముందుమాటలు' లోని 'వ్రాతప్రతి– ముద్రిత ప్రతి' (పేజీలు: 23-25) అన్న శీర్షిక కింద గుది గుచ్చబడింది. సంపాదకులు **"బ్రౌన్ సంతరించిన తాతాచార్ల కథలకు సంబంధించి ప్రస్తుతానికి వావిళ్ళ పునర్ముద్రణలే శరణ్యం."** అన్నారు. అంటే ఆయన బ్రౌన్ ప్రచురించిన "తాతాచారి కథలు" చూడలేదన్న మాటే కదా?

"అయితే, అసలు మూల వ్రాతప్రతి అదృష్టవశాత్తు మద్రాసు ఓరియంటల్ మేను స్క్రిప్ట్స్ లైబ్రరీలో నేటికీ పదిలంగా ఉంది." (పేజి: 23) అంటే బంగోరె 'తాతాచారి కథలు' వ్రాతప్రతిని చూశారే కాని తొలి ముద్రిత ప్రతి (1855) చూడలేదన్న మాట. బండిగోపాలరెడ్డి గారికి ఈ తొలిముద్రిత కథలు' పుస్తకం మాత్రమే లభ్యమయినందువల్ల దీనికి వ్రాతప్రతికి గల వ్యత్యాసాల్ని ఆయన గమనించిన రీతిలో పరిశీలిద్దాం.

వావిళ్ళ ప్రెస్ వారు ప్రచురించిన 'తాతాచార్యుల కథలు' విషయ సూచిక ప్రకారం ఇలా వున్నాయి.

1. ముసలి దాన్ని చంపిన కథ
2. నిప్పుతగిలి పిల్లకాయలు చచ్చిన కథ
3. పామాంజి కాళను నాయుడు ఓడిపోయిన కథ
4. మనిషి యొక్క సద్గతి దుర్గతి తెలిపే కథ



5. చీవర గ్రామణి వుండి చెరిపి, చచ్చి చెరిపిన కథ
6. బండివాడు ఆడమనిషిని చంపదలచిన కథ
7. "అధికారము మొదలు చెఱచును" అనదమును గుఱించిన కథ
8. దయ్యమునకు వెరిచిన బ్రాహ్మణుని కథ
9. దుగ్గిశెట్టి కొడుకుల కథ
10. దున్నపోతు కథ
11. గ్రామశక్తికి పొంగలి పెట్టిన కథ
12. బ్రాహ్మడికి మాన్యము యిచ్చిన వాడేనా మాలవాడు అనే కథ
13. వాలజాపేట రాయజీ మసీదు కథ
14. సత్య పూర్ణాచార్యుల యేనుగను నవాబు కొడుకు చంపించిన కథ
15. దేవరమాకుల కథ
16. హలీంఖాన్ మోసపోయిన కథ
17. స్త్రీ చమత్కార కథ
18. "గిరిన్మయూరే అనే శ్లోకమును గుఱించిన కథ
19. ఏకాదశి తాంబూలపు కథ
20. పొగచుట్టు కథ
21. నవాబు రూపాయిల కథ
22. సమయస్ఫూర్తిగా చెప్పిన వాక్యమును గురించిన కథ
23. వెర్రివాండ్ల పట్టీ కథ
24. ధర్మానికి క్షౌరము చేసికొన్న సన్యాసి చిల్లర కథలు (కృష్ణమాచార్యులు చెప్పినవి

1. ఉభయులకు జయములని తీర్పును గురించిన కథ

2. గాలివాన ఇప్పుడు మన మొక ముఖ్య విషయం గమనించాలి. ఎంతో పరిశోధన చేస్తేకాని అసలు సంగతి తెలియదు. బ్రౌను దొర ప్రచురించిన 'తాతాచారి కథలు' (1855) పుస్తకాన్నే గురజాడవారు యథాతథంగా వావిళ్ళ రామశాస్త్రులు అండ్ సన్

సంస్థ ద్వారా అచ్చు వేయించారా?సంపాదకులుగా గురజాడ అప్పారావు గారి పేరు ముద్రించి సి. పి. బ్రౌను 'తాతాచారి కథలు' పుస్తకాన్ని 'తాతాచార్యుల కథలు' అనిపేరు ఎందుకు మార్చారు ప్రకాశకులు? బ్రౌను వెలువరించిన 'తాతాచారి కథలు' వావిళ్ళ వారి ప్రతి లోని 'తాతాచార్యుల కథలు' ఒక్కటేనా? 'ఆ వ్రాతప్రతిలో ఉన్న కొన్ని కథలు ముద్రిత ప్రతిలోకి ఎక్కలేదు. బ్రౌను కొన్ని కథల్ని చదివి అవి నచ్చనందువల్ల వాటిని 'తాతాచారి కథలు' ముద్రిత ప్రతిలో చేర్చలేదన్నారు బంగోరె అవి ఏడు కథలని కూడా అన్నారు.

(తాతాచార్ల కథలు – పేజీ: 24, 1974) పైగా **"ఇంత కాలం అముద్రితంగా ఉండి పోయిన ఇందులోని ఏడు కథలు ఇప్పుడు తొలిసారిగా అచ్చవుతున్నాయి."** (పైపేజే) అని సెలవిచ్చారు. బంగోరె అనుబంధం –1 లో పేర్కొన్న ఏడు కథలు ఇవి :

1. వెర్రివాండ్ల పట్టీ 2. పామంజి కాళను నాయుడు ఓడి పోయిన కథ 3. చీవర గ్రామణి వుండి చెరిపి చచ్చీ చెరిపిన కథ 4. అధికాశ మొదలు చెరుచును 5. సమయస్ఫూర్తిగా చెప్పిన వాక్యము 6. ముసలి దాన్ని చంపిన కథ 7. నిప్పు తగిలి పిల్లకాయలు చచ్చిన కథ 8. ధర్మానికి చేసుకున్న క్షవరం (పేజీలు : 211– 219)

తొలిసారిగా ఇప్పుడు అచ్చవుతున్న 'ఏడు కథలు' అంటూ ఎనిమిది కథల్ని అనుబంధం –1 లో ప్రచురించారు. ముద్రిత ప్రతిలో అదనంగా కనబడుతున్న ఎనిమిది చిన్నకథలు స్వల్పమార్పుల కొద్ది వేరేగా (అనుబంధం–1) చేర్చడం జరిగింది. శైలిని బట్టి, ఇతివృత్తాన్ని బట్టి తాతాచార్ల కథలుగానే కన్పడుతున్నా ప్రత్యక్షసాక్ష్యం లేదు గనుక వీటిని అనుబంధంలో చేర్చడమైంది." (తాతాచార్ల కథలు – పేజీ: 24) ఈ ఎనిమిది కథలు వావిళ్ళ ముద్రిత ప్రతిలో (1916) 'అదనంగా కనబడుతున్నా' యన్నారు బంగోరె (పేజి: 24)

కాని ఈ ఎనిమిది కథలూ వావిళ్ళ వారి ప్రతిలో 'విషయ సూచిక'లోనే ప్రధానస్థానాన్ని పొందాయి కదా. అలాంటప్పుడు బంగోరె వీటిని అదనపు కథలని పేర్కొంటూ అనుబంధం –1 లో చేర్చడం న్యాయమంటారా? **"శైలిని బట్టి, ఇతివృత్తాన్ని బట్టి తాతాచార్ల కథలుగానే కనపడ్తున్నా, ప్రత్యక్ష సాక్ష్యం లేదు గనుక వీటిని అనుబంధంలో చేర్చడమైంది."** (పేజీ: 24) అంటా రేమిటి బంగోరె? ప్రత్యక్ష సాక్ష్యం' ఎక్కడి నుంచి తేవాలి?ఎవరి నుంచి తేవాలి?బ్రౌను 1855లో ప్రచురించిన 'తాతాచారి కథలు' మనకు ఇంకా చిక్కలేదు కదా? దుర్లభమైన ఈ పుస్తకం తొలి ముద్రిత ప్రతి మనకు దొరికితే కాని అసలు సంగతి బయటపడదు. పైగా దాన్ని మద్రాసు ప్రాచ్యలిఖిత భండారంలో వున్న వ్రాతప్రతిలో తైపారు వేసి చూడాల్సి వుంటుంది.

వావిళ్ళ వారి ప్రతిలోని కథలతో, బంగోరె ప్రచురించిన తాతాచార్ల కథల్ని కాస్తా పోల్చిచూద్దాం. వావిళ్ళ వారి ప్రతిలోని తొమ్మిదవ "దుగ్గిశెట్టి కొడుకుల కథ' ఇలా మొదలవుతుంది– **"ముప్ఫయి యేండ్ల కిందట నెల్లూరు శీమలో దామర మడుగు అనే గ్రామములో దుగ్గిశెట్టివారు అనే కోమట్లు వుండిరి. వారు నిండా పేదవాండ్ల అయినందున కూలికి వడ్లు దంచుకొని మూటలు మోసుకొని వుప్పు అమ్ముకొని జీవనము చేస్తూ వుండిరి వాండ్లతో ఒక ముసలివాడికి యిద్దరు కొడుకులు. వాండ్లు పెద్దవాండ్లై తండ్రి చేసే కూలిపని తాము చేస్తున్ను తండ్రికి ఒక కష్టము లేక యింట్లోనే వుంచి వుపచారము చేస్తూ వుండగా, పెండారి దండు గుర్రము ఆ దేశము దోచుకోవడము నకు వచ్చినది."** (పేజీ: 22)

ఇక బంగోరె ప్రతిలోని కథా ప్రారంభం ఎలావుందో చూద్దాం. **"దుగ్గిశెట్టి కొడుక్లు' ముప్పై యేండ్ల కిందట నెల్లూరి శీమలో దామరమడ్గు అనే గ్రామములో దుగ్గిశెట్టివారు అనే కోమటి వుండిరి. వారు నిండా పేదవాండ్లు అయినందున కూలికి వడ్లుదంచి మూటలు మోసుకుని వుప్పు అమ్ముకుని జీవనం చేస్తూ వుండిరి. వాండ్లలో వొక ముసలి వాడికి యిద్దరు కొడుకులు వుండిరి. వాండ్లు పెదవాండ్లై తండ్రి చేసే కూలిపని తామూ చేస్తూ తండ్రికి వొక కష్టము లేక యింట్లోనే ఉంచి వుపచారము చేస్తున్నూ వుండగా పెండారి దండు గుర్రము ఆ దేశములో దోచుకోవడమునకు వచ్చినది."** (పేజీ: 32) ఈ రెండు ప్రతుల్లోని కథ భాషను పరిశీలిద్దాం. వావిళ్ళ ప్రతిలో 'దుగ్గిశెట్టి కొడుకుల కథ' అని వుంటే బంగోరె ప్రతిలో దుగ్గిశెట్టి కొడుక్లు' అని వుంది. వావిళ్ళ ప్రతిలో 'దామరమడుగు' అని వుంటే బంగోరె ప్రతిలో 'జీవనము' వుంటే, బంగోరె ప్రతిలో 'జీవనం' అని కనపడుతుంది. బంగోరె ప్రతిలో వాడుక భాష ప్రయోగింపబడి వుంటే, వావిళ్ళ ప్రతికి సంపాదకులుగా గురజాడ అప్పారావు గారని ముఖపత్రం చాటుతుంది. ఈ పుస్తక ప్రచురణకైన ఖర్చంతా గురజాడే భరించి విజయనగర లిటరరీ సొసైటి మూడవ పుష్పంగా వెలువరిస్తే, దాని ముద్రణ బాధ్యత వావిళ్ళ ప్రెస్సు వహించింది. కాని అప్పారావుగారు మరణించిన (1915) ఏడాది తర్వాత ఈ పుస్తకం అచ్చయింది. గురజాడ వారి సంపాదకీయం కాని, ఎలాంటి మాటలు కాని ఈ 'తాతాచార్యుల కథలు' (1916) లో లేనేలేవు. తెలుగు వ్యావహారిక భాషను తలకెత్తుకున్న గురజాడ వారు బ్రౌను 'తాతాచారి కథలు' ను 'తాతాచార్యుల కథలు' అనే పేరుతో గ్రాంథిక భాషా పదాలు చేర్చి ప్రచురించడానికి సిద్ధపడి వుంటారా? శాంతమ్ పాపమ్! వావిళ్ళ వారి ప్రతి 'తాతాచార్యుల కథలు' బ్రౌను ప్రతి 'తాతాచారి కథలు' కు ఎంత సన్నిహితమో తెలుసుకోవాలంటే ఆ రెంటినీ తైపారు వేయక తప్పదు.

సునిశితమైన చూపుగల సి. పి. బ్రౌన్ 'తాతాచారి కథలు' ఎందుకు ప్రచురించి వుంటారో కాస్త పరిశీలిద్దాం. బ్రౌన్ వాడుక తెలుగు భాషలో సజీవత్వాన్ని గమనించారు. అందువల్లే ఆయనకు తెలుగు సాహిత్య సేవలో వ్యావహారిక భాషకు పెద్దపీట లభించింది. 'దుగ్గిశెట్టి కొడుకు' అసలైన సిసలైన వాడుక భాషను తారకాణ. బంగోరె ప్రతి

బ్రౌను ప్రతితికి దగ్గరై వుంటుందని అట్టే పసికట్టవొచ్చు. వావిళ్ళ ప్రతిలో గ్రాంథిక భాషావాసనన్నూ ఇట్టే వూహించవచ్చు. వావిళ్ళ ప్రతినీ, బంగోరె ప్రతినీ పరిశీలించిన తర్వాత మనం బ్రౌను తొలి ప్రతినో లేదా మద్రాసు ప్రాచ్యలిఖిత గ్రంథాలయ ప్రతినో ముకాబిలా చేస్తే తాతాచారి కథల నిజ స్వరూపం గోచరిస్తుంది. 'దుగ్గిశెట్టి కొడుక్కు' కథలో పల్నాడు ప్రాంతం, నెల్లూరు ప్రాంతంలో జరిగిన పిండారీల దాడుల సంగతి ప్రస్తావించబడింది. ఆ బందిపోటులు వూళ్లను దోచుకున్న విధానం తెలుస్తుంది. ప్రాణభయంతో ప్రజలు వూళ్లు వొదిలి వెళ్లడమూ అవగతమవుతుంది. ఒకరో ఇద్దరో ముసలాళ్లు ఇల్లూ వాకిలి వొదలలేక ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని, బతికి బట్టగట్టిన వైనమూ అగపడుతుంది. గడ్డివాములో బిక్కుబిక్కు మంటూ దాక్కున్న దుగ్గిశెట్టి తెలివిగా పిండారి గుర్రం మీద వుంచిన నగల కంట్లాము– అటువైపు ఇటువైపు వేలాడుతున్న సంచుల జత – దీన్ని రాయలసీమలో 'అసిమి' అంటారు. తాళ్లపాక అన్నమయ్య 'అసిమి' పదాన్ని తన సంకీర్తనల్లో చాలా చోట్ల వాడారు.

(దొంగను బావిలో తోసి, పిండారి బేల మొగంతో వెళ్ళిపోయిన తర్వాత ఆ దొంగ సొమ్మును నిదానంగా కొంచెం కొంచెం అమ్మి సుఖపడతాడు. ఇద్దరు కొడుకులూ శ్రీమంతులై బతుకుతారు.) **"యీ సంగతి అతి గూఢమై నప్పటికిన్ని ఆ ప్రాంతమందు వుండే అందరికినీ విశదమై వదంతి పుట్టి వుండెను. ఇది ఆశ్చర్యమైన సమాచారము."** (తాతాచార్ల కథలు– పేజి: 36) ఈ కథ ముగింపు 'అతిరహస్యం బట్టబయలు' అన్న నీతిని చాటుతుందని వేరే చెప్పనక్కర్లేదు. అపాయంలో ఉపాయం చేసి బతుకు జీవుడా అని గండం దాటిన దుగ్గిశెట్టి సమయస్ఫూర్తి, లౌక్యం మనం ఈ కథవల్ల తెలుసుకోగలం, సామాన్యజనుల జీవితానుభవాల పట్లగల ప్రేమ, సమకాలీన సాంఘిక, రాజకీయ చరిత్ర పట్ల గల ఆసక్తి, వాడుక భాషలోని ప్రవాహగుణం, స్వాభావికత, నుడికారం పదును మొదలైనవి బ్రౌను దొరను ఆకట్టుకొన్నాయని చెప్పొచ్చు.

'తాతాచార్ల కథలు' లోని నాలుగవ కథ – 'గుడిని మసీదుగా మార్చిన రాయిజీ' – లో కూడ ఓ నవాబు దగ్గర దివానుగా పనిచేసిన రాయరెడ్డిరావు 'తారాతిగడీ బారా విద్యలు' అన్న సూక్తికి చక్కని ఉదాహరణ. ప్రభుత్వం సొమ్ముతో ఒక నగరినే నిర్మించి, దేవాలయం కట్టిస్తున్న సర్వాధికారి దివాను బ్రాహ్మణ ప్రజ్ఞ ఉపయోగించి, ఆ కొత్తనగరికి వాలాజపేట అనే తన నవాబు పేరు పెట్టి, కట్టిస్తున్న గుడిని మసీదుగా మార్చిన ప్రతిభాశాలి. దొరల దగ్గర పనిచేసే అధికారుల యుక్తికుయుక్తులు, తిమ్మిని బొమ్మి, బొమ్మిని తిమ్మి చేసే అసాధారణమైన ప్రజ్ఞాపాటవాల్ని ఈ కథ చాటుతుంది.

బంగోరె ప్రతిలోని రెండవ కథ – 'ఎవరు ఎవరు' అయితే వావిళ్ళ ప్రతిలోని పన్నెండవ కథ 'బ్రాహ్మడికి మాన్యము యిచ్చిన వాడేనా మాలవాడు అనే కథ వావిళ్ళ ప్రతిలోని కథాశీర్షిక వస్తువును తేటతెల్లం చేస్తే, బంగోరె ప్రతి లోని శీర్షిక పాఠకుల్ని ఆలోచింప చేస్తుంది.

అరవకథ 'నవాబు రూపాయిలు– రాణీముద్రలు' 18–19 శతాబ్దాల నాటి దక్షిణ భారతదేశం లోని నాణ్యాల కథాకమామీషు వెల్లడిస్తుంది. 11వ కథ 'దేవరమాకులు' ఆకాశ మెత్తు పెరిగిన తాటి చెట్ల సంరక్షణను తెలియ చేస్తుంది. ప్రాచీనులు కొన్ని చెట్లను దేవర మాకులని పిలుస్తూ, వాటిని కొలుస్తూ వుండే విశిష్ట సంప్రదాయం ఈ కథవల్ల విశదమవుతుంది.

సి.పి. బ్రౌను 'తాతాచారి కథలు' ను సేకరించి, ప్రచురించడం లోని ఆశయం ఆకాలం నాటి మద్రాసు ప్రెసిడెన్సీ – ముఖ్యంగా తెలుగు ప్రాంతంలోని సామాజిక, రాజకీయ, మత పరిస్థితుల్ని పొందు పరచడమే. అయితే ఈ కథల్ని వినేవాళ్ళు, చదివేవాళ్ళు ఆనందించడంతో పాటు విచక్షణ, వివేకాల్ని పెంపొందించుకొనాలన్నదే.

ఈ 'తాతాచార్ల' కథల భాష పాఠక ప్రపంచాన్ని ఆకట్టుకొంటుంది. ఇది నెల్లూరి ప్రాంతం వాడుక భాషే అయినా కొన్ని పదాలు రాయలసీమ మాండలి కాల్లోనూ కనిపిస్తాయి. జోడుగాండ్లు (పేజి: 34) తలచాటు (పేజి: 93) కూడుదల (పేజి: 132) అనే నెల్లూరు మాండలిలు, దేశదిమ్మరి కాకి (పేజి: 212) అనే నుడికారం ఎంత బాగున్నాయని నాకు ఈ పుస్తకంలో 11 సామెతలు అగపడ్డాయి. మొక్కుబడే లేదంటే వొక్క దాసరికి అయినా పెట్టు (పే. 92) వుడుము పోయినప్పటికి, చెయ్యి వీడి వచ్చినది అన్నట్లు (పేజి: 93) గాదె తీసెటప్పటికి పేదవాడికి ప్రాణం పోయె అన్నట్లు (పేజి: 193) చీవర్గం గ్రామణి వుండీ చెరిచెను చచ్చీ చెరిచెను (పేజి: 214) అనే సామెతలు ఎంత అపురూపమైనవని! ఇవి చాలీలో లేకపోవడం ఎంత బాధాకరమని!

యశోధనుడైన బంగోరె సంపాదకత్వం వహించిన 'తాతాచార్లు కథలు' లో పాదటిప్పణుల్లో చేసిన వ్యాఖ్యలు కుశాగ్రబుద్ధులైన పరిశోధకులకు ఎంత వెలుగు నిస్తాయని!

హైదరాబాదులో పుట్టిన సి. పి. బ్రౌను అకాడమీ 'తాతాచార్ల కథలు' ప్రచురించిందని తెలిసింది. ఘనమైన ఆ సంస్థ అదృశ్యమవ్వడం ఎంత బాధాకరమని!

చెన్నైలోని మద్రాసు ప్రాచ్య లిఖిత గ్రంథ భాండాగారంలో ఓ మూల నక్కివున్న, సి. పి. బ్రౌను సేకరించిన ప్రచురించిన 'తాతాచారి' కథలు వెలికి తీసి, వావిళ్ళ బంగోరె ప్రతులతో మొకాబిలా చేసి చక్కని తాతాచార్ల కథలు వెలువరిస్తే ఎంత బాగుంటుందని!



ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 1 (32) హైదరాబాద్ నవంబర్ : 2023

# పద్యమనోహరం - 46

## గన్నమరాజు గిరిజామనోహర్ బాబు

వరంగల్, ఫోన్ : 994 901 3448

**"రాజై దుష్కృతి జెందె చందురుడు, రారాజై కుబేరుండు దృ
గ్రాజీవంబున గాంచె దు:ఖము, కురుక్ష్మా పాలుడా ఆట చే
యాజింగూలె సమస్త రాజ బంధువులతో, నా రాజ శబ్దంబు ఛీ
ఛీ! జన్మాంతరమందు నొల్లను జుమీ! శ్రీ కాళహస్తీశ్వరా!"**

"రాజులు మత్తులు వారి సేవ నరకప్రాయంబు" అంటూ తన ధిక్కారస్వరాన్ని వినిపించిన ధూర్జటి మహాకవి రచించిన శ్రీకాళహస్తీశ్వర శతకంలోని ఈ పద్యం కూడా రాజులపై ధూర్జటికున్న వైమనస్య భావాన్ని ప్రకటిస్తూ ఉంది. 'రాజు' అనే పేరున్న చంద్రునికి మచ్చ ఉండిపోయింది. రారాజు అని కీర్తింపబడిన కుబేరునికున్న 'మెల్లకన్ను' కారణంగా ఒక దు:ఖం మిగిలిపోయింది. అదేవిధంగా 'రారాజు'గా పేరున్న దుర్యోధనుడు సబాంధవంగా సమర రంగంలో నిహతుడైపోయాడు. అసలు రాజు అనే శబ్దమే 'ఛీ!ఛీ! అని అసహ్యించుకునేదే తప్ప అందులో గొప్పదనం ఏముంది? కనుక "ఓ! కాళహస్తీశ్వరా! రాబోవు జన్మల్లో కూడా ఈ 'రాజ' శబ్దము, 'రాజ' జన్మము రాకుండా చూడు స్వామీ" అంటూ తీవ్రంగా రాచరికాన్ని ధిక్కరించిన ధూర్జటి తన వ్యక్తిత్వాన్ని నిస్సంశయంగా నిరూపించుకున్నాడు.

రాచరిక వ్యవస్థలో జీవిస్తూనే రాజులు మత్తులు అనగలిగిన ధైర్యశాలి ధూర్జటి మహాకవి. పాలకుల పట్ల ప్రజలు ప్రసన్నంగా ఉండాలన్నప్పుడు వారి పరిపాలన ప్రజోపయోగమైన పనులు చేపట్టి సర్వకాల సర్వావస్థలయందు ప్రజా సంక్షేమమే లక్ష్యంగా తమ పాలన సాగిస్తే, ప్రజారంజకునిగా పాలకుడు కీర్తింపబడతాడు. 'రాజు' అనే శబ్దానికే రంజింపజేసేవాడని కదా అర్థం. తన ఏలుబడిలో ప్రజలు రంజిల్లేవిధంగా పాలన కొనసాగించేవాడే నిజమైన 'రాజు'గా గుర్తింపబడతాడు.

మనం ప్రజాస్వామ్యంలో ఉన్నవాళ్ళం గనుక మనం ఎన్నుకున్న నాయకులు తప్పులు చేసినప్పుడు, అహంకారంతో ప్రజల పట్ల చిన్నచూపుతో వ్యవహరించినప్పుడు కవియైన వాడు ప్రజాపక్షపాతియై నిర్భయంగా విమర్శించ వచ్చు. కాని ధూర్జటి జీవించినకాలం రాచరిక వ్యవస్థ ఉండేది. ఆ కాలంలో పాలకుణ్ణి విమర్శించాలన్నప్పుడు కవికి ఎంతో గుండెధైర్యం కావాలి, కవి మిక్కిలి నియమనిష్ఠాపరుడై నిజాయితీతో జీవించగలగాలి. రాజాశ్రయాన్ని ఆశించే లౌల్యం పనికి






రాదు. స్వతంత్ర వ్యక్తిత్వం ఉండాలి. ఇన్ని సల్లక్షణాలున్నవాడే గనుక ధూర్జటి తన కాళహస్తీశ్వర శతకంలో ఐదారు పద్యాలు కేవలం 'రాజు'ను ధిక్కరించే రీతిలోనే రాశాడు.

అధికార మదాంధత రావడానికి ఎక్కువ అవకాశం ఉన్నరోజులు. బహుశ: ఇటువంటి రాజులను ధూర్జటి చూసి కూడా ఉఉండవచ్చు. అందరూ శ్రీకృష్ణదేవరాయల వారి వంటి పాలకులు కాదు కదా! అటువంటి అనుభవంతో ఇటువంటి పద్యాలను కవి తన శతకంలో పొందుపరచి ఉంటాడు. కవులు నిరంకుశులు కదా! ఎవరి అధికారానికీ వాళ్ళు లోబడరు. ఏవీ ఆశించిన వ్యక్తిత్వం కలిగిన ఏ సృజనకారునికీ పాలకులను కీర్తించవలసిన అవసరం ఎప్పటికీ రాదు.

ఈ పద్యంలో చంద్రుణ్ణి, కుబేరుణ్ణి, దుర్యోధనుణ్ణి వర్ణిస్తూ చంద్రుడు చల్లని వెన్నెలలను వెదజల్లేవాడే కాని ఆయనలోని మచ్చ ఎప్పటికీ మాయనిది కదా! ఒకసారి మచ్చపడిన రాజు అప్పటికీ కళంకితుడుగానే నిలిచిపోతాడు. కుబేరుడు అమిత ధనవంతుడు. ఆయన ధనాధిపతి. కాని ఆయనకున్న అవకరం ఎప్పటికీ మారదు. ఏ ధనవంతుడైనా, ఎంతటి ధనవంతుడైనా అవకరాలు కలిగి ఉంటే అది లోపమే తప్ప మరొకటి కాదు. దుర్యోధనుని కథ మనందరికీ తెలిసిందే. అభిమానం దురభిమానమై అహంకారం నిలువెల్ల వ్యాపించి సబాంధవంగా సర్వ నాశనమయ్యే దుర్గతి పట్టింది. ఇది మానవ సమాజానికి కనువిప్పు కావాలి.

శ్రీకాళహస్తీశ్వర శతకంలోని ప్రతి పద్యమూ ఒక రత్నము. మానవునికి ఉండవలసిన ఉన్నత వ్యక్తిత్వాన్ని తెలియజెప్పడంతో బాటు పాలకుల దుర్మార్గాలను కూడా ఎండగట్టిన తీరుతో ధూర్జటి మహాకవి, బమ్మెరపోతన వంటి భావికవులకు కూడా మార్గదర్శకుడయ్యాడు.

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 1 (33) హైదరాబాద్ నవంబర్ : 2023

# ఓటు చైతన్య కవిత్వం

**పి. రాజీవ్ కుమార్,** రీసెర్చ్ స్కాలర్, తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 809 608 7911

ఆధునిక తెలుగు కవులు ఓటు హక్కు ప్రాధాన్యతను గుర్తించారు. యోగ్యులయిన అభ్యర్థులకు మాత్రమే ఓటు వేయాలని తమ కవిత్వం ద్వారా సమాజాన్ని చైతన్యం చేశారు. స్వయంగా ఎన్నికల్లో పోటీచేసిన కవులు కూడా ఉన్నారు. అభ్యర్థి ఏ పార్టీ వాడని కాదు, ఏ పాటివాడో చూడు అని ప్రజలను అప్రమత్తం చేసిన ప్రముఖ కవి కాళోజీ నారాయణ రావు సైతం ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. 1952 లో ఆయన వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటి చేశారు. పీడీఎఫ్ అభ్యర్థి పెండ్యాల రాఘవ రావు కాళోజీపై గెలిచారు. ఎమర్జెన్సీకి నిరసనగా కాళోజీ ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావుపై 1978 లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి మళ్ళీ ఓటమి పాలయ్యారు.

నేరుగా ఎన్నికల్లో పోటీ చేసి గెలవక పోయినా, నామినేటెడ్ పద్ధతిలో చట్ట సభలలోకి ప్రవేశించిన కవులు కూడా ఉన్నారు. గుర్రం జాషువ, బోయి భీమన్న వంటి కవులు ఎమ్మెల్సీలుగా పని చేశారు. సి. నారాయణ రెడ్డి రాజ్యసభ సభ్యునిగా పని చేశారు. ప్రస్తుతం గోరటి వెంకన్న, దేశపతి శ్రీనివాస్ వంటి కవులు చట్ట సభల్లో సభ్యులుగా ఉన్నారు.

ఓటు చైతన్యం మీద కవిత్వం రాసిన వారిలో ముందుగా జాషువా గురించి చెప్పుకోవాలి. జాషువా స్పృశించని వస్తువంటూ లేదు. తెలుగు సాహిత్యంలో ఇంతటి వస్తు వైవిధ్యంతో కవిత్వం రాసిన కవులు అరుదు. ఓటు అనే పేరుతో తొమ్మిది పద్యాలతో కూడిన ఖండికను రాశాడు.

**కూటికి గుడ్డకున్ ప్రజలు, కొంగరవోవుచుండ నీటుగా**
**మోటారు బండ్లపై నగదు మూటలతో కలవారి వోటు బి**
**క్షాటన సాగుచున్నయది జాగ్రత ! దేశనివాసులారా ! మీ**
**యోటులు స్వీయభారత సముజ్వల గాత్రికి సూత్ర బంధముల్**
(పుట :656, జాషువ సర్వలభ్య రచనలు)

60 దశకంలో ఈ పద్యాన్ని రాశాడు. అంటే ఆనాటికే ఓటుకు డబ్బు పంచే దుస్థితికి మన ప్రజాస్వామ్య వ్యవస్థ దిగజారిందని అర్థం చేసుకోవచ్చు. కనీస అవసరాలైన కూడు, గుడ్డ కోసం ప్రజలు వలస వెళుతున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఓట్ల కోసం మోటారు బండ్లపై నగదు మూటలతో తిరిగే స్థితి ఏర్పడినా, ప్రజలు వివేకంతో ఓటు వేస్తే అలాంటి ఓట్లు **"స్వీయ భారత సముజ్వలగాత్రికి సూత్రబంధముల్"** అనే ఆశాభావాన్ని వ్యక్తం చేశాడు.

**ఒక పర్యాయము చేయి జారితిరి మీ వోటుల్ దగా దేశ నా**
**యకులన్నమ్మి, సమస్త కష్టములపాలై దేశ మల్లాడె, వా**




**లకముల్ మారిచి వారు, వారి హితులున్ లాలింపగా వత్తు రిం**
**డ్లకు బండ్లెక్కి, ప్రజాహితార్థులవలెన్ ద్రవ్యంబు వ్యోగించుచున్**
(పుట :656,జాషువ సర్వలభ్య రచనలు)

పొరపాటున ఒకసారి చేయి జారి అయోగ్యులకు ఓటు వేస్తే దగాకోరు నాయకులు అధికారంలోకి వచ్చి, దేశాన్ని సమస్త కష్టాలకు గురిచేస్తారని హెచ్చరిస్తున్నాడు. అభ్యర్థులందరూ ప్రజాహితం కోరే వారిగా మనలని మచ్చిక చేసుకోవడానికి వస్తారు. అందులో నిజాయితీ పరులను గుర్తించాలని ఓటర్లకు కవి సూచిస్తున్నాడు.

ఓటు చైతన్య కవిత్వం విషయంలో జాషువా తర్వాత కాళోజీని పేర్కొనవచ్చు. వయసులో జాషువా కంటే కాళోజీ 20 యేళ్ళు చిన్నవాడు అయినప్పటికీ జాషువా కంటే ముందుగానే ఓటు గురించి రాశాడు. పోలీస్ యాక్షన్ తర్వాత 1949లో స్టేట్ కాంగ్రెస్‌కు జరిగిన సంస్థాగత ఎన్నికల సందర్భంగా రాసిన గేయాన్ని చూద్దాం.

**ఓటిచ్చు అధికార మున్నట్టివారు**
**ఎన్నికల సమయాన తిన్నగా వినుడు**
**మట్టి బానలుకొనిన కొట్టి చూచెదము**
**సరుకుకొన వీధెల్ల తిరిగి చూచెదము**
**పండు పండెనో లేదో పట్టి చూచెదము**
**ఓటు వేయుట పిల్లలాట ఎట్లగును ?**
**అభ్యర్థులై ఓటులడిగేటివారు**
**ఏమేమి జేసిరో ఎటువంటి వారో ?**
**పురుషులెవ్వారు కాపు పురుషులెవ్వారు**
**గుర్తించి ఓటులను గురిపింప వలయు**
**ఓటిచ్చునప్పుడే ఉండాలె బుద్ధి**
**ఎన్నుకొని తలబాదుకొన్న నేమగును ?**
**తర్వాత ఏడ్చినా తప్పదనుభవము.** (పుట : 25, నా గొడవ)

మట్టి కుండను కొనేటపుడు కూడా దానిని చేతితో కొట్టి పరీక్షగా చూస్తాము. మార్కెట్లో ఏ వస్తువును కొన్నా పది రకాలుగా ఆలోచిస్తాము.

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 1  హైదరాబాద్ నవంబర్ : 2023




అలాంటిది మన భవితాన్ని నిర్దేశించే పాలకులను ఎన్నుకునే సందర్భంలో ఎంత జాగ్రతగా నిర్ణయం తీసుకోవాలో కవి సూచిస్తున్నాడు. ఓటు వేసిన తర్వాత బాధపడితే లాభం లేదు, తగని వారికి ఓటు వేస్తే చేదు అనుభవాలు తప్పదంటున్నాడు.

**ఓ ఓటరు కాపన్నా ! / ఎద్దుల తప్పేమీ లేదు**
**కాడి పెట్టుకున్నందుకే / మురిసిపోయి దేవెవోలె**
**ఓట్లు మేపి పంటమాట / మరచి నీవు పస్తుంటివి**
**బలసిరేగి కాడెద్దులు / జంట వీడకుండ మేసి**
**రంకలేస్తూ తిరుగుచుండె / మూడు సార్లు ఓట్లేసి**
**స్వర్గానికి ఉట్టి కట్టి / లొటకలేస్తూ చస్తుంటివి**
**అయ్యో ఖర్మం అంటూ / నెత్తంతా బాదుకుంటూ**
(పుట :89, నా గొడవ )

యజమాని అయిన రైతుకు తన కాడెద్దులను సరిగా ఉపయోగించుకోవడం తెలియాలి. మేత బాగా వేసి పని నేర్పకుంటే అవి రంకెలేస్తూ ఖాళీగా తిరుగుతాయి. గెలిచి పనిచేయకుండా తిరిగే నాయకులను అలాంటి ఎద్దులతో, ఓట్లను మేతతో పోల్చాడు కవి. నిజానికి ప్రజాస్వామ్యంలో ప్రజలే యజమానులు. పాలకులు సేవకులు మాత్రమే. కానీ ప్రజలు ఓటు ద్వారా తమ అధికారాన్ని నాయకులకు బదిలీ చేసి చివరికి దీనుల్లా ప్రజలు మిగిలిపోతున్నారని కవి ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

కాళోజీ 1967 లో **"తస్మాత్ జాగ్రత్త !జాగ్రత్త!!"** అనే శీర్షికతో రాసిన కవిత తెలుగునాట చాలా ప్రాచుర్యం పొందింది. తెలుగు కవిత్వాని అభిమానించే వారు ఈ క్రింది కవితను ఎప్పుడో ఒకసారైన చదవడం గానీ, వినడం గాని చేసి వుంటారు .

**అభ్యర్థి ఏ పార్టీ వాడని కాదు / ఏ పాటి వాడో చూడు**
**ఎన్నుకుంటే వెలగబెట్టడం కాదు / ఇందాక ఏం చేసిండో చూడు**
**ఇప్పుడు కట్టే ముడుపులు కాదు / ఇందాక చెల్లించింది చూడు**
**పెట్టుకునే టోపీ కాదు / పెట్టిన టోపీ చూడు**
**ఎగరేసిన జండా కాదు / చాటున ఆడిన దందా చూడు**
**మనిషిని చూడు, చరిత్ర చూడు**
**నుడువులు కాదు, నడవడి చూడు** (పుట :151, నా గొడవ)

ఈ కవితలో రాజకీయ పార్టీల వైఫల్యాన్ని ఎండగట్టాడు కాళోజి. అన్ని రాజకీయ పార్టీలు ఒకే మూసలో ఉన్నపుడు ఏపార్టీకి ఓటు వేస్తే ఏమి ప్రయోజనం అనే భావం వ్యక్తం అవుతుంది. ఏ రెండు పార్టీలకు మద్యకూడా తేడా లేదు. దాదాపు అన్ని ప్రధాన పార్టీలు ఓట్లకు డబ్బు, మద్యం పంచుతున్నాయి. గెలిచిన తర్వాత వ్యవహరించే తీరులో కూడా తేడా లేదు. పార్టీలకు సిద్ధాంతాలు లేవు. గాంధీజీ చెప్పిన ఏడు మహాపాపాలలో సిద్ధాంతాలు లేని రాజకీయాలు మొదటిది. సిద్ధాంతాలను రాద్ధాంతాలుగా అభివర్ణిస్తున్న కాలం ఇది. ఎవరు ఎప్పుడు ఏ పార్టీలో ఉంటారో చెప్పలేం. అలాంటప్పుడు పార్టీలను పక్కన పెట్టి, అభ్యర్థుల నిజాయితీ, చరిత్ర, సామర్థ్యం మొదలైన వాటిని పరిగణలోకి తీసుకొని ఓటు వేయాలని కవి భావన.

ఆరుద్ర కూనలమ్మ పదాలలో కూడా ఓటు హక్కు ప్రస్తావన ఉంది.

**బ్రూటున కేసిన ఓటు**
**బురదలో గిరవాటు**
**కడకు తెచ్చును చేటు**
**ఓ కూనలమ్మ !** (కూనలమ్మ పదాలు )

బ్రూటు అంటే క్రూరమైన వాడు అని అర్థం. మరి క్రూర స్వభావం కలిగిన రౌడీలు, గూండాలు రాజకీయాల్లోకి ఎందుకు వస్తున్నారు? ఎన్నికల్లో ఎందుకు పోటీ చేస్తున్నారు?. ప్రజాసేవకు మార్గంగా ఉండాల్సిన రాజకీయం వ్యాపారంగా మారింది కాబట్టి. సామాన్యులు రాజకీయాల్లోకి వచ్చే పరిస్థితి లేదు. కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి గెలడం, గెలిచాక అంతకు పదిరెట్లు దోచుకోవడం ఇది ప్రస్తుత రాజకీయ ముఖచిత్రం. అందుకే అలాంటి 'బ్రూటు'లకు ఓటు వేయొద్దని ఆరుద్ర చెబుతున్నాడు. ఒకవేళ వేస్తే అది బురదలో వేసినట్లే తుదకు వేసిన వారికే ప్రమాదంగా పరిణమిస్తుందని హెచ్చరిస్తున్నాడు.

తెలుగులో మినీ కవిత్వాన్ని వ్యాప్తిలోకి తెచ్చిన వారిలో ముఖ్యుడైన రావి రంగారావు కూడా ఓటు హక్కు వినియోగం మీద చాలా కవితలు రాశాడు. కేవలం మినీ కవితలే కాక రావి శతకం వంటి వాటిలో పద్యాలు కూడా రాశాడు.

**నమ్మకమ్ము నిలుపు నాయకులున్నచో /ఓటు నమ్ముకోరు నోటు కొరకు** (పద్యం :12, రావి శతకం )

**పాయసమ్ము వంటిది ప్రజాస్వామ్యమందు /గుండుసూదులు ప్రజాలమ్ముకొన్న ఓట్లు** (పద్యం:107,వింటివా ఏడు కొండల వెంకటేశ శతకం)

**దినము దినముకు ఓట్లమ్ముకుడెడివారు/పెరుగుచుండగ అవినీతి పేరుగుచుండె** (పద్యం:109, వింటివా ఏడు కొండల వెంకటేశ శతకం)

పైన పేర్కొన్నవి రావి రంగారావు ఓటు మీద రాసిన కొన్ని పద్యపాదాలు. అనేక మినీ కవితలు కూడా రాశాడు

**1. ఓటు / నోటు**
**వాటేసుకుంటే / పుట్టేది**
**రాక్షస బిడ్డే** (రావి కిరణాలు )

**2. ఓటు / పెద్ద గునపమైతే**
**ఎంత బాగుంటుందో**
**అవినీతి గుండెల్లో** (వెలుతురు వేళ్ళు)

**3. వినాయకుడి లాంటి ఓటర్లను**
**ఎంతో విలువైన దేవుళ్ళను / ఆర్భాటమైన భక్తితో**
**నైవేద్యాలు పెట్టీ పెట్టీ / పండగ రోజులు పోగానే**
**హుస్సేన్ సాగర్ లో ముంచుతారు** (ఎన్నికల చెణుకులు)

**4. సీటు జనరల్ అయితే నేనే / మహిళలకైతే మా ఆవిడ**
**దళితులకైతే మా పాలేరు / మైనారిటీలైతే మా డ్రైవర్**
**కలకాలం అధికారం నాదే !**
**కార్యకర్తలకు బూడిదే!** (ఎన్నికల చెణుకులు)

**5. నీ చేతిలో ఓటు / జాగ్రత్తగా వాడితే**
**పొలం దున్నే హలం / కళ్ళు మూసుకొని వేస్తే**
**భవిష్యత్తును బలిగొనే**
**విషపూరిత కరవాలం !** (ఎన్నికల చెణుకులు)

ఇట్లా ఎవరికైనా సులభంగా అర్థం అయ్యే రీతిలో చాలా మినీ కవితలు వచ్చాయి.

ఆధునిక కాలంలో ప్రజల్లోకి బలంగా చొచ్చుకుపోయిన సాహిత్య ప్రక్రియ పాట. తెలుగునాట పాట అంటే ముందుగా గుర్తొచ్చే పేరు గద్దర్. చాలా కాలం పాటు గద్దర్ విప్లవోద్యమంతో ఉన్నాడు. బయటికి వచ్చాక ఆయన ఓటు హక్కు కోసం ఎన్నికలసంఘానికి దరఖాస్తు చేసుకొని 2018 లో ఓటు హక్కును పొందాడు. అదే సంవత్సరం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మొదటి సారిగా ఓటు హక్కును వినియోగించుకున్నాడు. ఓటు పై పాటలు కూడా రాశాడు.

**రాజకీయ బానిసలారా .... ఈ రాజీ బ్రతుకులు వద్దురా.**
**ఒకే మనిషికొక ఓటురా....నోటుకు బలిపెట్టొద్దుర**
**వెల కట్టలేనిదీ ఓటురా .... నీ బ్రతుకును మార్చే తూటరా**
**ఇది బాటరా .... బాబా సాహెబ్ మాటరా**

జయరాజు రాసిన వానమ్మ పాట బాణీకి సమీపంలో ఉండే విధంగా **"ఓటమ్మ...ఓటమ్మ నిన్ను ఎవరికేసి వస్తినమ్మో ఓటమ్మ"** అనే పాటను కూడా రాశాడు. ప్రజా వాగ్గేయకారుడు గోరటి వెంకన్న **"ఓటేడ నేనేస్తిరన్న.... నా ఓటు, దానోటు నా పెండ్లామే గుద్దే .... ఓటేడ నేనేస్తిరన్న"** అనే అద్భుతమై పాటను రాశాడు.

ఇట్లా ఎందరో తెలుగు కవులు ఓటు హక్కు ప్రాధాన్యతను తెలుపుతూ రాశారు.



కాల్పనిక వస్తువును ఎంచుకొని రాయడం సులభం. మానవ సంబంధాలు , వారి మధ్య ఉండే సున్నిత భావోద్వేగాల మీద కూడా కవిత్వం పండించవచ్చు. కానీ ఆధునిక జీవితంలో అన్నీ ఆంగ్ల పదాలు వచ్చి చేరాయి. ఓటు కూడ ఇంగ్లీష్ పదమే. వర్తమాన కాలంలో ఏ సాంఘిక వస్తువును ఎంచుకున్న ఇంగ్లీషు పదాలతో ముడిపడి ఉంటుంది. మధ్య మధ్యలో కొరకరాని కొయ్యల్లా ఉండే ఆంగ్ల పదాలను అనువైన రీతిలో వేస్తూ ఆకర్షణీయంగా రాయడం ప్రతిభావంతమైన కవులకే సాధ్యం. సామాజిక బాధ్యతతో అలాంటి కవిత్వాన్ని నిలబెడుతున్న కవులకు నమస్కారం.

ఆధార గ్రంథాలు :

1. జాషువ సర్వ లభ్యరచనలు (మనసు ఫౌండేషన్ ప్రచురణ)

2. నారాయణ రావు, కాళోజి. నా గొడవ, హైదరాబాద్ : కాళోజీ ఫౌండేషన్, 2016.

3. రంగారావు, రావి. రావి కిరణాలు. గుంటూరు : రావి రంగా రావు సాహిత్య పీఠం, 2017.

4. రంగారావు, రావి. వింటివా ఏడుకొండల వెంకటేశ శతకం. మచిలీపట్నం: సాహితీ మిత్రులు ,2012.

5. రంగారావు, రవి. ఎన్నికల చెణుకులు. గుంటూరు : రావి రంగా రావు సాహిత్య పీటం, 2008.

6. గద్దర్ ఇంటర్వ్యూ, (TV5 ప్రసారం)

7. https://www.scribd.com.



# దేశం ఉండేదట

మహేష్ వేల్పుల, తొండ తిరుమలగిరి, సూర్యాపేట.
ఫోన్ : 995 187 9504

నక్షత్రాలు పొడిచే ఆకాశాన్ని నేనిక చూస్తానా ?
రాకెట్ లాంఛర్లు చీల్చని కలలను ముద్దాడుతానా ?

భూమి భయపడుతోంది
గుక్క పట్టి గుక్కపట్టి రక్తాన్ని కారుస్తోంది
శిథిల చరిత్రను
రాయాలని నీకెంత ఇష్టమో కదా !!

అదిమిపట్టి ఏడుస్తున్న శబ్దం
నీకు రాగమెలా అవుతోంది ??

అవిసిపోయిన గుండెలపై
బలవంతపు సంతకం ఎలా పెట్టాలనిపిస్తోంది ??

ఇప్పుడు నీకొక లోకం కావాలి అంతేగా !!
సమాధులను అందంగా కట్టి
నిశ్శబ్దాన్ని ఏలే లోకం కావాలి అంతేగా !!
రా !! రా !!

మధ్యధరా సముద్రమంతా రక్తం తో నిండింది
తోడుకొని బలమైన కోటలు కట్టుకో !!..

బుల్లెట్లు నాటి శవాల పంటను తీస్తున్న నీకు
పెట్టుబడి దారీ సామ్రాజ్యవాద
మందులు ఎంత దిగుబడిని ఇస్తున్నాయో కదా !!
మద్దతు ధర ఎంత గరిష్టమో కదా !!
మీలో ఎవరైనా ఒక్కరైనా
నా చిరునామాను భద్రపరుస్తారా !?

వాడు తెల్లని ఫాస్ఫరస్ చల్లకముందే
అంటుకున్న ఈ మట్టిలో దయచేసి ఖననం చేయండి
పాలకు ఏడుస్తున్న నా బిడ్డ పొట్టను రక్తంతో నింపలేను
ప్రజల కోసమే యుద్ధమంటే నమ్మలేను...

(పాలస్తీనా – ఇజ్రాయిల్ యుద్ధం.. సామాన్య పౌరుల తరపున)









ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 1  UGC Care List Approved Journal
హైదరాబాద్ నవంబర్ : 2023

# పునరుత్పత్తి రాజకీయాలను చిత్రించిన మొట్టమొదటి కథకురాలు 'ఓల్గా'

**ప్రొఫెసర్ కిన్నెర శ్రీదేవి,** తెలుగుశాఖ, ద్రవిడ విశ్వవిద్యాలయం, ఫోన్ : 9441404080

మహిళాసంఘాలు, స్త్రీవాదులు పునరుత్పత్తి, రాజకీయ రంగాలలో లేవనెత్తిన అనేక ప్రశ్నలను ఓల్గా **"భిన్నసందర్భాలు"** కథాసంపుటిలో చర్చించారు. శ్రమ విభజన, లైంగికతను నిర్వచించడంలో ఉండే రాజకీయఅంశాలను నిర్దిష్టమైన జీవన సందర్భాల లోంచి ఓల్గా విశ్లేషించారు. పునరుత్పత్తిలో ప్రధానపాత్ర వహిస్తున్నది స్త్రీలే అయినప్పటికీ, అందులో స్త్రీలకు ఎటువంటి స్వేచ్ఛలేదు. ఈ స్వేచ్ఛారాహిత్య స్థితిని ప్రశ్నించటమే కాక, స్త్రీలు పిల్లల్ని కనే యంత్రాలుగా మార్చబడుతున్న విధానాలను చిత్రించారు. భారతీయ వివాహ వ్యవస్థలో స్త్రీకి ఎటువంటి స్వతంత్రత లేదు. స్త్రీల లైంగిక అవసరాలతో సమాజానికెటువంటి పనిలేదు. స్త్రీలచేత అన్ని రంగాలలో పురుషులకు సేవలు చేయించటమే దాని లక్ష్యం. అటువంటి వివాహవ్యవస్థలో వుండే అసమంజసత్వాన్ని, దాన్ని రూపొందించి నడుపుతున్న పురుషస్వామ్యాన్ని ఓల్గా 'భిన్నసందర్భాలు' కథలు నిలదీసి ప్రశ్నించటమే కాక చర్చలకు ఆహ్వానిస్తాయి.

"భిన్నసందర్భాలు" కథాసంపుటిలోని కథలు స్త్రీల లైంగికత్వం, (Sexuality) స్త్రీల పునరుత్పత్తి రాజకీయాల వెనుకవున్న పితృస్వామిక స్వభావాన్ని ఆవిష్కరిస్తాయి. లైంగిక సంబంధాలలో వుండే 'భిన్నసందర్భాలు' విభిన్న అనుభవాలలోని అసమాన అధికార రాజకీయాలను, వాటి స్వభావాన్ని నొక్కి చెబుతాయి. ఆత్మీయమైన, వ్యక్తిగతమైన సంబంధాలలో కూడా రాజ్యం పోషించే పాత్రను, దాని రాజకీయ స్వభావాన్ని పునరుత్పత్తి హక్కుల నేపథ్యంలో ఈసంపుటం లోని కథలు చర్చిస్తాయి. **"వ్యక్తిగతం కూడా రాజకీయమే"** అన్న స్త్రీవాద ఉద్యమ నినాదంలోని అర్థమేమిటో ఈ కథలద్వారా అవగాహనలోకి వస్తుంది.

ఓల్గా లైంగికత్వాన్ని ప్రధాన రాజకీయ ప్రశ్నగా లేవనెత్తి దానికి సంబంధించిన విషయాలను ఇక్కడ ప్రస్తావించారు. పిల్లలు కనకుండా గర్భనియంత్రణ సాధనాలను వాడటానికి, గర్భస్రావం చేయించుకునే హక్కుకోసం, వివాహంతో ప్రమేయంలేకుండా తల్లులయ్యే స్వేచ్ఛ కోసం 'భిన్నసందర్భాలు' కథలోని సుభద్ర, శాంతి పాత్రలు సంఘర్షిస్తాయి.

భారతీయ సమాజంలో స్త్రీల లైంగికక్రియ వివాహం వలన మాత్రమే కుదురుతుందనీ, వివాహానికి వెలుపలగల లైంగిక సంబంధాలన్నీ అక్రమ సంబంధాలుగానే చూడబడుతున్నాయి. అలాగే లైంగిక సుఖావసరం స్త్రీలకంతగా ముఖ్యంకాదని కూడా నమ్మించారు. ఆ భావజాలంలోంచే స్త్రీలశరీరాన్ని వివాహం, సంతానం కోసం మాత్రమే ఉపయోగపడే పరికరాలుగా తయారుచేసే వ్యవస్థగా మన వైవాహికవ్యవస్థ స్థిరీకరించబడింది. అలా స్థిరీకరించబడిన వ్యవస్థ లోని అసమంజసత్వాన్నినిలదీస్తాయి. పితృస్వామ్య వ్యవస్థ నిర్ధారించిన క్రమంలోకాక విద్యావంతులైన స్త్రీల ఆలోచనలలో వ్యక్తీకరించబడిన భిన్నమైన, ప్రత్యేకమైన వ్యక్తిత్వాలను, స్త్రీలకు పునరుత్పత్తి హక్కుల పట్లగల భిన్నమైన ఆలోచనలను సమర్థవంతంగా ఈ కథాసంకలనం లో ప్రతిపాదించడం జరిగింది.

స్త్రీ గర్భం ధరించడం, ధరించకపోవడం అనే అంశాలు స్త్రీల చేతుల్లో లేవన్న నిజాన్ని ఎత్తిచూపిన కథ 'భిన్నసందర్భాలు'. "స్త్రీ గర్భం ధరించడం" అనే విషయం ఒకటే అయినా, భిన్నసందర్భాలలో అంటే పెళ్ళికి పూర్వం గర్భం ధరించడానికి, పెళ్ళి తర్వాత గర్భం ధరించడానికి ఇలా రెండు వేరువేరు సందర్భాలలో స్త్రీలు ఎదుర్కొంటున్న సంఘర్షణలను ఈ కథలో రచయిత చర్చకు పెట్టారు.




'భిన్నసందర్భాలు' కథలో సుభద్ర, శాంతి, లీల ప్రధాన పాత్రలు. ప్రపంచ స్త్రీల ఉద్యమంలో ప్రధానంగా చర్చనీయాంశమైన పునరుత్పత్తి స్వేచ్ఛ గురించి ప్రశ్నలు లేవనెత్తిన పాత్ర శాంతి. చురుకుదనం, తెలివితేటలు, ప్రగతిశీల భావాలు కలిగిన యువతి ఈమె. ''పెళ్ళి'' అంటే స్పష్టమైన అభిప్రాయం ఈమెకు వుంది. శాంతికి పెళ్ళంటే యిష్టంలేదు. మొగుడికి చాకిరీ చేసి, అతని చెప్పుచేతల్లో వుండటం నా ఒంటికి సరిపడదు అంటుంది. రెండవ పాత్ర సుభద్ర. ఈమె సంప్రదాయ చట్రంలో వుంటూనే చిన్నతనంలో ఏర్పడిన భయం వలన పిల్లల్ని కనటం తన కిష్టంలేదని వ్యతిరేకిస్తుంది. ఇక మూడవ పాత్ర లీల. ఈమె సుభద్ర చెల్లెలు. సుభద్ర, లీల ఇద్దరికి ఎలాంటి ప్రజా సంఘాలతో పరిచయం లేదు. వీరు సంప్రదాయ కుటుంబ నేపథ్యం నుండి వచ్చారు. కానీ సుభద్రకు ఎదురైన పరిస్థితులే వారిలో స్త్రీఅస్తిత్వ స్పృహను కలిగిస్తాయి. ఇంకా స్పష్టంగా

చెప్పాలంటే, లీల పాత్రకు స్పష్టమైన అభిప్రాయాలు గానీ, ఖచ్చితంగా ఇలాగే వుండాలన్న స్పృహగానీ లేదు. అందరి అభిప్రాయాలను వింటూ పాత కొత్త భావాల సంఘర్షణలో కొట్టుమిట్టాడే పాత్ర. అందుకే ఆమె ఇలా అంటుంది. తనకు మతి పోగొట్టటానికే సుభద్ర అక్కయ్యగా పుట్టిందనీ శాంతి ఫ్రెండయ్యిందనీ వ్యాఖ్యానిస్తుంది.

**'దానికి పెళ్ళి కావాలి గానీ పిల్లలొద్దు. నీకు పిల్లలు కావాలిగానీ పెళ్ళివద్దు. మీరు ఏమవుతారోనని నాకు చెడ్డభయంగా వుందే.... అందరిలాగా మామూలుగా వుండండి'** అని అడుగుతుంది. శాంతి మాత్రం ఆమె భయాన్ని ఏమాత్రం పట్టించుకోకుండా మేమవుతాం? నీకెందుకు టెన్షన్? నేను పెళ్ళి చేసుకోకుండా పిల్లల్ని కంటాను. మీ అక్క పెళ్ళి చేసుకొన్నా కూడా పిల్లల్ని కనదు అంతేగదా, అని చాలా సాధారణంగా తీసుకొంటుంది. అలా అంటుందే కానీ ఆ మాటలు వాళ్ళ జీవితంలో అత్యంత సంక్షోభానికి ప్రధాన కారణమవుతాయి.

స్త్రీల లైంగికత్వాన్ని, నిర్వచించడంలో స్త్రీల పునరుత్పత్తి హక్కులు ప్రధానమైనవి. పిల్లల్ని కనాలా? వద్దా? అనే విషయంలో స్త్రీలకు స్వయం నిర్ణయాధికారం లేనంతకాలం స్త్రీలు స్వతంత్రులు కాలేరు. ఇంటి చాకిరి, పిల్లల పెంపకంలోకి బలవంతంగా నెట్టబడ్డంతకాలం స్త్రీలు పురుషులతో సమానులు కాలేరు. అందుకే జండర్ సమతౌల్య (gender equity) సమాజానికి ఉత్పత్తి మీద శ్రామికుల కంట్రోలు మాత్రమే సరిపోదనీ, సంతానోత్పత్తిలో కూడా ప్రజాతంత్ర విధానం వుండాలని, **"పునరుత్పత్తి ప్రజాస్వామ్యాన్ని"** (Democracy in Reproductivity) ఈ రోజు స్త్రీవాదులు డిమాండ్ చేస్తున్నారు. ఇంతవరకు స్త్రీలు తమకు ఇష్టమై పిల్లల్ని కంటున్నారా లేక పిల్లల్ని కనాలి అనే నిర్దేశిత నియంత్రణ వారి పైన వుంది కాబట్టి పిల్లల్ని కంటున్నారా? అన్న ప్రశ్నకు స్పష్టమైన అవగాహన ఏర్పరచే సాహిత్యం మనకింతవరకు నిర్దిష్టంగా రాలేదు. కొంతవరకు చలం, కొ.కు. ఈ సమస్యలపై అపుడపుడు కొంత కామెంట్స్ రూపంలో కొన్ని వాక్యాలు రాసినా వాటిపై చర్చకూడా జరగలేదు. అయితే స్త్రీవాద ఉద్యమం తెలుగు సాహిత్యాన్ని ప్రభావితం చేసిన క్రమంలో స్త్రీవాదులు ముందుకు తెచ్చిన పునరుత్పత్తి హక్కుల అజెండాను తన కథలలో ముఖ్యంగా "భిన్న సందర్భాలు" కథా సంకలనంలోని సగం కథలు చర్చించాయి.

ఇంతకాలం స్త్రీల జీవితాలను శాసిస్తున్న పితృస్వామ్య వ్యవస్థ స్త్రీల శరీరాల చుట్టూ ఎంత కాల్పనిక సాహిత్యాన్ని విరజిమ్మినా, స్త్రీ శరీరావయవాలకు సంబంధించిన స్పృహను కలిగించడంలో మాత్రం పూర్తిగా విఫలమైంది. ఆడవాళ్ళు ఎంత అమాయకంగా వుంటే, పితృస్వామ్య వ్యవస్థ ఉనికి అంత స్థిరంగా వుంటుంది. అందుకే స్త్రీల శరీరాలను వారికి పరాయిగా చేసిన తీరును రచయిత సుభద్ర, ఛాయల మధ్య జరిగిన సంభాషణల్లో ఓల్గా స్పష్టం చేశారు.

**"అసలివన్నీ మనకు తెలిసే అవకాశం వుండాలి ఎలా వుంటుంది?, ఉండే వుంటాయి. మనకు తెలియదు. మొన్నొక పుస్తకం చూశా అందులో ఈ విషయం వుంటుందనిపించింది గానీ షాపులో ఆ పుస్తకం తిరిగేయాలన్నా, కొనాలన్నా, చచ్చే మొహమాటంగా అనిపించింది... యేంటే యివన్నీ నిషిద్ధ విషయాలలాగా వుంటాయంటుంది"** సుభద్ర పెళ్ళిగాని ఆడపిల్లలకివన్నీ అనవసరం అనీ, వాటిని తెలుసుకున్న వాళ్ళు మంచివాళ్ళు కాదనీ, పెళ్ళయ్యాక వాటంతటవే తెలుస్తాయి. కాబట్టి ఈ విషయాలు ఆడవాళ్ళకి అక్కర్లేదనుకుంటారని ఛాయ అంటుంది. పునరుత్పత్తిలో అమలయ్యే గుప్తతపట్ల, అమ్మాయిలకున్న భయాలను, సందేహాలను పెంచే అంశాలపట్ల తన అసహనాన్ని ప్రదర్శిస్తుంది.

ఎంతోమంది స్త్రీలు గర్భధారణ గురించి ఏమి తెలియకుండా వాళ్ళ, ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండానే తల్లులవటం ఒక ఎత్తైతే, పిల్లల్ని ఎప్పుడు కనాలి, ఎందర్ని కనాలి, ఎలా పెంచాలి? అన్న విషయాలు నిర్ణయించేది పురుషాధిపత్య సమాజమే. చాకిరి చేసేది మాత్రం స్త్రీలేనన్న గమనాన్ని ఓల్గా ఈ కథలో ఒక చర్చలాగా పునరుత్పత్తి అంశాలపట్ల చైతన్యాన్ని కలిగిస్తారు. అది కూడా ఒంటెత్తు పోకడగా కాక సమస్య రెండు ముఖాలను విభిన్న అభిప్రాయాలు కలిగిన రెండు పాత్రలను సృజించి, అందించడం ద్వారా పాఠకులకు పూర్తి అవగాహన కలుగుతుంది.

ఇక ఈ పునరుత్పత్తి అంశానికి అత్యంత దగ్గరగా చర్చించాల్సిన అంశం అత్యాచారం. ఇది కేవలం బలవంతపు లైంగిక క్రియ మాత్రమే కాదు. స్త్రీని ఒక వ్యక్తిగా, మనిషిగా పురుషుడు గుర్తింప నిరాకరించే చర్య. ఆడవాళ్ళు ఆడవాళ్ళుగా పుట్టినందుకు సమాజం వేసే శిక్ష. (ఒక మనిషిని హీనపరచి, హేయంగా చూసి, నువ్వు ఆడదానివి అని చెప్పటానికి మగవాళ్ళు చేసే దౌర్జన్యం. ఆడవాళ్ళను అదుపులో వుంచటానికి, తమ కోర్కెలు తీర్చే సాధనంగా మార్చటానికి చేసుకునే ప్రయత్నం.) ఇది ఒక వ్యక్తి తనకిష్టమైన మరోవ్యక్తి మీద దౌర్జన్యం చేసే చర్యేకాదు. అధికారంలో వున్న వ్యక్తి మరో వ్యక్తిని అణచివేసే రాజకీయ చర్య. భార్యను సొంత ఆస్తిగా చూస్తూ తన ఆస్తిని తాను అనుభవించటంలో మరొకరి ప్రమేయం అక్కర్లేదనే అవగాహన పురుషస్వామ్య సమాజం పురుషులకిచ్చింది. అత్యాచారం విషయంలో భార్యయినా, మరొకరైనా వారి ఇష్టానికి వ్యతిరేకంగా జరిపే అణచివేత చర్యగా అత్యాచారాలను స్త్రీవాదులు గుర్తించినారు. ఈ క్రమంలో వాసులాంటి వాళ్ళు స్త్రీలు పిల్లల్ని కనకపోవటం అనేది పురుషాధిపత్య సమాజం నిర్ధారించిన కట్టుబాట్లను ధిక్కరించటంగానే చూస్తారు. అందుకే సుభద్ర భర్త వాసు ఆమె పిల్లల్ని కనకపోవటాన్ని **"పిచ్చిపనిగా, పనికిమాలిన పనిగా, పొగరెక్కి చేసిన పనిగా"** వర్ణిస్తాడు.

"భిన్న సందర్భాలు" కథ పునరుత్పత్తిలో భాగమైన మాతృత్వం చుట్టూ అల్లబడిన అందమైన భావజాలాన్నే స్త్రీలకు సమాజం చూపిస్తుంది. కానీ ఆ మాతృత్వాన్ని సాధించ డంలో వాళ్ళు పడుతున్న

శ్రమ, భయం మాత్రం చర్చలోకి రాకపోవటంలోని పురుష రాజకీయాల్ని మనం కొంచెం లోతుగానే గమనించాలి. స్త్రీలను తయారు చేయడంలో వున్న శ్రద్ధ, శిక్షణ స్త్రీల శ్రమను అర్థం చేసుకోవటంలోగానీ, వారి భయాలను పోగట్టే ప్రయత్నంలోగానీ ఈ సమాజం ఎక్కడ విఫల మౌతుందో ఓల్గా ఈ కథలో బట్టబయలు చేశారు.

శాంతి పెళ్ళి అనే తంతులేకుండా తను ప్రేమించిన కిషోర్‌తో బిడ్డను కనాలనుకుంటుంది. పెళ్ళి కుదరదని ఖచ్చితంగా తెలిసీ, కిషోర్ తో సంబంధంలోకి వెళ్ళటం, బిడ్డను కనాలనుకోవటం ఇవన్నీ మామూలుగా స్త్రీల జీవితాలలో జరిగే విషయం కాదు. అట్లని శాంతి ఖచ్చితంగా **“పెళ్ళేచేసుకోను. పెళ్ళిచేసుకోకుండానే బిడ్డను కంటాను”** అని కూడా నిర్ణయించుకొని ప్రవర్తించిన పాత్రకాదు. యాదృచ్ఛికంగా జరిగిన సంఘటనలు, వాటి పర్యవసానాలను, స్త్రీల జీవితంలోని అధికార సంబంధాల వాస్తవికతను అర్థంచేసుకోటానికి లైంగిక విషయాలలో ఒక్క పితృస్వామ్య దృష్టితోనో లేదా వర్గ దృష్టితో మాత్రమే చూస్తే సరిపోదు. వర్తమాన సమాజంలో ఏ ఆధిపత్యాన్నైనా సరే విశ్లేషించటానికి రెండూ అవసరమే అన్న వాస్తవం ఈ కథలో అటు సుభద్ర పాత్ర ద్వారా, ఇటు శాంతి పాత్ర ద్వారా రచయిత వ్యక్తం చేసారు.

శాంతి తండ్రి రంగనాథం శాంతి ఆలోచనలకు, అభిప్రాయాలకు ఏమాత్రం అడ్డుతగలడు. ఆయన తనతరంలో కుటుంబ వ్యవస్థ ఏర్పరచిన భావజాలానికి విరుద్ధంగా శాంతి కిషోర్ విషయం చెప్పినపుడుగానీ అతను రహస్యజీవితంలోకి వెళ్ళడంవల్ల పెళ్ళి చేసుకొని అందర్లా బ్రతకడం సాధ్యంకాదని చెప్పినప్పుడుగానీ ఒక్కక్షణం నివ్వెర పోయినా శాంతి అభిప్రాయాన్ని గౌరవిస్తాడు. అందుకు కేవలం శాంతి వ్యక్తిత్వం, సంస్కారం పట్ల అతనికి వున్న నమ్మకం. ఆ నమ్మకం వల్లనే శాంతి తల్లి జానకమ్మ ఆలోచనా పరిధిలో ఏమాత్రం అభ్యుదయ భావాలకు అవకాశం లేకపోయినా శాంతి నెలసరి కాకపోవడం పట్ల అనుమానం వున్నా, శాంతి ప్రవర్తనపై వున్న నమ్మకంతో ఆమెను అడగలేకపోతుంది. కనీసం జానకమ్మ అనుమానించే సాహసం చేయలేక పోతుంది. సంఘం ఏర్పరచిన కట్టుబాట్లకు భయపడి శాంతి తీసుకున్న నిర్ణయం పట్ల ఎంత నమ్మకం, సానుభూతి వున్నా కూడా జానకమ్మ ఆమె నిర్ణయాన్ని సడలించే ప్రయత్నంచేసి విఫలమవుతుంది. వివాహతంతు లేకుండానే బిడ్డను కనాలనే తన కోరిక సమాజ ఆమోదానికి వ్యతిరేకంగా వున్నప్పటికీ తన పునరుత్పత్తి హక్కును శాంతి కాపాడుకో గలుగుతుంది.

సుభద్ర ఇష్టానికి వ్యతిరేకంగా ఆమె భర్త వాసు బిడ్డల కోసం జరిపే అత్యాచారాలను తట్టుకోలేక, అతని హింస నుంచి బయట పడుతుంది. సుభద్ర తన చెల్లెలికి ఉత్తరం రాస్తూ ఇలా అంటుంది **“ఎదకాని ఆవు – తల్లి కావాలనే కోర్కె కలగని రుతువులో ఆవు అట్లా దొరికిపోదు. మనుషులకు కానీ ఆంబోతులకు కానీ మగవాళ్ళు**



**తమ పెంపుడు జంతువుల గర్భధారణ కోసం యేర్పాట్లు చేసినట్లు, తమకోసం కూడా యేర్పాటు చేసుకొని”,** పెళ్ళిని కనిపెట్టారని వ్యాఖ్యానిస్తుంది.

వివాహితుడైన పురుషుడు కోరుకున్నంత కాలం భార్య తల్లి కావటానికి సిద్ధంగా వుండాల్సిందే. పునరుత్పత్తిలో పురుషుడి అధికారం ఏ స్థాయిలో కొనసాగుతుందో తెలియజేస్తాయి. ఎలిజిబెత్ ఫిషర్ చెప్పినట్లు పురుషులు పశువుల పెంపకం మీద సంతానోత్పత్తిలో తాము నిర్వహించాల్సిన పాత్ర గురించి నేర్చుకున్నారు. పశువులను బలవంతంగా జత చెయ్యటం నుంచి, పురుషులకు స్త్రీలను బలాత్కరించవచ్చుననే ఆలోచన వచ్చింది. పశువుల పెంపకంలో వున్న మొరటుదనం, కర్కశత్వం, హింస యివి పురుషుల వ్యవస్థీకృతమైన లైంగిక దురాక్రమణకు దారితీశాయని భావించే విశ్లేషణల నేపథ్యంలోంచే సుభద్ర చాలా లోతుగా స్త్రీలను సంతానోత్పత్తి సాధనంగా ఏర్పరచిన చారిత్రక క్రమాన్ని, తనపైన జరిగిన లైంగికదాడి అనుభవంలోంచి చూడగలుగుతుంది. స్త్రీల అణిచివేత రాజకీయాలకుగల మూలాలపట్ల ఓల్గాకుగల అవగాహన సుభద్ర, శాంతి, పాత్రచిత్రణలో చాలా స్పష్టంగా తెలుస్తుంది.

**‘పెళ్లైన ఆడది పిల్లల్ని కని తీరాలి’** అనే శాసనం ఆడదాని భద్రతకే కల్పించబడి నట్లుగా పురుష సమాజం చిత్రించింది. స్త్రీలే తన తోటిస్త్రీలకు బోధించే స్థాయిలో స్త్రీల మెదళ్ళకు శిక్షణనిచ్చి పునరుత్పత్తి రాజకీయాలు స్త్రీలను పాలించాయి. అసౌకర్యంగా, తప్పనిసరిగా కనిపెంచాల్సిన భారం స్త్రీలపై పెట్టడం, యువతులకు గర్భనియంత్రణ గురించి సరైన సమాచారం యివ్వక పోవటం లాంటి అంశాలు స్త్రీల మీద మాతృత్వం బలవంతంగా రుద్దబడిన చర్యగా అర్థమవుతోంది. అందుబాటులో వున్నబవోరల్ పిల్స్ గానీ, కాపర్ టీలాంటి గర్భ నిరోధక సాధనాలు చాలావరకు సరిగా పనిచేయనివిగా, ఖరీదైనవిగా, ఒక్కొక్కసారి ప్రమాదకరమైనవిగా కూడా వుంటున్నాయి. పితృస్వామ్యం గర్భస్రావానికి పరిమితులు విధించి చాలాసార్లు గర్భస్రావం చేసుకునే అవకాశాన్ని పూర్తిగా నిరాకరించి, అదే సమయంలో స్త్రీలను లైంగిక సంబంధాలలోకి తప్పనిసరిగా వెళ్ళేలాగా తీవ్రమైన ఒత్తిడిని వారిపై కలుగజేస్తున్నది.

మాతృత్వ భావజాలం స్త్రీల అణచివేతకుగల పునాదుల్లో ఒకటి. దీని ద్వారానే పితృస్వామ్యాన్ని స్థిరపరచటం సాధ్యమవుతుంది. సునంద తండ్రి, సునంద భర్త నరేంద్ర, అతని తల్లి, మిగిలిన బంధువులు అందరిలో పాతుకుపోయిన పితృస్వామిక స్వభావాన్ని చిత్రించటం ద్వారా పునరుత్పత్తిలోని వ్యక్తిగత రాజకీయదృక్కోణాన్ని ఓల్గా నిరూపించే ప్రయత్నం చేశారు.

పశువులకంటే హీనంగా స్త్రీలను పోల్చడం, స్త్రీలపై జరుపుతున్న అణచివేతకు, హింసాస్వరూపాన్ని అర్థంచేయించడానికి రచయిత తీసుకున్న 'భిన్న సందర్భాలలోని కథావస్తువు ఓల్గాగారి అభివ్యక్తి గాఢతకు నిదర్శనం. సుభద్ర తాను తల్లినయ్యే అవకాశాన్ని అబార్షన్ ద్వారా రద్దు చేసుకుంటే, శాంతి అబార్షన్ను వ్యతిరేకించి పెళ్ళి కాకపోయినా తల్లి కావాలనుకుంటుంది. తల్లికావటంలో శాంతి భావుకత్వానికి లోనైతే, సుభద్ర భయానికి లోనయ్యింది. ఏమైనప్పటికి, సుభద్ర, శాంతి ఇద్దరు కూడా తమ అభీష్టాలు నెరవేర్చుకోవడంలో కొంత వ్యతిరేకతకు, సంఘర్షణకు లోనయినా తాము వాంఛించినట్లు గానే నడచుకున్నారు. వ్యక్తులుగా తమ భావస్వాతంత్ర్యాన్ని తాముగా ఒక హక్కుగా పొందటానికి పోరాటమార్గాన్ని ఎంచుకున్న మహిళాసంఘాల ద్వారానే తమస్వేచ్ఛను నిలబెట్టు కోవాల్సివచ్చింది. సుభద్ర, శాంతి ఈ రెండు పాత్రల సృష్టిలో రచయిత తాను చెప్పదలచు కున్న అంశాన్ని కొంత భావుకత్వం చోటుచేసుకున్నా ఖచ్చితంగా చెప్పే ప్రయత్నం చేశారు. ప్రయత్నిస్తే తమ పునరుత్పత్తి హక్కుల్ని స్త్రీలు కొంత ఘర్షణ ద్వారానైనా సాధించు కోవచ్చనే అభిప్రాయాన్ని "భిన్న సందర్భాలు" కథలో సందేశాత్మకంగా ఓల్గా సూచించారు.

ఈ కథ కొంత సుధీర్ఘంగా సాగినా, పునరుత్పత్తి హక్కుల్ని పొందడానికి వాళ్ళిద్దరూ చేసిన జీవన పోరాటంతో తమ హక్కుల్ని ఎలా సాధించారో చెప్పటానికి ఆ పాత్రల స్వభావాలను, చైతన్యాన్ని చిత్రించే క్రమంలో కొంతవరకు సుదీర్ఘత కూడా అనివార్యమే అనిపిస్తుంది.

సుభద్ర, శాంతి పాత్రల సృష్టిలో రచయిత శ్రద్ధకూడా వ్యక్తమవుతుంది. ఎందుకంటే, స్త్రీవాద ఉద్యమ చైతన్యానికి పూర్వం స్త్రీల పునరుత్పత్తి హక్కుల కోసం పోరాడే స్త్రీలసంఖ్య నిష్పత్తిరీత్యా చాలా తక్కువ. అలాంటప్పుడు సుభద్ర, శాంతి మామూలు విషయాలకోసం ఎందుకు అంత పోరాడాల్సి వచ్చింది. అసలు అంత చైతన్యం ఆ పాత్రలకు ఉందా? అన్న సందేహం రాకుండా శాంతి, సుభద్ర, ఛాయ, లీల, రాజేశ్వరి, లెక్చరర్ రాధాకృష్ణలతో కూడిన వాళ్ళ కళాశాల జీవితాన్ని కూడా చిత్రించాల్సి వచ్చింది. అధ్యాపకులు, కాలేజీ కమిటీ ఏకగ్రీవంగా అమ్మాయిల నాటకాలను నిషేధిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని పట్టుదలతో సాధించగలిగారు. తమ అభీష్టాన్ని వారికి నివేదించడానికి వాళ్ళు జరుపుకున్న సమావేశాలలోని వేడివేడి చర్చలు, అమ్మాయిలంతా కలసికట్టుగావుండి తీసుకున్న నిర్ణయాలు మొదలైన సన్నివేశాలను చిత్రించడంద్వారా సుభద్ర, శాంతి పాత్రలచిత్రణ వాస్తవానికి దగ్గరగా రూపకల్పన చేయటంవల్లనే సాధ్యమైంది.

అలాగే స్త్రీల జీవితాలను లైంగికతను, పునరుత్పత్తిని కంట్రోలు చేసే క్రమంలో స్త్రీల జీవితం ఎంత హింసాపూరితంగా వుంటుందో ఆవిష్కరించే కథే "హింస". పద్దెనిమిదేళ్ళ సుగుణ పెళ్ళైన రెండు సంవత్సరాల వరకూ గర్భం ధరించకపోవడంతో అత్త మహాలక్ష్మమ్మ తో మాటలు పడుతుంది. సుగుణ గర్భధారణ సమయంలో **'వల్లల్ ఎడీమా'** అనే భయంకరమైన వ్యాధికి గురవుతుంది. ఈ వ్యాధి లక్షణం పొత్తికడుపు వాచిపోయి, యోని దగ్గరా, తొడల దగ్గరా నీరు చేరుతుంది. పొత్తికడుపులో చేరిన నీరును సిరంజి ద్వారా తీసివేయక పోతే భయంకరమైన బాధ, అలాతీయటం కూడా స్పృహతప్పేంత బాధే. ఈ హింసనంతా భరిస్తూ బిడ్డకు జన్మనివ్వాలనుకుంటుంది సుగుణ. 20 రోజుల కొకసారి ఈ హింసనంతా భరించాల్సి రావడం ఎంతో నరకయాతనగా వుంటుంది. సుగుణ ఈ బాధనంతా భరిస్తూ కూడా, తన ప్రాణానికి, కడుపులో బిడ్డ ప్రాణానికి ముప్పని తెలిసినా కూడా ఆ హింసనంతా భరిస్తూంటుంది. పునరుత్పత్తి క్రమంలో స్త్రీలు గురయ్యే ఇలాంటి బాధలను రచయిత కళ్ళకు కట్టినట్లుగా వర్ణించారు.

ప్రాణాన్ని లెక్కచెయ్యకుండా, దుర్భరమైన బాధను భరిస్తూ సుగుణ లాంటి స్త్రీలు ఎందుకిలా మొండిగా వున్నారన్న ప్రశ్న పాఠకుల్ని వెంటాడుతుంది. ఆ మొండితనానికి కారణం ఆదర్శీకరించబడిన 'మాతృత్వభావన'వల్లే. తల్లికాకపోతే తన జన్మే వృథా అనుకునేంత బలమైన భావజాలాన్ని ఆమె చుట్టూవున్న సమాజం క్షణక్షణం గుర్తుచేస్తుంటుంది. అందుకే సుగుణలాంటి స్త్రీలు తల్లికాలేనపుడు ఆడది చచ్చినా బతికినా ఒకటే అనుకుంటుంది. బిడ్డను కనడంలో చచ్చిపోయినా ఫరవాలేదనుకుంటుంది. అవమానాలు పొందడం కంటే, ప్రాణం పోవడమే మేలని బలంగా నమ్ముతుంది. మాతృత్వ భావనలు సమాజంలో ఎంత లోతుగా పాతుకు పోయాయో సుగుణ బలవన్మరణానికి సైతం సిద్ధపడటంలోనే తెలుస్తోంది.

స్త్రీలను నడిచే గర్భసంచులుగా చూసినంతకాలం, స్త్రీలు మాతృత్వం చాటున దాగిన ఈ హింసనంతా భరిస్తూనే వుంటారు. పురుషులు స్త్రీలనలా చూడటమే కాదు, ఆడవాళ్ళు కూడా తమను తాము అట్లా చూసే వాతావరణం, భావజాలం సమాజంలో బలంగా వేర్లూనుకొనేట్లు చేశారు. అలాకాని పక్షంలో స్త్రీలు అంత పెద్ద హింసను, దానికి అనుగుణంగా చేసే త్యాగాలకు సైతం సిద్ధపడే ఉద్వేగం స్త్రీలు చూపరు. పునరుత్పత్తి క్రమంలో ఎదురయ్యే వేదనకు స్త్రీలను సిద్ధం చేయడానికి పితృస్వామ్య సంస్కృతి మోసపూరితమైన భాషను, మాతృత్వాన్ని ఉదాత్తపరిచే పదజాలాన్ని సిద్ధం చేసుకున్న క్రమం ఈ కథలో ఆవిష్కరించబడింది.

స్త్రీలు పునరుత్పత్తిలో ఎదురయ్యే హింసకు అలవాటు పడిపోయారు.

ఎందుకింత హింసపడాలని ఆలోచించరు. పైగా అది తమ స్త్రీత్వ నిరూపణ అనుకొంటారు. హింసకు స్త్రీలను ఆమోదించేట్లు చేయటం, అలవాటు చేయటంతో హింసకు ఎక్కడలేని బలం వస్తుంది. కొన్నిరోజులు తర్వాత, ప్రశ్నించబడని ఈ హింసే మామూలు వ్యవహారంగా అంటే, సహజసిద్ధమైనదిగా ఆచరణయోగ్యతను పొందుతుందనే అవగాహన బలంగా ఈ కథలో వ్యక్తమవుతుంది.

పురుషులు స్త్రీల సంతానోత్పత్తి శక్తినికూడా కంట్రోలు చేస్తారు. చాలా సమాజాల్లో స్త్రీలకు ఎంతమంది పిల్లలను కనాలి. గర్భనిరోధక సాధనాలు వాడొచ్చా? వాడకూడదా? గర్భాన్ని తీయించుకోవాలా? వద్దా? మొదలైన విషయాలు నిర్ణయించుకొనే స్వేచ్ఛ వుండదు. వ్యక్తులుగా పురుషులు విధించే కంట్రోలుతోపాటు పురుషాధిపత్య సంస్థలైన మతం, రాజ్యం కూడా స్త్రీల సంతానోత్పత్తి శక్తిపై ఆంక్షలు విధిస్తాయి. ఇది సంస్థాగతమైన కంట్రోలు. ఉదాహరణకు 'స్త్రీపురుషులు గర్భనిరోధ పద్ధతులు వుపయోగిస్తే ఏ పద్ధతులు వుపయోగించాలి. పిల్లలు వద్దనుకున్నపుడు స్త్రీలు గర్భస్రావం చేయించుకోవచ్చా' అనే విషయాలపై, ఎలాంటి అవగాహన స్త్రీలకు ఏర్పరచకుండానే ప్రభుత్వాలు కుటుంబ నియంత్రణ పద్ధతులను అమలుచేస్తుంటాయి. అలా అమలు చేయడంలో స్త్రీల శరీరాలను పరాయీకరణకు గురిచేస్తున్న వైనాన్ని "పురిటినొప్పులు" కథ తెలుపుతుంది.

పితృస్వామ్య సమాజంలో కుటుంబ నియంత్రణ కార్యక్రమాల ద్వారా స్త్రీల సంతానోత్పత్తి శక్తిని కంట్రోలు చేయాలని ప్రయత్నిస్తోంది. దేశంలో ఎంత జనాభా వుండవచ్చో రాజ్యం నిర్ణయించి దాని ప్రకారం పిల్లల్ని కనటానికో, కనకుండా ఉండటానికో స్త్రీలను ప్రోత్సహిస్తుంది. భారతదేశంలో గర్భనియంత్రణ కార్యక్రమాల్ని ఉధృతంగా అమలు చేసి కుటుంబం సైజుని పరిమితం చేస్తుంది. ప్రభుత్వం విధించే ఈ ఆంక్షల వల్ల స్త్రీల శరీరాలు ప్రయోగశాలల కంటే అధ్వాన్నంగా మారుతున్న స్థితిగతులు వైద్య పరిజ్ఞానం లేని ఆడవాళ్ళకు అర్థం కాదుగానీ, వైద్య వృత్తిలో వున్న డా.వనజకు మాత్రం బాగా అర్థమయింది. **"జనాభా తగ్గించండి అనే కేకలేగాని ఆడవాళ్ళ ఆరోగ్యం గురించి యెవరికీ శ్రద్ధలేదు"** అని ఆమె తనలో తాననుకునే మాటల్లో రాజ్యస్వభావం వ్యక్తమవుతుంది.

రాజ్యం తన కుటుంబ నియంత్రణ కార్యక్రమాల ద్వారా స్త్రీల సంతానోత్పత్తి శక్తిని కంట్రోలు చేయటంలో భాగంగా స్త్రీలపై అన్ని పథకాలను అమలు చేస్తుంది. తప్పు, ఇద్దరూ సంతానోత్పత్తిలో భాగమైనపుడు స్త్రీలపైనే తన నియంత్రణ పద్ధతులను, ఆధిపత్యాన్ని కొనసాగించడంలో పురుషకేంద్రక దృష్టి వ్యక్తమవుతుంది. ఎందుకంటే, ఈ దృష్టివలన ఎదురయ్యే భౌతిక, మానసిక హింసను స్త్రీలు మాత్రమే భరించాల్సి వచ్చినపుడు, పురుషుడు బయటపడగలుగుతున్నాడు. ఈ వైఖరి మారనంతకాలం రాజ్యం స్త్రీల శరీరాలను ఇంతకు ముందు



చెప్పుకున్నట్లుగా ఒక ప్రయోగశాలగానే మిగిలిస్తుంది. ఇలా కుటుంబ నియంత్రణ పేరుతో అమలవుతున్న పునరుత్పత్తి రాజకీయాలను **"పురుటినొప్పులు"** కథలో ఓల్గా బహిర్గతం చేయగలిగారు.

మైనర్ బాలికలు అత్యాచారాలకు గురైన ఫలితంగా గర్భవతులవుతున్నారు. పునరుత్పత్తి క్రమంలో ఆ పసివాళ్ళు ఎదుర్కొంటున్న హింసకు మరొక సజీవ సాక్ష్యం **"మొదటి చావు"** కథ. మైనర్ బాలికలపై జరిగే అత్యాచారం వలన వాళ్ళు పడే శారీరక, మానసిక సంవేదనలను ఈకథ తెలియజేసింది. అమ్మాయిలు అత్యాచారానికి గురవడమే ఒక హింసైతే, పర్యవసానంగా 'అబార్షన్' రూపంలో, ఎదురయ్యే హింసను అనుభవించడంలో ఆ పసివాళ్ళు పలుమార్లు చావుకు దగ్గరగా వెళుతున్నారన్న నగ్నసత్యాన్ని ఈ కథలో ఓల్గా ఆవిష్కరించారు.

దళిత పేద వర్గాల స్త్రీలు పేదరికంతో పాటు పురుషాహంకారమనే అదనపు హింసకు గురవుతున్నారు. అనుక్షణం ఆడపిల్లల్ని 'మగపశువులకు' బలివ్వలేక, కష్టమో సుఖమో కట్టుకున్నవాడే చూసుకుంటాడన్న ఉదాసీనభావంతో తల్లులు ఆలోచిస్తూ వుంటారు. నన్నొక సందేహం నిరంతరం పీడిస్తుండేది. తల్లిదండ్రులు ఆడపిల్లలకు చిన్నప్పుడే పెళ్ళిళ్ళు ఎందుకు చేస్తారో అని ఆలోచించేదాన్ని. ఈ సందేహాలకు గల మూలకారణాల్ని ఈ కథ పరోక్షంగా చెప్పినట్లయింది. పనుల కోసం వెళ్ళే ఆడపిల్లలు పనిచేసేచోట ఎన్ని రకాలుగా అత్యాచారాలకు గురికావలసివస్తుందో, వాటన్నింటిని శ్రామిక తల్లులు తప్పించలేరు. పని వెసులుబాటు లేకపోవడంవల్లే చిన్నారి ఇందిర లాంటి శ్రామిక బాలికలు అనునిత్యం చావుకు దగ్గరవుతారన్న వాస్తవాన్ని ఓల్గా ఈ కథలో సంకేతించారు.

బిడ్డల పెంపకంలో లైంగికత్వం విషయంలో తమకే తెలియని విషయాలు తమ బిడ్డలకేవిధంగా చెప్పాలో తెలియనితనం చదువుకున్న స్త్రీల కంటే చదువుకోని స్త్రీలకు మరింత అయోమయానికి గురిచేస్తుంది. చదువుకొన్న స్త్రీలు కూడా వృక్షశాస్త్రమో, జీవశాస్త్రమో,

ఆర్థిక శాస్త్రమో, చరిత్రో, పాఠాలుగా, చదువుకుంటారే గానీ, తమ శరీరాలకు సంబంధించిన పూర్తి జ్ఞానాన్ని వారికి మనసమాజం అందుబాటులో ఉంచదు. స్త్రీల ఉద్యమాలు అందించిన సిఫారసుల మేరకు పాఠ్యపుస్తకాలలోకి పునరుత్పత్తి పాఠాలు ఎక్కినా, వాటిని బోధించే అధ్యాపకులు ఆవిషయాలను ఉచ్చరించడానికి సిగ్గుపడుతూనో లేదా కొంతమంది పురుష అధ్యాపకులు అత్యుత్సాహంగానో చెప్పడం వలన అమ్మాయిలు వాటికి సంబంధించిన జ్ఞానాన్ని పొందడంలో సఫలీకృతులు కావడంలేదు.

అందుకే "మొదటి చాపు" కథలోని పన్నెండేళ్ళ ఇందిర తన శరీరంలో జరుగుతున్న మార్పుల్ని చూసి తల్లి కలవరపడితే, **"నేనేం సిన్నపిల్లనా! పెద్దయిన గదా! నాగురించి నువ్వెందుకు బుగుల్ పడ్తున్నవ్"** అని అడుగుతుంది. అందుకు ఆమె తల్లి **"నువ్వు సిన్న పిల్లవైతే నేనెందుకు బుగులు పడ్తానే పెద్దనయినవనే నా పరేశాని"** అంటుంది. అడవిలో క్రూరమృగాల బారిన పడకుండా ఎలా తప్పించుకోవాలో అలాగే జనారణ్యాలలో సైతం మగవాళ్ళ బారిన పడకుండా స్త్రీలు, పిల్లలు భయపడుతూ బ్రతకడంలో వున్న హింసరూపం ఎంత బలీయమైందో ఆ తల్లీకూతుళ్ళ మాటల్లో అర్థమవుతుంది.

తమకు లేని జ్ఞానాన్ని తమ బిడ్డలకు అందించలేని అసహాయత, అజ్ఞానం వాళ్ళలో ఉక్రోషాన్ని పెంచుతుంది. ఆ తెలియనితనాన్ని కప్పిపుచ్చుకొనేందుకు పిల్లల్ని విసుక్కోవడంలోనూ, వాళ్ళడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక చేయి చేసుకోవడంలో తమ అసహనాన్ని ప్రదర్శిస్తుంటారు. అసలు ఆడపిల్లగా పుట్టడం, పెరగడమే నేరమనేట్లుగా ప్రవర్తిస్తున్న తల్లులను అర్థం చేసుకోలేని నిస్సహాయ బాలికలు తమకెదురయ్యే లైంగిక దాడుల పట్ల సరైన అవగాహన లేక సమస్యలను ఎదుర్కొనే సమయంలో తమ ప్రాణాలు కోల్పేయేంత ప్రమాద స్థితికి గురవుతున్నారని ఈకథలో రచయిత వ్యక్తీకరించారు.

మూసీ
సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక
మూసీ మాస పత్రిక సభ్యులుగా చేరండి
వెంటనే శాశ్వత చందాదారులు కండి.
సాహిత్య రంగంలో వెలువడుతున్న ఒకే ఒక
పరిశోధనాత్మక వ్యాసాల మాస పత్రిక
యూజీసీ కేర్ లిస్ట్‌లో చేరిన తెలుగు పరిశోధనా పత్రిక
శాశ్వత సభ్యత్వం (10 సం॥లు)... 2500/-
సంప్రదించండి. మూసీ మాసపత్రిక... ఫోన్ : 934 7971177

**'విముక్తి'** కథ కూడా మైనర్ బాలికలపై జరిగే లైంగిక దాడి వలన గర్భం ధరించి ప్రాణాలు కోల్పోయిన అనాథ బాలిక కథ. ఈనాటికి కూడా చిన్నపిల్లల మీద జరిగే అమానుషమైన, రాక్షసమైన లైంగిక దాడులు జరుగుతున్న సందర్భంలోనే మనమున్నాం. ఎంతోమంది అమ్మాయిలు తమ బాల్యంలో ఇలాంటి సంఘటనలను ఎదుర్కొలేక దాడి జరిపిన వారిపై పెద్దవాళ్ళకు చెప్పి వాళ్ళచేతకూడా చీవాట్లు తినే ధైర్యంలేక మౌనంగా భరిస్తున్న వైనాన్ని ఈ కథ తెలియజేస్తుంది. వాళ్ళ మూగరోదనల్ని నిస్సహాయతను ఈ కథలో ఏమి చేయలేని ఒక అసహాయస్థితిని చిత్రించడం జరిగింది. చిన్నప్పుడు జరిగిన లైంగికదాడి ఒక డాక్టరుగా ఎదిగినా, ఇందిర లోపలి గాయం యెప్పుడూ రేగుతూ వుండటం వల్ల తన భర్తతో లైంగికంగా దగ్గర కాలేక ఫ్రిజిడిటికి లోనవుతుంది. పేషంట్‌గా వచ్చిన చిన్నపిల్లకూడా ఆమెలాగే బాల్యం నుండి అత్యాచారాలకు గురవుతూనే వుంటుంది. లైంగికదాడి ఆమెకు అలవాటయిపోయింది. స్త్రీలు జీవితకాలమంతా ఇలాంటి గాయాలు అట్లా నిరంతరం రక్తం స్రవించడాన్ని అలవాటుగా చేసుకుంటూనే వున్నారు. సుందర స్వప్నాలు కనాల్సిన వయసులో భయంకరమైన రాక్షసరతికి బలౌతూ **"చిన్నాయన్ల నుండీ, సమీప బంధువుల నుండీ, వార్డన్లనుండీ తప్పించుకోలేకపోతున్నారు. కనీసం బహిర్భూమికి పోయే చోట, పనులుచేసే చోట కాపుకాసే పెద్దపులుల పంజాల నుండీ విముక్తి"** లభించేది వారికి చావుతోనే అని డా.ఇందిర ఉదాసీన వైఖరిని ప్రకటిస్తుంది. అలా ప్రకటించడంలో ఎంతోమంది నిరుపేద స్త్రీల నిస్సహాయత దాగివుందని ఈకథలో నిరూపితమవుతుంది.

ఒక **'రాజకీయకథ'**లో ఉత్పత్తి, పునరుత్పత్తి సంబంధిత రాజకీయాల్ని బహిర్గతం చేయటం ఈ కథలో మరింత కీలకాంశం. మధుసూదన్ తను పనిచేస్తున్న ఫ్యాక్టరీలో ప్రమాదం జరిగి చేతివేళ్ళు పోగొట్టుకుంటాడు. ఆ సందర్భంలో తన తోటి వర్కర్స్ అందరూ అతనికి సంఘీభావం ప్రకటించడం, ఆర్థిక సహాయం చేయటమేకాక అతనికి అండగా యూనియన్ ఉందని గొప్ప భరోసా ఇస్తారు. ఈ సందర్భంలోనే మధుసూదన్ భార్య గర్భవతి అవుతుంది. బిడ్డ గర్భసంచిలో కాకుండా, గర్భసంచికి ముందుండే ట్యూబులో పెరిగి, అండం విచ్ఛిత్తి జరిగి ఆమె పొత్తి కడుపంతా రక్తం మడుగై పోతుంది. ఆమెకు ఆపరేషన్ చేసిన డాక్టర్లు ఇక ఆమెకు పిల్లలు పుట్టే వీలులేదని ప్రకటిస్తారు. అంటే, ఆమెలో పునరుత్పత్తి చేసే శక్తిలేదని నిర్ధారిస్తారు. ఈ సంఘటన జరిగిన తరువాత ఆమె పట్ల కుటుంబంలోని వ్యక్తుల వైఖరి పూర్తిగా మారిపోతుంది.

**"ఎవర్ని ఉద్ధరించడానికి? మోడల్లే వాడికి పడి ఏడవటానికి కాకపోతే, ఎందుకు బతికినట్టు ఎంత పాడు బతుకైపోయింది. బిడ్డ నెత్తుకునే అదృష్టం లేకపోయె"** అని ఆమె అత్త అంటుంది. సూటిపోటి మాటలతో ఆమెకు నరకం చూపించడమే కాక కొడుకుకు రెండోపెళ్ళి

చేయడానికి ప్రయత్నిస్తుంది. ఇరుగుపొరుగు ఆడవాళ్ళు కూడా అత్త వాదనకు మద్దతిస్తారు. ఆడవాళ్ళందరూ ఒకటిగా ఎందుకులేరు? తల్లులుగా, భార్యలుగా, కూతుళ్ళుగా, అత్తలుగా, కోడళ్ళుగా, ఆడ బిడ్డలుగా ఎందుకు విడిపోయారు. **"ఎవరు విడగొట్టారు? దాంపత్యం పేరిట, మాతృత్వం పేరిట ఎందుకింత మోసం చేస్తున్నారు? ఈ మోసం ఎవరికే లాభాలను ఆర్జించి పెడుతుంది."** అనే విషయాలకు సమాధానాలు అన్వేషించి, వాటిని మొత్తం స్త్రీజాతికి తెలియజెప్పాలి అన్న ఓల్గా తపన ఈకథలో కనబడుతుంది. ఈ ఓల్గాకు ఆడవాళ్ళందర్ని సంఘటితం చేయటంలో తన జీవిత గమ్యం ఉందని ఆమె నిర్ణయించు కుంటుంది. ఈ నిర్ణయానికి రావటంలో కొంత నాటకీయత ఉన్నప్పటికీ తెలుగు కథాసాహిత్యంలో కార్మికుడి ఉత్పత్తి చరిత్రకు ధీటుగా, స్త్రీ పునరుత్పత్తి చరిత్రను చర్చకు పెట్టడం. అదికూడా చాలా సాధికారికంగా ఆ విషయాన్ని కథలో చర్చకు పెట్టడం, మొట్టమొదటిసారి.

అలాగే, పునరుత్పత్తి క్రమంలో, స్త్రీల కుండాల్సిన హక్కుల్ని మరింత సాధికారికంగా ముందుకు తెచ్చిన కథ 'కేసు'. ఈ కథలో రమ్య అనే వివాహిత స్త్రీ, ఉద్యోగిని. ఆమె పిల్లల్ని కనటం వ్యక్తిగత విషయం కాదని, దానితో ప్రభుత్వానికి ప్రత్యక్ష సంబంధం ఉందని, వాదిస్తూ కోర్టుకెళుతుంది. స్త్రీలు మౌలిక ప్రశ్నలు వేసినపుడు కొంత అభ్యుదయకరంగా ఉన్న వ్యక్తులు, సంస్థలు కూడా వాళ్ళతో గొంతు కలపటానికి జంకుతాయని కొన్ని సందర్భాలలో వ్యతిరేకిస్తాయని కూడా ఈ కథలో ఓల్గా సోదాహరణంగా రుజువుచేస్తారు. ఈ కథలో రమ్య వేసిన ప్రశ్న ఏమంటే, మనం సమాజంలో భాగం కాబట్టి మనం చేసే పనులకూ, సమాజానికీ సంబంధం ఉంటుంది. నేను పిల్లాణ్ణి కన్నాను అంటే, ఆ పిల్లాడు నా ఒక్క దానికేనా? మనింట్లో ఆవు కాదుగదా ఆ పిల్లాడు. మన పెరట్లోని జామచెట్టు కాదుగదా ఆ పిల్లాడు. వాడు పెరిగి పెద్దవాడవుతాడు. సమాజంలో భాగమవు తాడు. వాడు వ్యక్తిగతంగా ఏంచేస్తాడో చేయ్యడో గానీ సమాజానికి మటుకు కొంతచేస్తాడు. అలాంటి పిల్లాడిని కనటం నా సొంత సమస్యా? అని ప్రశ్నించడం ద్వారా సమాజానికి పునరుత్పత్తికి గల సంబంధాన్ని 'కేసు' రూపంలోఓల్గా చర్చకు పెడుతుంది.

రెండు కథలు కూడా స్త్రీలు పురుషస్వామ్య ఆర్థిక వ్యవస్థలో కేవలం use value మాత్రమే కలిగి ఉండే వస్తువులుగా దిగజార్చ బడ్డారనే విషయాన్ని రుజువు చేస్తాయి. అదే సందర్భంలో న్యాయ వ్యవస్థ పురుషుడికే అనుకూలంగా ఉందనే విషయాన్ని కూడా ఓల్గా కథలు రుజువుచేస్తాయి. అలాగే పునరుత్పత్తి రాజకీయాలను చర్చకుపెట్టిన మరొక శక్తివంతమయిన కథ **'ఆర్తి'.** ఈ కథ ప్రధానంగా మూడు అంశాల మీద కేంద్రీకరిస్తుంది.

ఒకటి. పురుషస్వామ్యం స్త్రీలలో ప్రశ్నించే శక్తిని ఎలా చంపుతుంది?

రెండు. స్త్రీలలో ఉండే లైంగిక వాంఛలను ఎలా అణచివేస్తుంది.

మూడు. ఈనాడు స్త్రీలు తమ శరీరాల మీద తమకున్న పునరుత్పత్తి హక్కుల్ని స్త్రీలు ఎలా assert చేసుకోవాలి.

ఈ మూడు అంశాలమీద కేంద్రీకరించి ఓల్గా తనదైన శైలిలో ఈ కథను నడిపారు. ఆత్మకథాత్మక కథనంలాగా నడిచే ఈ కథలో ప్రధాన పాత్ర అనేక ప్రశ్నలను లేవనెత్తుతుంది. ఒకరకంగా కథంతా ప్రశ్నల మయమే. ఈ ప్రశ్నలన్నీ పురుషస్వామ్య వ్యవస్థను అన్ని పార్శ్వాలలో నిలదీసే ప్రశ్నలే.

స్త్రీలు, బాలికలు అనేకరూపాల్లో హింసను ఎదుర్కొంటున్నారు. లైంగిక అత్యాచారం, ఇతర లైంగికపరమైన అవహేళనలు, అవమానాలు, గర్భస్థ శిశువుల హత్య, భార్యలను వేదించడం, తమ మాటకు, చేతలకు అడొచ్చిన భార్యలను చంపడం వరకు ఎన్నో రూపాల్లో




స్త్రీలపై హింస అమలవుతోంది. ఈ హింస, ఫలితంగా స్త్రీలలో పాతుకుపోయిన భయాలు, అభద్రతాభావం, వాళ్ళను ఇంటికే పరిమితం చేసిన సంధర్భాలు మరింత లైంగిక దోపిడికి, సాంఘిక అణచివేతకు గురిచేస్తాయి. కుటుంబంలో, సమాజంలో, రాజ్యంలో జరిగే హింసకు వ్యతిరేకంగా ప్రస్తుతం జరుగుతున్న పోరాటాల్లో హింస ఇంత హెచ్చుగా పెరగడానికి రాజ్య స్వభావం కూడా కారణంగా గుర్తించారన్న స్పృహ ఈమె కథలు కలిగిస్తాయి.

ఈ విషయాలను ప్రచారం చేయటం ద్వారా పురుషస్వామ్యం తనకు అవసరమున్న, ప్రయోజనమున్న తీరులోనే స్త్రీలను స్త్రీల లైంగికతను రూపొందిస్తుంది, చూస్తుంది. ఆ విధంగానే ఆడపిల్లలకు తర్ఫీదు కూడా ఇస్తుంది. స్త్రీవాద మనోవైజ్ఞానిక శాస్త్రవేత్తలు ఇటీవలికాలంలో ఈ విషయాలను చాలా లోతుగానే విశ్లేషించ గలిగారు. బాల్యంలో పడే ముద్రలు ముఖ్యంగా లైంగికత విషయంలో ఎంత గాఢంగా ఉంటాయో Joseph Bristow అనే విమర్శకుడు చాలా చక్కగా వివరించారు. అవన్నీ కూడా కథాంశాలలో ప్రతిఫలించాయి.

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 1 44 హైదరాబాద్ నవంబర్ : 2023

## ఆదిత్య హృదయ మహిమ

**"రామ రామ మహాబాహో శృణు గుహ్యం సనాతనమ్**
**యేన సర్వానరీన్ వత్స సమరే విజయిష్యసి"**

'రామా! రామా! మహాబాహూ! సనాతనము, గుహ్యము అయినదానిని విను. దానితో, బిడ్డా! నీవు శత్రువులందరినీ సమరంలో గెలుస్తావు'.

ఈ శ్లోకంలో మూడు సంబోధనలు ఉన్నాయి. అందులో మొదటిది రెండుమారులు ఆవృత్తమయింది. అగస్త్యులవారి హృదయాన్ని ఇవి తెలియజేస్తున్నాయి. రాముడు కారుణ్యంతో ఎక్కడ రావణుని వధ విషయంలో అనాసక్తుడవుతాడో అనే ఆందోళన ఈ సంబోధనలలో స్పష్టంగా అభివ్యక్తమవుతున్నది.. రామా, రామా, అని రెండుమారులు పిలవటంలో పరధ్యానంలో ఉన్న శ్రీరాముణ్ణి తనకు అభిముఖంగా చేసుకోవాలి అనే ఆరాటం తెలియవస్తున్నది.

తరువాతి సంబోధన 'మహాబాహో'. గొప్ప బాహువులు కలవాడా! అని ఆ పదానికి అర్థం. నిజమే. రావణుడు గొప్పవాడే. గొప్ప తపస్సంపద కలవాడే. కానీ ధర్మద్రోహం చేసిన విషయాన్ని నీవు మరచిపోగూడదు. అతడు నీకు శిక్షింపదగినవాడు. నీ బాహుబలాన్ని దుష్టశిక్షణ విషయంలో సద్వినియోగం చేయక తప్పదు. అన్న భావం అక్కడ ప్రతీయమానం అవుతుంది.

శ్రుణు – విను, అని నొక్కి చెపుతున్నాడు. ధ్వనిశాస్త్రం ప్రకారం ఒక గొప్ప ప్రయోజనం ఉన్నది. నిజానికి ఈ పదం వాక్యంలో లేకపోయినా నష్టంలేదు. అదిగో గుహ్యము, సనాతనమూ అయిన ఒక విషయం. దీనితో నీవు సర్వ శత్రువులను గెలుస్తావు. అంటే వాక్యాన్వయానికి ఇబ్బంది లేదు. అలా అక్కరలేని పదాన్ని కవి ప్రత్యేకించి వాక్యంలో నిలిపాడంటే, 'శ్రద్ధాసక్తులతో, మహా ప్రయోజనాన్ని అపేక్షించి నీవు ఈ మాటను వినాలి' అనే అభ్యర్థన ఉన్నదన్నమాట. అది రాముని తాత్కాలిక పరధ్యాన ప్రవృత్తి నుండి మరలించడం కోసం ప్రయోగించిన పదమని తాత్పర్యం.

గుహ్యము – మహా ప్రయోజనాన్ని సాధించడానికి ఏర్పడిన మంత్రమయవాక్కు కనుక ఇది హృదయ గుహలో భద్రంగా నిలుపుకోదగినది అని అర్థం.

సనాతనమ్ – పరబ్రహ్మము వలె దేశకాల విభాగాలు లేని శబ్ద సముదాయం కనుక నింఖాళదైన శ్రద్ధతో వినవలసినది అని మహర్షి భావన. (సశేషం) (ఆచార్య శలాక రఘునాథ శర్మగారి **ఆదిత్య హృదయ హృదయం** నుండి)

## సత్సంగం



### శూన్యమూ – శౌచమూ

మనకి ఎండా వానల నుండి రక్షణ కల్పించడానికి ఇల్లు కట్టుకుంటాం. కాని అన్ని వైపులా మూసుకు పోయిన ఇంట్లో ఎవ్వరూ ఉండలేరు. ఏ యింటికైనా కిటికీలు, తలుపులూ అవసరం. అవి లేకపోతే ఊపిరాడదు.

కిటికీలు, తలుపులు ఖాళీ జాగాలు. అంటే ఇల్లంతా గోడలుంటే కుదరదు. కొన్ని ఖాళీ జాగాలూ ఉండా లనమాట. ఆ ఖాళీలలో కిటికీలనీ, తలుపులనీ పెట్టుకుంటాం. అంటే ఎవరైనా ఇంట్లో ఉండాలంటే ఖాళీ జాగా అత్యవసరమన్నమాట. ఈ ఖాళీల వల్లే ఇల్లు వాసయోగ్యమవుతుంది.

మనస్సు నిండా కోర్కెలుంటే కిటికీలు, తలుపులూ లేని కట్టడం వలె ఉంటుంది. ఎప్పటికప్పుడు మనస్సుని ఖాళీ చేస్తుంటే మనం ఆరోగ్యంగా జీవించగలుగుతాం. ఏ పెట్టె అయిన ఉపయోగపడాలంటే ఖాళీగా ఉండాలి కదా. దానిని ఏవేవో వస్తువులతో నింపేసుకుంటే వాడుకోలేం కదా. మనిషి మనస్సుని ఎప్పటికప్పుడు ఖాళీ చేసుకోవడం శ్రేయస్కరం. స్వార్థపరమైన వాంఛలతో మనస్సుని బంధించకుండా ఉంటే దివ్యత్వమనే గాలి మనస్సులో స్వేచ్ఛగా వీస్తుంది.



శరీరం మలినమైనప్పుడు శుభ్రపరచుకొంటాం. శరీరం పరిశుభ్రమైన తరువాత ఎంతో హాయిగా ఉ ంటుంది. కాని సబ్బు తనంతట తాను శరీరాన్ని శుభ్రపరచలేదు. దేనినైనా శుభ్రపరచాలంటే, ముందుగా నీళు ్ళండాలి. ఆ తరువాతనే దేనితోనైనా తోమాలి. ఇట్లాగే కదా ఏదైనా పరిశుభ్రమయ్యేది. ఎండిపోయిన సబ్బు దేనినీ శుభ్రం చేయలేదు. దేనినైనా సబ్బుతో కడిగితే కొంత సబ్బు కూడా కరిగిపోతుంది ఆ మలినంతోబాటు.

ఎవరైనా మనస్సుని పరిశుభ్ర పరచుకోవాలంటే, పూజనో, జపాన్నో, ధ్యానాన్నో సబ్బుగా చేసుకోవాలి. అన్నిటి కన్నా ముఖ్యమైనది నీరు. అనుగ్రహమనే నీరు. నీరొక్కటే చాలు. ఒక జలపాతం క్రింద నిలబడినప్పుడు సబ్బుని వాడం. జలపాతం యొక్క బలం వల్ల మన శారీరక మాలిన్యమంతా బలవంతంగా, శీఘ్రంగా తుడిచి పెట్టుకుపోతుంది. ఏ యోగి సన్నిధిలోనో, ఏ ఋషి సన్నిధిలోనో ఉండటం జలపాతం క్రింద నిలబడటం వంటిదే. అటువంటి మహనీయుల యొక్క అనుగ్రహపాతం మానసిక మాలిన్యాన్ని మాపివేస్తుంది.

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 1 హైదరాబాద్ నవంబర్ : 2023


# రాతప్రతుల సేకరణకు, పరిష్కరణకు కృషి చేసిన ప్రముఖులు

**కె. సంతోష్ కుమార్,** పరిశోధక విద్యార్థి, ప్రాచ్య పరిశోధనా సంస్థ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.
ఫోన్ : 77290 30324

ప్రాచీన కాలంలో పూర్వీకులు మనకు అందించిన సంపదల్లో తాళపత్ర రాతప్రతులు ఒకటి. ఈ తాళపత్ర రాతప్రతుల్లో మన దేశచరిత్ర, సంస్కృతి రాసి భద్రపరిచారు. కాగితం అందుబాటులోలేని రోజుల్లో తాళపత్రాల ద్వారానే చదువుకునేవారు. పూర్వం ఆశ్రమాల్లో, గురుకులాల్లో గురువులు విద్యార్థులకు ఈ తాళపత్ర గ్రంథాల ద్వారానే బోధన చేసేవారు. తాటాకులను, భూర్జపత్రాలను మన వాళ్ళు జ్ఞాన చిహ్నాలుగా భావించారు. ఈ రెండింటి మీద రాసే పద్ధతి మనదేశంలో ఎప్పటి నుంచి వుందో ఖచ్చితంగా చెప్పలేము కాని బుద్ధుని కాలం నుండి వుండినట్లు చెప్పడానికి కొన్ని ఆధారాలున్నాయి. అవి నాటి భారతీయ శిల్పకళలో దర్శనమిస్తున్నాయి. బ్రహ్మసరస్వతులు ఎడమ చేత్తో తాటాకు పుస్తకం పట్టుకున్నట్టు చెక్కిన ప్రాచీన శిల్పాలు కొన్ని మ్యూజియాలలో(లక్నో మ్యూజియం)వున్నాయి. దక్షిణ భారతదేశంలో రాతకు తాటాకులనే ఉపయోగించేవారు. రాతకు పనికివచ్చే తాటాకులను సిత్తాళపత్రాలని, శ్రీతాళపత్రాలని పిలిచేవారు. మౌఖిక సంప్రదాయంలో వున్న జ్ఞానం బుద్ధుని కాలం నుండి లిఖిత సంప్రదాయానికొచ్చింది. అప్పటి నుండి రాత పద్ధతి సాధనాలు వాడుకలోకి వచ్చాయి. రాతపద్ధతి ఏర్పడిన కొద్దికాలానికే రాళ్లపైన, శిలలపైన, శాసనాలు చెక్కించడం ప్రారంభమైంది. జ్ఞానాన్ని భద్రపరచడం, కావలసినవారందరికీ అందుబాటులోకి తేవడం ప్రధానాంశాలుగా నాడు తాళపత్ర రచన జరిగింది. అయితే అది సాధ్యం కాలేదు. కేవలం బ్రాహ్మణులు, పండితుల వర్గానికి మాత్రమే తాళపత్రాలు అందుబాటులో ఉండేవి. ఈ తాళపత్ర గ్రంథాలల్లో నాటి రాజుల పరిపాలనా విధానం గురించి, చారిత్రకాంశాలు గురించి వివిధ పురాణాలు, కావ్యాలు, ప్రబంధాలు, శతకాలు వంటి అంశాలను గురించి రాయబడ్డాయి.

తరతరాల నుండి దాచి ఉంచిన సాంప్రదాయిక విజ్ఞానం వారసత్వంగా ముందు తరాలకు అందకపోవడం వల్ల చాలాచోట్ల తాటాకు గ్రంథాలు జీర్ణవస్థలో ఉండిపోయాయి. మరికొన్ని క్రిమికీటకాలు వలన, అగ్ని ప్రమాదాల వలన అంతరించిపోయాయి.

**రాత ప్రతులు సేకరణ - పరిష్కరణ:**

రాతప్రతులు సేకరణ ఒక యజ్ఞమైతే, వాటిని పరిష్కరించి ముద్రించడం మరో మహాయజ్ఞం. ఇటువంటి మహాయజ్ఞం ప్రారంభించి ఎన్నో అముద్రిత కావ్యాలను, ప్రబంధాలను సేకరించి పరిష్కరించి ముద్రించిన ప్రముఖల్లో సి.పి బ్రౌన్, కల్నల్ కాలిన్ మెకంజీ, మానవల్లి రామకృష్ణకవి, వేటూరి ప్రభాకర శాస్త్రి, మల్లంపల్లి సోమశేఖర శర్మ, నేలటూరి వెంకటరమణయ్య, నిడదవోలు వెంకట రావు, ఆచార్య బిరుదురాజు రామరాజు వంటి వారు ఉన్నారు. వీరు రాతప్రతులు సేకరణ, పరిష్కరణకు విశేషంగా కృషి చేసి ఎన్నో రాతప్రతులను సేకరించి, పండితుల చేత పరిష్కరించి ముద్రిందించి భద్రపరిచారు.

**శరభోజి భోంస్లే (1777-1832)**

తంజావూరును పాలించిన శరభోజి మంచి సాహితీప్రియుడు. ఇతను తెలుగు భాషను ఆదరించి ఎంతో విలువైన చెల్లాచెదురుగా ఉన్న తాళపత్రాలను సేకరించి తంజావూరు



సరస్వతీ మహల్ గ్రంథాలయాన్నీ స్థాపించి భద్రపరిచాడు. తమిళదేశంలో తెలుగు కవులను ఆదరించి స్వయంగా తెలుగు కావ్యాలను రచించిన గొప్ప రాజకవి శరభోజి.

**సి.పి బ్రౌన్ : (1794 - 1884)**

తెలుగు భాషకు అపారమైన కృషి చేసిన విదేశీయుల్లో సి.పి బ్రౌన్ అగ్రగణ్యుడు. బ్రౌన్ తండ్రి బహుభాషాకోవిదుడు కావడం ద్వారా బ్రౌన్ హీబ్రూ, అరబిక్, పర్షియన్, హిందూస్థానీ, సిరియక్, గ్రీకు, ఆంగ్లం వంటి భాషలను సునాయసనంగా నేర్చుకున్నాడు. తండ్రి డేవిడ్ బ్రౌన్ కలకత్తా ఫోర్ట్ విలియం కళాశాలలో బహుభాషా పండితుడు. తండ్రి రాతప్రతులను పరిష్కరించడంలో బ్రౌన్ తండ్రికి తోడ్పడేవాడు. అది బ్రౌన్‌కి భవిష్యత్తులో బాగా ఉపకరించి గొప్ప పేరు ప్రఖ్యాతులు సంపాదించి పెట్టింది. తెలుగు సాహిత్య చరిత్రలో సి.పి బ్రౌన్‌కి ఒక ప్రత్యేక స్థానం కలదు. సి.పి బ్రౌన్ 1817లో మద్రరాసు సివిల్ సర్వీసులో ఉద్యోగం చేరాడు. మద్రాసులోని ఫోర్ట్ సెయింట్ జార్జి కళాశాల ఆధ్యాపకుడు వెలగపూడి కోదండరామయ్య వద్ద తెలుగు నేర్చుకున్నాడు. ఉద్యోగరీత్యా కడప, గుంటూరు, మచిలీపట్టణం, రాజమండ్రి ప్రాంతాలలో పనిచేశాడు. ఆ సమయం లోనే వేమన గురించి తెలుసుకుని ఆయన పద్యాల



పట్ల ప్రభావితుడై అనేక పద్యాలను పరిష్కరించి ముద్రించాడు. వేమన గురించి ప్రపంచానికి తెలియజేసింది బ్రౌనే అని చెప్పడంలో అతిశయోక్తిలేదు. తెలుగు ప్రాంతంలో చెల్లాచెదురుగా పడివున్న తాళపత్రాలను సేకరించి పండితులను నియమించి వారికి తన సొంత నగదు ఇచ్చి రాతప్రతులను పరిష్కరించి ముద్రించాడు. అంతేకాక కడప జిల్లాలో బంగ్లాతోటలో గ్రంథాలయం నిర్మించి తెలుగు గ్రంథాలను పండితులచేత పరిష్కరించేవాడు. సి.పి బ్రౌన్ కృషితో రాతప్రతులను పరిష్కరించడం వలన నేటికి మనచరిత్ర, సంస్కృతి వంటి చారిత్రక సామాజికాంశాలను భావితరాలవారు తెలుసుకోగలుగుతున్నారు. తెలుగు అక్షర నిర్మాణంలో, లేఖనానికి సంబంధించిన మార్పులు చేశాడు. తాతాచారి కథలు ద్వారా దేశ చరిత్రను నిక్షిప్తం చేశాడు.

తెలుగు సాహిత్య విమర్శను తెలుగు వారికి పరిచయం చేసింది సి.పి బ్రౌన్. అలానే కావ్యాలకు, లఘువ్యాఖ్యలు, టిప్పణులు రాయడం నేర్పించాడు. 18 కావ్యాలకు వ్యాఖ్యలు పండితుల చేత రాయించాడు. కొన్ని కావ్యాలకు స్వయంగా వ్యాఖ్యలు రాశాడు. గ్రంథపరిష్కరణలో జూలూరి అప్పయ్య, అద్వైత బ్రహ్మయ్య, మున్నెం కనకయ్య, గరిమెళ్ళ వెంకయ్య, వారణాసి వీరస్వామి, తిరుపతి తాతాచార్యులు వంటి పండితులు సహకరించారు. సి.పి బ్రౌన్ తెలుగు, కన్నడ, తమిళ, మరాఠి, హిందీ భాషకు చెందిన 5,751 గ్రంథాలను సేకరించినట్లు తెలుస్తుంది. అందులో తెలుగు భాషకు సంబంధించినవి 2,440 దాకా ఉన్నాయి. వాటిలో రామాయణం, భారతం, భాగవతాలు, కావ్యాలు, ప్రబంధాలు, వ్యాకరణ గ్రంథాలు కలవు. ఆముక్తమాల్యద-బుధ మనస్తోహిణీ వ్యాఖ్యా, మనుచరిత్ర, వసుచరిత్ర ప్రబంధాలకు ప్రతిపదార్థ ప్రకాశిక వ్యాఖ్య, సారంగధర చరిత్రకు వ్యావహారిక భాషలో టీక, వేమన, సుమతి శతకాలను ఆంగ్లంలోకి అనువాదం, తెలుగు - ఆంగ్ల నిఘంటువులు వంటివి బ్రౌన్ కృషి ఫలితంగా మనకు ఈనాడు అందుబాటులో ఉన్నాయి.

**ఆచార్య జార్జి బుహ్లెర్ ( 1837)**

ఈయన పూనేలోని భండార్కర్ ఇన్‌స్టిట్యూట్ తీర్చిదిద్దిన జర్మన్ పండితుడు. ఆ తర్వాత భండార్కర్ వీరి అడుగుజాడలలో నడిచాడు. సంస్కృత భాషాధ్యయనం చేసిన జార్జి భారతదేశానికి రావాలని ఎంతో తపన పడ్డాడు. 1863లో తొలిత బొంబాయిలోని ఎలిఫిన్‌స్టన్ కళాశాలలో చేరాడు. 1866లో ఈయనను పూనాలోని దక్కన్ కాలేజి వారు ఆహ్వానించారు. ఎక్కడికి వెళ్లినా ఆయన రాతప్రతుల సేకరణకే ఎక్కువ సమయం కేటాయించి వ్యక్తులవద్ద ఉన్న తాళపత్ర రాతప్రతులను సేకరించాడు. సభలు, సమావేశాలు నిర్వహించి రాతప్రతుల సేకరణ ఆవశ్యకతను నొక్కి చెప్పాడు. జార్జి పండితుడు రాజస్థాన్‌లో పర్యటించి అనేక తాళపత్రాలు సేకరించాడు. జైసల్మేర్‌లో 11వ శతాబ్దానికి చెందిన విక్రమాంక దేవచరిత్ర ప్రతిని సేకరించి దానిని కాపీచేసి భండార్కర్ ఇనిస్టిట్యూట్‌లో భద్రపరచారు. జార్జి పండితుడు కాశ్మీరు ప్రాంతాన్ని పర్యటించి అక్కడ శారదలిపిలో రాసిన ఋగ్వేద ప్రతిని, అదేవిధంగా మరో 2800 తాళపత్ర రాతప్రతులను సేకరించాడు. రాతప్రతుల పరిరక్షణకు జార్జి చేసిన కృషి వెలకట్టలేనిది.

**కల్నల్ కాలిన్ మెకంజీ (1754- 1821)**

ప్రముఖ ఆంగ్లేయ అధికారి, భారతదేశపు మొదటి సర్వేయర్ జనరల్. మెకంజీ అంటే మనకు గుర్తుకు వచ్చే అంశం కైఫీయత్తులు. మనం దక్షిణ భారతదేశచరిత్ర అధ్యయనం చేస్తున్నప్పుడు వెంటనే గుర్తుకు వచ్చే పేరు కూడా కల్నల్ కాలిన్ మెకంజీ. తన జీవితం మొత్తం స్థానిక చరిత్రలను సేకరించి భద్రపరచడానికి కృషి చేసిన మహనీయుడు మెకంజీ. ఆంధ్రదేశ చరిత్రను తెలుసుకోవడానికి అవసరమగు మూలాలను సమకూర్చిన ఆంగ్లేయుడు మెకంజీ. భారతదేశంలో దేశాటన చేయునపుడు ఆయా గ్రామములోని అనేక సుందర దేవాలయాలు అక్కడి సుందర శిల్పాలు, శాసనాలు అతనిని ఎంతగానో ఆకర్షించాయి. మెకంజీ గ్రామ చరిత్రలను రాయించడానికి, తాళపత్ర రాతప్రతులు సేకరణకు, చరిత్ర కుపకరించు ప్రాచీనపు నాణెలను సంపాదించుటకు, అజ్ఞాతలిపిలో ఉన్న ఎన్నో తెలుగు - కన్నడ శాసనాలోని స్థానిక చరిత్రను తెలుసుకొనుటకు ఏలూరులో ఉండే కావలి వెంకట బొర్రయ్య అనే పండితునికి వేతనమిచ్చి దుబాసిగా నియమించుకున్నాడు. ఆ తరువాత బొర్రయ్య సోదరుడు కావలి లక్ష్మయ్యను కూడా మెకంజీ దుబాసిగా నియమించుకున్నాడు. వీరి సహయంతో చరిత్ర, జాగ్రఫీ, జానపద గాథలు, స్థానికచరిత్రలు సేకరించి వాటిని రాసి భద్ర పరిచాడు. 1793 నుండి 1816 వరకు మెకంజీ చరిత్రకు ఉపకరించే అనేక తాళపత్ర గ్రంథాలను, రాతప్రతులను సేకరించాడు. అవి సుమారుగా 1568 పైగా ఉన్నాయి. అందులో సంస్కృతం, తమిళం, తెలుగు, కన్నడ, మలయళం, ఒరియా, మరాఠీ, హిందీ భాషల్లో రాసిన గ్రంథాలు కలవు. ఇవే కాకుండా 2070 స్థానిక చరిత్రలు, వృత్తాంతాలు, 8076 శాసన పాఠములు, 79 దేశ పటములు, 2630 బొమ్మలు, 6128 నాణెములు, 106 శిల్పచిత్రాలు, 40 పురాతన వస్తువులు ఉన్నాయి. వీరు సేకరించిన తాళపత్ర రాతప్రతులు



మొత్తంగా 5,31,255 స్థానిక చరిత్రలను, ఎనిమిదివేలకు పైగా శాసనాల పాఠాలను మద్రాసు ప్రాచ్య గ్రంథాలయానికి పంపబడ్డాయి. మెకంజీ ఆంగ్లంలో భారతీయ సంస్కృతి, హిందూదేశచరిత్రను గురించి వ్యాసాలు రాయగా అవి ఏషియాటిక్ మాన్యువల్ రిజిష్టరు, ఏషియాటిక్ రిసర్చెస్, రాయల్ ఏషియాటిక్ సొసైటీ వంటి పత్రికలో ప్రచురించడం జరిగింది. భారదేశచరిత్ర, సంస్కృతిని విదేశీయులకు, స్వదేశీయులకు తెలియజేసిన ఘనత ఒక ఆంగ్లేయుడైన మెకంజీ దక్కుతుంది. ఆయన చేసిన సేవ అపారము, అద్వితీయము.

### మానవల్లి రామకృష్ణ కవి (1866- 1957)

తాళపత్ర రాతప్రతులు పట్ల ప్రత్యేక ఆసక్తి గల వ్యక్తి మానవల్లి రామకృష్ణ కవి. సాహిత్య పరిశోధకుడు, కవి, సంస్కృతాంధ్ర పండితుడు, బహుభాషా కోవిదుడు, గ్రంథ పరిష్కర్త. సంస్కృతం, తెలుగు, తమిళం, కన్నడం, మలయాళం, ఆంగ్ల భాషలలో పాండిత్యం గల మేధావి. తెలుగు పరిశోధనా రంగంలో తన ప్రతిభతో అవిరళ కృషి చేసిన సాహిత్య విజ్ఞాన సర్వస్వం అనదగిన శ్రీమాన్ మానవల్లి రామకృష్ణకవి అనేక విస్మృత కవుల కావ్యాలను వెలికితీయడమే కాకుండా వాటిని టీకా తాత్పర్యాలతో సహసాహితీ లోకానికి అందించి కవితాశక్తినీ, పరిశోధనశక్తినీ, సముపాళ్ళలో రంగరించి పరిశోధక విద్యార్థులకు మార్గదర్శకుడైనాడు. ప్రాచీన గ్రంథ సముపార్జనకు తన జీవితమును, ధనమును సమర్పించిన స్వార్థ దూరుడు. ప్రాచీన గ్రంథ పరశోధన సంస్కరణములందును, శబ్దార్థ స్వరూప నిర్ణయంలోనూ మానవల్లి కవి ప్రజ్ఞా పాటవములు సునిశితమైనవి.



విస్మృత కవులు శీర్షికన క్రింది అనేక ప్రాచీనాంధ్ర గ్రంథాలను సంస్కరించి ప్రచురించారు. అవి నన్నెచోడుని కుమార సంభవం, వల్లభరాయని క్రీడాభిరామం, మడికి సింగన సకలనీతి సమ్మతం, వేంకటేశోదాహరణం, భైరవకవి శ్రీరంగ మాహాత్మ్యం మొదలైనవి. దక్షిణ భారత సంస్కృత గ్రంథమాలలో అపూర్వ ప్రాచీన సంస్కృత గ్రంథాలను మానవల్లికవి సంస్కరించి ప్రచురించాడు.

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన భాసుని నాటకాలను తొలిసారిగా వెలుగులోకి తెచ్చి, అనువదించిన ఘనత కూడా మానవల్లి కవికే దక్కుతుంది. అంతేకాకుండా సోమదేవసూరి రాసిన కథా సరిత్సాగరంలోని ఉదయనుని కథని ఇతివృత్తంగా తీసుకొని 'మృగావతి' అనే కావ్యాన్ని కూడా రాశాడు.



మద్రాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారములోనూ, తిరుపతి శ్రీ వేంకట్వేర ప్రాచ్య పరిశోధన సంస్థలోనూ ఈయన రీడరుగా పనిచేశారు. ఆరోజుల్లో ఊరూరా తిరిగి తాళపత్ర రాతప్రతులు సేకరించడం ప్రారంభించి కనుమరుగైన కృతులను వెలుగులోకి తెచ్చాడు. ప్రాచ్య పరిశోధనసంస్థ అభివృద్ధికి నిరంతరం శ్రమించిన గొప్ప పరిశోధకుడు మానవల్లి రామకృష్ణ కవి. తెలుగు సాహిత్య చరిత్రలో మానవల్లి స్థానం చెరిగిపోరానిది. ఆయన కృషి, పట్టుదల, నిబద్ధత తరువాత కవులకు, పరిశోధకులకు ఆదర్శనీయం, ఆచరణీయం.

### వేటూరి ప్రభాకరశాస్త్రి (1888 - 1950)



వాఙ్మయ పరిశ్రమ సాగించిన తెలుగు వారిలో వేటూరివారు ప్రముఖులు. ముఖ్యంగా వారు మద్రాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారంలో వెలువడిన గ్రంథసూచికా సంపుటాలలో, వేలకొలది తాళపత్ర గ్రంథాలకు రాసిన వ్యాఖ్యాలన్నీ ఈనాడు పునర్ముద్రింప దగినవి. మద్రాసు ప్రభుత్వ ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారంలో పండితునిగా 30సం॥లు పైగా పనిచేసి అపారమైన పరిశోధనలు కొనసాగించారు. బసవపురాణం, ఉద్భటారాధ్య చరిత్రము, హరవిలాసం, మనుచరిత్ర, క్రీడాభిరామం, రంగనాథ రామాయణం, శృంగారశ్రీనాథం వంటి విమర్శగ్రంథాలు, ఇవేకాక ప్రాచీన తాళపత్ర గ్రంథాలను పరిశోధిస్తున్నప్పుడు సేకరించిన కవుల చాటువులను సంకలనం చేసి, 'చాటుపద్యమణి మంజరి' అన్న పేరుతో ప్రచురిం చారు. ఉద్యోగ రీత్యా తిరుపతి శ్రీవేంకటేశ్వర ప్రాచ్యపరిశోధన సంస్థలో రీడర్‌గా పనిచేసి తాళ్ళపాక కవుల రచనల్ని వెలుగులోకి తేవడం శాస్త్రిగారు ప్రధాన కర్తవ్యంగా భావించినట్లు అన్నమాచార్య చరిత్రలో చెప్పుకున్నాడు. వేంకటేశ్వర వచనాలు, అన్నమయ్య సంకీర్తనలు,

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 1  హైదరాబాద్ నవంబర్ : 2023





సుభద్రకల్యాణం, సారసంగ్రహ గణితం. కుమార సంభవ వ్యాఖ్య, ఉత్తర హరివంశం, నైషధ పారిజాతం గ్రంథాలకు విలక్షణమైన పద్ధతిలో వ్యాఖ్యానాలు రాశారు. తొలి తెలుగు పదం 'నాగబు' అని సాహిత్యలోకానికి తెలియజేసింది కూడా వేటూరివారే. ఉద్యోగ ధర్మమున ప్రాచీన తాళపత్ర రాతప్రతులు వేలకు వేలు సేకరించి, పరిశీలించి, పరిష్కరించి ఉత్తమస్థాయికి చెందిన విమర్శక వ్యాసము రాసి ఉత్తమ పండితుడుగాను, కవిగాను, గ్రంథపరిష్కర్త గాను, విమర్శకుడుగాను, చరిత్రకారుడుగాను, బహుముఖ ప్రతిభావంతుడిగా పేరుగాంచారు. రాతప్రతుల సేకరణలో వేటూరి ప్రభాకర శాస్త్రి గారి కృషి అజరామరం.

**నేలటూరి వెంకట రమణయ్య : (1883 -1977) :-**

వెంకట రమణయ్య అసలు పేరు 'వెంకట రమణాచారి' నేలటూరి అన్నది వారి ఊరు పేరు. సంస్కృత గ్రంథ పరిశోధకులైన మానవల్లి రామకృష్ణకవితో సన్నిహిత పరిచయ మేర్పరచుకొని అనేక తాళపత్ర గ్రంథాలను పరిశోధన దృష్టితో పరిశీలించాడు. ఆయన "ప్రాచీన పల్లవ చోళ శాసనములు" అనే అంశంపై పరిశోధన చేసి మద్రాసు విశ్వవిద్యాలయం నుండి పి.హెచ్.డి పట్టాను అందుకున్నారు. 'దక్షిణ దేశములో దేవాలయ ప్రాదుర్భావము' అన్న విషయముతో వారి పరిశోధన ప్రారంభమైంది. వెంకట రమణయ్యగారి పరిశోధనలో ఎంతో ముఖ్యమైనది 'విజయనగర చరిత్ర' దాని తరువాత 'విజయనగరము - సామ్రాజ్య ప్రాదుర్భావము' అరబిక్, పర్షియన్ భాషలను నేర్చుకుని, ఆ రచనలను అధ్యయనం చేశాడు.

అదేవిధంగా తెలుగు ప్రబంధాలు, తాళపత్ర రాతప్రతులు, స్థానిక చరిత్రలు, కైఫియత్తులు, శాసనాలను పరిశీలించి, పరిశోధించి విజయనగర రాజుల నాటి సమగ్ర చరిత్ర రచనకు పునాదులు వేశాడు. వారు రాసిన ముఖ్యమైన గ్రంథాలు 'ఎర్లీ ముస్లిం ఎక్స్‌పాన్షన్', ఫర్దర్ సోర్సెస్', థర్డ్ డైనాస్టి ఆఫ్ విజయనగర' మొదలైనవి. మద్రాసులో ఉన్నప్పుడు వీరికి వేటూరి ప్రభాకరశాస్త్రి, మానవల్లి రామకృష్ణకవి, టి.యన్. రామచంద్రన్, మల్లంపల్లి సోమశేఖరశర్మ వంటి ప్రసిద్ధ పరిశోధకులు, శాసన, తాళపత్ర పరిష్కర్తలతో మంచి సాంగత్యం ఉండేది. మల్లంపల్లి సోమశేఖరశర్మ వారితో కలసి 'కాకతీయ చరిత్ర' ను రచించాడు. శాసనాలపై కూడా పరిశోధనలు చేశాడు. అవి కలిదిండి తామ్రశాసనము, కృష్ణదేవరాయల గయ శాసనం, అచ్యుతరాయల కొరింజవాడ తామ్రశాసనం వంటి శాసనాలపై పరిశోధన చేసి అనేక వ్యాసాలు ప్రచురించాడు. నేడు ఆంధ్రదేశ చరిత్ర తెలుసుకొవడానికి నేలటూరి వెంకట రమణయ్య రచించిన గ్రంథాలు, వారి పరిశోధనలు ఎంతోగానో ఉపకరిస్తున్నాయి.

**నిడదవోలు వెంకటరావు (1903 -1982)**

ప్రాచీన గ్రంథ పరిష్కర్త, విమర్శకుడు, మరియు కవి. వీరి ఇంటిలో 1900 సంవత్సరం నాటికే 300 ముద్రిత గ్రంథాలు, 1500 తాళపత్ర గ్రంథాలు ఉండేవి. చిన్నతనం నుండే అనేక పద్య- గద్య రచనలు చేస్తూ, భారతి వంటి పత్రికలో ప్రచురించేవారు. తండ్రి సేకరించిన తాళపత్ర రాతప్రతులు తనివితీరా చదివి, తనలోని సాహిత్య, పరిశోధన జిజ్ఞాసను పెంపొందించుకున్నాడు. తెలుగు ప్రాచీన గ్రంథ పరిష్కరణలో పేరు ప్రతిష్ఠలను అర్జించిన వారిలో నిడదవోలు వారు ఒకరు. మద్రాసు ప్రభుత్వ ప్రాచ్యలిఖిత గ్రంథాలయం, తంజావూరు సరస్వతీ మహల్ గ్రంథాలయాలలోని కొన్ని గ్రంథాలను ఆయన పరిష్కరించాడు. వాటిలో ముఖ్యమైనవి ఖడ్గలక్షణ శిరోమణి, కట్టా వరదరాజ రామాయణం, రాజగోపాల విలాసం, శివతత్త్వసారం, కుమార సంభవం, అన్యవాద కోలాహలము, ఉత్తర హరివంశం, భాస్కర రామాయణం మొదలైనవి.

ఈ విధంగా నేడు మనం ఏవిధమైన శ్రమలేకుండా చదువుకుని ఎన్నో విలువైన కావ్యాలు,పురాణాలు, ప్రబంధాలు, శతకాలు, స్థానిక చరిత్రలు వంటి అనేక రచనలను గురించి తెలుసుకుంటున్నామంటే అది మన ముందుతరం పరిశోధకుల శ్రమ ఫలితమేనన్న విషయం మరిచిపోకూడదు. వీరి బాటలోనే భావి పరిశోధకులు సైతం పరిశోధనలు చేసి జీర్ణావస్థలో ఉన్న మరిన్ని రాతప్రతులను, గ్రంథాలను పరిరక్షించి, పరిష్కరించవలసిన అవసరం ఎంతైనా ఉందని నా వ్యాసం ద్వారా తెలియజేస్తున్నాను.

**ఆధార గ్రంథాలు:**

1. రాతప్రతులు విజ్ఞానశాస్త్రం - డా॥ పాలెపు సుబ్బారావు.

2. గ్రంథ పరిష్కరణ విధానాలు - ( సంపాదకులు) చిట్రాజు గోవిందరాజు

3. డిస్క్రిప్టివ్ క్యాటలాగ్ ఆఫ్ తెలుగు పేపర్ మ్యానుస్క్రిప్ట్స్ (సంకలనం) -1988 - ముదివేడు ప్రభాకరావు, కె.జె కృష్ణమూర్తి.

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 1 (49) హైదరాబాద్ నవంబర్ : 2023

# వర్తమాన కవిత్వం – పర్యావరణ చైతన్యం

**వర్ధ వేణు,** పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 996 381 5484

**పరిచయం**

పర్యావరణం అంటే పరిసరాలు. మనచుట్టూ అవరించివున్న పరిసరాలు, మనుషులు, జంతువులు, వృక్షాలు, జీవనసరళి, పని విధానాన్ని ప్రభావితం చేసే బాహ్యాపరిస్థితులు. మానవుని జీవనసరళిని అవగాహన చేసుకోవాలంటే తనని ఇతర జీవరాసులు వృక్షాలు ఏ విధంగా ప్రభావితం చేస్తున్నాయో అవగాహన చేసుకోవాలి. పర్యావరణం నుంచి మానవుడిని వేరుగా చూడలేము.

**సంకుచితార్థంలో పర్యావరణం**

మనచుట్టువున్న పరిస్థితులు లేదా పరిసరాలకు సంబంధించినవి. ఇందులో మనం పీల్చేగాలి, మనం త్రాగేనీరు, మనం భుజించే ఆహారం, మనం ధరించే దుస్తువులు, నివసించే ఇళ్ళు, మన ఆరోగ్యం మొదలగు అంశాలను చెప్పవచ్చు.

**విస్తృతార్థంలో పర్యావరణం**

తల్లి గర్భం నుంచి భూగర్భంలో కలిసే వరకు వ్యక్తి గడించే అన్ని స్పందనల సముదాయం పర్యావరణం. పర్యావరణం సాంస్కృతిక, సంప్రదాయ, ఆర్థిక, భౌగోళిక, రాజకీయ, మతపర సామాజిక, ఆధ్యాత్మిక ప్రభావాలన్నింటికి లోనవుతుంది. చుట్టూ ఆవరించుకొని ఉండేదాన్ని పర్యావరణం అంటున్నాం. జీవకోటి మనుగడకు కావలసిన వనరులన్ని ప్రకృతి సమకూరుస్తుంది. అందుకే ప్రకృతిని తల్లిగా ఆరాధించారు. ప్రకృతి ప్రసాదించిన వనరులను పంచభూతాలుగా భావించి పవిత్రమైన భావనతో ఆరాధిస్తాం. మానవ జాతికి ఏదో ఒకటి ఇచ్చువాడికి దేవుడిగా పరిగణించారు. జీవకోటికి ప్రాణాధారమైన ఆక్సిజన్‌ను ఇచ్చే గాలిని వాయు దేవుడికి గాను, వర్ష రూపంలో నీటిని ఇచ్చే మేఘాలను వరుణదేవుని గాను, జీవుల మనుగడకు కారణభూతమైన జలవనరులను గంగామాత గాను, శక్తినిచ్చే అగ్నిని దేవుడిగాను, ఆహారాన్ని వృక్ష సంతతి ద్వారా అందించే నేలను భూమాతగాను, తన తేజస్సుతో విశ్వమంతా వెలుగు నింపి సమస్త శక్తికి మూలాధారమైన సూర్యుడిని ఆదిత్యునిగా ఆరాధిస్తున్నారు.

**పర్యావరణం – చైతన్యం**

పర్యావరణ సాహిత్యం అంటే స్థూలంగా పర్యావరణాన్ని, ప్రకృతిని, కాలుష్యాన్ని ఉన్నది ఉన్నట్లుగా చిత్రీకరించడం అని చెప్పవచ్చు.

స్పృహ అంటే తెలివి, జ్ఞానం, అవగాహన, అభిప్రాయం, చైతన్యం, కొంతమేరకు తెలిసి ఉండటం. "చైతన్యం" అంటే Awareness అనే మాట ఆంగ్లంలో విజ్ఞాన సర్వస్వంలో 18వ శతాబ్దంలో వరకు




కనిపించదు. దానికి బదులుగా Consciousness అనే పద ప్రయోగం కనిపిస్తుంది. స్పృహ, చైతన్యం అనే పదాలు Consciousness కి అనువాదాలు. ఈ Consciousness మనస్తత్వశాస్త్రంలో విలక్షణంగా ప్రయోగింపవడింది. వ్యక్తి అంతరంగానికి సంబంధించిన, జాగృతి అని ఈ పదానికి అర్థం. దీనికి మనం మన స్పందనగా పేర్కొనవచ్చు.

పర్యావరణ స్పృహ అంటే పర్యావరణ సమస్య మీద కాలుష్యం మీద, చెట్లు, చేమలు, నదులు, గాలి, భూమి, నీరు, ఆకాశం, అగ్ని, అగ్ని ప్రమాదాల మీద, ప్లాస్టిక్ సంచులమీద, వ్యవసాయ పంటలకు వినియోగిస్తున్న క్రిమిసంహారక మందులు, వాహనాల పొగ, వాయుకాలుష్యం, శబ్దకాలుష్యం.. వీటి అన్నిటి మీద అవగాహన కలిగి ఉండటాన్ని పర్యావరణ స్పృహ అంటారు. ప్రాచీనులు ఆధునికులు అందరు కూడా పర్యావరణాన్ని ప్రకృతిని సమానార్థకం గానే వాడినట్లు కనిపిస్తుంది. రెండింటిని అభేదంగానే భావిస్తున్నారు.

**"బుక్కెదన్నము కోరి బుజ్జిమేకను జంపు**
**రొక్కమ్ము మొక్కగా రొయ్య జంపు**
**బోడి పందెములకై కోడిపుంజుల జంపు**
**పాపురమ్ముల జంపు పట్టుదలకు**
**దంతాల సంతకై దంతావళము జంపు**
**తోలు సంచులకు సర్పాల జంపు**
**చిరు నివాసమునకై చెట్టు చేమల జంపు**
**ఐశ్వర్యమును కోరి అడవి జంపు**
**ఇన్ని చంపి చంపి ఏ నాటికిని చావ**
**నంచు తలచి కొంపముంచుకొనును!**
**ప్రకృతి సంతులనము పర్యావరణ శోభ**
**దెబ్బతిన్న నరుడు దిబ్బ కాదె!"**

(సాగరఘోష, డా. గరికిపాటి నరసింహారావు, పుట. 62)

ISSN 2457-0796

UGC Care List Approved Journal

మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 1  హైదరాబాద్ నవంబర్ : 2023




"ధనం మూలం ఇధం జగత్" ఈ రోజులల్లో డబ్బుతొనె ఏదైనా సాధించవచ్చు. అనే భ్రమలో మనుషులు బ్రతుకుతున్నారు. ధనంతోనే మనుషుల మధ్య గొడవలు, మిత్రుల మధ్య తగాదాలు, తల్లితండ్రుల మధ్య గొడవలు రగులుతున్నాయి. డబ్బు కోసం మనిషి అడవి మీద జంతువుల మీద పడి వాటిని హింసించడం. చంపేయడం. ఈ మధ్య కాలంలో మనం చూస్తున్నాం. ఈ పద్యంలో గరికపాటి మనిషి యొక్క ఆగడాలను విపరీత బుద్ధిని వివరిస్తున్నాడు. బుక్కెడన్నము కోరి బుజ్జి మేకను చంప మనుషులు ఈ భూమి మీద దొరికే కూరగాయలు, పండ్లు రుచులను కాక మాంసం మీద రుచి మరిగి మేకలను, కోళ్ళను, పావురాలను, చేపలను ఇతర జంతువులను చంపి తినడం ఎక్కువగా జరుగుతుంది. మనిషి సుఖానికి ఎగబడి మాంసానికి రుచిమరుగుతున్నాడు. ఇంతటితో తృప్తి చెందక వాటితో పందాలు కాస్తున్నాడు. కొన్ని ప్రాంతాలలో సంక్రాంతి వచ్చిందంటే చాలు కోడిపందాలు, పొట్టేలు పందాలు, ఎడ్ల పందాలు కాస్తున్నారు. ఈ విధంగా కూడా మనిషి వాటిని హింసిస్తున్నాడు. వివిధ రకాల వస్తువులను తయారుచేసుకోవడానికి పాములను, జింకలనుచంపి వాటి తోలుతో బెల్టు, తోలు సంచులు, లెదర్ పర్సులు వంటివి తయారు చేస్తున్నాడు. ఈ చర్మాలతో నాణ్యతను కోరుకుంటున్నాడు. ఏనుగులు, పులులు, జింకలు, వాటి జంతువులతో అంతర్జాతీయ వ్యాపారం జరుగుతుంది. ఏనుగు దంతాలకు, పులి చర్మానికి, జింక తోలుకు మంచి గిరాకి ఉంది. మనుషులు ధనం మీద ఆశతో అడవి జంతువులను చంపి వాటి అవయవాలను అమ్ముకుంటున్నాడు. ఇవే కాకుండా అడవులనుండి చెట్లను నరికి వాటితో ఇండ్లను నిర్మించుకోవడం, విలాసవంతంగా జీవించడానికి కుర్చీలను, సోఫా, బల్లలు వంటి వాటిని తయారు చేసుకోవడం... ఇన్ని చంపి చంపి తాను ఏనాటికి చావననుకుంటాడట అని కవి గరికపాటి మనిషి విపరీత బుద్ధిని తెలియజేస్తున్నాడు. మనిషి ఇన్ని చంపి తాను ఎన్నాళ్ళు జీవిస్తాడు మహా అంటే నూరేళ్ళు మాత్రమే కానీ తరతరాల నుండి తనను కాపాడుకుంటూ ముందుతరాల వారిని కాపాడుతున్న అడవులను, చెట్లను నరివేస్తున్నాడని కవి వివరించాడు.

**చెత్తబుట్టల షోకు ఎత్తుపీటల రీకు**
**ఏన్గు పాదమ్ముల కెగ్గుతెచ్చె**
**మృదు చర్మముల మీద ముదితలంగల ప్రీతి**
**జింకప్రాణమ్ములు చిదిమివైచె**
**బల్లపైనను గప్పు పట్టాలపై మోజు**
**మొసలి ప్రాణమ్ముల కెసరు పెట్టె**
**కొమ్ములపై వచ్చు సొమ్ములపై ఆశ**
**ఖడ్గమృగమునైన కాలరాచె.**
**చచ్చిననుగాని ఆదాయమిచ్చు ననగ**
**చంపి సంపాదనము చేయు చావువచ్చె**
**నష్టపరిహారమిత్తురు నరుని మృగము**
**చంప; నేమిత్తు రవ్వాని జంపనరులు.**

(సాగరఘోష, డా. గరికిపాటి నరసింహారావు)

ఎన్ని రకాల జంతువుల్ని మీ వ్యాపారం కోసం చంపుతున్నారో వింటే ఆశ్చర్యంగా ఉంటుంది. భారతదేశంలో ఏనుగులను చంపి వాటి కాళ్లను నరికి ఎగుమతి చేస్తుంటే, ఆ కాళ్లను మధ్యలో తొలిచి వాటిని చెత్త బుట్టలుగా... ఉపయోగిస్తున్నారు అగ్రరాజ్య మహానుభావులు.

మృదువైన చర్మాలంటే పాపం మీ ఆడవాళ్లకి చాలా ఇష్టం కదా! ఈ మెత్తదనం కోసం భయంకరంగా కడుపుతో ఉన్న కుందేళ్లను చంపి, లోపలి పసికూనల చర్మంతో పర్సులు తయారుచేస్తున్నారు. మొసళ్లని చంపి వాటి చర్మంతో టేబుల్ క్లాత్లను తయారుచేస్తున్నారు. కొమ్ముల మీద వచ్చే సొమ్ముల మీద ఆశ ఖడ్గ మృగాలను కూడా కాలరాసేసింది. చచ్చినా కాని ఉపయోగపడే వాటిని చంపి. మరీ సంపాదిస్తున్నారే!

అవునయ్యా ఒక్క ప్రశ్న. క్రూర జంతువులు మనుషుల్ని చంపితే మీ ప్రభుత్వం నష్టపరిహారం ప్రకటిస్తుందే – మరి మనుషులే ఈ జంతువులని చంపితే వాటికి ఏం నష్టపరిహారం ఇస్తారయ్యా!

**పక్షి ప్రాణులన్ని పలహారమై పోయె**
**చెట్ల పొదల గూళ్ళు చెదిరి పోయె**
**పర్యవరణ మెల్ల పాడెయె నేడును**
**పుడమి తల్లి నదుల పుణ్యవేణి**

*(పుడమి తల్లి, సామలేటి లింగమూర్తి, పుట. 25)*

పర్యావరణ కాలుష్యం వలన ఎంతటి అనర్థాలు జరుగుతున్నాయో మనం ఉహించుకుంటేనే భయం వేస్తుంది. నేడు పెద్దపెద్ద నగరాలలో మనం చూసినట్లయితే ఢిల్లీ, కలకత్తా, ముంబాయి, పూణే, హైదరాబాద్ వంటి నగరాలల్లో విపరీతమైన వాహనాల పొగ కాలుష్యం, ధ్వని కాలుష్యం జరుగుతుంది. అక్కడవుండే పక్షులు ఆ పొగబారిన చెట్లమీద నివసిస్తూ కాలుష్యమైన పొగ పీలుస్తూ అనేక

రకాలైన వ్యాధులతో ఎన్నో పక్షులు మరణిస్తున్నాయి. అదేవిధంగా సెల్‌ఫోన్ల టవర్ల వలన ఎన్నో రకాల పక్షులు మరణిస్తున్నాయి. చెట్లను నరకడం వలన పక్షులు ఆవాసంగా ఏర్పరుచుకున్న గూడు చెదిరి పోతున్నాయి. వాటికీ గూడు సరిగ్గా లేక పక్షులు పక్షులు నిలబడటానికి అవాసాలు లేక కరెంటు తీగలపై వాలుతూ కరెంటు బారిన పడి ఎన్నో పక్షులు మరణిస్తున్నాయి. ఇప్పటికే ఎన్నో రకాల పక్షులు మాయమైపోయాయి. ఇలా నిర్లక్ష్యం చేస్తే రేపు మన పిల్లలకు ప్రత్యేకంగా పక్షులను చూసే అవకాశమే ఉండదు. భవిష్యత్తులో పిల్లలకు చిత్రపటాలు చూపించి ఇదిగో ఇలా ఉంటుంది ఈ రకం పక్షి అని చెప్పవలసిన పరిస్థితి ఏర్పడుతుంది.

**తుది వాయువీచిక చెదపట్టి చెడిపోయి**
**అంతరించెడివేళ అర్థమగును**
**జీవప్రవాహాల చివరి బిందువు కూడ**
**విషతుల్యమౌ వేళ వెల్లడియగు**
**చిట్టచివరి చెట్టు పట్టు తప్పిన వేళ్ళు**
**కూలిపోయెడి వేళ తేలిపోవు**
**కదలి కడుపులోని కడపటి చేప మీ**
**వలలోన పడువేళ తెలియనగును.**
**సృష్టి ధనరాశి కంటె విశిష్టమనుచు**
**ప్రకృతి భగవంతుడిచ్చిన వరమటంచు**
**తెలిసి చేసెడిదేమి? మీ తెలివి మాలి**
**నట్టి పనులకు ఒక చుక్క పెట్టు డిపుడే.**

ఈ సృష్టిలో ప్రకృతి పంచ భూతాలు భూమి, నీరు, వాయువు, అగ్ని, ఆకాశం, ఈ భూమి మీద అడవులు వృక్షాలు, జంతువులు, జలసంపద, వీటితో మనిషి ఈ భూమి మీద జీవిస్తున్నాడు. మనం పుట్టినప్పటి నుండి మరణించేంత వరకు వీటితోనే జీవిస్తున్నాం. ఇందులో ఏ ఒక్కటి లేకున్నా ఈ భూమి మీద మనం బతుకజాలం మనుషులు మితీమీరిన అహంకారముతో అవసరానికంటే ఎక్కువగా అడవుల సంపదను, జల సంపదనను, వినియోగిస్తూ నాశనం చేస్తున్నాడు. ముందు తరాలవారికి భవిష్యత్తు లేకుండా చేస్తున్నాడు. అవసరం ఉన్న లేకున్నా మోటారు సైకిల్, కారును ఇంకా ఇతర వాహనాలను వినియోగిస్తున్నాడు. గాలి కలుషితం చేస్తూ విచ్చలవిడిగా ఇంధనంను ఖర్చు చేస్తున్నాడు. సముద్రం వంటి జల సంపదను కూడా నాశనం చేస్తున్నాడు. ఇంధనం బయటకు తీస్తున్నప్పుడు సముద్రంలో ఉన్న వీళ్ళు కలుషితం అవడమే కాకుండా జలజీవరాసులు కూడా చాల మరణిస్తున్నాయి. భూమి వేడెక్కి వాతావరణం సమతుల్యం దెబ్బతిని భూమి మీద వివిధ రకాలైన తుఫానులు, భూకంపాలు, సునామీలు, వర్షాలు సరిగ్గా పడకపోవడం. వంటివి అనర్థాలు జరుగుతున్నాయి. గరికపాటి వారు ఈ భూమి మీద చివరి నీటి బొట్టు కూడా విషంగా మారినప్పుడు మనిషి యొక్క



బ్రతుకు అగమ్య గోచరంగా మారుతుందని ఈ సృష్టి భగవంతుడు ఇచ్చిన వరంగా భావించి జాగ్రత్తగా కాపాడుకోవాలని, లేకుంటే ఈ విశ్వం మీద మనిషికి బ్రతికే హక్కులేదని ఇప్పటికైనా మనిషి ముందు జాగ్రత్తగా నీరు, అడవులను, జలసంపదను, కాపాడుకోవడం మొదలు పెట్టాలని చెట్లను నాటడం చేయాలని కవి ఆవేదనను వ్యక్తం చేస్తున్నాడు.

**ఏక్షణమందు ప్లాస్టికు మహీతలమందున కాలుమోపెనో**
**ఆ క్షణమందె ఈ ధరణి యంతయుమారెను చెత్తకుండిగా**
**మోక్షములేదు దీనికిక, ముద్దలు తక్కువ మూతలెక్కువై**
**అక్షయమయ్యె చెత్త, యదియంటిన చాలు పశుల్ నశించెడిన్**

(సాగరఘోష, డా. గరికిపాటి నరసింహారావు, పుట.248)

ప్లాస్టిక్ ఈ ధరణీ తలంలో ప్రవేశించిన దగ్గర నుంచి భూమి మొత్తం ఒక చెత్త కుండీలా తయారయింది. దీనికి మోక్షం ఉందా? ముద్దలు తక్కువ, మూతలు ఎక్కువ అన్నట్టుగా ఉంది పరిస్థితి. మీకు కావలసింది చిన్న బ్రష్, దానికి ఒక అట్ట పెట్టె, దానికొక ప్లాస్టిక్ సంచి, ఇవన్నీ కలిపి పట్టుకెళ్లడానికి మరో ప్లాస్టిక్ సంచి, ఆ బ్రష్ తీయగానే ఇవన్నీ చెత్తలోకి వెడతాయి. ఈ రకంగానే చెత్త ఎక్కువవు తోంది. గడ్డితో, ఆహార పదార్థాలతో కలిసిపోయిన ఈ ప్లాస్టిక్ సంచులు తిని వేలవేల పశువులు చనిపోతున్నాయని అందుకే ఈ ప్లాస్టిక్ కవర్లనుగానీ, వస్తువులను గానీ వాడకుండా నారసంచులను, పేపర్‌తో చేసిన కవర్లను వాడుతూ మార్కెట్‌కు వెళ్ళిన ఖాళీ చేతులతో వెళ్ళకుండా సంచులనుగానీ, టిఫిన్ బాక్స్‌లను గానీ వెంటతీసుకెళ్ళాలి. ప్లాస్టిక్ పెనుభూతాన్ని అరికట్టి ఈ భూమిని కాపాడాలని రచయిత మనకు హితవు పలికారు.

**కాలుష్యం**

ఈరోజు కాలుష్యం ప్రపంచ దేశాలన్నింటినీ వేధిస్తున్న సమస్య మానవ జాతి మనుగడ అదృశ్యం చేసే బలమైన దుష్టశక్తుల్లో మొదటగా పేర్కొన్నబడేదే కాలుష్యం అందుకే మానవజాతి మేల్కొంటేనే పాలకవర్గాలు కళ్ళు తెరిచి మొదటి ప్రాధాన్యతగా కాలుష్యాన్ని ఎదుర్కొంటే మానవజాతి తలపై ఇది భస్మాసుర హస్తమై కూర్చుంటుంది. మరో 100 ఏండ్లలో మానవుని ఆనవాళ్లు కూడా భూగోళంపై లేని స్థితి దాపరిస్తుందని స్టీఫెన్ హాకింగ్ చెప్పాడు. ఈ

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 1 (52) హైదరాబాద్ నవంబర్ : 2023



కాలంలో వేరే గ్రహంపై మనిషి బతికే పరిస్థితులు ఉన్న ఏమో కనుక్కొని అక్కడ వెళ్లడం సాధ్యం కాదని తేలిపోయింది. అందుకే ఈ భూమిని రక్షించుకోవాలి. మానవ వినాశానికి కారణాలైన ప్రపంచ యుద్ధాలు తీవ్రవాదం వైరస్ లాంటి వల్ల భారీ నష్టాలే జరిగిన జరగబోతున్న కాలుష్యం చేసే నష్టం కోలుకోలేనిది. అందువల్ల ప్రపంచ దేశాలన్నీ కాలుష్య సమస్యలు ప్రథమ బాధ్యతగా తీసుకొని సమస్యను బాధ్యతగా తీసుకొని కలిసికట్టుగా చర్యలు తీసుకోవాలి. ప్రతి సంవత్సరం బడ్జెట్లో పెద్ద ఎత్తున నిధులను కేటాయించాలి.

ఇంతవరకు మనం భూమి అగ్ని వాయువు నీరు గాలి, ఆకాశం లాంటి పంచభూతాలను ప్రకృతి హరితహారాన్ని నాశనం చేస్తున్న శక్తులను అందుకు గల పరిష్కార మార్గాలు గురించి వచ్చిన కవిత్వంలో పరిశీలించాలి ప్రభుత్వాలు తీసుకుంటున్న స్వచ్ఛభారత్ హరితహారం లాంటి పథకాల ప్రయోజనాలను చూసాం. వాటిపై వచ్చిన కవిత్వాన్ని విశ్లేషించాం. చెట్లు ఊరు పచ్చదనం పరిశుభ్రత పకృతి ప్రకృతిగా సౌందర్య అలసితంగా ఉంచడం లాంటి అనేక విషయాలపై వచ్చిన కవిత్వాన్ని విశ్లేషించారు. పర్యావరణాన్ని కాపాడుకోవడటంలో ఇవన్నీ ఎలా దోహదం చేస్తాయో విశ్లేషించారు.

ఇప్పుడు కాలుష్యకారకాలను పరిశీలిద్దాం. ప్లాస్టిక్, డ్రైనేజీ పరిశ్రమల సీరియస్ భూమిని నీటిని కాలుష్యం చేయడం, ఆహార పదార్థాల కాలుష్యం, మనస్తత్వాలు కార్పొరేట్ కాలుష్యం, మార్కెటింగ్ కాలుష్యం, మనిషి కాలుష్య మనుష్యుడై ప్రమాదకారిగా మారడం లాంటి అనేక విషయాలను పరిశీలిద్దాం. సామాజిక బాధ్యత గల రచయితలు కాలుష్యంపై విశేషంగా స్పందించి పాఠకుల హృదయాలు స్పందించేలా రాసినటువంటి కవితలను కూడా విశ్లేషిద్దాం.

ప్రాణ్ రావు రాసిన 'హంసగీతి' కవిత సంపుటి పర్యావరణ కాలుష్య సమస్యలపై రాయబడిన కవితల్లో అతి ముఖ్యమైంది. అందులో నేను కవిత మనిషి తనకు తెలిసి తెలియకుండానే ఉద్దేశ పూర్వకంగానూ పర్యావరణ వినాశనానికి ఎలా కారకుడు అవుతున్నాడో చెప్పిన కవిత.

**"నేను అనే మనిషి మరుగజేసే ఏమంత బలవంతుడు కాదు**
**కానీ ఈ భూమిని నా కనుసన్నల్లో నిలుపుతాను**
**ఆకాశానికి బొక్కెలు పెడతాను**
**ఎన్నిటినో అంతం చేస్తాను"** (ప్రాణ్ రావు – హంసగీతి)

ఓజోన్ పొర విచ్చిన్నం లాంటి దుశ్చర్యలకు మనిషి కారణం. మనిషి సింహం లాంటి జంతువుల ముందు దుర్బలుడైనా సింహాలను వేటాడుతున్నాడు. పాదరసం లాంటి బుద్ధితో తెలివితేటలున్న మెదడుతో లోకానికి ఉపయోగపడే పనులు కాక విధ్వంసం సృష్టిస్తున్నాడు. కిచకిచలాడే పిచ్చుకలు, వాతావరణ పరీక్షలు, యాంత్రిక నాగరికతతో కనబడకుండా పోయాయి. మనిషి వల్లే ధ్వని కాలుష్యం, మనిషి వల్లే ప్రకృతి ముద్దుబిడ్డలైన వాగులు వంకలు, చెరువులు మోటబావులన్నీ కనుమరుగయ్యాయి. ఇవన్నీ కాలుష్యభరిత మైపోయాయి. ప్రతి చోట కాంక్రీటు నివాసాలు ఎక్కువైపోయాయి.

**"కొండలు పర్వతాలు అవధూతలయ్యాయి**
**నగ్నంగా నిలిచాయి**
**తమ గుండెల్లో బాంబులు నింపి**
**బ్లాస్టులు చేస్తున్న మనిషికి**
**ఈ యాంత్రిక మనిషికి**
**కనువిప్పు కలుగజేసేదేమోనని**
**కల్లోల పడుతున్నాయి"** (ప్రాణ్ రావు – హంసగీతి)

వీటన్నింటికీ కారణం మనిషి ఆశా దురాశ అభివృద్ధి పేరును కలిగి ప్రకృతి విధ్వంసం "అయితే ఈ కాలుష్యం అందరిని హత్య చేసి ఏకైక వారసుడిగా నిలుస్తుంది. జీవజాలం లేని భూమిని తన దుర్గంధ చట్టాల్లో ఎదగనంతగా బిగుస్తుంది"

కాలుష్యం కాటుకు మానవజాతి అంతమైతే మిగిలేది జీవజాలం లేని భూమి స్మశాన భూమి.

**"నా మీద పడిన వీడి భస్మాసుర హస్తం**
**రేపు వీడి మీద వాలుతుంది**
**వీడిని బూడిదగా మారుస్తుంది**
**వీడు నా బిడ్డలలో**
**చివరగా వచ్చాడు మొదటై పోతాడు"**(ప్రాణ్ రావు – హంసగీతి)
అని వాపోతోంది భూమాత.

భూమిపై పుట్టిన జీవరాశుల్లో చివరగా పుట్టింది మనిషే కానీ ఆ మనిషి చేస్తున్న ప్రకృతి విధ్వంసం మనిషినే ముందు తీసుకుపోతుందని దుఃఖిస్తుంది. భూమాత పర్యావరణ విధ్వంసకుడైన వీడు ఒంటరిగా పోడు. నా బిడ్డలందరినీ నాతో సహా చంపి చస్తాడు. హ్యూమన్ టచ్ పరిశోధనలు చేసిన మానవజాతిని నిలబెట్టాలని చూస్తున్న శాస్త్రవేత్తలు హెచ్చరించిన మానవజాతి విధ్వంసం మనిషి చేసే కాలుష్యం పనుల వల్ల జరుగుతుందని భూమాత దుఃఖిస్తుంది.

'కాదేది కవితా కనర్హం' అన్నాడు శ్రీశ్రీ. కానీ కాదేది నీ నాశనానికి

అనర్థం. ఇది నేటి మానవుని సూక్తి. మంచి చెడు మరిచిన మానవ మృగం మంచి చెడు మరిచి, వినాశకాలే విపరీత బుద్ధి అన్నట్టు మనుషులు చేస్తున్న ప్రకృతి విధ్వంసం చేసే దిశగా సాగుతుంది. పర్యావరణ భూగోళాన్ని, మానవ జాతిని రక్షించుకోవాల్సిన అవసరం ఉంది.

వామనుడిలా పెరిగి పోయిన మనుషులు అడవులను చెరువులను వాగులను వంకలను ఆక్రమించుకున్నాడు. చెట్లను గుట్టను కూడా తమవే అని కొండలను సైతం పిండి చేస్తున్నారు.

**"భూగర్భాన్ని ఛేదించి విషజలాలు నింపాడు**
**సముద్రం మథనం చేసి మృత్యువును కౌగిటపట్టాడు**
**గాలిని ఉక్కిరిబిక్కిరిచేసి రోగాలను సృష్టించాడు**
**ఎరువులకు నెరవేసి క్రిమి కీటకాలను చంపాడు**
**పాటల పక్షుల స్వరపేటికలను చిదిమేశాడు**
**తింటున్న అన్నంలో కాలకూట విషం నింపాడు"**

ఇన్ని రకాల కాలుష్యాలు చేసిన మనిషి దాచుకున్నది ఏమిటి? బ్యాంకుల్లో కూడబెట్టుకున్న ధనం మానవజాతిని కాపాడుతాయా. మనిషి చేసిన, చేస్తున్న విధ్వంస చర్యలు, పంచభూతాల కాలుష్యం మానవజాతికి అత్యంత ప్రమాదకరంగా మారింది. మనిషి తన ప్రవృత్తిని మార్చుకొని పర్యావరణ పరిరక్షణ దిశగా దృష్టి పెట్టాలన్న సందేశాన్ని ఇస్తున్నాయి. తుమ్మూరి రామ్మోహన్రావు తాలిమి కావాలి అనే కవిత ద్వారా కాలుష్య విశ్వరూపాల్లో మనో కాలుష్యం ఉందని చెబుతున్నాడు.

**"చెత్త పేరుకుపోయింది వీథుల్లో సరే**

**మనుషుల మనసులో నిండా కూడా"** అని ప్రారంభిస్తాడు. వీధుల్లో కూరుకుపోయిన చెత్తను తొలగించవచ్చు. కానీ కాలుష్యభరితమైన మనిషిలో నిండా కూరుకుపోయిన కాలుష్యాన్ని ఎలా తొలగించడం? మనిషి మనో కాలుష్యమే అతిపెద్ద ప్రమాదకారి. మనిషి మనసు కాలుష్య భరితమైందని చెప్పడానికి అతడు చేస్తున్న చెట్లు అడవులు నరకడం, అభివృద్ధి పేరు మీద పంట భూములను కాంక్రీట్ వనాలుగా మార్చడం, భూములు ఆక్రమణ ఇంకుడు గుంతలు లేని ఇల్లు అధికారులు అలసత్వం డబ్బులు ఇచ్చి సరిదిద్దడం లాంటి పనులు ఉదాహరణగా చూపవచ్చు.

**"దేశం నిండా మూసి వంటి మురికి నదులు ఎన్నో**
**కాలుష్యాన్ని కడుపులో దాచుకునే హుస్సేన్ సాగర్‌లో**
**ముసిరే ఈగలు దోమలను లెక్కచేయని మురికివాడ లెన్నో**
**కూలిన వాసనల గళ్ళు ఎన్నెన్నో"**

ఇలాంటి అనేక కాలుష్యాలకు తోడుగా మనసులు కూడా కాలుష్యభరితమై మనిషి అరిషడ్వర్గాలను జయించకుండా ఆరాధిస్తున్నాడు. వాతావరణ, నీటి కాలుష్యాలతో పాటు మనం అన్ని కాలుష్యాల్ని జయించాల్సిన అవసరం ఉందని చెప్పే కవిత.




అక్షర దీపాలు పర్యావరణ కవితా సంకలనంలో మాధవి సనారా రాసిన కాలుష్య దీపం అనే కవితలో వస్తువులు, నీరు, చెట్టు అన్ని కాలుష్యం బారినపడి నలిగి పోతుంటే కన్నీరు కార్చడం తప్ప ఆ దీపాన్ని ఆర్పే ప్రయత్నం చేయడం లేదన్న విషయం తెలుస్తుంది.

భూగోళం మొత్తాన్ని కాలుష్య భరితం చేస్తున్న కారకాలలో ప్లాస్టిక్ ప్రధానమైందన్న విషయం జగమంతటికి తెలుసు. ప్లాస్టిక్ కాలుష్యం ఇందుగలడందు లేదని సందేహము వలదు అన్నట్లు, చెంచాలు, టీ కప్పులు, గ్లాసులు, ప్లేట్లు, బకెట్లు, బిందెలు, సంచులు, పాల ప్యాకెట్లు, బిస్కెట్ ప్యాకెట్లు, వాహనాలు, గృహపకరణాలు, పెన్నులు, బట్టలు, అలంకార వస్తువులు ఇంకా బయట ఆఫీసుల్లో అంతట వ్యాపించి ఉంది. ప్రతిరోజు వేల లక్షల టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు రాశులుగా పడుతున్నాయి. ఇవి కాగితంలా, కట్టెలా మట్టిలో కలిసిపోవు. కాలిస్తే కాలవు. 1000 సంవత్సరాలు నశించకుండా ఉంటాయి. ప్లాస్టిక్ కాలుష్యం ఇప్పుడు ప్రపంచ సమస్య. జంతువులు ఇవి తిని చనిపోతున్నాయి. ఇది క్యాన్సర్ కారకం కూడా. ప్లాస్టిక్ వల్ల నష్టాలు పర్యావరణ సమస్య గురించి తెలివిగల కవులు బాగానే స్పందించారు. అక్షరవృక్షాలు పర్యావరణం కవిత సంకలనంలో జి. శ్రీనివాసులు రాసిన ప్లాస్టిక్ జీవితం కవితలో అనేక విషయాలు చెప్పారు.

**"మట్టిలో మమేకం చెందే నాగరికతకు**
**ప్లాస్టిక్ లతలు పల్లికిలించాయి**
**ప్లాస్టిక్ ప్రపంచమంతా పాకింది**
**ఈజిప్ట్ సంస్కృతిలా ఉన్న జీవితానికి**
**వెతల అగాథాల లోతులు చూయిస్తుంది"**

మట్టిలో మట్టిగా కలవని ప్లాస్టిక్ ప్రకృతి విరుద్ధం. పుట్టిన ప్రతి జీవి, వస్తువు పిడికెడు బూడిదగా మట్టిలో కలిసిపోతాయి. కానీ ప్లాస్టిక్ అలా కాదు. ఈజిప్ట్ సంస్కృతిలో ప్రాచీనత సౌరభవంతో ప్రకృతిలా ఉండే జీవితాలను ప్లాస్టిక్ అగాధంలోకి తోసేసింది.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 1

UGC Care List Approved Journal
హైదరాబాద్ నవంబర్ : 2023

# తండా వామనుడి త్రివిక్రమ 'బతుకు' చిత్రం

**మదన మోహన రెడ్డి బుగడూరు**, పరిశోధక విద్యార్థి, హైదరాబాదు విశ్వవిద్యాలయం. ఫోన్ : 998989 4308






ఆధునికకాలంలో ప్రపంచీకరణ ప్రభావాల ద్వారా అస్తిత్వ ఆరాట, పోరాటాల ప్రాధాన్యతలు తీవ్రతరమయ్యాయి. అందులో భాగంగా జీవిత చిత్రణల ఆవశ్యకత ఏర్పడింది. అస్తిత్వంలో సమస్యలు, సంఘర్షణలు, సవాళ్ళు మాత్రమే కాకుండా జీవనంలోని సంస్కృతి, సౌందర్యాత్మకతలను కూడా అభివ్యక్తీకరణలో భాగంగా నిలిచాయి. బహుశా ఏ వాద సాహిత్యానికైనా వీటిని దశలుగా పేర్కొనవచ్చు. సంస్కృతి, సౌందర్యాత్మకతను వ్యక్తపరచడానికి నవల, ఆత్మకథ ప్రక్రియలు అనువుగా ఉంటాయి. నవల కొంత కాల్పనికతను కోరుకొన్న ఆత్మకథ అత్యంత వాస్తవికతకు దగ్గరగా ఉంటుంది. అటువంటి ఆత్మకథల్లో ఎలెక్స్ హేలీ 'ఏడుతరాలు' నీగ్రోల జీవితాల్ని, వై. సత్యనారాయణ 'మై ఫాదర్ బాలయ్య' దళిత జీవితాన్ని, తిరుమల రామచంద్ర 'హంపి నుంచి హరాప్పా దాకా' బ్రహ్మణ జీవితాన్ని చిత్రించాయి. అదే కోవలో ఆచార్య ఎం. గోనా నాయక్ ఇటీవల రాసుకొన్న 'బతుకు' అనే దీర్ఘ కవిత తండా సుగాలీ జీవితాన్ని చిత్రించిన ఆత్మకథగా నిలవబోతుంది.

గోనా నాయక్ **'ప్రజలు చచ్చినారు వేలకు వేలు... కానీ రసజ్ఞత ఇంచుకు చావని రాయలసీమ'**లో అందులోనూ 'కరువు పిలవకుండానే పలికే' అనంతపురంలోని సింగనమల తాలూకాలోని నాగుల గుడ్డం అనే ఓ మారుమూల తండాలో భావ్యా నాయక్, గంగమ్మ దంపతులకు 1965లో జన్మించారు. గోనా నాయక్ అసలుపేరు 'గున నాయక్'. పాఠశాల ప్రవేశంలో ఉపాధ్యాయుడైన కస్తూరి రంగయ్య 'గున ఏంట్రా గున... గోన బుద్దారెడ్డి లోని గోన తీసుకొని మీ నాయక్ ని కలుపుకొని గోనా నాయక్ అని రాస్తా' అంటని పేరు మార్చారు. వాస్తవానికి గున నాయక్ అన్నది గోనా నాయక్ ముత్తాత పేరు. తాత ముత్తాతల పేర్లు పెట్టుకోవడం భారతీయ అన్ని వర్గాలలో ఆనవాయితీగా వస్తున్నదే. (సుగాలీ భాషలో 'గున' అన్న పదానికి కుట్టడం అని అర్థం)

గోనా నాయక్ బాల్యం నుంచి ఎన్నో కష్టాలు పడుతూ బతుకుపోరులో ఎక్కడి నుంచి ఎక్కడివరకు ఎదిగానన్న జీవిత మూల్యాంకనం చేసుకోన్నదే ఈ 'బతుకు' దీర్ఘ కవిత. వాస్తవానికి ఇది అతని ఆత్మకథ మాత్రమే కాదు. తన జీవితంతో ముడివేసుకొన్న స్థల, కాల, ప్రాంత, సామాజిక, సాంఘిక పరిస్థితుల ఆత్మకథ కూడా. ఈ భావనలోనే శ్రీశ్రీ తన 'అనంతం' ఆత్మకథను ఆత్మచారిత్రాత్మక జీవిత చరిత్ర అన్నాడు. గోనా నాయక్ తన శ్వాస ఆరంభం నుంచి ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయాలైన ఉస్మానియా, హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో ఆచార్యుడిగా ఎదిగిన తన జీవిత క్రమపరిణామ వికాసాన్ని తెలియపరిచేదే ఈ 'బతుకు' కవిత.

గోనా నాయక్ ఆర్థికలేమి ప్రాంతంలో పుట్టారు గాని స్వచ్ఛమైన అనుబంధాల మధ్యనే పెరిగారు. తండాకి పెద్దయనగా భావింపబడే తాత రూప్లా నాయక్ సత్యనిష్టత, తండ్రి భావ్యా నాయక్ శ్రామికత్వం, తల్లి గంగమ్మ నిరాడంబరం, చిన్నాన్న, అన్నల అవ్యాజ్య ప్రేమలు ఇవన్నీ వెరసి గోనానాయక్ జీవితానికి మార్గదర్శకాలుగా చేశాయి. తన కుటుంబం గురించి పేర్కొంటూ **'ఉమ్మడి కుటుంబం మాది/ ఊరు మెచ్చుకునే కుటుంబం మాది / మా ఇంటి పిల్లను అందుకోవడానికి / మా ఇంటికి పిల్లను పంపడానికి / ఎందరో ఉవ్విళ్ళూరే వారు'** తండాలో వారికున్న స్థానాన్ని తెలియజేశారు. ఒక వ్యక్తిపై సమాజం కంటే ఎక్కువగా ప్రభావం చూపేది కుటుంబమే. మంచి కట్టుబాట్లు, మానవ సంబంధాలు కలిగిన కుటుంబంలో పెరగడం గోనానాయక్ మంచి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుకోవడంలో దోహదపడింది. కుటుంబ సభ్యుల ఉమ్మడి మనస్తత్వాల కూటమే ఆయన వ్యక్తిత్వం. గోనా నాయక్ జీవితం నేడున్నంత పచ్చగా మొదలవలేదు. పసుల కాపరిగా, వ్యవసాయ కూలీగా, భోజనం పెట్టె కళాశాలలో విద్యాభ్యాసం వంటి పరిస్థితుల్ని ఎదుర్కొన్నారు. అలాగని బాధల్ని బరువుగా మోసుకురాలేదు. గ్రామీణ జీవితం నుంచి వచ్చినవాడు కాబట్టి ప్రతి దశని ఆస్వాదించడం నేర్చుకున్నాడు.

జీవిత పయనంలో సహకరించిన ప్రతి ఒక్కరిని కృతజ్ఞతా పూర్వకంగా పేర్కొన్నారు. బలపం పట్టించిన కస్తూరి రంగయ్య మొదులుకొని పద్య సేద్యం చేయించిన సాయికుమారి, పదోతరగతిలో తెలుగును రమ్యంగా చెప్పిన నాగముని, 'సుగాలి చరిత్ర సంస్కృతి'కి పర్యవేక్షణ గొడుగు నెత్తిపట్టిన హెచ్.ఎస్.బ్రహ్మానందం వరకు వారితో పెనవేసుకొన్న అనుబంధాన్ని కవిత్వీకరించారు. ముఖ్యంగా

హెచ్.ఎస్.బ్రహ్మానందంగారితో తనకున్న గురుభావనని **'తెలుగుకు పాదయ్యే నాలో విరబూసిన చిగురుకు, భావ సృజనకు / కృష్ణ రాయలి మాన్యంలో నా ఉన్నత విద్యలు / బ్రహ్మై బ్రహ్మానందమిచ్చె నా 'బ్రహ్మానంద' గురువు / చుక్కానియై దారి చూపి మార్గమ్ము / నందించె భారతీ సుజ్ఞాన సుగంధ గ్రంథాల నీయ / నెగబాకితి నున్నత చదువుల తరువులనంటి'** అంటూ వ్యక్తపరిచారు. గోనా నాయక్ జీవితం తీర్చి దిద్దడంలో కుటుంబం పెంపకం కంటే గురువుల వాత్సల్యం ఎక్కువగా ఉందన్న విషయం ఈ రచన ద్వారా తెలియవస్తుంది. 'ఉద్యోగ' ఒడ్డుకు చేరుకోన్నాక 'గురుభక్తి' తెప్పను తగలబెట్టే ఈ రోజుల్లో వారి మరణానంతరం కూడా 'నా బతుకు వారి జ్ఞానభిక్ష'గా చెప్పుకు తిరిగే గోనా నాయక్ శీలం కలిగిన శిష్యుడు.

బాల్యమో యవ్వనమో మనసులో ఏదో ఒకదానిపై వ్యామోహం పెంచుకోవడం సహజంగా జరుగుతుంది. మిగతా ప్రాంతాలకంటే రాయలసీమలో అధికంగా ఉండే 'పద్యం, నాటకాల మోజు' గోనా నాయక్ లో వ్యామోహం పెంచింది. పెద్దలకు కంఠం నచ్చడంతో చిన్నతనంలోనే రంగువేసి రంగస్థలమెక్కించారు. ఆ వయసుకి ఆ 'చప్పట్లు, పిన్నీసుతో గుచ్చిన నోట్లు, వన్స్ మోర్ ఈలలు' వ్యామోహాన్ని కాస్త వ్యసనంగా మార్చింది. అది ఎంతలా అంటే **'డిగ్రీ పరీక్షలో ఒక పరీక్ష నా బతుకునకు పరీక్ష పెట్టింది / బళ్ళారి జిల్లా సిందనూరు పట్టణంలో 'గయోపాఖ్యానం' నాటకం / నన్ను మాటిచ్చేలా చేసింది/ పరీక్ష వదులుకునేలా చేసింది నాటక కళకు బద్ధుడనయ్యాను డిగ్రీ పరీక్ష'** తప్పేదాక వెళ్ళింది. చదువు విలువ తెలిసి బాగుపడమని పంపిన చిన్నాన్నకు ఈ విషయం తెలిసి 'జీవితంలో దేన్నీ ఎంతవరకు తీసుకోవాలో' చెప్పిన మాటల ద్వారా గోనా నాయక్ 'పడిన చదువు' మళ్ళీ లేచి గాడినపడింది. అక్కడి నుంచి ఎప్పుడూ వెనక్కి తిరిగి చూసుకోలేదు. గోనా బతుకు మలుపులో చిన్నన్న కీలకమైన 'హ్యాండ్ పోస్ట్'. 'ఏ మివ్వగలను నా వాళ్లకు తలవంచి నమస్కరించడం తప్ప... ఆనాటి నాటకం ఈ స్మృతి పొత్తంలో ఒక కమ్మని కమ్మ'గా సాగిందన్నది గోనా జీవితంలో కీలకమైన ఎపిసోడ్.

**"సంగటికి పడుతున్న సంకటాలతో... నేను భువన విజయం రూపకానికి ఇరుసు నా పాత్రపేరు తిమ్మరుసు... సుగాలి పరిశోధన నిలిచిపోలేదు ఏ గాలి వీచిన..."** వంటి ప్రాస చమత్కారాలతో పాటు **'నా జీవితం అమ్మ చెట్టుకు కట్టిన చీర ఊయలంత భద్రంగా లేదు... నా పినతల్లి పచ్చిజొన్నల పిండి... ఉప్పు, కారం తిన్నా ఉపకారం వీడలేదు నాన్న... శ్వాస ఆగేవరకు శాశ్వతంకాని జీవితాన్ని బరువుగా కాకుండా పరువుగా మోయాలన్న ఆదర్శం తాతది... అమ్మలా సాకింది ఉస్మానియా... ఎక్కడున్నా ఈ బిడ్డ నీవాడే అనుకో తల్లి...'** వంటి మెటాఫర్లతో రంగు, రుచి తెలపని వర్షపు ధారలా సాగుతుంది ఈ ఆత్మకథ.

ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాసం వంటి నియతాలు హేతువుగా రచయిత సాధించిన రచన కాదిది. ఆశల 'పుప్పొడి' మీద నుంచి 'శ్రమ' తుమ్మెదలు జుర్రుకొచ్చి అనుభవాల తుట్టిలో పెట్టిన జ్ఞాపకాల మధురిమలివి. ఇటువంటి దీర్ఘ కవితాత్మకథ ఆస్వాదించడానికి కవితాసక్తితో సమంగా 'జీవితం'పై మక్కువ కూడా ఉండాలి. ఆధునిక తెలుగు సాహిత్యంలో గిరిజన సాహిత్యానికి వారు రాసిన కవితలు, కథలే కాకుండా వారి ఆత్మకథలు కూడా భాగమవ్వడం కొత్త చైతన్యం. ఇదే విషయాన్ని ముందుమాటలో **'తెలుగు సాహిత్యంలో ఇప్పుడు సుగాలి వీస్తోంది. నిన్న మొన్నటి 'కొండగాలి', 'తూర్పుగాలి', 'పడమటి గాలి' తరువాత 'తండాగాలి' కవితా ఋతువులోకి ప్రవేశించింది. వేల సంవత్సరాల ఆధిపత్య భావజాల కులాల హోరీరు తగ్గింది. ఒకవైపు పోరు పెరిగింది. మరొక వైపు తీరు మారింది. ఏ దృక్పథం ఎక్కువ కాలం సాహిత్యాన్ని గానీ, సమాజాన్ని గానీ శాసించలేద'**ని ఆచార్య ఎండ్లూరి సుధాకర్ పేర్కొన్నారు. ముఖ్యంగా లంబాడి సాహిత్య ప్రవంతికి చీనియనాయక్, ప్రొ. భంగ్య భూక్య, పొ. గోనా నాయక్, ప్రొ.సూర్య ధనుంజయ్, ధనుంజయ్ నాయక్, జె. రాజారామ్ మొదలుకొని యువ రచయితలైన రమేష్ కార్తీక్, బట్టు విజయ్ కుమార్ వరకు తమవంతు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు.

ఒక్క మాటలో ఈ బతుకు దీర్ఘ కవిత గురించి చెప్పాలంటే 'వెనకటి అనుభవాలు వర్తమాన జ్ఞాపకాలు'గా రాసుకొన్నవి. శ్రామిక బతుకులు కొంత వేరైనా జీవితం నడిపించే ఎత్తుపల్లాలు అటుఇటుగా అందరివి ఒకటే. ఈ 'బతుకు' వందేళ్ళ జీవితానికి పూర్వభాగం లాంటిది మాత్రమే. కీలకమైన ఉత్తరాయణం కూడా పాఠకులకు బాకీగా అందించాల్సిన బాధ్యత రచయితపై లేకపోలేదు. ఆత్మకథలు తక్కువగా వెలువడుతున్న తెలుగు సాహిత్యంలో ఈ దీర్ఘ కవిత తప్పకుండా పాఠకుల హృదయాల్లో 'బతుకు' నింపుతుందని ఆశిద్దాం.


# మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక
మూసీ మాస పత్రిక సభ్యులుగా చేరండి
వెంటనే శాశ్వత చందాదారులు కండి.
సాహిత్య రంగంలో వెలువడుతున్న ఒకే ఒక
పరిశోధనాత్మక వ్యాసాల మాస పత్రిక
యూజీసీ కేర్ లిస్ట్‌లో చేరిన తెలుగు పరిశోధనా పత్రిక
శాశ్వత సభ్యత్వం (10 సం॥లు)... 2500/-
సంప్రదించండి. మూసీ మాసపత్రిక... ఫోన్ : 934 7971177

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 1 (56) హైదరాబాద్ నవంబర్ : 2023

# 'వర్గమూలాల' శోధన

డా. వెల్దండి శ్రీధర్, ఫోన్ : 98669 77741




వర్గ మూలాలు (కవిత్వం)
జిందం అశోక్
వెల - 150 /-
ప్రతులకు : శ్రీమతి జిందం శ్రీలేఖ,
ఇం.నెం. 8-5-492/5/2, పోచమ్మ వాడ,
కొత్తిరాంపూర్, కరీంనగర్ - 505 001.
ఫోన్ : 89785 32225

"I can't think of a case where poems changed the world, but what they do is they change people's understanding of what's going on in the world."
-Seamus Heaney

వ్యవస్థతో రాజీ పడితే ఏ పేచీ లేదు. ధిక్కరించి ఎదురు నిలిచి ప్రశ్నించినపుడే గుండె లోలోపల మందుపాతరలు పేలుతాయి. నాలుగు కాళ్ల కుర్చీకి ఒక కాలు వదులు అవుతుంది. సాధారణంగా ప్రజల సామూహిక నొప్పిని ఎవరూ పట్టించుకోరు. ఒకచో పట్టించుకుంటే అతడు 'అర్బన్ నక్సలైట్' అయిపోతాడు. అమ్ముడుపోయి, మూతికి బట్టకట్టుకున్న కవులే ఎక్కువున్న సంక్షోభ సందర్భంలో యుద్ధరంగం మీద నిల్చొని రక్తం అంటిన నాలుగు కవితా వాక్యాలు రాయడం పెద్ద సాహసం. మనిషి అస్తిత్వంలోనే స్వేచ్ఛ ఇమిడి ఉంది. భావప్రకటనా దారులున్నాయి. వాటిని అణచిపెట్టి మనల్ని మనం సంకెళ్లలో బంధించుకుంటున్నాము.

ప్రతి కవి హృదయంలో ఎన్నో దు:ఖ సముద్రాలు ఉప్పొంగు తుంటాయి. లోకంలోని ఎన్నో దృశ్యాలు సుతిమెత్తగా మనసు మీద గాయాల్ని చెక్కుతూ వెళ్తాయి. ఎన్నో అనుభవాలు వెతల తెరను కట్టి కన్నీళ్ల సెలయేళ్లను ముంగిట నిలుపుతాయి. తనకు సమాజానికి ఎడతెగని పోరు మొదలవుతుంది. పిడికెడు అక్షరాలకు ఆయుధపు పదును పూసి ఎక్కడికో చేరవేయాలని తాపత్రయపడుతాడు. ప్రజల స్వప్నాల్ని, దు:ఖోద్వేగాలను సొంతం చేసుకొని చీకటిదారులకు వెలుతురు రంగుపూస్తూ పయనిస్తాడు. జీవితాన్ని,అందులోని ఆర్ద్రమైన సందర్భాలను అక్షరీకరించాలని పట్టుదలతో, మనసు పుందు పుండౌత సలపరం పెడుతున్నపుడు కవిత్వపు జీవధారకు ప్రాణం పోస్తాడు. దారి దొరకక సామాన్యుడు కృత్రిమ మాయాజాలంలో చిక్కుకుపోయి తన్లాడుతున్నపుడు అతని చేతికి టార్చిలైట్ ఇచ్చి చుట్టుకుపోయిన పోగులకు పాపుతూ ముందుకు తీసుకెళ్తాడు.

శత్రువు ఎదురుపడి ఖడ్గంతో దేహాన్ని ముక్కలు ముక్కలు చేసినా పరవాలేదు. కాని కనిపించకుండా ఎక్కడో దాక్కొని మౌనంగా బాకుతో వెన్నులో కుమ్మితే ఆ బాధ వర్ణనాతీతం. దాన్ని పట్టి చూపడమూ కష్టమే. ఈ గుట్టు విప్పిన కవులు చాలా తక్కువ మంది ఉంటారు. మూలాల్ని శోధించి మన 'వర్గమూలాలు' ఇవీ అని అరచేతిలో ఆరుద్రపురుగులను ప్రత్యక్షం చేసేవాళ్లు అరుదుగా ఉంటారు. అలాంటి నాగేటి సాళ్ళల్లో నడుస్తూ అప్రమత్తత నేర్చే కవి జిందం అశోక్.

లోకరీతిని, మానవీయ పొరలను, మనుషుల నిర్లిప్తతను, మందకోడితనాన్ని చాలా జాగ్రత్తగా అక్షరాలకెత్తి దివిటీలా చూపెడుతాడు. 'రాజులు కూర్చున్న సింహాసనం, మూలాలతో పెకిలించి నరికిన పచ్చని చెట్టని బోధించిన 'నెలబాలిక' పిడికిలిలో కూడా విప్లవాన్ని కలగంటాడు. పొట్టచేత పట్టుకొని నిరాయుధురాలిగా చేనేత గూటికి చేరుకున్న పండుటాకులను చూసి పగిలిపోతాడు. సిరిసిల్లలాంటి 'అగ్గిపెట్టెలో ఇమిడ్చిన చీర ప్రపంచ వాకిట్లో సింగులుగా ముడిచిన ప్రాంతం'లో కాటన్ గుడ్డ కఫన్‌గా తొలిగిపోని స్థితిని ఎండగడుతాడు. కొయ్యగుర్రంలాంటి రాజ్యపు ఉదాసీనతను, మనుషుల పట్టీపట్టనితనాన్ని ప్రశ్నిస్తాడు. కర్తవ్యాన్ని బోధిస్తాడు. **'గుండె గుండెకు సంకోచ వ్యాకోచాలు సర్వసాధారణం. గుండె చప్పుళ్లన్నీ ఒకే లయబద్ధం కావద్దూ'** అని అందరి బాట ఒకటే కావాలని ఆకాంక్షిస్తాడు.

ముంపు గ్రామాల ప్రజలు 'జకముక' రగిలించాలని కొత్తదారి చూపుతాడు. పుట్టిన ఊరును, దాని చుట్టూ పరుచుకున్న అనేక జ్ఞాపకాలను, తోటి మనుషులతో అల్లుకున్న సంబంధ బాంధవ్యాలను జారవిడుచుకొని ఎక్కడికో తరలిపోవడం వెనుక దాగివున్న విషాదాన్ని గుండెకు పంచుతాడు.

**"తల్లికి పిల్లను / పిల్లకు తల్లిని వేరు చేసే క్రమం**
**నేలను వనరులను**
**నీడను గూడును కనుమరుగు చేసే క్రమం"**

అర్థం చేసుకోవాలని కుట్రను పసిగట్టి హెచ్చరిస్తాడు. ఎన్నో గ్రామాలను మింగి బొర్రవిరుచుకొని నిలబడ్డ ప్రాజెక్టుల వల్ల ఎన్ని ఎకరాలకు నీటి పారుదల సౌకర్యం కలిగిందో కాని అక్కణ్ణుంచి ఖాళీ చేసి పుట్ట బెదిరి తలో దిక్కు చెదిరిపోయిన ప్రజల కన్నీళ్లు మాత్రం నిశ్శబ్దంగా ఇంకా పారుతూనే ఉన్నాయి.

ఆధునిక మానవుడు ఎన్నింటికో బానిస అయిపోయి తనను తాను మూసేసుకుంటున్నాడు. టీవీ, ధూమపానం, మద్యం, పదవులు ఇలా బానిసత్వానికి ఎన్నో రూపాలు.

**"చెవిపై చేయి పెట్టి / టవర్ సాక్షిగా**
**ప్రమాణం చేస్తున్నాము / మేమంతా మొబైల్‌కు బానిసలం"**

అత్యాధునిక శాస్త్ర సాంకేతికత వెంట పరుగెత్తి మనిషి రోజుకింత ఆలోచన నశిస్తున్న జీవిగా మారిపోతున్నాడు. డిజిటల్ కూపంలో కూరుకుపోతున్నాడు. ఏలిన వారికి కావాల్సింది కూడా ఇదే. ఆ

విషయాన్ని గమనించే సోయిలో లేడు మనిషి. తెల్లవారి దగ్గరి నుంచి రాత్రి దాకా ఏదో చేతబడి చేసినట్టు ఎన్నో విషయాలకు బానిసై పోతున్నాడు. కాళ్ళ కింది మట్టిని కూడా గుంజుకుపోతున్న సంగతిని గ్రహించలేకపోతున్నాడు. ఇదొక విషాద దశ.

ఇప్పుడు ఏ మనిషికీ 'పరిసరాల విజ్ఞానం' లేదు. మన చుట్టూ ఏం జరుగుతుందో తెలుసుకునే స్థితిలో ఎవరూ లేరు. 'మన ఒద్యారం గుట్టలను మాయం చేసింది, ఇసుకను తోడుక తింటున్నది, నది పరివాహ ప్రాంతాలకు విషమిస్తున్నది, రాజ్యం బతుకుదెరువులో భాగమే' అందుకే 'రాజ్యమే పెద్ద విధ్వంసకారి' అని తేల్చి చెప్తాడు కవి. 'ఇప్పుడు మనందరి శత్రువు ఒక్కడే. మనిషి వాని తాలూకు రాజ్యం'. బుల్డోజర్ కల్చర్ రోజురోజుకూ విస్తరిస్తోంది.

గత రెండు దశాబ్దాల మనిషి ప్రస్థానం, అతని వక్రబుద్ధి, స్వార్థం, రైతు కష్టాలు, భజనపరుల సంకీర్తనలు, ప్రపంచీకరణ ఇనుపపాదం పర్యవసానాలు, ఎన్నికల్లో నోటుకు అమ్ముడుపోయి ఓడిపోతున్న ఓటరు దీనత్వం, మీడియా ఓవరాక్షన్, సెల్‌ఫోన్లో గంటల కొద్దీ మాట్లాడే మనిషి ఇంటి మనుషులతో ప్రత్యక్షంగా మాట్లాడటానికి చేసే మొరాయింపు, పతనమవుతున్న రాజ్యాంగం కల్పించిన విలువలు, అవినీతి, చట్టసభల్లో మహిళలకు ముప్పైమూడు శాతం రిజర్వేషన్ కల్పించలేని పురుషాధిపత్యం, చిన్నపిల్లల డిస్కో డాన్సుల వెకిలితనం, వృద్ధాప్యపు ఈతి బాధలు, మనిషి అంతిమ ప్రయాణపు తాత్త్వికత ఇలా ఎన్నో పార్శ్వాల మీద కవి తనదైన వ్యాఖ్యానాన్ని చేసి సగటు మనిషి బుద్ధిలోని బూజును దులుపుతాడు.

సమీప బంధువులు అకాలంలో రాలిపోతే ఎలిజీలు రాయాల్సి రావడం జీవితకాలంలో అదొక బాధా శకలం. **'తెగినపేగు'**, **'హరి నామ స్మరణ'** పేర రాసిన రెండు స్మృతి కవితలు నిజంగానే మనసును మెలితిప్పుతాయి. ఈ సంపుటిలో ఉన్న రెండు విలక్షణమైన కవితలు **'సుప్రభాతం'**, **'ఆకుపచ్చని బంగారం'**. జ్వరపీడితునిగా ఉన్నప్పుడు బంధుమిత్రుల పలకరింపుల గాఢతను 'ధర్మామీటర్'తో కొలిచే కవిత **'సుప్రభాతం'**. పల్లెలో మొలిచిన చెట్టును గురించి, కదలకుండానే అది చేసే నిశ్శబ్ద సేవ గురించి **'హలంగా వేల ఎకరాలకు పచ్చని పైట నేస్తోంది. కలంగా లక్షల మెదళ్ళలో కదలిక తెస్తోంది'** అని అనడంతో రైతుకు, కవికి చెట్టు పరోక్షంగా ఉపయోగపడుతున్న తీరు చిత్రితమైంది.

గడిచిన రెండు దశాబ్దాలలో భారతదేశంలో జరిగిన అతిపెద్ద ఉద్యమం ప్రత్యేక తెలంగాణ మలిదశ ఉద్యమం. మన కాలంలో మనం చూసిన గొప్ప చారిత్రక విజయం. ఆ కాలంలో ఇక్కడి కవులు, కళాకారులు, రచయితలు అనివార్యంగానే తెలంగాణను పలవరించారు. తమ కవిత్వం, పాటల ద్వారా పదునెక్కించారు. ఈ సందర్భంలో జిందం అశోక్ కూడా విలువైన కవిత్వం రాయడం గమనార్హం. ఈ కవితా సంపుటిలో అయిదు కవితలు తెలంగాణ ఉద్యమ కేంద్రంగా రాసినవే ఉన్నాయి. ప్రతి కవిత కాలికి కట్టుకున్న గజ్జెల సవ్వడిలాగా, డప్పుల దరువులాగా గుండెను ఆసాంతం కదిలిస్తుంది. ఉద్యమం నెమ్మదించినపుడు ఉద్యమకారులు ఆత్మహత్యలైనా చేసుకొని ఉద్యమాన్ని వేడెక్కించారు.

**"భూతల్లీ ఏడ్వకు! / నీ పేగు తెంపుకొని దూరమైన త్యాగధనులు సాహిత్యకారుల కలాలకు / బచ్చలిపండ్ల 'సిరా'గా మారుతారు ప్రతి దసరా పండుగకు / పాలపిట్టగా ఊరూరికి దర్శనమిస్తారు"**

వస్తు విస్తారంతో పాటు పాటించిన శిల్పమే కవిని నాలుగు కాలాలపాటు పాఠకుల మదిలో నిలుపుతుంది. చాలా మంది కవులు కొత్తగా చెప్పాలని ప్రయోగ వైవిధ్యం కోసం తాపత్రయపడుతుంటారు. జిందం అశోక్ వాటి జోలికి పోకుండా చాలా సాదాసీదాగా చెప్తాడు. భాష కోసం, పదచిత్రాల కోసం ఆరాటపడడు. వాటికవే వచ్చి ఆయా సందర్భానుసారంగ వాక్యంలో కూర్చుంటాయి. సాగదీయడం, వాక్యాలను విరగ్గొట్టడం, అతికించడమనే ప్రక్రియకు పాటుపడడు. ముక్కుసూటిగా చెప్పడమే ఈ కవి అలవాటు. విలోమ సమాజ మర్మాన్ని కనుక్కోలేని వాళ్లు ఇలాంటి శిల్పం ముసుగులోనో, పదచిత్రాల తెరచాటునో దాగుంటారు. భాషా ప్రయోగాల కోసం ఉబలాటపడుతారు.

నిజమైన కవిత్వం జీవితపు పునాదుల నుంచి వస్తుంది. అలాంటి నిక్కచ్చి కవిత్వానికి నిదర్శనమే ఈ కవితా సంపుటి. **'రాజ్యం నీకేమివ్వదు, రాజ్యానికి నీవే ఒక దీపస్తంభమై నిలువు'**, **'అవినీతి మంటలకు అధికారుల ఆమ్లజని ఎక్కువవుతుంది. ఆర్పడానికి నీతివంతమైన యువ ఫైరింజన్లు కావాలి'**, **'నిస్వార్థ భావజాలం కవిత్వమై అంకురిస్తుంది'**, లాంటి వాక్యాలు జిందం అశోక్ దృక్పథాన్ని పట్టిచూపుతాయి. ఆక్సీజన్ స్థూపమాలిక, విత్తన గుళిక, పిడికిళ్ల నడకలు లాంటి పదచిత్రాలు ఆయన కవిత్వ నాణ్యతకు ఆనవాళ్ళుగా నిలుస్తాయి. నూరు పుటల ఈ కవితా సంపుటిలో ఎన్నో సిమిలెలు, పారడాక్స్‌లు పాఠకుడిని కొత్తగా ఆలోచించేలా ప్రేరేపిస్తాయి. సారాంశంలో మనిషి మనిషికి భిన్నమైన 'వర్గ మూలాలు'ంటాయి. అన్నీ ఆలోచనా మూలాలు మన చుట్టూ జరుగుతున్న అన్యాయంపై తిరగబడేలా ఉండాలని ముఖ్యంగా యువత ఈ బాధ్యతను తమ భుజస్కంధాలపై మోయాలనే ఎరుకను కలిగిస్తుంది ఈ కవితా సంపుటి.

**'అదృశ్యకిరణాలు'**తో మొదలై **'మానేరు నానీలు'**, **'ఎనగర్ర'**, **'గవ్వలు'**, **'చుక్కపొద్దు'** లాంటి కవిత్వ సంపుటాలను వెలువరించి పాఠక లోకంలో వలసినంత కదలికను తెచ్చిన జిందం అశోక్ తెలుగు సాహిత్య ప్రపంచానికి చిరపరిచితులు. ఇప్పుడు మళ్ళీ **'వర్గమూలాలు'** తో గడిచిన ఇరవై ఏండ్ల సమాజ ప్రయాణాన్ని తనదైన కోణంలో ఆవిష్కరిస్తూ సాహిత్య లోకంలోకి మరింత కొత్త భావనా స్పర్శతో వస్తున్నారు.

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 1 58 హైదరాబాద్ నవంబర్ : 2023

# ఈ 'కాల'పు నిఘంటువు – నిఘంటుకర్త

**డా. చంద్రయ్య ఎన్.,** అధ్యాపకులు, నిజాం కళాశాల.
ఫోన్ : 9700000948




కాలపదాలు
డా. మల్లెగోడ గంగాప్రసాద్
వెల : 220 /-
ప్రచురణ : ఛాయా రిసోర్సెస్ సెంటర్,
హైదరాబాద్ ... 70931 65151
ప్రతులకు : అన్ని ముఖ్య పుస్తక విక్రయ కేంద్రాలు

నిఘంటు నిర్మాణం అనేది Thankless job అని చెబుతుంటారు. పైపెచ్చు ఇది 'కాల'హరణం. ఎంతో శ్రమకోర్చి, ఎన్నో నిఘంటువులను, గ్రంథాలను శోధించి, పదాల్ని సేకరించడం ఒక ఎత్తైతే, వాటికి సాధారణ అర్థాలతోపాటూ, సందర్భానుసార అర్థాల్ని కూర్చడం మరొక ఎత్తు. ఈ రెండింటికీ మించింది–భాషాభాగ వింగడింపు. ఈ మూడు పనులు చేయాలంటే పరిశోధకులకు మొదట ఉండవలసింది నిబద్ధత, అంకుఠిత దీక్ష, సంకల్పశుద్ధి, ఓపిక. ఇవి మాత్రమే ఉంటే సరిపోదు. భాషాతర్కంపై సంపూర్ణమైన, సాధికారమైన ప్రభుత కావాలి. వ్యాకరణజ్ఞానం ఉండాలి. ఇన్ని విధాలుగా తనని తాను హూనంచేసుకొని, తీరా ప్రచురణకర్తలు దొరక్క సొంత ఖర్చులతో వేసుకోవాల్సిరావడం మరో రకమైన బాధ. కిందామీదాపడి ఇంతపని చేసాక, భాషావ్యవహర్తలకు నిఘంటువుల్ని కొని, చదువుకొనే ఓపిక తక్కువ. ఇన్ని ప్రతికూల పరిస్థితులమధ్య నిఘంటునిర్మాణం చేపట్టిన గుండెను ఏమని మెచ్చుకోవాలి? ఆ గుండెను ఎట్లా హత్తుకోవాలి? వీటన్నింటికీ పాత్రుడూ, అర్హుడూ, మిత్రుడూ డా. మల్లెగోడ గంగాప్రసాద్.

డా. మల్లెగోడ గంగాప్రసాద్ 'కాలం, కాల' అనే పదాల/రూపాల అర్థాలను, వాటి ప్రయోగ విశేషాల్ని ఒక నిఘంటువుగా కూర్చి, 'కాలపదాలు' అనే నిఘంటువుగా ముద్రించాడు. 'కాలం'>'కాలం, కాల' అనే పదం, ఔపవిభక్తికం అనే రెండు రూపాల్లో 'time' అనే అర్థంలో తీసుకోబడింది. 'black' అనే అర్థాన్ని తెలిపే 'కాల' అనే మరో పదంకూడా ఆరోపంగా తీసుకోబడింది. అంతేకాకుండా 'కాలు(leg)–కాలదన్ను, కాలు (to burn)–కాలవేయు అనే పదాల ఔపవిభక్తిక రూపాలు కూడా 'కాల' అనే వర్ణక్రమం కిందనే గుర్తించి, ఆరోపంగా గ్రహించబడ్డాయి. 'కాలం' అనే అర్థాన్ని బోధించే వివిధ పదాలని కూర్చడమూ ఈ నిఘంటువులో కనిపిస్తోంది. ఇలా 'కాలం, కాల' అనే పదాలు భిన్నమైన వర్ణక్రమాల్తో, అర్థాలతో, పదాలతో స్వీకరించిన పద్ధతి ఈ నిఘంటువు ప్రత్యేకతగా చెప్పవచ్చు. ప్రముఖ నిఘంటుకర్త ప్రొ. వై. రెడ్డిశ్యామల దీన్ని 'తెలుగు నిఘంటు చరిత్ర' లోనే తొలిప్రయత్నంగా కొనియాడారు.

కాలానికి ప్రతీకగా వాడే జంతుజాలాల పేర్లు కూడా ఆరోపంగా గ్రహించబడ్డాయి. ఉదా : కాలజ్ఞము–కోడికూత. కేవలం 'కాల' అనే వర్ణక్రమాన్ననుసరించి, 'కాలనీటతీయు', 'కాలవేయు', 'కాలరియ', 'కాలరి'వంటి భిన్నార్థబోధకాలైన పదాల్ని ఆరోపంగా ఇవ్వడాన్ని చూడవచ్చు. కాలం సంధివశాన 'కాల, కాలి, కాలీ కాలం, కాలా'లాంటి వర్ణచ్ఛాయలతో కూడిన పదాలు కూడా ఆరోపాలుగా కూర్చబడ్డాయి. 'కాలటి'లాంటి స్థలనామాల పేర్లూ ఆరోపంగా ఇవ్వబడ్డాయి. 'కాలంచేయు', 'కాలరాయు', 'కాలనీళ్లు'లాంటి పలుకుబడులు కూడా చోటుచేసుకున్నాయి. 'కాలనేమి','కాలపుత్రులు' వంటి పాత్రల్ని ఆరోపాలుగా పొందుపరిచాడు. 'కాలనేమి', 'లాంటి పదాలకు సవివరంగా ఆరు పేజీల వ్యాఖ్యానం రాయాల్సి వచ్చింది. 'కలియుగం'లాంటి చాలాపదాలకు వాటి తాత్త్విక నేపథ్యంలోంచి అర్థాలను సవివరంగా ఇవ్వాల్సి వచ్చింది. కొన్నిచోట్ల ఏక పదంగా, మరొకొన్ని చోట్ల వాక్యాలుగా, ఇంకొన్ని చోట్ల పేరాలుగా, పేజీలుగా కూడా అర్థవివరణ గావించాడు.

ఈ నిఘంటువులో నిఘంటువులవారీగా 'కాలం, కాల' పదాలు సేకరించి, అకారాదిగా ఇచ్చాడు. కనుక 'కాలక్షేపము'లాంటి పదాలు రిపిటేషన్స్‌గా తోస్తాయి కానీ జాగ్రత్తగా పరిశీలిస్తే, అవి భిన్నమైన అర్థాల్లో కనిపిస్తాయి. అమరకోశం, ఆంధ్రక్రియాస్వరూపం, తత్త్వశాస్త్ర నిఘంటువు, తెలుగు వ్యుత్పత్తికోశం, తెలుగు–ఇంగ్లీష్ నిఘంటువు, తెలుగు పర్యాయ పద నిఘంటువు, పురాణనామ చంద్రిక, పత్రికా భాషాపదకోశం, శబ్దరత్నాకరం, సూర్యరాయాంధ్ర నిఘంటువు, శ్రీహరి నిఘంటువు ఇలా తెలుగులో ప్రసిద్ధమైన 32 నిఘంటువులతో పాటూ మహాభారతంలో ప్రయోగించిన 'కాల' పదాలను సేకరించాడు. ఇలా వివిధ ఆకరాలనుంచి సేకరించిన పదాల్ని అనుబంధంగా అకారాదిక్రమంలో ఇచ్చాడు. ఉదా: 'అమావాస్య' అనే పదం ఏయే పుటల్లో, ఏయే అర్థభేదాలతో లేదా అర్థచ్ఛాయలతో ఆరోపంగా వచ్చిందో తెలుసుకోవడానికి ఈ అనుబంధం ఎంతో తోడ్పడుతుంది. ఒక్క 'కాలకంఠుడు' అనే పదం 17, 20, 43, 47, 76, 93, 95, 99, 105, 110, 113, 127, 142 పుటల్లో వైవిధ్యమైన అర్థాలతో ప్రయోగించబడిన విధానాన్ని సులభంగా తెలుసుకోవడానికి వీలుకల్పిస్తుందీ అనుబంధం.

ఇన్ని ఇబ్బందులకోర్చిన డా. మల్లెగోడ గంగాప్రసాద్ కు ఈ నిఘంటువును ముద్రించి, మహోపకారం చేసిన 'ఛాయా' రిసోర్స్ సెంటర్ గుండె కూడా దిటువైనదే. తెలుగు ప్రజలకు మంచి ఫిక్షన్ అందించాలనే లక్ష్యంతో ప్రారంభమైన 'ఛాయా', కాలవివేచనకు సంబంధించి 'రిసోర్స్'గా ఉండే పుస్తకాన్ని ముద్రించడం డా. గంగాప్రసాద్ లాంటి ఔత్సాహిక పరిశోధకులకు ఎంతో ధైర్యాన్నిస్తుంది. కేవలం 220 రూపాయలకే 210 పుటల పుస్తకాన్ని మనచేతుల్లో పెడుతోన్న నిఘంటుకారునికీ, ఛాయా పబ్లికేషన్ కు అభినందనలు, శుభాకాంక్షలు.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 1  UGC Care List Approved Journal
హైదరాబాద్ నవంబర్ : 2023

# తెలంగాణ పరిశోధనల 'సారాంశం' ఆవిష్కరణ సభ

**డా. మంత్రి శ్రీనివాస్, ఫోన్ : 832 833 3720**

పరిశోధన లోక సత్యానికి బలాన్ని చేకూర్చుతూ అందరికీ ఆమోదయోగ్యమైన విషయాన్ని సాక్షాధారాలతో నిరూపిస్తుంది. అటువంటి పరిశోధనల ఫలితంగా వెలువడిన గ్రంథాల నిర్మాణం, అందలి శోధనా పద్ధతి, సాహితీ, సామాజిక అంశాల విశ్లేషణ, అంతిమంగా పరిశోధకుల లోకోపదేశం వంటి అంశాలను, వారి విభిన్న దృక్పథాలను, దృష్టి కోణాలను వ్యాసకర్తలు తమ అక్షరాలలో విప్పి చెప్పడం అరుదైన విషయం. అటువంటి అరుదైన రికార్డులను నమోదు చేసిన సందర్భం రెండు గ్రంథాల రూపంలో పురుడుపోసుకుంది.

ధ్రువ ఫౌండేషన్ మరియు మూసీ సాహిత్య ధార సంయుక్త ఆధ్వర్యంలో ఈ ఘట్టం చోటుచేసుకుంది. అది డా.అట్టెం దత్తయ్య సంపాదకత్వంలో రూపొందిన 'సారాంశం' (పరిశోధన గ్రంథాలు పరిచయ వ్యాసాలు) రెండు సంకలనాలుగా 28 అక్టోబర్ 2023 శనివారం సాహితీ దిగ్గజాల చేతుల మీదుగా ఆవిష్కరించబడింది.

తెలంగాణ సారస్వత పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఆచార్యులు, పాఠ్య ప్రణాళిక సంఘం అధ్యక్షులు డా. సాగి కమలాకర శర్మ అధ్యక్షత వహించారు. విశిష్ట అతిథి, ఆవిష్కర్త తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వాధ్యక్షులు డా. నందిని సిధారెడ్డి గ్రంథాలను ఆవిష్కరించి లోకార్పణం చేయగా తెలుగుశాఖ ఉస్మానియా విశ్వవిద్యాలయం పూర్వాధ్యక్షులు, విశ్రాంతాచార్యులు డా. వెలుదండ నిత్యానందరావు, తెలుగు విశ్వవిద్యాలయం నిఘంటు నిర్మాణశాఖ ఆచార్యులు డా. వై. రెడ్డి శ్యామల గార్లు గ్రంథాలను అంకితం తీసుకున్నారు.

సభాధ్యక్షులు సభనుద్దేశించి మాట్లాడుతూ మేకల కాపరిగా ప్రకృతితో సావాసం చేసిన దత్తయ్య నుండి డా. అట్టెం దత్తయ్యగా, తెలుగుశాఖ ఎస్వీ కళాశాల ఢిల్లీ విశ్వ విద్యాలయం సహాయా చార్యుడుగా ఎదిగిన తీరును ఎంతో వాత్సల్యంతో వివరించారు. పరిశోధకుడిగా ఉన్నప్పుడే దత్తయ్య ఈ బృహత్తర కార్యానికి శ్రీకారం చుట్టాడని అది కార్యరూపం దాల్చి అందరి ముందుకు వచ్చిందన్నారు. ప్రతిభావంతులు, శోధనా నైపుణ్యం గల అలనాటి నుండి పరిశోధకుల నేటి తాళ్ళపల్లి యాకమ్మ వరకు గల శతాధిక గ్రంథాల అంతరంగాన్ని ఆవిష్కరించే ప్రయత్నాన్ని దత్తయ్య సంపాదకుడుగా ఈ సారాంశాలు రెండు చేశాయని, ఎన్నో అవాంతరాలు ఎదుర్కొని ఈ మహత్తర కార్యం అతని చేత పూర్తి కావింపబడ్డదని కొనియాడారు. ఈ సంకలనాల ప్రకాశక బాధ్యతలను తమ భుజాల మీద వేసుకుని ఈ ఇరు గ్రంథాలను పాఠకులకు చేరువ చేసిన ధ్రువ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ప్రిన్స్‌పల్ ఇంజనీర్, యుఎస్ఎ, శ్రీ దుండె లక్ష్మణ్ గారిని మనసారా అభినందించారు.

విశిష్ట అతిథి డా. నందిని సిధారెడ్డి మాట్లాడుతూ తెలుగు మహాసభల కాలం కంటే ముందు నుండే దత్తయ్య కృషిని అతని అంకిత భావాన్ని తాను గమనిస్తున్నానని, మూసీ మాసపత్రిక సంపాదకుడిగానే కాదు సాహిత్య అకాడమి తలపెట్టిన గ్రంథసూచి పుస్తక బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించాడన్నారు. ఇక గ్రంథం విషయానికి వస్తే లబ్ధ ప్రతిష్టుల నుండి నేటితరం వారి వరకు వచ్చిన



పరిశోధన గ్రంథాలలో పాటించిన పద్ధతులను, వారు విషయాన్ని భిన్న రీతుల్లో వ్యక్తపరిచిన విధాన్ని భావి పరిశోధకులకు అందించిన దారిదీపంగా అభివర్ణించారు. విశ్వవిద్యాలయాల విద్యార్థులకు ఒక విజ్ఞానసర్వస్వంగా ఈ గ్రంథాలు రెండు ఉపయోగ పడతాయన్నారు.

గ్రంథాత్మను సభముందుంచిన సమీక్షకులు డా.ఎస్.రఘు గ్రంథంలో చోటుచేసుకున్న ఒక్కో పరిశోధన ఒక్కొక్క ఆణిముత్యం లాంటిదని, వాటిని సమీక్షించిన వ్యాసకర్తల పరిణితిని ముందుమాటలు రాసిన ప్రముఖులు చిక్కని వాక్యాల్లో చెప్పారని ఒక్క మాటలో గ్రంథ బలాన్ని అందరికీ పంచారు. వివిధ వ్యాసకర్తలు పరిశోధన గ్రంథాలను సమీక్షించిన విధానాన్ని అందులో వారు చూపిన వైవిధ్యాన్ని సభికులకు పంచారు. చక్కని పరిశోధనలు, పరిశోధకులు కరువైపోతున్న ఈ రోజుల్లో ఈ పుస్తకాలు రెండు ఈనాటి పరిశోధకుల మనసుల్లో కలిగే సందేహాలకు జవాబులను అందించి దిశానిర్దేశం చేస్తాయని, భిన్నమైన పరిశోధన పద్ధతులను పరిచయం చేస్తాయన్నారు. ఈ అమూల్యమైన గ్రంథాలు చదవటం వల్ల సేకరించిన సమాచారాన్ని ఎలా పొందిక చేసుకొని నిజ నిరూపణ









చేయాలో తెలుస్తుందని, సాహితీ జ్ఞానంతో పాటు సమకాలిన అంశాల పట్ల పరిశోధకుని స్పందనకు ఒక నూతనత్వం ఏర్పడుతుందని తన విశ్వాసాన్ని ప్రకటించారు.

గ్రంథ స్వీకర్తలు డా. వెలుదండ నిత్యానందరావు దత్తయ్యలోని ప్రతిభను, ఆయన పుస్తకాలలో పేర్కొన్న వివిధ పరిశోధనలు, పరిశోధకులు వారి శోధనా దృక్పథాలను విశదపరిచారు. నేటి శోధకులు పాటించాల్సిన పరిశోధన పద్ధతులను, అనుసరించాల్సిన విధానాలను వివరిస్తూ ఈ గ్రంథాలు రెండు నేటి ఖాళీలని పూరిస్తాయన్నారు. తన 'విశ్వవిద్యాలయాలలో పరిశోధన' కు అనుబంధంగా ఈ రెండు గ్రంథాలు ఎంతో ఉపకరిస్తాయని పేర్కొన్నారు.

మరొక స్వీకర్త డా.వై.రెడ్డి శ్యామల మాట్లాడుతూ దత్తయ్య తీసుకొచ్చిన గ్రంథాలను పరికిస్తే అతను పడ్డ కష్టం, రచయితల నుండి వ్యాసాలను రాబట్టేందుకు అతను పడ్డ ప్రయాస ఎంతటిదో అర్థమవుతుందన్నారు. దత్తయ్య నిబద్ధత ఈ గ్రంథరూపకల్పన చూస్తే తెలుస్తుందని ఆత్మీయంగా ఆశీస్సులు అందించారు.

ఈ గ్రంథ ప్రకాశక బాధ్యతలను చేపట్టి వ్యయ భారాన్ని వహించి ఈ రెండు బృహత్ గ్రంథాలను సాహితీ జగత్తుకు అందించే అదృష్టం తమ సంస్థకు కలగడం పట్ల ధృవ ఫౌండేషన్ అధ్యక్షులు మల్లేశం ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేశారు. విత్తపరమైన కార్యభారాన్ని అందించి సంస్థను ముందుకు నడిపిస్తున్న శ్రీ దుండె లక్ష్మణ్ గారు ఆత్మీయంగా స్పందిస్తూ సాహిత్యం పట్ల తనకున్న అభిరుచిని, సాహితీ గ్రంథాల ప్రచురణకు తన ఆసక్తిని దత్తయ్య గ్రంథాల మాధ్యమంగా వెలిబుచ్చారు.

అంతిమంగా గ్రంథ సంపాదకుడు దత్తయ్య మాట్లాడుతూ తాను ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పరిశోధన చేసే సమయంలో పెద్దల సమక్షంలో శోధనాంశాలు చర్చిస్తున్న సమయంలో ఇటువంటి గ్రంథమొకటి ఉండాలని, అది భవిష్యత్ తరాల పరిశోధకులకు చుక్కాని అవుతుందన్న ఆలోచన కలిగిందని వెంటనే కార్యాచరణ ప్రారంభించడానికి పూనుకున్నాననీ తెలిపారు. ఇందులో భాగంగా ఎన్నో పరిశోధన గ్రంథాలను సేకరించి సమర్థులైన వ్యాసకర్తలకు పంపే పనిని చేపట్టానని, నా ఆలోచన గమనించిన పెద్దలు అడిగిన వెంటనే వ్యాసాలు పంపారని, పుస్తకం పూర్తయ్యాక కూడా ఇంకా చాలా వ్యాసాలు వస్తున్నాయని వాటిని మరో రూపంలో తీసుకొచ్చే యత్నం చేస్తామన్నారు.

ఆద్యంతం ఆసక్తికరంగా, ఉల్లాసభరితంగా సాగిన ఈ కార్యక్రమంలో వ్యాస కర్తలు కూడా తమ విలువైన స్పందనలు తెలియజేశారు. వారిలో డా.బుక్కా బాలస్వామి, డా.దహగం సాంబమూర్తి, గన్నమరాజు గిరిజా మనోహర్ బాబు, డా. కాకునూరి సూర్యనారాయణ మూర్తి, డా. శ్రీవల్లీ రాధిక, డా. సంగిశెట్టి శ్రీనివాస్, డా.దేవేంద్ర, డా.చంద్రయ్య లాంటివారున్నారు.

ఈ విశిష్ట సభకు ప్రముఖ సాహితీవేత్తలు, విశ్వవిద్యాలయాల ఆచార్యులు, కవులు, పరిశోధకులు, స్నాతకోత్తర విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

ఈ కార్యక్రమానికి ధ్రువ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీ బోళ్ల ప్రవీణ్ కుమార్ తన మధుర వాక్కులతో స్వాగతం పలుకగా డా.మంత్రి శ్రీనివాస్ తుది పలుకులు పలికారు.



# స్వ 'కృతి'




**భారతీయ చింతన**
డా. దహగాం సాంబమూర్తి అశీతి పూర్తి అభినందన సంచిక
వెల : 1000 /- ప్రచురణ: సహృదయ, వరంగల్
**ప్రతులకు :** డా. దహగాం సాంబమూర్తి, 6-7-36, రాగన్న దర్వాజ, హనుమకొండ. ఫోన్ : 94401 71746




**సాహిత్యానువాదంలో సమస్యలు**
డాక్టర్ బాణాల భుజంగరెడ్డి
ఫోన్ : 72178 72141
వెల : 250 /-
**ప్రతులకు :** తెలంగాణ సాహిత్య అకాడమీ, కళాభవన్, రవీంద్రభారతి, హైదరాబాద్.







**ఆనందవర్ధనం** - స్తంభంకాడి గంగాధర్, వెల : 90 /-
**అమృతతల్పం** - స్తంభంకాడి గంగాధర్, వెల : 90 /-
**ప్రతులకు :** రచయిత,
ఇం.నెం. 10-2-448/బి, హరిహర నగర్,
రోడ్ నెం. 2, విద్యానగర్, కరీంనగర్ - 505 001.
ఫోన్ : 94400 49872, 73862 00610







**బంధ కవిత్వం** - ముదిగొండ శ్రీరామ శాస్త్రి
వెల : 250 /-
**ఛందో వైభవము** - ముదిగొండ శ్రీరామ శాస్త్రి
వెల : 200 /-
**ప్రతులకు :** రచయిత, 15-19-370/1/బి, బాలాజీ నగర్, ఖానాపురం హవేలీ, ఖమ్మం - 507 002.
ఫోన్ : 98663 05945




**శివస్తుతి (రకార ప్రాస కందపద్య శతకం)**
గండికోట లింగేశ్వర శర్మ
వెల : 40/-
**ప్రతులకు :** పందరి రాధాకృష్ణమూర్తి,
భోళా శంకర మందిరము,
న్యూ బోయిన్ పల్లి, సికింద్రాబాద్.
ఫోన్ : 9908029242,
9177820171


## మూసీ పబ్లికేషన్స్ వారి పుస్తకములు

**వివరాలకు : మూసీ మాసపత్రిక, 3-4-245/1, లింగంపల్లి, కాచిగూడ, హైదరాబాద్ -27, ఫోన్ - 27560616**

1. భారతదేశ చరిత్ర - సంస్కృతి (17భాగాలు 4,5 మరియు 7 నుండి 21 వరకు) రూ. 175/- ఒక్కొక్క భాగానికి రూ. 2875 - 00
2. బ్రాహ్మణ రాజ్య సర్వస్వము రూ. 1200 - 00
3. నల్లగొండ జిల్లా కవులు - పండితులు రూ. 350 - 00
4. మల్యాల వంశ చరిత్ర - శాసనములు రూ. 100 - 00
5. శాసన సంపుటి రూ. 150 - 00
6. కందూరు చోడుల శాసనములు - చరిత్ర - సంస్కృతిరూ. 100 - 00
7. షబ్నవీస్ శతజయంతి సంచిక రూ. 100 - 00
8. విజయనగర శాసనములు - సాహిత్య సాంస్కృతిక విశేషములు 90 - 00
9. త్రిపురాంతక దేవాలయ శాసనములు రూ. 75 - 00
10. పులిజాల రంగారావు సంక్షిప్త జీవిత చరిత్ర రూ. 75 - 00
11. దేవాలయ వాస్తుశిల్పము రూ. 50 - 00
12. మూసీ ద్వైవార్షిక ప్రత్యేక సంచిక రూ. 50 - 00
13. మూసీ 'తెలుగు సంస్కృతి' ప్రత్యేక సంచిక రూ. 75 - 00
14. 'సుచరిత' (బి.ఎన్.శాస్త్రి సంస్మరణ) ప్రత్యేక సంచిక రూ. 100 -00
15. మూసీ 'మన తెలుగు' ప్రత్యేక సంచిక రూ. 100 - 00
16. ఆంధ్రదేశ శాసన సాహిత్యంలో స్త్రీలు రూ. 175 - 00



## చిరునామా

**మూసీ రచయితలకు, చందాదారులకు విజ్ఞప్తి.**

**చందాలు, రచనలు పంపాల్సిన చిరునామా**
**సంపాదకుడు, మూసీ మాసపత్రిక,**
**ఇం.నెం. 2-2-1109/**
**బికె-ఎల్.ఐ.జి.10, బతుకమ్మకుంట,**
**బాగ్అంబర్‌పేట, హైదరాబాద్-500013.**
**చందాలకు ఆన్‌లైన్ అకౌంట్**
**స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నల్లకుంట, హైదరాబాద్.**
**అకౌంట్ నెం. 52019740642**
**IFS Code : SBIN0020083**
**editormusi@gmail.com**

# దుఃఖం







భుజం మీద ఎత్తుకున్న గుర్తులు
వేలు పట్టి నడిపించిన దారులు
పండుగలకు తెచ్చిన కొత్త బట్టలు
లక్షలు వెచ్చించిన ఆడంబరపు విద్య
ఇవేవీ స్మృతిపథంలో లేవు

తాగిన గ్లాసులు / తడిసిన పంచలు
తన్నులు తిన్న అమ్మ శరీరం
తల్లడిల్లిన మా హృదయాలు
ఇప్పుడివే జీవిత స్మృతి చిహ్నాలు

డిగ్రీ స్థాయి ఫుట్‌బాల్ సర్టిఫికేట్
నిత్యయువకుడిలా స్పోర్ట్స్ నాలెడ్జ్
కలం కాగిత రహిత వడ్డీ లెక్కలు
అధికారుల్ని ఆశ్చర్య పరచిన సంతకం
సరళ రేఖలా దున్నిన విత్తనపు సాలు
నెర్రెలు బారిన నేలలో సృష్టించిన ఆర్థిక వ్యవస్థ
నీ ప్రతిభకివే కొలమానాలు

కానీ ఈసడింపుల సమాజంలో
నీవేమో తాగి తాగి చచ్చిన తండ్రివి
మేమేమో తాగుబోతోడి బిడ్డలం

తమ్ముళ్ళను సైతం అరే అనని మనస్తత్వం
మైక్రోస్కోప్ కూ కనిపించని విభేదాలు
ఎవడు బతుకుతాడు నీలాగా!
ఏ గొప్పవాడితో పోల్చగలను
నీతోనే నిన్ను పోల్చడం తప్పు!!

నేరమెవరిదని తప్పు పట్టను!
ఎన్.టి.ఆర్. సారా ప్యాకెట్ల నుండి
కే.సి.ఆర్. మద్యం పాలసీ దాకా
నీ కడుపులో భాగాల్ని కత్తిరించిన కత్తులేనాయే..

దుఃఖం వైయక్తికం కానే కాదు
ముమ్మాటికీ సామూహికమే

తాగుబోతుల తెలంగాణాలో
తండ్రుల్ని కోల్పోయిన బిడ్డలెందరో
మద్యమే ఇంధనమైన 'సర్-కార్'లో
మధ్య వయస్సులోనే పుస్తెలు తెగిన తల్లులెందరో

అమ్మ జ్వరమెచ్చి అమ్మమ్మ ఇంటికెళ్ళింది
అంబేద్కర్ దిమ్మె మీద కూర్చోని
ఎర్రబస్ కోసం ఎదురు చూసి పోరాదూ..!

.....విను
ఫోన్ : 6281 222 878

# ఫర్టీ 9 సంతాన సాఫల్యత కేంద్రం

**మీ మాతృత్వపు స్పర్శకు దూరం అయ్యారా?**

అందమైన చిన్ని చిన్ని అడుగులు..
బోసి బోసి నవ్వుల కేరింతలు...
ఒక పూజ్యమైన అలక, అలుపెరగని ఉల్లాసం..
మారం చేస్తూ, మైమరిపిస్తూ...
మీ ఆనందం అంభరాన్ని తాకాలా ?

సరోగసి, అసిస్టెడ్ హ్యాచింగ్,
ఎంబ్రియో &సెమెన్ ఫ్రీజింగ్,
స్త్రీలలో గర్భాశయ అండాశయ
లోపాల నివారణ-చికిత్స,
వెరికోసిల్, వీర్యకణాల లోపం,
ల్యాప్రోస్కోపిక్ విధానం ద్వారా
లోపాల నిర్ధారణ -సవరణ,
ఆధునిక వైద్యవిధానాలతో చికిత్స.

7416 106 106
www.ferty9.com

**మీరు తీసుకునే
ప్రతి నిర్ణయానికి
మా ప్రేమ, సేవ
అంకిత భావం మీకు
తోడుగా ఉంటుంది.**

**IUI | IVF | ICSI | IMSI | HSG**



ఫర్టీ 9 హాస్పిటల్ మరియు పరిశోధన కేంద్రం

మీ ఆశ, మీ స్వప్నం ఫలిస్తుంది ఫలప్రదంగా...

విజయ డయాగ్నస్టిక్స్ ఎదురుగా, సికింద్రాబాద్ మరియు నిజాంపేట్ క్రాస్ రోడ్, కూకట్‌పల్లి, హైదరాబాద్

Scanned with OKEN Scanner